

www.andhrajyothy.com
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHI

మంత్రి క్షమాపణ..
నాగార్జున కేసు వాపస్
కొండా సురేఖపై పరువు నష్టం కేసును
ఉపసంహరించుకున్న సినీ నటుడు 10
విచారణను ముగించిన నాంపల్లి కోర్టు

శుక్రవారం | 14-11-2025 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 23 సంచిక (Issue) : 226 | శ్రీ విశ్వావసునామ సంవత్సరం, దక్షిణాయనం, శరదృతువు, కార్తీకమాసం, బహుళపక్షం; తిథి: దశమి రా.12.50 తదుపరి ఏకాదశి; నక్షత్రం: పుబ్బ రా.9.20 తదుపరి ఉత్తర; వర్జ్యం: తె.5.12 మొదలు, దుర్ముహూర్తం: ఉ.8.37-9.22, మ.12.21-1.06; అమృతఘడియలు: మ.2.28-4.11; రాహుకాలం: ఉ.10.30-12.00; సూర్యోదయం: 6.23; సూర్యాస్తమయం: 5.35 | వరంగల్
Warangal | Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

32 కార్లు.. 8 మానవ బాంబులు


హరియాణాలోని ఫరీదాబాద్ జిల్లా ఖండావలిలో.. ఢిల్లీ ఘటనతో సంబంధం ఉందని భావిస్తున్న కారు వద్ద ఫోరెన్సిక్ నిపుణులు

దేశంలో అసాధారణ విధ్వంసానికి ఉగ్రవాదుల కుట్ర

ఐఈడీల తయారీకి 26 క్వింటాళ్ల ఎరువుల కొనుగోలు

దేశంలో 8 చోట్ల ఏకకాలంలో దాడులకు ప్రణాళిక

రూ.20 లక్షలు సేకరించి ఉమర్ నబీకి అందజేత

టర్కీలో ఉకాసా అనే వ్యక్తితో తరచూ సంభాషణ

అరెస్టయిన డాక్టర్లంతా ఆత్మాహుతి బాంబర్లే!

న్యూఢిల్లీ, నవంబరు 13: దేశంలో కనీవినీ ఎరుగని స్థాయిలో విధ్వంసం సృష్టించేందుకు ఫరీదాబాద్ ఉగ్రవాద ముఠా ప్రణాళిక సిద్ధం చేసినట్లు జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్ఐఏ) అధికారులు గుర్తించారు. ఏకంగా 32 కార్లలో బాంబులు అమర్చి, 8 ప్రధాన ప్రాంతాల్లో ఏకకాలంలో ఆత్మాహుతి దాడులు చేయాలని ఈ మాడ్యూల్ కుట్ర పన్నింది. ప్రధానంగా ఢిల్లీ, ఉత్తరప్రదేశ్‌లను లక్ష్యంగా ఎంచుకున్నారు. వీరి కుట్రకు హరియాణాలోని అల్ ఫలాహ్ యూనివర్సిటీ వేదిక

మిగతా 2వ పేజీలో...


శ్రీనగర్ సీనియర్ ఎస్పీ సందీప్ చక్రవర్తి

'పోస్టర్' లాగితే ఉగ్రకుట్ర భగ్నం!
పోస్టర్‌పై రాతల ఆధారంగా దర్యాప్తు.. సీసీ కెమెరాల జల్లెడ 10
జమ్మూకశ్మీర్‌లో ఉగ్ర కుట్ర భగ్నంలో తెలుగు ఐపీఎస్ అధికారి కీలకపాత్ర


ఢిల్లీలో అమెరికా-భారత్ వ్యూహాత్మక భాగస్వామ్య సదస్సులో ప్రసంగిస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి. చిత్రంలో జయేశ్ రంజన్ తదితరులు

పెట్టుబడులు పెట్టండి!

ప్రపంచ పెట్టుబడులకు గమ్యస్థానం హైదరాబాద్

చైనా+1 మోడల్‌కు గ్లోబల్ సమాధానం తెలంగాణ

గత ప్రభుత్వాలన్నీ పెట్టుబడులకు పెద్దపీట వేశాయ్.. హైదరాబాద్‌ను అంతర్జాతీయ నగరంగా తీర్చిదిద్దడమే లక్ష్యం

మూసీ పునరుజ్జీవంతో నైట్ ఎకానమీలో కీలక వృద్ధి.. రోడ్లకు ఇకపై గూగుల్, మెటా, టీసీఎస్ తదితర సంస్థల పేర్లు

'యూఎస్ ఐఎస్‌పీఎఫ్'లో సీఎం రేవంత్.. 'తెలంగాణ రైజింగ్-2047' విజన్ ప్రదర్శన.. టెక్ దిగ్గజాల ప్రశంసలు

న్యూఢిల్లీ, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ నగరం ప్రపంచ పెట్టుబడులకు గమ్యస్థానమని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చెప్పారు. అంతర్జాతీయ పెట్టుబడిదారులకు హైదరాబాద్ స్వర్గధామం అన్నారు. ఇక్కడ అంతర్జాతీయ స్థాయి మౌలిక వసతులు, పరిశ్రమలకు అనువైన వాతావరణం, భద్రతకు ఢోకా లేదని తెలిపారు. దేశంలోనే వేగవంతమైన వృద్ధి రేటు కలిగిన రాష్ట్రం తెలంగాణ అని చెప్పారు. రాష్ట్రంలో యువశక్తి ఎక్కువగా ఉందని గుర్తుచేశారు. గురువారం ఢిల్లీలో జరిగిన అమెరికా సంయుక్త రాష్ట్రాలు- భారతదేశ వ్యూహాత్మక భాగస్వామ్య సదస్సు (యూఎస్ ఐఎస్‌పీఎఫ్)లో సీఎం రేవంత్‌రెడ్డి మాట్లాడారు. తెలంగాణ ప్రాంతంలో గత 35 ఏళ్లుగా కాంగ్రెస్‌తోపాటు అనేక పార్టీల ప్రభుత్వాలు సారథ్యం వహించినా.. పెట్టుబడులకు, పెట్టుబడిదారులకు మద్దతుగా నిలిచాయని వివరించారు. భారతదేశంలో పెట్టుబడులకు హైదరాబాద్ ముఖద్వారమని తెలిపారు. అంతర్జాతీయ సామర్థ్య కేంద్రాల (జీసీసీ) హబ్‌గా ఉన్న హైదరాబాద్‌లో పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు రావాలని పారిశ్రామికవేత్తలను ఆహ్వానించారు. మహిళా సాధికారిత, నాణ్యమైన విద్య, యువతకు నైపుణ్య శిక్షణ, పట్టణాభివృద్ధితోపాటు మెరుగైన వసతులు, అత్యున్నత జీవన ప్రమాణాలతో కూడిన అంతర్జాతీయ స్థాయి నగరంగా హైదరాబాద్‌ను నిలపడమే తన ప్రథమ ప్రాధాన్యమని రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు. ఈ సందర్భంగా గత 23 నెలల కాలంలో రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను వివరించారు. 30 వేల ఎకరాల్లో అద్భుతమైన మౌలిక వసతులు, అంతర్జాతీయ ప్రమాణాలతో భారత్ ఫ్యూచర్ సిటీని నిర్మిస్తున్నామని చెప్పారు. మూసీ నది పునరుజ్జీవం పూర్తయితే

మిగతా 13వ పేజీలో...

జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే ఎవరు?
నేడే ఉప ఎన్నిక ఫలితం
ఉదయం 8 గంటలకు లెక్కింపు ప్రారంభం
తొలుత పోస్టల్ ఓటింగ్, సర్వీస్ ఓట్లు
మధ్యాహ్నం 12 గంటలకల్లా తుది ఫలితం
కౌంటింగ్ కేంద్రం వద్ద భారీ బందోబస్తు


కౌంటింగ్‌కు యూసుఫ్‌గూడ స్టేడియంలో ఏర్పాట్లు

హైదరాబాద్ సిటీ, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): తెలుగు రాష్ట్రాల ప్రజలు ఆసక్తిగా ఎదురు చూస్తున్న జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక ఫలితాలు శుక్రవారం వెల్లడవనున్నాయి. ప్రధాన పార్టీలు ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్న ఎన్నికల్లో విజేత ఎవరన్నది మధ్యాహ్నానికల్లా తేలిపోనుంది. యూసుఫ్‌గూడలోని కోట్ల విజయభాస్కర్‌రెడ్డి స్టేడియంలో ఉదయం 8 గంటలకు ఓట్ల లెక్కింపు ప్రారంభం కానున్నట్లు జిల్లా ఎన్నికల అధికారి, జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్వీ కర్ణన్ గురువారం చెప్పారు. 4.01 లక్షల ఓటర్లున్న నియోజకవర్గంలో 58 మంది అభ్యర్థులు బరిలో

మిగతా 12వ పేజీలో...

బిహార్ తీర్పు నేడే!
భారీ ఓటింగ్‌తో గెలుపుపై ఎవరి ధీమా వారిదే.. ఎన్డీఏవైపే ఎగ్జిట్ పోల్స్ మొగ్గు
విభేదిస్తున్న మహాగఠ్‌బంధన్ 2
తమదే అధికారమంటున్న ఆర్జేడీ


ఖమ్మం జిల్లా చింతకాని మండలం లచ్చగూడెంలో పత్తి పంటను దున్నేస్తున్న దృశ్యం

ఎకరానికి 3 క్వింటాళ్లే దిగుబడి..
మూడెకరాల్లో పత్తి పంట వేశా. వాతావరణం అనుకూలించకపోవడంతో సరైన దిగుబడి రాలేదు. ఎకరానికి 3 క్వింటాళ్లు మాత్రమే దిగుబడి వచ్చింది. పత్తి చేను ఉంచినా లాభం లేదని.. దున్నేసి, మొక్కజొన్న సాగు చేశా.
- కత్తుల మల్లయ్య, ఇప్పగూడెం, జనగామ

పొట్ట నింపని పత్తి

దిగుబడి రాకపోవడంతో చేలు దున్నేస్తున్న పత్తి రైతులు
ప్రత్యామ్నాయంగా మొక్కజొన్న, ఇతర పంటలు
ఖరీఫ్ సీజన్‌లో పత్తి రైతులను ముంచిన అధిక వర్షాలు
దారుణంగా దెబ్బతిన్న పంట.. దిగుబడి లేక దిగాలు
ఎకరానికి నాలుగైదు క్వింటాళ్లు కూడా రాని వైనం
మొక్కజొన్నతో ఎంతోకొంత గిట్టుబాటు అవుతుందన్న ఆశ

హైదరాబాద్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): పత్తి రైతులు ప్రత్యామ్నాయ మార్గాలు చూసుకుంటున్నారు. పంట సాగు చేసినప్పటి నుంచి అష్టకష్టాలు పడిన రైతన్నలు.. మరిన్ని నష్టాలను భరించలేమన్న విషయాన్ని గ్రహించారు. పత్తితో లాభం లేదనుకొని.. ప్రత్యామ్నాయ, ఆరుతడి పంటల వైపు దృష్టి పెట్టారు. పంటకాలం పూర్తికాకముందే పత్తి చేనును పీకేసి, అదే భూమిలో మొక్కజొన్న సాగు చేస్తున్నారు. ఈ వానాకాలంలో భారీ వర్షాలతో పత్తి పంట దెబ్బతినడం, భవిష్యత్తులో కోలుకొని దిగుబడి వస్తుందనే భరోసా లేకపోవడంతో రైతులు పత్తి మొక్కలు పీకేస్తున్నారు. కొందరు రెండోసారి పత్తి తీశాక మొక్కలను పీకేస్తుండగా.. మరికొందరు ఒక్కసారి పత్తి తీసిన వెంటనే ప్రత్యామ్నాయ పంటను ఎంచుకుంటున్నారు. ఈ ఖరీఫ్

మిగతా 13వ పేజీలో...

డబ్బులిచ్చి మనుషుల్ని వేటాడారు!


బోస్నియా రాజధాని సారయేవోలో తుపాకీ గుళ్ల బారిన పడకుండా ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని రోడ్డుపై నడుస్తున్న ప్రజలు (1993 నాటి ఫొటో)

బోస్నియాలో ఇటాలియన్ సంపన్నుల వారాంతపు స్నైపర్ టూరిజం

పిల్లల్ని కాల్చాలంటే ఎక్కువ ధర.. వృద్ధులైతే ఉచితంగా కాల్చుకోవచ్చు

1992-95 నడుమ నాలుగేళ్లపాటు సాగిన దారుణ మారణకాండ

తాజాగా దర్యాప్తు ప్రారంభించిన మిలాన్ పబ్లిక్ ప్రాసిక్యూటర్

మిలాన్, నవంబరు 13: చుట్టూ కొండలు.. మధ్యలో ఊరు! కొండల మధ్యన రైఫిళ్లతో మాటువేసిన స్నైపర్లు. ఆ ఊరి ప్రజలు గుక్కెడు మంచినీళ్లు తెచ్చుకోవాలన్నా.. బుక్కెడ బువ్వ కోసం పనికి వెళ్లాలన్నా.. రోడ్డుమీదకు వెళ్లాల్సిందే! కానీ.. అలా వెళ్తే ఏ పక్క నుంచి ఏ రైఫిల్ తూటా వచ్చి ఒంట్లో దిగబడుతుందో తెలియదు. 1992లో యుగోస్లావియా నుంచి బోస్నియా స్వతంత్ర దేశంగా విడివడ్డ తర్వాత.. ఆ దేశ రాజధాని సారయేవోలో ప్రజలు అనుభవించిన నరకం ఇది! బోస్నియా అలా స్వతంత్ర దేశంగా ఏర్పడడాన్ని జీర్ణించుకోలేని ఆర్థోడాక్స్ సెర్బులు.. సారయేవో నగరాన్ని 1425 రోజులపాటు (దాదాపు 4 సంవత్సరాలపాటు) ముట్టడించి అక్కడి ప్రజలపై సాగించిన దారుణ నరమేధమిది! ఇంకా ఘోరం ఏంటంటే.. ఈ మారణకాండలో ఇటలీకి చెందిన అత్యంత సంపన్నులు కూడా పాలు పంచుకున్నారని ఇటీవల వెల్లడైంది. పొట్టకూటి కోసం తప్పనిసరి పరిస్థితుల్లో రోడ్డుపైకి వచ్చి.. భయంతో బిక్కుబిక్కుమంటూ వెళ్తున్న బోస్నియన్లను స్నైపర్లతో కాల్చిచంపే అవకాశం కోసం వారు పెద్ద ఎత్తున డబ్బులు కూడా ముట్టజెప్పేవారని (ఇలా వెళ్లడాన్ని స్నైపర్ టూరిజం లేదా స్నైపర్ సఫారీగా వ్యవహరించేవారు).. సరదా కోసం వారాంతాల్లో మనుషులను వేటాడేవారని.. సారయేవో ప్రజల ప్రాణాలు తీసి వికృతానందం పొందేవారని తేలింది. ఎజియో గవజెనీ అనే పాత్రికేయుడు, నవలా రచయిత చేసిన ఫిర్యాదు మేరకు.. ఇటలీలోని పబ్లిక్ ప్రాసిక్యూటర్ కార్యాలయం దీనిపై తాజాగా దర్యాప్తు చేపట్టింది. ఇటాలియన్లతోపాటు.. అమెరికా, రష్యా

మిగతా 2వ పేజీలో...

పసిడి తులం రూ. 1,30,900 2
1.7 లక్షలకు చేరిన కిలో వెండి
అమెరికా మార్కెట్ల ప్రభావం

హౌసింగ్ స్కాంలో ఎస్ఎల్‌బీసీ కాంట్రాక్టర్ అరెస్టు
జేపీ ఇన్‌ఫ్రాటెక్ ఎండీ మనోజ్‌గౌర్‌పై ఈడీ చర్య
ఢిల్లీ, హరియాణాలో జేపీ ఇన్‌ఫ్రా పలు హౌసింగ్ ప్రాజెక్టులు
రూ.14,599 కోట్ల మనీలాండరింగ్!

న్యూఢిల్లీ/హైదరాబాద్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): హౌసింగ్ ప్రాజెక్టుల్లో వేల కోట్ల మనీలాండరింగ్ కుంభకోణానికి సంబంధించి జేపీ ఇన్‌ఫ్రాటెక్ లిమిటెడ్ ఎండీ మనోజ్‌గౌర్‌ను ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) బుధవారం అరెస్టు చేసింది. తెలంగాణలోని ఎస్ఎల్‌బీసీ టన్నెల్

మిగతా 2వ పేజీలో...


ఎంజీఎంలో విజిలెన్స్ అధికారుల విచారణ

సివిల్ పనులకూ ఆరోగ్యశ్రీ నిధులు!
ఎంజీఎం ఆస్పత్రిలో నిధుల దుర్వినియోగంపై విజిలెన్స్ విచారణ షురూ 12
పలు ఫైళ్లను పరిశీలించిన అధికారులు
రూ.30 కోట్లకుపైగా దుర్వినియోగం?





48 గంటల్లో 750 వాహనాల సీజ్ 13
రవాణా శాఖ స్పెషల్ డ్రైవ్.. ఓవర్ లోడ్, అతి వేగం ఉల్లంఘనలపై చర్యలు

ఓవర్‌లోడ్‌తో ఆర్టీసీ బస్సు టైర్లకు మంటలు!
గమనించి చెప్పిన రోడ్డు మీది వాహనదారులు.. తప్పిన ముప్పు 3
జోగులాంబ గద్వాల జిల్లాలో ఘటన

రెండేళ్లలో 2 నుంచి 597 మంది!
ఐఐటీ జేఈఈ, నీట్ పరీక్షల్లో సత్తా చాటిన ఏకలవ్య స్కూల్స్ విద్యార్థులు

న్యూఢిల్లీ, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): ఐఐటీ, జేఈఈ, నీట్ వంటి అత్యంత కఠినమైన పరీక్షల్లో ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ స్కూల్స్(ఈఎంఆర్ఎస్) విద్యార్థులు సత్తా చాటారని కేంద్రం తెలిపింది. 2024-25 విద్యా సంవత్సరంలో దేశవ్యాప్తంగా 597మంది ఈఎంఆర్ఎస్ విద్యార్థులు, ఈ కోర్సుల్లో అర్హత సాధించారని గిరిజన వ్యవహారాల మంత్రిత్వ శాఖ నివేదిక పేర్కొంది. సీట్లు పొందిన వారిలో అత్యధికులు.. గుజరాత్(213), మధ్యప్రదేశ్(176) రాష్ట్రాలకు చెందినవారు కాగా, మూడో స్థానంలో ఉన్న తెలంగాణ నుంచి 94 మంది ఎంపికయ్యారు. ఏపీ నుంచి 18 మంది ఎంపికయ్యారు. 2022-23లో ఏకలవ్య స్కూల్స్ నుంచి కేవలం ఇద్దరు విద్యార్థులు మాత్రమే ఈ పరీక్షలలో ఉత్తీర్ణులవ్వగా, రెండేళ్లలో వీరి సంఖ్య 597కు చేరడం గమనార్హం.

ఏసీబీ వలలో జడ్జి
అనుకూల తీర్పునిచ్చేందుకు ముంబైలోని సివిల్ సెషన్స్ కోర్టు అదనపు న్యాయాధికారి రూ. 25 లక్షల లంచం డిమాండ్
అతని తరఫున కోర్టు క్లర్క్ వసూళ్లు.. రూ. 15 లక్షలకు బేరం
తీసుకుంటూ దొరికిన కోర్టు క్లర్క్.. అతనితో పాటు జడ్జిపై కేసు



ముంబై, నవంబరు 13: ఓ భూవివాద కేసులో అనుకూల తీర్పునిచ్చేందుకు బాధితుడి నుంచి లంచం తీసుకున్న వ్యవహారంలో మజగావ్ సివిల్, సెషన్స్ కోర్టు అదనపు జడ్జి ఎజాజుద్దీన్ సలావుద్దీన్ కాజీతో పాటు కోర్టు క్లర్క్ చంద్రకాంత్ వాసుదేవ్‌పై అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) కేసులు నమోదు చేసింది. రూ.15 లక్షలు లంచం తీసుకుంటుండగా వాసుదేవ్ రెడ్ హ్యాండెడ్‌గా పట్టుబడగా.. జడ్జిని కూడా నిందితుడిగా చేర్చినట్లు ఏసీబీ అధికారులు తెలిపారు. ఓ అదనపు సెషన్స్ జడ్జిపై లంచం కేసు నమోదు చేయడం ఇటీవలి కాలంలో ఇదే మొదటిసారని వెల్లడించారు. ఓ కంపెనీ యాజమాన్యం తమ భూమిని బలవంతంగా ఆక్రమించిందని ఆరోపిస్తూ ఫిర్యాదుదారుడి భార్య 2015లో బాంబే హైకోర్టును ఆశ్రయించింది. 2016లో ఈ వివాదాస్పద భూమిపై థర్డ్ పార్టీ హక్కుల సృష్టిని నిరోధిస్తూ కోర్టు మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. ఆ భూమి విలువ రూ.10 కోట్ల కంటే తక్కువ ఉండటంతో 2024లో కేసును మజగావ్‌లోని సివిల్ కోర్టుకు వాణిజ్య దావాగా బదిలీ చేసింది. ఈ నేపథ్యంలోనే ఈ ఏడాది సెప్టెంబరు 9న ఫిర్యాదుదారుడు కేసు విచారణకు హాజరైనప్పుడు.. కోర్టు క్లర్క్ వాసుదేవ్ తనని కలవమని చెప్పాడు. దీంతో ఫిర్యాదుదారుడు ఓ కేఫ్‌లో వాసుదేవ్‌ను కలువగా.. అనుకూల

మిగతా 2వ పేజీలో...

హౌసింగ్ స్కాంలో ఎస్ఎల్‌బీసీ కాంట్రాక్టర్ అరెస్టు


మనోజ్ గౌర్

(మొదటి పేజీ తరువాయి)

కాంట్రాక్టు పనులను ఇదే మనోజ్‌గౌర్‌కు చెందిన జేపీ గ్రూపు కంపెనీ చేపట్టింది. ఇటీవల ఆ టన్నెల్‌లో జరిగిన ప్రమాదంలో పలువురు కార్మికులు మరణించిన సంగతి తెలిసిందే. గౌర్ నేతృత్వంలోని జేపీ ఇన్‌ఫ్రా సంస్థ ఢిల్లీ, హర్యానాలో జేపీ విష్‌టౌన్, జేపీ గ్రీన్స్ పేరిట పలు హౌసింగ్ ప్రాజెక్టులు ప్రారంభించి వేలాది మంది కొనుగోలుదారుల నుంచి వందల కోట్లను వసూలు చేసింది. ఆ నిధులను గృహ ప్రాజెక్టుల నిర్మాణం కోసం ఉపయోగించకుండా, వాటిని వివిధ ట్రస్టులు, అనుబంధ సంస్థలకు మళ్లించినట్లు ఆరోపణలు వచ్చాయి. హౌసింగ్ ప్రాజెక్టులు సకాలంలో పూర్తి చేయకపోవడం, ఫ్లాట్లను అప్పగించకపోవడంతో మోసపోయిన వేలాది మంది పెట్టుబడిదారులు ఢిల్లీ, యూపీలలోని ఆర్థిక నేరాల విభాగం వద్ద అనేక కేసులు నమోదు చేశారు. వాటి ఆధారంగా రంగంలోకి దిగిన ఈడీ జేపీ గ్రూపునకు చెందిన రెండు సంస్థలు జైప్రకాశ్ అసోసియేట్స్ లిమిటెడ్ (జేఏఎల్), జేపీ ఇన్‌ఫ్రాటెక్ లిమిటెడ్ (జేఐఎల్) గృహ కొనుగోలుదారుల నుంచి వసూలు చేసిన రూ. 14,599 కోట్ల భారీ మొత్తాన్ని జేపీ సేవా సంస్థాన్ (జేఎస్ఎస్), జేపీ హెల్త్‌కేర్ లిమిటెడ్ (జేహెచ్ఎల్), జేపీ స్పోర్ట్స్ ఇంటర్నేషనల్ లిమిటెడ్ (జేఎస్ఐఎల్) వంటి అనుబంధ సంస్థలకు మళ్లించినట్లు గుర్తించింది. మే 23న ఢిల్లీ, నోయిడా, ఘజియాబాద్, ముంబైలోని సంస్థ కార్యాలయాల్లో సోదాలు చేసిన ఈడీ భారీ మొత్తంలో ఆర్థిక పత్రాలు, డిజిటల్ రికార్డులను స్వాధీనం చేసుకుంది. నిధుల మళ్లింపులో గౌర్ కీలక పాత్ర పోషించినట్లు నిర్ధారించింది.

బిహార్ అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు నేడే

పట్నా, నవంబరు 13: బిహార్ అసెంబ్లీ ఎన్నికల ఓట్ల లెక్కింపునకు సర్వం సిద్ధమైంది. ఈవీఎంల్లో ఓటర్లు నిక్షిప్తం చేసిన తీర్పు శుక్రవారం వెలువడనుంది. 243 అసెంబ్లీ స్థానాలకు ఈ నెల 6, 11 తేదీల్లో రెండు దశల్లో జరిగిన ఎన్నికల్లో రాష్ట్ర చరిత్రలో ఎన్నడూ లేని విధంగా భారీగా 67.13% పోలింగ్ నమోదైంది. 2020 ఎన్నికల్లో 57.29 శాతం ఓటింగ్ జరిగింది. దరిదాపుగా పది శాతం అధికంగా పోలింగ్ నమోదు కావడంతో.. విజయంపై పాలక ఎన్‌డీఏ, విపక్ష మహాగఠ్‌బంధన్ ధీమాతో ఉన్నాయి. సీఎం నితీశ్‌కుమార్ సారథ్యంలోని ఎన్‌డీఏదే మళ్లీ గెలుపని ఎగ్జిట్ పోల్ సర్వేలు పేర్కొన్నాయి. ప్రతిపక్షాలు మాత్రం తోసిపుచ్చుతున్నాయి. 2,616 మంది అభ్యర్థులు పోటీచేయగా.. సుమారు 7.45 కోట్ల మంది ఓటర్లలో 67.13 శాతం మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. శుక్రవారం ఉదయం 8 గంటలకు ఓట్ల లెక్కింపు ప్రక్రియ ప్రారంభమవుతుంది.

తులం బంగారం @ 1.3 లక్షలు

న్యూఢిల్లీ, నవ ంబర్ 13: బంగారం, వెండి ధరలు మళ్లీ పుంజుకున్నాయి. గురువారం ఢిల్లీలో 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర ఒక్క రోజులోనే రూ. 3వేలకు పెరిగి రూ. 1,30,900 మార్కును దాటింది. వెండి కిలోకు రూ. 7,700 పెరిగి ఏకంగా లక్షా 69వేల రూపాయలకు చేరింది. అంతర్జాతీయ మార్కెట్‌లో ఔన్సు బంగారం ధర 4,236 డాలర్లు, వెండి ఔన్సు 54.41 డాలర్లకు ఎగబాకడంతో ఆ ప్రభావం దేశీయ మార్కెట్లపై కనిపించింది. దీంతో, పదిహేను రోజుల క్రితం లక్షా 22వేల దిగువకు పడిపోయిన బంగారం ధర మళ్లీ క్రమంగా పెరుగుతూ వస్తోంది. హైదరాబాద్‌లో 24 క్యారెట్ల ఒక గ్రాము పసిడి ధర రూ. 12,780కు చేరగా, 18 క్యారెట్ల బంగారం ధర రూ. 9,585 పలుకుతోంది. అమెరికాలో 40రోజులకు పైగా కొనసాగిన షట్‌డౌన్ ముగియడంతో పాటు అంతర్జాతీయంగా డాలర్ ఇండెక్స్ బలహీనపడటం వంటి అంశాలు పెట్టుబడిదారుల్లో నమ్మకాన్ని పెంచి.. బంగారం, వెండి ధరల ర్యాలీకి కారణమయ్యాయని విశ్లేషకులు భావిస్తున్నారు.

వలస డ్రైవర్లపై అమెరికా వేటు

వాషింగ్టన్, నవంబరు 13: వలస డ్రైవర్ల విషయంలో అమెరికా కఠిన వైఖరి ప్రదర్శిస్తోంది. వలస డ్రైవర్లలో ఏకంగా 17వేలమందికి చెందిన కమర్షియల్ డ్రైవింగ్ లైసెన్సులను రద్దుచేయాలని యోచిస్తున్నట్టు కాలిఫోర్నియా ప్రకటించింది. రహదారులపై భారీ వాహనాలు నడిపే వలస డ్రైవర్ల సంఖ్య పెరిగిపోతోందని, వారిలో చాలామంది అక్రమమార్గాల్లో లైసెన్సులు పొందారంటూ ట్రంప్ ప్రభుత్వం ప్రకటించిన నేపథ్యంలోనే కాలిఫోర్నియా ఈ నిర్ణయానికి వచ్చినట్టు వార్తలు వస్తున్నాయి. అమెరికాలో వరుస రోడ్డు ప్రమాదాల నేపథ్యంలో అక్కడి వలస డ్రైవర్ల విషయంలో ట్రంప్ ప్రభుత్వం ఆగ్రహంతో ఉంది. వారిలో అక్రమంగా దేశంలోకి ప్రవేశించినవారిని గుర్తించేందుకు ఇటీవలే జాతీయస్థాయిలో ఆడిట్ మొదలుపెట్టింది. ఒక అంచనా ప్రకారం అమెరికాలో ప్రస్తుతం 2లక్షల మంది వలస డ్రైవర్లు ఉండగా, కొత్త నిబంధనల ప్రకారం వారిలో పది వేలమందే అర్హులుగా తేలే అవకాశం ఉంది.

అమెరికన్లకు శిక్షణ ఇచ్చి మీ దేశానికి వెళ్లిపోండి!

- అమెరికా ఆర్థిక మంత్రి స్కాట్ బెసెంట్ వ్యాఖ్యలు

న్యూయార్క్/ వాషింగ్టన్, నవంబరు 13: అమెరికన్లకు శిక్షణ ఇచ్చి స్వదేశానికి తిరిగి వెళ్లిపోయే నిపుణులైన విదేశీ కార్మికులను తీసుకురావడమే హెచ్-1బీ వీసా విషయంలో కొత్త విధానమని ఆ దేశ ఆర్థిక మంత్రి స్కాట్ బెసెట్ అన్నారు. అమెరికాలో తగినంత మంది ప్రతిభావంతులు లేరని, వివిధ విభాగాల్లో పనిచేసేందుకు నిపుణులైన విదేశీ ఉద్యోగులను తీసుకురావాల్సిన అవసరం ఉందని అధ్యక్షుడు ట్రంప్ చేసిన వ్యాఖ్యలపై ఆయన ఈ మేరకు స్పష్టతనిచ్చారు. "అమెరికన్ కార్మికులకు శిక్షణ ఇవ్వడానికి మూడేళ్లు, ఐదేళ్లు, ఏడేళ్ల సమయం పట్టినా సరే.. శిక్షణ పూర్తయిన తర్వాత వారు స్వదేశానికి వెళ్లిపోవచ్చు. ఆ ఉద్యోగ బాధ్యతలను అమెరికన్లు చేపడతారు" అని ఆయన పేర్కొన్నారు. తగిన శిక్షణ లేకుండా కీలక స్థానాల్లో అమెరికన్లను నియమించలేమన్నారు.

అమెరికాలో ముగిసిన 43 రోజుల షట్‌డౌన్

వాషింగ్టన్, నవంబరు 13: అమెరికాలో రికార్డు స్థాయిలో 43 రోజుల పాటు కొనసాగిన సుదీర్ఘ షట్‌డౌన్‌కు ముగింపు పలుకుతూ ప్రభుత్వ ఫండింగ్ బిల్లుపై అధ్యక్షుడు ట్రంప్ బుధవారం రాత్రి సంతకం చేశారు. అంతకుముందు షట్‌డౌన్ ఎత్తివేతకు సంబంధించిన బిల్లును ప్రతినిధుల సభ ఆమోదించింది. 222-209 ఓట్ల తేడాతో ఈ బిల్లు ఆమోదం పొందింది. షట్‌డౌన్‌ను ముగించేందుకు ప్రవేశపెట్టిన తీర్మానాన్ని సెనేట్ ఇంతకుముందే ఆమోదించింది. తాజా బిల్లు వచ్చే ఏడాది జనవరి 30 వరకూ నిధులను పొడిగించనుంది. షట్‌డౌన్ మొదలైన తర్వాత ఉద్యోగాలు కోల్పోయిన ఫెడరల్ కార్మికులను తిరిగి విధుల్లోకి తీసుకోవడం, వారికి జీతాలు చెల్లించడం వంటి కీలక అంశాలు ఇందులో ఉన్నాయి. ఆహార సహాయ కార్యక్రమాలపై ఆధారపడే వారికోసం ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ముగిసే వరకూ సాయాన్ని పునరుద్ధరిస్తారు.

పాక్ త్రివిధ దళాధిపతిగా ఆసిం మునీర్

ఇస్లామాబాద్, నవంబరు 13: తమ దేశ ఆర్మీ చీఫ్ అధికారాల విస్తరణకు ఉద్దేశించిన రాజ్యాంగ సవరణ బిల్లును పాకిస్థాన్ పార్లమెంట్ ఆమోదించింది. బిల్లుకు పార్లమెంట్‌లోని దిగువసభ మూడింట రెండు వంతుల కంటే ఎక్కువ మెజారిటీతో బుధవారం నాడు ఆమోదం తెలిపింది. కేవలం నలుగురు సభ్యులు మాత్రమే బిల్లుకు వ్యతిరేకంగా ఓటేశారు. ఇది ప్రజాస్వామ్యానికి హాని అంటూ ఆ సమయంలో ప్రతిపక్ష సభ్యులు సభ నుంచి బాయ్‌కాట్ చేశారు. ఈ రాజ్యాంగ సవరణ బిల్లుపై అధ్యక్షుడి సంతకంతో అది చట్ట రూపం దాల్చనుంది. దీంతో ఆర్మీ చీఫ్ ఆసిం మునీర్ చీఫ్ ఆఫ్ డిఫెన్స్ ఫోర్సెస్ (సీడీఎఫ్)గా బాధ్యతలు చేపట్టనున్నారు. ఇకపై నౌకా దళం, వాయుసేన కూడా ఆయన ఆధీనంలో ఉంటాయి. ఈ రాజ్యాంగ సవరణతో సుప్రీంకోర్టుకు ఉన్న అధికారాలకు అడ్డుకట్టపడింది. రాజ్యాంగ కేసులకు సంబంధించిన విచారణకు కొత్తగా ఫెడరల్ కాన్‌స్టిట్యూషనల్ కోర్టును ఏర్పాటు చేయనున్నారు.

2 కంటెయినర్ల మధ్య కారు నుజ్జు..8 మంది మృతి

పుణె, నవంబరు 13: పుణెలో రెండు భారీ కంటెయినర్ల మధ్య కారు ఇరుకున్న దుర్ఘటనలో ఎనిమిది మంది మరణించగా, 15 మంది గాయపడ్డారు. గురువారం స్థానిక నవాలే వంతెన వద్ద ఈ ప్రమాదం చోటుచేసుకుంది. వెనక నుంచి వస్తున్న కంటెయినర్ అదుపు తప్పి ముందున్న పలు వాహనాలను ఢీకొట్టింది. అనంతరం కారును, దాని ముందున్న మరో కంటెయినర్‌ను వేగంగా ఢీకొట్టింది. ఈ క్రమంలో మధ్యలో ఉన్న కారు నలిగిపోగా, దాని ముందున్న కంటెయినర్ బాగా దెబ్బతిని మంటలు వ్యాపించాయి.

8 32 కార్లు.. మానవ బాంబులు

(మొదటి పేజీ తరువాయి)


గురువారం పుల్వామాలో కార్డన్ అండ్ సెర్చ్ ఆపరేషన్‌లో భద్రతా బలగాలు

అయ్యింది. ముఖ్యంగా యూనివర్సిటీ క్యాంపస్‌లోని 17 భవనంలో ఉన్న బాయ్స్ హాస్టల్‌లోని 13వ నంబర్ గదిని ఉగ్ర స్థావరంగా మార్చుకున్నట్లు గుర్తించారు. ఈఉగ్రవాద వైద్యులు టర్కీలోని ఉకాసా అనే వ్యక్తితో తరుచూ సంభాషించారు. ఆ ఉకాసా ఎవరన్నదానిపై దర్యాప్తు అధికారులు దృష్టి సారించారు. హ్యాండ్లర్‌తోపాటు ఈ ముఠా సభ్యులు పరస్పరం సంభాషించుకునేందుకు స్విట్జర్లాండ్‌కు చెందిన త్రీమా యాప్‌ను ఉపయోగించినట్లు గుర్తించారు. కాగా, సోమవారం సాయంత్రం ఢిల్లీలోని ఎర్రకోట వద్ద జరిగిన ఉగ్రదాడిలో మృతుల సంఖ్య13కు చేరింది. ఎల్ఎన్‌జేపీ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న క్షతగాత్రుల్లో గురువారం ఒకరు మరణించాడు.

బాంబుల కోసం 26 క్వింటాళ్ల ఎరువు

ఫరీదాబాద్ ఉగ్రవాదులు మహా విధ్వంసానికే కుట్ర పన్నారు. 8 మంది నాలుగు గ్రూపులుగా విడిపోయి, ఏక కాలంలో 32 కార్లలో బాంబులు అమర్చి పేల్చివేయాలని ప్రణాళిక వేశారు. అందుకోసం మొత్తం పాత కార్లనే కొనుగోలు చేయాలని నిర్ణయించుకున్నారు. ఇప్పటికే నాలుగు కార్లను సమకూర్చుకున్నారు. ఎర్రకోట వద్ద పేలింది అందులో ఒకటే. ఎరుపు రంగు ఎకోస్పోర్ట్ కారును బుధవారం హరియాణాలోని ఓ గ్రామంలో స్వాధీనం చేసుకున్నారు. అందులో నిద్రిస్తున్న ఓ యువకుడిని అదుపులోకి తీసుకొని ప్రశ్నిస్తున్నారు. ముజమ్మిల్ వాడిన బ్రెజా (హెచ్ఆర్87 యూ9988) కారును యూనివర్సిటీ క్యాంపస్‌లో కనుగొన్నారు. డాక్టర్ షహీన్ సయీద్ వాడిన స్విఫ్ట్ డిజైర్ కారును గతంలోనే స్వాధీనం చేసుకోగా, అందులో ఓ అసాల్ట్ రైఫిల్ లభించింది. ఈ కార్లలో అమర్చేందుకు ఇంప్రూవైజ్డ్ ఎక్స్‌ప్లోజివ్ డివైజెస్ (ఐఈడీ) బాంబులను తయారు చేసేందుకు రూ.3 లక్షలతో గురుగ్రామ్, నూహ్ తదితర చోట్ల నుంచి 26 క్వింటాళ్ల ఎన్‌పీకే ఎరువులను కొనుగోలు చేసినట్లు తేలింది. బాంబుల తయారీ, దాడుల కోసం డాక్టర్ ముజమ్మిల్, డాక్టర్ అదీల్, డాక్టర్ షహీన్ సయీద్, డాక్టర్ ఉమర్ నబీ కలిసి రూ.20 లక్షలు సేకరించి, ఆ డబ్బును నబీ వద్ద దాచినట్లు గుర్తించారు. ఎర్రకోట బాంబు దాడిలో అతడు కూడా మరణించిన విషయం తెలిసిందే. ఈ డబ్బు విషయంలో ముజమ్మిల్, ఉమర్ మధ్య అభిప్రాయ బేధాలు వచ్చినట్లు కూడా అధికారుల విచారణలో తేలింది. అరెస్టయిన డాక్టర్లంతా ఆత్మాహుతి బాంబర్లుగా మారాలని నిర్ణయించుకున్నట్లు గుర్తించారు.

అంతర్జాతీయ నెట్‌వర్క్‌ను ఛేదించే పనిలో

జమ్మూకశ్మీర్‌లోని శ్రీనగర్‌లో జైషే మహ్మద్ ఉగ్రవాద సంస్థకు మద్దతుగా పోస్టర్లు వేసి దొరికిపోయిన ఫరీదాబాద్ ఉగ్ర మాడ్యూల్ వెనుక అత్యంత ప్రమాదకరమైన అంతర్జాతీయ ఉగ్ర నెట్‌వర్క్ ఉన్నట్లు భారత దర్యాప్తు, నిఘా వర్గాలు గుర్తించాయి. మొదట ఈ మాడ్యూల్‌ను తేలిగ్గా తీసుకున్న పోలీసులు.. ఢిల్లీలోని ఎర్రకోట వద్ద బాంబు దాడి తర్వాత లోతుగా శోధిస్తుండటంతో నిఘా వర్గాలే ఉలిక్కిపడే కుట్ర బయటపడుతోంది. టర్కీలో తిష్ట వేసిన పాకిస్థాన్ జైషే మహ్మద్ ఉగ్రవాద సంస్థ నాయకులు.. అక్కడి నుంచి ఫరీదాబాద్ మాడ్యూల్‌ను నడిపించినట్లు గుర్తించారు. ముఖ్యంగా ఉకాసా అనే పేరుతో ఉన్న వ్యక్తి ఈ మాడ్యూల్‌కు ఎప్పటికప్పుడు ఆదేశాలు ఇచ్చినట్లు తేలింది. అరబ్బీలో ఉకాసా అంటే సాలీడు అని అర్థం. ఢిల్లీలో ఆత్మాహుతి దాడికి పాల్పడిన డాక్టర్ ఉమర్ నబీతోపాటు ఈ వైద్యుల ముఠాను తయారుచేసిన జమ్మూకశ్మీర్‌కు చెందిన ఇమామ్ ఇర్ఫాన్ అహ్మద్ గతంలో టర్కీలో రెండువారాలు ఉండి వచ్చినట్లు గుర్తించారు. వారు ఉకాసాను కలిసి ఉంటారన్న కోణంలో దర్యాప్తు జరుపుతున్నారు.

రూమ్ నంబర్ 13.. ఉగ్రడెన్

హరియాణాలోని అల్ ఫలాహ్ యూనివర్సిటీలో జరుపుతున్న సోదాల్లో సంచలన విషయాలు వెలుగులోకి వస్తున్నాయి. దాదాపు 70 ఎకరాల్లో విస్తరించి ఉన్న ఈ వర్సిటీని ఉగ్రవాదులు తమ డెన్‌గా మార్చుకున్నట్లు తేలింది. ముఖ్యంగా 17వ భవనంలో ఉన్న బాయ్స్ హాస్టల్‌లో 13వ నంబర్ గది ఉగ్ర స్థావరంగా మారింది. పోలీసులు అరెస్టు చేసిన డాక్టర్ ముజమ్మిల్ ఆ గదిలో ఉండేవాడని గుర్తించారు. ఈ ఉగ్రముఠా మొత్తం ఈ గదిలోనే తరచూ సమావేశమై దాడులకు ప్రణాళిక రూపొందించినట్లు తేలింది. ఆత్మాహుతి దాడికి పాల్పడిన డాక్టర్ ఉమర్ నబీ ఇదే హాస్టల్‌లో 4వ నంబర్ గదిలో ఉండేవాడని, ఆ గ దిలో కూడా ఈ ఉగ్ర డాక్టర్లు సమావేశం అయ్యేవారని పోలీసులు తెలిపారు. క్యాంపస్‌లో ఇంకా ఎవరెవరు ఈ ముఠాలో సభ్యులుగా చేరారన్నదానిపై లోతుగా దర్యాప్తు చేస్తున్నారు. పోలీసులు అరెస్టు చేసిన మహిళా ఉగ్రవాది, అల్ ఫలాహ్ వర్సిటీ మెడికల్ కాలేజీ డాక్టర్ షహీన్‌కు పాకిస్థాన్ ఉగ్రవాదులతో సంబంధాలు ఉన్నట్లు స్పష్టమైంది.

అల్ ఫలాహ్ వర్సిటీ స్థాపకుడి అక్రమాలెన్నో..

దేశవ్యాప్తంగా భారీగా పేలుళ్లకు కుట్ర పన్నిన ఉగ్ర వైద్యులకు అడ్డాగా మారిన అల్ ఫలాహ్ యూనివర్సిటీ వ్యవస్థాపకుడు జావేద్ అహ్మద్ సిద్ధిఖీ అక్రమాలు బయటికి వస్తున్నాయి. భారీగా లాభాలు వస్తాయంటూ రూ.7.5 కోట్లు డిపాజిట్లు సేకరించి, మోసం చేసిన కేసులో ఆయన మూడేళ్లు జైలుకు వెళ్లిన అంశం చర్చనీయాంశంగా మారింది. అల్ ఫలాహ్ ఇన్వెస్ట్‌మెంట్ సంస్థలో పెట్టుబడులు పెడితే భారీగా లాభాలు వస్తాయని ప్రజల నుంచి డిపాజిట్లు సేకరించి.. ఆ సొమ్మును వ్యక్తిగత ఖాతాల్లోకి మళ్లించారు సిద్దిఖీ. దీనిపై నమోదైన కేసులో 2001 మార్చిలో అతడు అరెస్టయ్యారు. బాధితులకు సొమ్ము తిరిగిస్తానని ఢిల్లీ హైకోర్టుకు హామీ ఇవ్వడంతో 2004 ఫిబ్రవరిలో బెయిల్‌పై విడుదల య్యారు. డిపాజిట్ల సేకరణ వ్యవహారంపై ఈడీ కూడా దర్యాప్తు చేపట్టింది. మధ్యప్రదేశ్‌లోని ఇండోర్ జిల్లా అంబేద్కర్ నగర్‌కు చెందిన సిద్ధిఖీ.. అల్ ఫలాహ్ చారిటబుల్ ట్రస్టు కింద తొమ్మిది సంస్థలను స్థాపించారు. ఇవన్నీ కూడా ఢిల్లీలోని జామియా నగర్‌లో అల్ ఫలాహ్ హౌజ్ పేరిట ఉన్న ఒకే భవనం చిరునామాతో రిజిస్టర్ చేశారు. ఇందులో యూనివర్సిటీ తప్ప మిగతా సంస్థలన్నీ 2019 ఏడాది వరకే కొనసాగాయి. తర్వాత కొన్నింటిని మూసేయగా, మరికొన్నింటిని పక్కనపెట్టేశారు. ఇదిలా ఉండగా, అల్ ఫలాహ్ ప్రైవేటు యూనివర్సిటీకి 'న్యాక్ (జాతీయ మదింపు, గుర్తింపు మండలి)' నోటీసులు జారీ చేసింది. వర్సిటీ పరిధిలోని ఇంజినీరింగ్, ఉపాధ్యాయ విద్య కాలేజీలకు న్యాక్ నుంచి ఎలాంటి గుర్తింపు లేకున్నా.. న్యాక్ 'ఏ' గ్రేడ్ గుర్తింపు ఉన్నట్టుగా వెబ్‌సైట్లో పేర్కొన్నారని వెల్లడించింది.

లోకం తీరు



1000 అడుగుల దూరం ఎగిరిపడిన చేయి

ఎర్రకోట వద్ద బాంబు పేలుడు ధాటికి కొందరి శరీరాలు తునాతునకలైపోయాయి. అందులో ఒకరి చేయి భాగం పేలుడు జరిగిన ప్రాంతానికి సుమారు 1000 అడుగుల దూరంలోని ఓ షాపు పైభాగంలో గురువారం లభ్యమైంది. వేళ్ల నుంచి మోచేతి కింద వరకు ఉన్న ఈ చేయి భాగాన్ని సేకరించిన పోలీసులు.. డీఎన్ఏ పరీక్షల కోసం ఫోరెన్సిక్ నిపుణులకు పంపించారు. ఇంకా ఏమైనా అవశేషాలు ఉన్నాయా అన్నదానిపై పరిసర ప్రాంతాల్లో క్షుణ్ణంగా పరిశీలన జరుపుతున్నారు. కాగా, పేలుడు జరిగిన ప్రాంతంలో సేకరించిన పలు శరీర భాగాల డీఎన్ఏ ఉగ్ర వైద్యుడు ఉమర్ నబీ తల్లి డీఎన్ఏ శాంపిళ్లతో సరిపోలాయని.. దీనితో ఆ కారును నడుపుతున్నది అతడేనని కచ్చితంగా తేలిందని పోలీసు వర్గాలు గురువారం వెల్లడించాయి.

మరో వైద్య విద్యార్థి అరెస్టు

ఫరీదాబాద్ ముఠాతో సంబంధం ఉన్న మరో వైద్య విద్యార్థిని ఉత్తరప్రదేశ్ ఏటీఎస్ పోలీసులు కాన్పూర్‌లో అరెస్టు చేశారు. ప్రభుత్వం నడుపుతున్న గణేశ్ శంకర్ విద్యార్థి మెమోరియల్ మెడికల్ కాలేజీలో కార్డియాలజీ ఫస్టియర్ చదువుతున్న డాక్టర్ మొహమ్మద్ ఆరిఫ్ (32)ను అదుపులోకి తీసుకొని ప్రశ్నిస్తున్నారు. జీఎస్ మెడికల్ కాలేజీ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ ఫరూక్ ను కూడా అరెస్టు చేశారు. పరారీలో ఉన్న జమ్మూకశ్మీర్‌కు చెందిన మరో వైద్యుడు ముజఫర్ ఆచూకీ కనుగొనేందుకు పోలీసులు ఇంటర్‌పోల్ సహాయం కోరారు. కాగా, ఢిల్లీ బాంబు దాడిని సమర్థిస్తూ సోషల్ మీడియాలో పోస్టులు పెట్టిన 15మందిని అసోం పోలీసులు అరెస్టు చేశారు. బాంబు దాడి నేపథ్యంలో తదుపరి ఆదేశాలు ఇచ్చేవరకు ఎర్రకోట మెట్రో రైల్ స్టేషన్‌ను మూసి ఉంచుతున్నట్లు ఢిల్లీ మెట్రో కార్పొరేషన్ ప్రకటించింది. అల్ ఫలాహ్ వర్సిటీ ఆర్థిక లావాదేవీలపై ఈడీని కేంద్రం ఆదేశించింది.

ఏసీబీ వలలో జడ్జి

(మొదటి పేజీ తరువాయి)

తీర్పునిచ్చేందుకు జడ్జికి రూ.15 లక్షలు, తనకు రూ.10 లక్షలు.. మొత్తం రూ.25 లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేశాడు. ఇది ఇష్టం లేని ఫిర్యాదుదారుడు ఏసీబీ అధికారులను ఆశ్రయించాడు. దీంతో వారి సూచనలతో మరోసారి వాసుదేవ్‌ను కలవగా.. చివరకు అతడు రూ.15 లక్షలకు అంగీకరించాడు. ఈ నేపథ్యంలోనే ఈనెల 11న ఫిర్యాదుదారుడి నుంచి వాసుదేవ్ రూ.15 లక్షలు తీసుకుంటుండగా.. ఏసీబీ అధికారులు పట్టుకున్నారు. తనకు డబ్బు అందగానే వాసుదేవ్ సదరు న్యాయమూర్తికి కూడా ఫోన్ చేసి చెప్పగా.. అందుకు ఆయన కూడా అంగీకరించారు. దీంతో ఇరువురిపై ఏసీబీ కేసులు నమోదు చేసింది.

నకిలీ రికార్డులతో భూమి స్వాహా!

- సత్వ గ్రూపు భాగస్వామి అశ్విన్ సంచేటి అరెస్టు

బెంగళూరు, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): ప్రముఖ రియల్ ఎస్టేట్ సంస్థ సత్వరిషి ప్రైవేట్ లిమిటెడ్ భాగస్వామి అశ్విన్ సంచేటిని బెంగళూరు ఆవలహళ్లి పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. నగరంలోని బండాపుర పరిధిలో 10 ఎకరాల భూమిని నకిలీ రికార్డులు సృష్టించి కాజేసినట్టు ఆయనపై పోలీసులకు ఫిర్యాదు అందింది. దీంతో చర్యలను ప్రారంభించారు. బండాపుర పరిధిలోని సర్వే నంబరు 20, 21, 44/1లో పది ఎకరాల భూమిపై 2022లో కొందరు నకిలీ రికార్డులు తయారు చేసి కోర్టు ద్వారా భూమి హక్కులు పొందారు. ఈ ఆక్రమణపై అసలు యజమానులు ఫిర్యాదు చేయడంతో పోలీసులు అశ్విన్‌తో పాటు 14మందిపై ఎఫ్ఐఆర్ నమోదు చేశారు.

మాస్కులేం సరిపోతాయ్?

- ఢిల్లీలో కాలుష్యంపై సుప్రీంకోర్టు ఆందోళన
- న్యాయవాదులు విచారణలకు వర్చువల్‌గా హాజరుకావాలన్న జస్టిస్ పీఎస్ నరసింహ

న్యూఢిల్లీ, నవంబరు 13 : దేశ రాజధాని న్యూఢిల్లీలోని వాయు కాలుష్యం తీవ్రతపై సుప్రీంకోర్టు గురువారం తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. ఢిల్లీలో నెలకొన్న కాలుష్య తీవ్రతకు ముఖానికి మాస్కులు ధరించినా ఫలితం ఉండదని, సీనియర్ న్యాయవాదులు కేసుల విచారణలకు వర్చువల్‌గా హాజరు కావాలని సూచించింది. ఢిల్లీలో వాయు కాలుష్యం తీవ్ర ఆందోళనకరంగా ఉందన్న అత్యున్నత న్యాయస్థానం.. వీడియో కాన్ఫరెన్స్ విధానం అందుబాటులో ఉన్నప్పటికీ సీనియర్ న్యాయవాదులు స్వయంగా విచారణలకు ఎందుకు హాజరవుతున్నారని ప్రశ్నించింది. సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ పీఎస్ నరసింహ సీనియర్ న్యాయవాదులతో మాట్లాడుతూ ఈ వ్యాఖ్యలు చేశారు. 'ఢిల్లీలోని కాలుష్యం శాశ్వత నష్టాన్ని కలిగిస్తుంది. మీరంతా కోర్టుకు ఎందుకు వచ్చారు. విచారణలకు వర్చువల్‌గా హాజరయ్యే విధానం మనకు ఉంది కదా. ఆ సదుపాయాన్ని ఉపయోగించుకోండి. ఇప్పుడున్న కాలుష్య తీవ్రతను ఎదుర్కొనేందుకు ముఖానికి మాస్కులు ధరించినా ఫలితం ఉండదు. ఈ విషయాన్ని ప్రధాన న్యాయమూర్తితోనూ చర్చిద్దాం' అని జస్టిస్ పీఎస్ నరసింహ వ్యాఖ్యానించారు.

డబ్బులిచ్చి మనుషుల్ని వేటాడారు!

(మొదటి పేజీ తరువాయి)

ఇతర దేశాలకు చెందిన ధనవంతులు కూడా 'యుద్ధ పర్యాటకం' పేరుతో ఈ అకృత్యానికి పాల్పడేవారని సమాచారం.

ఇదీ నేపథ్యం..


సారయేవోలో 1995 ఏప్రిల్ 20న స్నైపర్ల నుంచి ప్రాణాలను కాపాడుకునేందుకు పరుగెత్తుతున్న పిల్లలు

రెండో ప్రపంచ యుద్ధానంతరం ఏర్పడ్డ సోషలిస్ట్ ఫెడరల్ రిపబ్లిక్ ఆఫ్ యుగోస్లావియా నుంచి.. 1992 మార్చిలో బోస్నియా-హెర్జెగోవినా స్వాతంత్ర్యం ప్రకటించుకుంది. యూరోపియన్ యూనియన్, ఐక్యరాజ్య సమితి బోస్నియాను స్వతంత్రదేశగా గుర్తించాయి. కానీ.. బోస్నియాలోని ఆర్థొడాక్స్ క్రిస్టియన్ సెర్బులు దీన్ని వ్యతిరేకించారు. బోస్నియా ఉంటే యుగోస్లావియాలో ఉండాలి లేదా సెర్బియాలో కలవాలి అని కోరుకున్నారు. అలా జరగకపోవడంతో రాడోవాన్ కరాడ్జిచ్ నేతృత్వంలో 1992 ఏప్రిల్ 5న సారయేవోను ముట్టడించారు. నగరం చుట్టూ ఉన్న కొండల్లో మాటువేసి పౌరులపై స్నైపర్‌తో కాల్పులు జరిపేవారు. ఆ నగరానికి విద్యుత్తు, నీరు, ఆహారం అందకుండా చేశారు. దీంతో సారయేవో పౌరల జీవితం నరకప్రాయమైంది. ఒక్క బంగాళదుంప.. ఒక్క రొట్టె ముక్క దొరికినా ప్రాణాలు నిలబెట్టుకోవచ్చన్న ఆశ. అవి దొరకాలంటే బయటకు వెళ్లాల్సిందే. ఏదో ఒక పని చేయాల్సిందే. అలా వెళ్లాలంటే.. నగరంలోని రెండు ప్రధాన రహదారుల గుండా వెళ్లాల్సి వచ్చేది. వాటిలో ఒకటి డ్రాగన్ ఆఫ్ బోస్నియా స్ట్రీట్.. రెండోది మోసా సెలిమోవిక్ బొలివర్డ్. చుట్టుపక్కల ఉన్న పరిశ్రమల్లోను, విమానాశ్రయంలో పనిచేయడానికి వెళ్లాలంటే ఈ వీధుల గుండానే వెళ్లాల్సి వచ్చేది. దీంతో.. సెర్బు స్నైపర్లు ఈ వీధులనే లక్ష్యంగా చేసుకుని మాటువేసేవారు. వాటి గుండా వెళ్లే పౌరులను.. చిన్నా, పెద్దా అనే తేడా లేకుండా తమ గురికి చిక్కే ప్రతి ఒక్కరినీ తూటాలు దింపి చంపేసేవారు. అందుకే ఆ వీధులను 'స్నైపర్ ఎల్లీ'లుగా వ్యవహరించేవారు. ఆ వీధుల్లో వెళ్లాలంటే పౌరులు ఐక్యరాజ్యసమితి వాహనాలు వచ్చేదాకా ఆగి.. వాటి వెనుక నక్కినక్కి వెళ్లేవారు. లేదా.. ఏదైనా మరుగుచూసుకుని ఆగి.. ఒక్క ఉదుటున ఒకచోటు నుంచి మరో చోటుకు పరుగెత్తి ఆగేవారు. ఇలా ఆగుతూ పరుగెత్తుతూ.. నాలుగేళ్ల పాటు ఆ నరకప్రాయమైన జీవితాన్ని గడిపారు. ఇలా వెళ్లే వారిని చంపడానికే ఇటాలియన్ సంపన్నులు పెద్ద ఎత్తున (ఇప్పటి లెక్కల ప్రకారమైతే.. రూ.కోటి దాకా) డబ్బులిచ్చి మరీ అక్కడికి వెళ్లేవారు. అక్కడికెళ్లాక.. చిన్నారులను చంపడానికి ఈ సంపన్నులు ఎక్కువ మొత్తంలో డబ్బు చెల్లించేవారని.. వృద్ధులను ఉచితంగా కాల్చేందుకు సెర్బులు అనుమతించేవారని చెబుతారు. బోస్నియాకు చెందిన సైనిక నిఘా అధికారి ఒకరు ఇటీవలే ఈ మేరకు సాక్ష్యం ఇచ్చారు. నిజానికి ఆ అధికారి ఆ విషయాన్ని 1994 మొదట్లోనే ఇటలీ సైనిక నిఘా అధికారులకు తెలపగా.. ఇటలీ సైన్యం స్నైపర్ టూరిజానికి చెక్ పెట్టింది. అప్పట్లోనే దీని గురించి తెలుసుకున్న పాత్రికేయుడు ఎజియోగవజెనీ ఇన్నాళ్లుగా దీనికి సంబంధించిన ఆధారాలన్నీ పోగుచేసి పబ్లిక్ ప్రాసిక్యూటర్‌కు అప్పగించడంతో ఇప్పుడు దర్యాప్తు ప్రారంభించారు. కాగా.. సారయేవో ముట్టడిలో 11,500 మందికి పైగా ప్రజలు ప్రాణాలు కోల్పోయారు. అందులో 1600 మందికి పైగా పిల్లలున్నారు. ఎట్టకేలకు 1995 చివర్లో అమెరికా అధ్యక్షుడు బిల్ క్లింటన్ ఆధ్వర్యంలో కుదిరిన డేటన్ శాంతి ఒప్పందం ద్వారా సారయేవో ముట్టడికి తెరపడింది. కానీ.. ఆ నాలుగేళ్లలో సారయేవోలోని ప్రతి ఒక్క కుటుంబం తమలో కనీసం ఒకరినైనా కోల్పోయింది. ఆ నగరంలోని గ్రంథాలయాలు, పాఠశాలలు, చర్చిలు, మసీదులు.. ఏవీ మిగల్లేదు. వేలాది అరుదైన పుస్తకాలు కాలిపోయాయి. అందుకే అప్పట్లో ఆ నగరాన్ని 'బర్నింగ్ లైబ్రరీ ఆఫ్ యూరో'ప్‌గా పిలిచేవారు.


రాత్రిపూట కౌంటింగ్ కేంద్రంలోకి.. ఈవీఎం పెట్టెల లారీ!

- బిహార్ అసెంబ్లీ ఎన్నికల కౌంటింగ్ ముందు కలకలం
- ఈవీఎంలు మార్చేందుకేనంటూ ఆర్జేడీ ఆందోళన

పట్నా, నవంబరు 13: బిహార్ అసెంబ్లీ ఎన్నికల ఓట్ల లెక్కింపునకు ముందు 'ఓట్ చోరీ' అంశం మరోసారి మంటలు పుట్టించింది. ఆ రాష్ట్రంలోని చెనారి అసెంబ్లీ నియోజకవర్గంలోని ససారాంలో ఈవీఎంల స్ట్రాంగ్ రూమ్, కౌంటింగ్ కేంద్రం ఉన్న ప్రాంగణంలోకి బుధవారం రాత్రి పెద్ద సంఖ్యలో ఇనుప పెట్టెలున్న లారీ ప్రవేశించడం కలకలం రేపింది. ఈవీఎంలను మార్చి ఓటు చోరీకి పాల్పడేందుకే లారీలో ఈవీఎంలను తెచ్చారని ఆర్జేడీ శ్రేణులు బుధవారం అర్ధరాత్రి పెద్ద ఎత్తున ఆందోళనకు దిగాయి. స్ట్రాంగ్ రూమ్ లోపల, బయట సీసీ కెమెరాలను ఆఫ్ చేశారని ఆరోపించాయి. పలువురు ఆర్జేడీ ఎమ్మెల్యే అభ్యర్థులు కూడా అక్కడికి చేరుకుని ధర్నాలో పాల్గొన్నారు. పరిస్థితి ఉద్రిక్తంగా మారడంతో పోలీసులు లాఠీచార్జి చేసి, అందరినీ చెదరగొట్టారు. అయితే కౌంటింగ్ కేంద్రంలోకి వచ్చిన లారీలో ఉన్నవి ఖాళీ పెట్టెలని.. కౌంటింగ్ తర్వాత ఈవీఎంలు, పోలింగ్ సామగ్రిని తరలించేందుకు తీసుకువచ్చారని జిల్లా ఎన్నికల అధికారి ఉదితా సింగ్ ప్రకటించారు. అధికారులు ఆ లారీలోని పెట్టెలన్నింటినీ అభ్యర్థులు, ఏజెంట్ల సమక్షంలో తెరిచి చూపించారని వెల్లడించారు. సీసీ కెమెరాలేవీ నిలిపివేయలేదని, పూర్తి ఫుటేజీ ఉందని తెలిపారు. కాగా, ససారాం గొడవ నేపథ్యంలో నిర్లక్ష్యంగా వ్యవహరించారంటూ చెనారి అసెంబ్లీ సెగ్మెంట్ రిటర్నింగ్ అధికారి లలిత్ భూషణ్‌ను ఎన్నికల విధుల నుంచి తప్పిస్తూ రాష్ట్ర ఎన్నికల అధికారి వినోద్ సింగ్ ఆదేశాలు జారీ చేశారు.

పార్టీ ఫిరాయించిన బెంగాల్ ఎమ్మెల్యే సభ్యత్వం రద్దు

- గెలిచిన నెలకే బీజేపీ నుంచి టీఎంసీలోకి ముకుల్ రాయ్



కోల్‌కతా, నవంబరు 13: బీజేపీ టిక్కెట్‌పై గెలిచి తృణమూల్ కాంగ్రెస్‌లోకి మారిన సీనియర్ నాయకుడు ముకుల్ రాయ్ శాసనసభ సభ్యత్వాన్ని రద్దు చేస్తూ గురువారం కలకత్తా హైకోర్టు తీర్పు ఇచ్చింది. ఫిరాయింపుల నిషేధం చట్టం కింద నిర్ణయాన్ని వెలువరించింది. ఈ కారణంగా ఆయన ప్రాతినిధ్యం వహిస్తున్న కృష్ణనగర్ (ఉత్తర) స్థానం ఖాళీ అయింది. అయితే ఉప ఎన్నికలు జరిగే అవకాశాలు మాత్రం లేవు. అసెంబ్లీ ఎన్నికలు సమీపిస్తుండమే ఇందుకు కారణం. 2021 మే నెలలో బీజేపీ టిక్కెట్‌పై ఎమ్మెల్యేగా విజయం సాధించిన ఆయన కొద్ది సమయంలోనే అంటే.. జూన్ నెలలో తృణమూల్ కాంగ్రెస్‌లో చేరారు. ముకుల్‌పై అనర్హత వేటు వేయాలని బీజేపీకి చెందిన ప్రతిపక్ష నాయకుడు సువేందు అధికారి స్పీకర్ బిమన్ బెనర్జీని కోరారు. అందుకు స్పీకర్ అంగీకరించలేదు. దాంతో సువేందు హైకోర్టును ఆశ్రయించారు. విచారణ జరిపిన ధర్మాసనం స్పీకర్‌కు మరో అవకాశం కల్పించింది. అయినా స్పీకర్ ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంతో ముకుల్ రాయ్‌ను ఎమ్మెల్యేగా అనర్హుడిగా ప్రకటించింది. హైకోర్టు తనకు సంక్రమించిన రాజ్యాంగపర అధికారాలను ఉపయోగించుకొని ఫిరాయింపుల నిషేధం చట్టం కింద ఎమ్మెల్యేను అనర్హుడిగా ప్రకటించడం ఇదే తొలిసారి అని సువేందు అధికారి తరపు న్యాయవాది బిల్వదళ బెనర్జీ చెప్పారు. తీర్పుపై బీజేపీ నేత సువేందు అధికారి స్పందిస్తూ ఇది రాజ్యాంగ విజయమని అన్నారు.

ఓవర్‌లోడ్‌తో పల్లెవెలుగు బస్సు టైర్లకు మంటలు?


బస్సు టైరు కాలిపోవడంతో వస్తున్న పొగ

- గమనించి చెప్పిన వాహనదారులు
- గద్వాల జిల్లాలో తప్పిన ప్రమాదం
- బస్సులో 96 మంది ప్రయాణం
- బస్సు సామర్థ్యం 55 మందేనన్న డ్రైవర్

మానవపాడు, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): జోగులాంబ గద్వాల జిల్లాలో పెను ప్రమాదం తప్పింది. మానవపాడు మండలంలోని మద్దూరు వద్ద గురువారం ఆర్టీసీ పల్లెవెలుగు బస్సులో మంటలు వ్యాపించాయి. మద్దూరు బస్టాపు వద్ద ఉన్న ప్రయాణికులు, ఇతర వాహనదారులు బస్సు డ్రైవర్ సత్యారెడ్డిని అప్రమత్తం చేయడంతో అతడు వెంటనే బస్సును రోడ్డు పక్కన నిలిపివేశాడు. ప్రయాణికులంతా భయంతో అరుస్తూ వేగంగా కిందికి దిగిపోయారు. దీంతో, ప్రమాదం తప్పిపోయింది. ఈ సమయంలో బస్సులో 96మంది ప్రయాణికులు ఉన్నారు. బస్సు సామర్థ్యం 55 మాత్రమే కాగా, 96 మంది ఎక్కారని, ఓవర్ లోడ్ కారణంగా లైనర్లు, టైర్లు వేడి కావడంతో మంటలు చెలరేగాయని డ్రైవర్ సత్యారెడ్డి చెప్పాడు. గద్వాల డిపోకు చెందిన పల్లె వెలుగు బస్సు గద్వాల నుంచి ఉదయం 7:30 గంటలకు కర్నూలుకు బయలుదేరింది. బస్సు మద్దూరు స్టేజీ సమీపంలోకి వస్తుండగా బస్సులోకి పొగలు వచ్చాయి. అదేసమయంలో మద్దూరు స్టేజీ వద్ద ప్రయాణికులు, గ్రామస్థులు, వాహనదారులు బస్సు టైర్ల వద్ద మంటలు అంటుకున్న విషయాన్ని గమనించి డ్రైవర్‌కు చెప్పారు. దీంతో, డ్రైవర్ బస్సును ఆపి, స్థానికుల సాయంతో మంటలను ఆర్పివేశాడు. శాంతినగర్ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని ప్రయాణికులను ఇతర బస్సులు, ప్రైవేటు వాహనాల్లో వారి గమ్యస్థానాలకు పంపించారు.

గుంతలను తప్పించబోయి కారు బోల్తా

- ఇద్దరి మృతి.. మరో ఇద్దరికి తీవ్ర గాయాలు.. హనుమకొండ జిల్లాలో ప్రమాదం

ఆత్మకూరు, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): గుంతలను తప్పించబోయి చెట్టును కారు ఢీకొట్టగా ఇద్దరు చనిపోయారు. మరో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. భూపాలపల్లి జిల్లా రేపాకపల్లికి చెందిన పార్శ సంపత్(55) మిర్చి పంటను అమ్మేందుకు బుధవారం కారులో వరంగల్‌కు వెళ్లారు. ఇంతలో కారు తాళం చెవి పోయింది. దీంతో పోతరాజు వెంకటేశ్ కారులో సంపత్.. వ్యాపారి కిషన్‌రావు(36), మురళీకృష్ణలు రేపాకపల్లి నుంచి తాళం చెవి తీసుకు వెళ్తుండగా బుధవారం అర్ధరాత్రి హనుమకొండ జిల్లా ఆత్మకూరు మండలం కొత్తగట్టు క్రాస్ రోడ్డు వద్ద గుంతలను తప్పించబోగా కారు అదుపు తప్పి పల్టీలు కొట్టుకుంటూ రోడ్డు పక్కన చెట్టును అతివేగంగా ఢీకొట్టింది. దీంతో కారు వెనుక సీట్‌లో కూర్చున్న సంపత్, కిషన్‌రావు మృతి చెందారు. డ్రైవింగ్ చేస్తున్న వెంకటేశ్, పక్కన కూర్చున్న మురళీకృష్ణ తీవ్రంగా గాయపడ్డారు.

సత్యసాయి శతజయంతి వేడుకలు ప్రారంభం

- ప్రశాంతి నిలయంలో ప్రత్యేక కార్యక్రమాలు



పుట్టపర్తి, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): శ్రీసత్యసాయి జిల్లా పుట్టపర్తిలో సత్యసాయి శత జయంతి వేడుకలు గురువారం ప్రారంభమయ్యాయి. ప్రశాంతి నిలయంలో సత్యసాయి మహాసమాధిని ప్రత్యేకంగా అలంకరించి, పూజలు చేశారు. అనంతరం విద్యార్థుల వేద పఠనంతో వేడుకలు ప్రారంభమయ్యాయి. వేలాది మంది భక్తులు సత్యసాయి మహాసమాధిని దర్శించుకున్నారు. వేడుకల్లో పాల్గొంటున్న భక్తులకు నారాయణ సేవను సత్యసాయి సెంట్రల్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ ఆర్‌జే రత్నాకర్ ప్రారంభించారు. నారాయణ సేవ కింద రోజూ ఉదయం అల్పాహారం, మధ్యాహ్నం, రాత్రి భోజనం అందిస్తారు. పుట్టపర్తిలో 20 అడుగుల పొడవు, 26 అడుగుల వెడల్పు ఉన్న సత్యసాయి శత జయంతి ఉత్సవాల గ్యాస్ బెలూన్‌ను ఆర్‌జే రత్నాకర్ ఎగురవేశారు. బెంగళూరు బృందావనంలో ప్రారంభమైన సత్యసాయి విద్యార్థుల సైకిల్ ర్యాలీ గురువారం సాయంత్రం హిల్‌వ్యూ స్టేడియానికి చేరుకుంది. సత్యసాయికి మంగళహారతిని నివేదించి, సైకిల్ యాత్రను ముగించారు. సైక్లోన్ సభా మండపంలో సాయంత్రం అనిర్బన్ రావ్ ఫ్లూట్ వాయిద్యంతో భక్తులను అలరించారు.

సర్కారీ భూమిలో 40 లగ్జరీ విల్లాలు

దాదాపు రూ.వంద కోట్ల విలువైన ఇళ్ల భవిష్యత్తుపై నీలినీలిడలు.. అమీన్‌పూర్ కిష్టారెడ్డిపేట రెయిన్‌బో మీడోస్ కాలనీవాసుల వ్యథ

- తమకిక ఆత్మహత్యలే శరణ్యం అంటున్న బాధితులు
- లే-అవుట్ చేసిన బిల్డర్ ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్‌లో టీడీపీ ఎమ్మెల్యే

అమీన్‌పూర్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): "హెచ్ఎండీఏ లే-అవుట్.. అన్ని అనుమతులూ ఉన్నాయి" అనే భరోసాతో రూ.కోట్లు వెచ్చించి ఖరీదైన విల్లాలను కొనుగోలు చేసిన 40 మంది.. అవి సర్కారీ భూమిలో కట్టినవని పదేళ్ల తర్వాత తేలడంతో తాము నట్టేట మునిగిపోయామని ఇప్పుడు వాపోతున్నారు! సంగారెడ్డి జిల్లా అమీన్‌పూర్ మున్సిపాలిటీ పరిధిలోని కిష్టారెడ్డిపేటలో ఔటర్ రింగ్ రోడ్డు పక్కనే ఉన్న రెయిన్‌బో మీడోస్ కాలనీలో విల్లాలు కొన్న కొందరి దుస్థితి ఇది. ఈ కాలనీ మధ్యలో 198, 204, 208, 210 సర్వే నంబర్లలో ప్రభుత్వ భూమిని ఆక్రమించి 40 ఇళ్లు కట్టినట్టు ఏడీ సర్వేలో తేలింది. బ్యాంకుల్లో అప్పులు చేసి కొన్న ఇళ్లు ప్రభుత్వ భూమిలో ఉన్నాయని ఏడీ సర్వేలో తేలడంతో.. ఆ నలభై ఇళ్ల యజమానులు ఏం చేయాలో దిక్కుతోచని పరిస్థితిలో పడ్డారు. మిగతా పట్టాభూముల్లో నిర్మించిన ఇండ్లకు వెళ్లేదారి సైతం ప్రభుత్వ భూమిలో వేసిన రోడ్డే ఆధారం. దీంతో మిగతా ఇండ్ల యజమానులు సైతం తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. హెచ్ఎండీఏ అనుమతితో పాటు నిర్మాణానికి సంబంధించిన అన్ని అనుమతులూ చూసుకునే విల్లాలను కొన్నామని.. వాటిపై కోట్లాది రూపాయల లోన్లు తీసుకున్నామని.. అధికారులు తీరిగ్గా ఇప్పుడొచ్చి అది ప్రభుత్వ భూమి అంటే తాము ఏం చేయాలని బాధితులు ప్రశ్నిస్తున్నారు. హెచ్ఎండీఏ అనుమతులు పొందే సమయంలో సదరు స్థలానికి ఇదే రెవెన్యూ అధికారులు ల్యాండ్ కన్వర్షన్ సర్టిఫికెట్లు ఎలా ఇచ్చారని నిలదీస్తున్నారు. లే-అవుట్ మధ్యలో రెండెకరాల ప్రభుత్వ భూమి కబ్జాకు గురైతే ఇన్నాళ్లు రెవెన్యూ సిబ్బంది చూస్తూ ఎలా ఊరుకున్నారన్నదానిపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.


సర్వే నిర్వహిస్తున్న ప్రభుత్వ సిబ్బంది

ఇలా వెలుగులోకి..

రెయిన్‌బో మీడోస్ కాలనీ మధ్యలో కొన్ని పట్టాభూములు చాలాకాలంగా ఖాళీగా ఉన్నాయి. కాలనీవాసులు అవన్నీ ప్రభుత్వభూములని ఇన్నాళ్లూ భావించారు. అయితే, ఆ భూములకు సంబంధించిన పట్టాలు కలిగినవారు వాటిని స్వాధీనం చేసుకోవడంతో.. కాలనీవాసులు ప్రభుత్వ స్థలం కబ్జా జరుగుతోందంటూ కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. స్థలాన్ని స్వాధీనం చేసుకున్నవారి వద్ద ఉన్న పట్టాదారు పాస్ పుస్తకాలు, ఇతర రికార్డులను పరిశీలించిన స్థానిక తహసీల్దారు.. వారు కబ్జాదారులు కాదని, అది వారి భూమేనని నిర్ధారించారు. అంతేకాదు.. అసలు కాలనీలోనే ప్రభుత్వ భూమి కలిసిందనే విషయం సర్వేలో వెలుగులోకి రావడంతో కాలనీవాసులు షాక్‌కు గురయ్యారు. గ్రామ నక్షా, టిప్పన్ మ్యాప్ ప్రకారం సర్వే నంబర్ 208, 210లో 1.06 ఎకరాల విలువైన ప్రభుత్వ భూమి ఉంది. ఆ భూమితోపాటు చుట్టూ పట్టా నెంబర్లలో భూములను కొనుగోలు చేసిన బిల్డర్లు.. రెయిన్‌బో మీడోస్ కాలనీ పేరుతో హెచ్ఎండీఏ అనుమతితో లే-అవుట్ వేసి ఇళ్లను నిర్మించి విక్రయించారు. ప్రస్తుతం పట్టాభూములుగా తేలిన భూమిని అప్పట్లో ప్రభుత్వ భూమిగా భావించి.. ఆ భూమిని కొనేందుకు తాము సిద్ధంగా ఉన్నామని పేర్కొంటూ అప్పటి కలెక్టర్‌కు దరఖాస్తు చేసుకున్నారు. అప్పటి తహసీల్దార్ సైతం వారికి అనుకూలంగా ఫైల్‌ను తయారు చేసి కలెక్టర్ పరిశీలనకు పంపారు. కానీ, ఆ తర్వాత అది ముందుకు కదల్లేదు. కాగా.. అప్పట్లో ఈ వెంచర్ వేసిన బిల్డర్లలో ఒకరైన ఇంటూరి నాగేశ్వరరావు.. ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్‌లోని కందుకూరు ఎమ్మెల్యే (టీడీపీ)గా ఉన్నారు. పటాన్‌చెరు, అమీన్‌పూర్, కిష్టారెడ్డిపేట పరిసరాలలో అనేక వెంచర్లు వేశారాయన.

సమగ్ర దర్యాప్తు..

రెయిన్‌బో మీడోస్ కాలనీలో ప్రభుత్వ భూమి కబ్జా వ్యవహారంపై సమగ్ర దర్యాప్తు జరుగుతోందని అమీన్‌పూర్ తహసీల్దార్ వెంకటేశ్ తెలిపారు. ఏడీ సర్వే తరువాత కొన్ని హద్దులను నిర్ణయించారన్నారు. త్వరలోనే సమగ్ర నివేదికను కలెక్టర్‌కు అందజేస్తామన్నారు. ఉన్నతాధికారుల ఆదేశాలమేరకు తదుపరి చర్యలు ఉంటాయని తెలిపారు.

హెచ్ఎండీఏ అనుమతితోనే లేఅవుట్ వేశాం

- ప్రభుత్వ భూమిని కబ్జా చేయలేదు
- సర్వే మ్యాప్ ప్రకారం హెచ్ఎండీఏ అనుమతులు
- సంగారెడ్డి జిల్లా కలెక్టర్‌ను కలిసి వివరిస్తాం
- కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరావు

అమీన్‌పూర్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): హెచ్ఎండీఏ అనుమతితోనే అమీన్‌పూర్ మండలం కిష్టారెడ్డిపేటలో రెయిన్‌బో మీడోస్ లేఅవుట్ వేశామని.. అందులో ఎలాంటి ప్రభుత్వ భూమీ లేదని కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరావు స్పష్టం చేశారు. ఇప్పటికీ అక్కడ ప్రభుత్వ భూమి ఖాళీగా ఉందన్నారు. అప్పటి మండల సర్వేయర్ స్కెచ్‌మ్యాప్ ప్రకారమే హెచ్ఎండీఏ లేఅవుట్ అనుమతి జారీ చేసిందన్నారు. కొందరు ఫేక్ డాక్యుమెంట్లు సృష్టించి పది గుంటల ప్రభుత్వ భూమి కబ్జా చేసేందుకు ప్రయత్నిస్తున్నారని ఆయన ఆరోపించారు. తాము కొనుగోలు చేసిన పట్టాభూముల్లోనే లే-అవుట్ వేశామని, ఒక్క గజం కూడా ప్రభుత్వ భూమి అందులో కలవలేదని తేల్చిచెప్పారు. మధ్యలో ఉన్న ప్రభుత్వ స్థలంతో పాటు లే-అవుట్ మొత్తం విస్తీర్ణం కొలవాల్సిన బాధ్యత ఏడీపై ఉందన్నారు. త్వరలోనే సంగారెడ్డి కలెక్టర్‌ను నేరుగా కలిసి పరిస్థితి వివరిస్తానన్నారు.

ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డికి గుండె శస్త్ర చికిత్స

- ఆస్పత్రి నుంచి డిశ్చార్జ్.. ఫోన్‌లో మోదీ పరామర్శ



బంజారాహిల్స్/(రంగారెడ్డి జిల్లా ప్రతినిధి), నవంబరు 13(ఆంధ్రజ్యోతి): చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి గుండెకు శస్త్ర చికిత్స జరిగింది. ఆయన హృదయానికి రక్తాన్ని సరఫరా చేసే వాల్వ్ సన్నగా అవడంతో పాటు రక్తస్రావం అవుతున్నట్టు ఇటీవల సాధారణ ఆరోగ్య పరీక్షల్లో తెలిసింది. దీంతో జూబ్లీహిల్స్ అపోలో వైద్యులు ఏఆర్టిక్ వాల్వ్ రీప్లేస్‌మెంట్ సర్జరీ చేయాలని నిర్ణయించారు. ఈ మేరకు నవంబరు 10న ఆపరేషన్ పూర్తి చేశారు. అప్పటి నుంచి విశ్వేశ్వర్ రెడ్డి ఆస్పత్రిలో ఉన్నారు. ప్రస్తుతం ఆయన ఆరోగ్య పరిస్థితి మెరుగవడంతో గురువారం డిశ్చార్జ్ చేసినట్టు వైద్యులు తెలిపారు. చిన్నతనం నుంచే గుండె కవాట సమస్యతో బాధపడుతున్న విశ్వేశ్వరెడ్డికి ఇటీవల ఆరోగ్య సమస్యలు తలెత్తాయి. కాగా, కొండా విశ్వేశ్వరెడ్డిని ప్రధాని మోదీ గురువారం ఫోన్‌లో పరామర్శించారు. ఎంపీ క్షేమ సమాచారం అడిగి తెలుసుకున్న ప్రధాని.. డాక్టర్ల సూచనలు తప్పక పాటించాలని చెప్పారు. మోదీ తనకు ఫోన్ చేసిన విషయాన్ని విశ్వేశ్వరెడ్డి 'ఎక్స్'లో వెల్లడించారు. అలాగే తాను త్వరగా కోలుకోవాలని ప్రార్థించిన అభిమానులందరికీ ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

శ్రీశైలం, సాగర్‌లో జల విద్యుదుత్పత్తికి బ్రేక్

- ఇన్‌ఫ్లో లేక ఉత్పత్తిని నిలిపేసిన జెన్‌కోలు

హైదరాబాద్, నాగార్జున సాగర్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): ఎగువనుంచి వరద రాక గణనీయంగా తగ్గిపోవడంతో శ్రీశైలం, నాగార్జునసాగర్ ప్రాజెక్టుల్లో జల విద్యుదుత్పత్తిని నిలిపివేశారు. గురువారం నుంచి శ్రీశైలం ప్రాజెక్టు రిజర్వాయర్ వద్ద ఇరువైపులా జలవిద్యుత్ కేంద్రాల్లో తెలంగాణ, ఏపీ జెన్‌కోలు విద్యుదుత్పత్తిని ఆపివేశాయి. ప్రస్తుతం ప్రాజెక్టుకు 13 వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తోంది. దాంతో తాగునీటి అవసరాల కోసం 8739 క్యూసెక్కులను ప్రాజెక్టు నుంచి తరలిస్తున్నారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటి మట్టం 215.81 టీఎంసీలు కాగా... ప్రాజెక్టులో ప్రస్తుతం 205.66 టీఎంసీల నిల్వ ఉంది. ఇక, ఇన్‌ఫ్లో తగ్గటంతో నల్లగొండ జిల్లా నాగార్జున సాగర్ ప్రాజెక్టు ప్రధాన జలవిద్యుత్ కేంద్రంలో బుధవారం రాత్రి నుంచి విద్యుదుత్పత్తిని నిలిపివేశారు. ఈ ఏడాది లక్ష్యం 1,450 మిలియన్ యూనిట్లు కాగా బుధవారం సాయంత్రానికి 2,265 మిలియన్ యూనిట్ల విద్యుదుత్పత్తి చేశామని, దీంతో జెన్‌కోకు రూ. 450కోట్ల ఆదాయం సమకూరిందని సీఈ మంగేష్ కుమార్ తెలిపారు. ప్రస్తుతం నాగార్జునసాగర్ ప్రాజెక్టుకు 15 వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా... వచ్చింది వచ్చినట్లే దిగువకు తరలిస్తున్నారు. సాగర్ సామర్థ్యం 312.05 టీఎంసీలు కాగా... ప్రాజెక్టులో 305.75 టీఎంసీల నిల్వ ఉంది. ప్రాజెక్టు ఫ్లడ్ కుషన్ 6.3 టీఎంసీలుగా ఉంది.

ఈ సీజన్‌లో భారీగానే..

ఈ సీజన్‌లో ప్రాజెక్టులకు నిలకడగా... భారీగా వరద వచ్చిచేరడంతో ఇప్పటిదాకా తెలంగాణ జెన్‌కో ఖాతాలో 6047 మిలియన్ యూనిట్ల విద్యుదుత్పత్తి చేశారు. శ్రీశైలంలో 2324 మిలియన్ యూనిట్లు ఉత్పత్తి కాగా... సాగర్ ప్రధాన కేంద్రంలో 2274, ప్రియదర్శిని జూరాలలో 504, లోయర్ జూరాలలో 495, సాగర్ ఎడమకాల్వపై 79, పులిచింతలలో 265, సింగూరులో 24, పోచంపాడు(శ్రీరాం సాగర్)లో 77 మిలియన్ యూనిట్ల ఉత్పత్తి చేశారు.

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

వైఫల్యం – విషాదం

ఎర్రకోట సమీపంలో జరిగిన పేలుడు ఘటనపై దర్యాప్తు ముమ్మరంగా సాగుతోంది. పదమూడుమందిని పొట్టనబెట్టుకొని, తీవ్ర గాయాలతో అనేకులను ఆస్పత్రిపాల్జేసిన ఈ దారుణంలో కుట్రదారులను, కార్యకర్తలనూ వెతికిపట్టుకొనే ప్రయత్నం ముమ్మరంగా సాగుతోంది. పదిమందిని అనుమానితులుగా అరెస్టు చేయడంతో పాటు, ఢిల్లీ పోలీసులు కొన్ని ప్రాంతాల్లో హోటళ్ళనూ, నివాసగృహాలను ఇంకా జల్లెడపడుతున్నారు. కశ్మీర్‌లోనూ గాలింపు కొనసాగుతోంది. ఆర్డీఎక్స్ స్థానంలో అతి సులువుగా అందుబాటులో ఉండే అమ్మోనియం నైట్రేట్‌తో ఆ దుర్మార్గులు ఇంతటి ఘోర విధ్వంసాన్ని సృష్టించారు. వీరి ఉన్మాదానికి సామాన్యులు, ఆటోడ్రైవర్లు, దుకాణదారులు బలైపోయారు. కొన్ని వందలమీటర్ల దూరంవరకూ శరీర అవయవాలు తెగిపడిన ఆ భీతావహదృశ్యాలు మనలను దీర్ఘకాలం వెంటాడతాయి.

జవాబులేని ప్రశ్నలు అనేకం మిగిలే ఉన్నాయి. ఈ విస్ఫోటనానికి ముందు కశ్మీర్‌లో ఏడుగురు అరెస్టుకావడం, ఫరీదాబాద్‌లో భారీగా పేలుడుపదార్థాలు దొరకడం వంటి పలు పరిణామాలను గుదిగుచ్చే ప్రయత్నం సాగుతోంది. ఇటువంటి ఘటనలు జరగ్గానే, విధ్వంసం తీవ్రత, విధానాలను బట్టి దర్యాప్తు సంస్థలు కొద్దిగంటల్లోనే దానిని ఉగ్రవాదచర్యగా గుర్తించడం, ఏ సంస్థ ఉన్నదో అంచనాకట్టడం జరిగిపోతుంది. ఎర్రకోట ఘటనలో ఢిల్లీ పోలీసులు, ఎన్ఐఏ నోరువిప్పడంలేదు. దీంతో తనకు అనధికారికంగా తెలిసినదానినో, ఊహించినదానినో మీడియా చెప్పుకుంటోంది. డిసెంబరు 6న ముప్పైకిపైగా వరుస పేలుళ్ళతో విధ్వంసాన్ని సృష్టించడానికి ఈ మతోన్మాదులు సర్వం సిద్ధం చేసుకున్నారని వార్తలు వస్తున్నాయి. ఒక్కకారుతో, అదీ హడావుడిలోనే ఇంతటి వినాశనం కలగచేయగలిగిన ఆ దుర్మార్గుల అసలు లక్ష్యం నెరవేరినపక్షంలో ఎంతటి ప్రాణనష్టం జరిగివుండేదో తలుచుకుంటేనే భయం కలుగుతుంది. జమాతే ఇస్లామీ, జైషే మహ్మద్ వంటి సంస్థలతో పాటు, తుర్కియే తోడ్పాటు కూడా ఉన్నట్టు వింటున్నాం.

దారుణం జరగ్గానే కుట్ర, భయానకం వంటి మాటలు మాత్రమే వాడిన పాలకులు రెండురోజులకు గానీ ఉగ్రచర్యగా గుర్తించలేదు. ఇంతలోగా ప్రధాని మోదీ భూటాన్ కూడా వెళ్ళి, కుట్రదారులను వదిలేది లేదని అక్కడ ఓ భీషణ ప్రతిజ్ఞచేశారు. ఎన్ఐఏకు కేసు అప్పగించడం, ఊపావంటి చట్టాలను ప్రయోగించడం కుట్రదారులమీద వదిలిపెట్టకుండా ఉండటానికే. క్రమంగా పాక్‌పాత్ర, జైషే హస్తం, ముంబైతరహా మరో విధ్వంసానికి విస్తృతమైన ప్రణాళిక ఇందులో స్పష్టం కావడంతో ఉగ్రవాదం అనకతప్పలేదు. ఆపరేషన్ సిందూర్ జోరుగా సాగుతూండగా, అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ అది ఆగిపోయిందని ముందే ప్రకటించి మన పాలకులను ఇరకాటంలో పడేశారు. ఆ తరువాత ఆయన ఓ యాభైసార్లు తానే యుద్ధాన్ని ఆపాననీ చెప్పుకున్నారు. ఇక చాలు మహాప్రభో అని పాక్ మిలటరీ అధికారులు ప్రాధేయపడడంతో తామే సిందూర్‌ను ఆపామని మన నాయకులు చెప్పుకున్నారు. ఇకపై ఉగ్రవాదులకు ఆశ్రయం ఇవ్వబోమన్న కనీస హామీ కూడా లేకుండా, కేవలం శత్రువు బతిమాలితే యుద్ధం ఆపేయడమేమిటని విపక్షాలు నిలదీశాయి. ఇకపై ఉగ్రచర్యలన్నీ యుద్ధచర్యలుగానే పరిగణిస్తామని స్వయంగా ప్రధాని ప్రకటించారు. ఈ నేపథ్యంలో, ఎర్రకోట ఘటనను ఉగ్రచర్యగా గుర్తించడం ప్రభుత్వానికి ఒక విధంగా ఇబ్బందే. ట్రంప్‌తో వీసమెత్తు సయోధ్యలేని స్థితిలో, అయన పూర్తిగా పాకిస్థాన్ పక్షాన, మార్షల్ మునీర్ ప్రేమలో తేలుతున్న తరుణంలో గతంలో మాదిరిగా సిందూర్‌లు సాధ్యం కాదు. పాలకులు కూడా కుట్రదారులకు ప్రభుత్వ ఏజెన్సీలు తగిన గుణపాఠం చెబుతాయని మాత్రమే అంటున్నారు.

ఒక మహా విధ్వంసం దిశగా సాగుతున్న కుట్ర ముందుగానే ఎర్రకోటవద్ద బద్దలుకావడం ఒక విధంగా ఉపశమనం కలిగించేదే. అయితే, రోజంతా భారీ పేలుడుపదార్థాలతో ఒక వ్యక్తి కీలకమైన ప్రాంతాల్లో సంచరించగలగడం మన నిఘావైఫల్యానికి నిదర్శనం. దీనికి పదిరోజుల ముందే కశ్మీర్, ఫరీదాబాద్‌లో ఉగ్రచర్యలను పోలీసులు భగ్నం చేసినా, దూరదృష్టి, సమన్వయం, సమాచార లోపంతో ఈ దారుణాన్ని నిలువరించలేకపోవడం అతిపెద్ద విషాదం. శక్తిమంతమైన లెఫ్టినెంట్ గవర్నర్ ఉన్న జమ్మూకశ్మీర్, బీజేపీ పాలిత హర్యానా, యూపీ, ఢిల్లీలమీదుగా ఈ ఉగ్రకుట్ర సాగడంతో విపక్షాలు పుల్వామా, పహల్గాం వైఫల్యాలను కూడా గుర్తుచేస్తూ కేంద్రాన్ని ఘాటుగా విమర్శించడం సహజం.

సంపదల్లో సమానత్వం ఎందుకు?



మానవ సమాజంలో అసమానతలపై వచ్చిన వివరణలూ, సమర్థనలూ ఇంకే విషయంపైనా రాలేదు. మతాలు ప్రబోధాలనూ, తత్వశాస్త్రాల చర్చలనూ తరచిచూస్తే అవే ఎక్కువగా కనపడతాయి. అన్ని సందర్భాల్లో అవి ప్రత్యక్షంగా వ్యక్తంకాకపోవచ్చు. విశ్వవిద్యాలయాల్లో నిష్ణాతుల మధ్య చర్చల్లా అవి ఉండకపోవచ్చు. ఈనాటి వాదప్రతివాదాల్లాగా స్పష్టంగా వెల్లడి కాకపోవచ్చు. కానీ మన సంప్రదాయ కథల్లో, పురాణాల్లో, కావ్యాల్లో, పాపపుణ్యాల వివేచనల్లో, ధర్మాధర్మ ఆలోచనల్లో.. అంతస్తుల్లో ఎక్కువ తక్కువలను వివరించి తాత్విక సమర్థనలు ఇవ్వటమే ప్రధానంగా ఉంటుంది. మన కర్మ సిద్ధాంతమే ఇందుకు నిదర్శనం. గతజన్మలో చెడు కర్మలు చేసినవారు కష్టాలను అనుభవిస్తున్నారనీ, మంచి కర్మలు చేస్తే వచ్చే జన్మలో ఉన్నత స్థాయికి వెళతారన్న భరోసా ఇవ్వటమే అందులో కనపడుతుంది. ఆ భరోసాతోనే సర్దుకుపోయే మనస్తత్వం ఏర్పడుతుంది. అన్ని దేశాల్లోనూ ఇలాంటి సిద్ధాంతాలు ఉన్నాయి. 'ధనికులను పేదలు చంపకుండా మతమే నిలువరిస్తోంది' అని నెపోలియన్ రెండు వందల ఏళ్ల క్రితమే చాలా నిక్కచ్చిగా చెప్పాడు. సాధారణ ప్రజలను నిశ్శబ్దంగా ఉంచటానికి అదొక అద్భుత సాధనమని కూడా నెపోలియన్ వ్యాఖ్యానించాడు.

ఈ అద్భుత సాధనం ఇప్పటికీ ఉన్నప్పటికీ ఒకనాటి పదునును కోల్పోతోంది. ఆధునిక సమాజంలో అసమానతలను ప్రశ్నించటం పౌరహక్కుగా మారిపోతోంది. ఒక స్థాయి వరకే అసమానతలను సహించే పరిస్థితి నెలకొంటోంది. మితిమీరిన అసమానతలపై ప్రపంచ వ్యాప్తంగా ఏదో ఒకరూపంలో అలజడులు, ఆందోళనలు జరుగుతూనే ఉన్నాయి. ప్రజాస్వామ్యానికీ, ఆర్థికాభివృద్ధికీ, పర్యావరణానికీ అసమానతలు తీవ్ర ఆటంకాలుగా పరిణమించటంపై ఎన్నో పరిశోధనలు జరుగుతున్నాయి. అసమానతలు కలిగిస్తున్న విపరిణామాల విషయమై అంతర్జాతీయ వేదికలపై చర్చలూ మొదలయ్యాయి. ఈ నెల 22, 23 తేదీల్లో దక్షిణాఫ్రికాలోని జోహానెస్‌బర్గ్‌లో జరిగే జీ–20 సదస్సులో అసమానతల అంశాన్ని కూడా ప్రధాన అజెండాలో చేర్చారు. జీ–20 కూటమికి అధ్యక్షత వహిస్తున్న దక్షిణాఫ్రికా సారథ్యంలో అసమానతలపై నివేదికను ఇవ్వటానికి స్వతంత్ర నిపుణులతో ఒక కమిటీ ఏర్పాటైంది. ఆర్థిక శాస్త్రంలో నోబెల్ బహుమతి పొందిన జోసెఫ్ స్టిగ్లిట్స్ నేతృత్వంలో ఏర్పడిన ఆ కమిటీ అసమానతలను పలుకోణాల్లో విశ్లేషించి నివేదికను రూపొందించింది.

తీవ్ర అసమానతల కారణంగా వివిధ కీలక రంగాలకు ప్రమాదం ఎలా పొంచి ఉందో నివేదికలో స్పష్టంగా వివరించారు. సంపద, ఆదాయాల పరంగా పెరిగిపోతున్న అసమానతలను లోతుగా విశ్లేషించారు. గత 40 ఏళ్లల్లో 50శాతం ప్రజల సగటు వాస్తవ ఆదాయం 358 డాలర్లు మాత్రమే పెరిగింది. ఒక శాతమున్న బడా ధనికుల సగటు ఆదాయం అదే కాలంలో 191,000 డాలర్లకు చేరింది. సంపదలో అసమానతలు ఇంకా దారుణంగా తయారయ్యాయి. 2020–2024 మధ్య కాలంలో ప్రపంచ వ్యాప్తంగా పెరిగిన మొత్తం సంపదలో 41శాతం ఒక శాతంగా ఉన్న శ్రీమంతుల చేతుల్లోకి వెళ్లింది. దిగువనున్న 50 శాతం ప్రజలకు పెరిగిన సంపదలో లభించిన వాటా 1 శాతం మాత్రమే. శ్రీమంతులకు సగటున 13 లక్షల డాలర్ల సంపద లభిస్తే అట్టడుగునున్న 50శాతం ప్రజలకు సగటున 585 డాలర్ల సంపదే దక్కింది. అంటే 2,655 రెట్లు ఎక్కువ సంపద 1 శాతం శ్రీమంతుల చేతుల్లోకి వెళ్లింది. ప్రపంచ వస్తు, సేవల విలువలో (జీడీపీ) 16శాతానికి సమానమైన సంపద 3,000 మంది కుబేరుల చేతుల్లో పోగుపడింది. ఇప్పటివరకూ బిలియనీర్లను మాత్రమే మనం చూశాం. పరిస్థితులు ఇలాగే కొనసాగితే మరో పదేళ్లల్లో ట్రిలియనీర్లు రంగంపైకి వచ్చేస్తారు. బిలియనీర్లు అందరూ సొంతంగా పరిశ్రమలూ, కంపెనీలూ పెట్టి కిందా మీదా పడి సంపదను కూడబెట్టినవాళ్లు కాదు. వారసత్వంగా సంపదను పొందినవాళ్లే ఎక్కువ.

అసమానతలు తీవ్రంగా ఉన్న దేశాల్లో ప్రజాస్వామ్య క్షీణత ఏడు రెట్లు ఎక్కువగా ఉంది. పెరిగిపోతున్న అసమానతల వల్ల 2020ల నుంచి దారిద్ర్యం నుంచి ప్రజలను గట్టెక్కించే ప్రక్రియల్లో వేగం తగ్గింది. దీంతో 230 కోట్ల మంది ఆహార అభద్రతను ఎదుర్కొంటున్నారు. సగం ప్రపంచ జనాభాకు అత్యవసర ఆరోగ్యసేవలు అందటం లేదు. వైద్య ఖర్చులకు సొంత డబ్బులు చెల్లించాల్సి రావటంతో 130 కోట్ల మంది ఆర్థిక పరిస్థితి దిగజారింది. అసమానతల వల్ల ప్రజాస్వామ్య సంస్థల్లో నమ్మకం తగ్గిపోతోంది. విభజన రాజకీయాలకు ప్రాధాన్యత పెరుగుతోంది. ఉన్మాద రాజకీయాల ప్రాబల్యం విస్తరిస్తోంది. ప్రజాస్వామిక ప్రక్రియల్లో పాల్గొనాలనే ఆసక్తిలోనూ క్షీణత కనపడుతోంది. అసమానతలు ఎక్కువగా ఉన్న 23 దేశాల్లో 22 చోట్ల ప్రజాస్వామ్యం అన్ని రకాలుగా దిగజారింది. చట్టసభలు, న్యాయవ్యవస్థల పనితీరు కూడా మందగిస్తోంది. అసమానతలు కలిగించిన అసంతృప్తిని ఆసరా చేసుకుని విపరీత పోకడలతో, జనాకర్షక నినాదాలతో, నియంతృత్వ లక్షణాలతో ఎన్నికల్లో గెలిచే నాయకుల సంఖ్యా ఎక్కువైంది. సంపన్న వర్గాల ప్రత్యక్ష, పరోక్ష ప్రభావంతో రాజకీయాలు తీవ్రంగా ప్రభావితం అవుతున్నాయి. రాజకీయ అధికారాన్ని శాసించటం ద్వారా సంపన్న వర్గాలు తమ అనుకూల విధానాలనే అమలయ్యేలా చూస్తున్నాయి. సంపద బలం నుంచి రాజకీయ ప్రాబల్యం... మళ్లీ ఈ ప్రాబల్యం అండతో సంపదను పెంచుకునే మార్గాలను సుస్థిరపరచుకోవటం... ఇట్లా ఎడతెగని బంధం ఒకటి ఏర్పడుతోంది.

> సామాజిక జీవితం సాఫీగా నడవాలంటే ఆ జీవితంలో భాగస్వాములైన వారి మధ్య పరస్పరం మంచి జరుగుతుందనే నమ్మకం ఉండాలి. సమానత భావం ఎంతో కొంత ఉండాలి. సాహార్దత నెలకొనాలి. ప్రజాస్వామ్య వ్యవస్థలూ, సంస్థలూ మనకోసం పనిచేస్తాయనే భరోసా ఉండాలి. మితిమీరుతున్న అసమానతలు వీటన్నిటినీ దెబ్బతీస్తున్నాయి. అందుకే అన్ని అనర్థాలకు మూలం అసమానతలేనన్న భావం బలపడుతోంది!

ప్రభుత్వ జోక్యం లేకుండా మార్కెట్‌కే అన్ని వదిలేస్తే ఆర్థికాభివృద్ధి పరుగులు పెడుతుందనే భావన ఎంత తప్పో అనేక దేశాల్లో పరిణామాలను చూస్తే అర్థం అవుతుంది. అసలు ప్రభుత్వం జోక్యం తగ్గిన తర్వాతే అసమానతలు ప్రపంచవ్యాప్తంగా పెరిగిపోయాయి. 1990ల నుంచి ఇదింకా స్పష్టంగా కనపడుతోంది. అసమానతలు ఆర్థికాభివృద్ధికి ఆటంకాలు ఎలా అవుతున్నాయో ఏడు విషయాలను పరిశీలిస్తే తేలికగా అర్థం అవుతాయి. 1) అసమానతల వల్ల తగినంత డబ్బు కింది వర్గాల్లో లేకపోవటంతో వస్తు, సేవలకు గిరాకీ తగ్గిపోతుంది. ఫలితంగా ఆర్థిక వ్యవస్థకు కావాల్సిన వస్తు–సేవల డిమాండ్ ఉండదు. కింది వర్గాలు తమ దగ్గర ఉన్న మొత్తం డబ్బుని ఖర్చుచేసినా వారు సృష్టించే డిమాండు తక్కువగానే ఉంటుంది. పై వర్గాల చేతుల్లో డబ్బు ఉన్నా కొనుగోళ్లు పరిమితం అవ్వటం వల్ల అవసరమైన డిమాండును సృష్టించలేరు. ఫలితంగా ఆర్థిక వ్యవస్థ తన సామర్థ్యానికి అనుగుణంగా పని చేయలేదు. 2) ఆదాయం అంతంత మాత్రంగా ఉండటం వల్ల సరైన పోషకాహారాన్ని ఎక్కువ మంది పొందలేరు. అవసరమైన వైద్యాన్నీ పొందలేరు. పిల్లల చదువుకూ ఇబ్బందులు ఏర్పడతాయి. అంతర్గత శక్తులు పూర్తిగా విప్పారని వారిగా ఆ పిల్లలు తయారవుతారు. దాంతో తక్కువ ఉత్పాదకత (లెస్ ప్రడక్టివ్) జీవులుగా మారతారు. దీని ప్రభావం మొత్తం ఆర్థిక వ్యవస్థపై ఉంటుంది. 3) ఉద్యోగ భద్రత లేకుండా అసంఘటిత రంగంలో పనిచేసేవారు ఆర్థికరంగంలో వచ్చే ఒడిదుడుకులకు తీవ్రంగా ప్రభావితం అవుతారు. ప్రభుత్వపరంగా వీరిని ఆదుకోటానికి సామాజిక భద్రతా పథకాల్లేని చోట పరిస్థితి దారుణంగా తయారవుతుంది. ఆందోళన చుట్టుముడుతుంది. దీంతో సరిగా పనిచేయలేరు. వాళ్ల ఉత్పాదకతా తగ్గిపోతుంది. మరోవైపు పిల్లల విద్యపై పెట్టే ఖర్చునీ తగ్గించివేస్తారు. కొత్త నైపుణ్యాల కోసం ఖర్చుపెట్టి మరో ఉద్యోగాన్ని పొందటమూ కష్టమవుతుంది. భవిష్యత్తు కోసం నిర్ణయాలు తీసుకోలేని అశక్తతలో కూరుకుపోతారు. 4) తక్కువ ఆదాయం ఉన్నవాళ్లకు మంచి విద్య, వైద్యం లభించదు. ఇక వాళ్ల పిల్లలకు వయస్సుతో పాటు అందాల్సిన పోషకాహారం లభించకపోవటంతో వాళ్ల మేధో సామర్థ్యం పూర్తిగా వికసించదు. దీంతో పెద్దయ్యాక కూడా వాళ్లు పోటీలు పడి మంచి ఉద్యోగాలను సాధించలేరు. సామాజికంగా పై మెట్టును ఎక్కలేరు. అసమానతల వల్ల పేదరికం తరాలపాటు కొనసాగుతుంది. సామాజిక పురోగతి స్తంభించిపోతుంది. ప్రభుత్వాలు ఆరోగ్య ఖర్చుని 1 శాతం పెంచితే తరాల మధ్య అసమానత 14 శాతం తగ్గుతుంది. కానీ అదే చాలాచోట్ల జరగటం లేదు. 5) అసమానతలు మెజారిటీ ప్రజలను అప్పుల ఊబిలో కూరుకుపోయేలా చేస్తాయి. దీంతో ఆర్థిక స్థిరత్వానికి ముప్పు ఎప్పుడూ పొంచి ఉంటుంది. 6) సంపద అధికంగా ఉన్న వర్గాలు తమ దగ్గరున్న డబ్బును ఉత్పాదకతను పెంచే రంగాల్లో పెట్టుబడులు పెట్టకుండా కూడా సమాజానికి హాని కల్గిస్తారు. సహజవనరులపై గుత్తాధిపత్యం సాధించి లాభాలను సంపాదించాలని చూస్తారు. కొత్త పరికరాల సృష్టికో, అదనపు విలువను జోడించటానికో ప్రయత్నించకుండా ప్రభుత్వ యంత్రాగాన్ని ప్రభావితంచేసి లాభాలను (రెంట్ సీకింగ్) గడించాలని చూడటం ఆర్థిక వ్యవస్థకే కాకుండా ప్రజలకూ తీవ్ర నష్టాన్ని తెచ్చిపెడుతుంది. గనులు, చమురు, సహజ వాయువు వనరులపై ప్రభుత్వ నియంత్రణ తక్కువ ఉండేలా చూసి లాభాలను అధికం చేసుకుంటారు. స్థానిక ప్రజల ఆరోగ్యం, పర్యావరణ నాశనం, భవిష్యత్తు తరాల సంక్షేమం పట్టకుండా వ్యవహరిస్తారు. 7) ఇక ఒక దేశంలో ఉన్న అసమానతలు ఆ దేశానికే పరిమితం కావు. ఆరోగ్యసేవలు బలహీనంగా ఉన్నచోట వ్యాధులు వేగంగా వ్యాపించి ఇతర దేశాలకూ చేరతాయి. ఒక దేశంలో కాలుష్యం ఇతర దేశాలకూ వ్యాపిస్తుంది. ధనికుల అతి విలాసాల వల్ల అధిక కార్బన్ వినియోగం జరిగి వాతావరణం విపరీత మార్పులకు లోనవుతోంది. అమెరికా, యూరప్‌లో ధనికుల జీవనశైలి వల్ల పేద దేశాల ప్రజలు అతివృష్టి, అనావృష్టిని ఎదుర్కొంటున్నారు. అందుకే దేశాల మధ్యా, దేశాల లోపలా అసమానతలను కట్టడిచేయకపోతే అస్థిరతలు, సంక్షోభాలు, తిరుగుబాట్లు, ప్రజాస్వామ్యం ముసుగులో నియంతల వీర విహారాలు చేయటం సర్వసాధారణం అవుతాయి.



■ రాహుల్ కుమార్

> ప్రపంచ వస్తు, సేవల విలువలో (జీడీపీ) 16 శాతానికి సమానమైన సంపద 3000 మంది కుబేరుల చేతుల్లో పోగుపడింది. ఇప్పటివరకూ బిలియనీర్లను మాత్రమే మనం చూశాం. పరిస్థితులు ఇలాగే కొనసాగితే మరో పదేళ్లలో ట్రిలియనీర్లు రంగంపైకి వచ్చేస్తారు. బిలియనీర్లు అందరూ సొంతంగా పరిశ్రమలూ, కంపెనీలూ పెట్టి కిందా మీదా పడి సంపదను కూడబెట్టినవాళ్లు కాదు. వారసత్వంగా సంపదను పొందినవాళ్లే ఎక్కువ.

అసమానతలు ఉన్నచోటే.. పైకి ఎదగాలన్న ఆర్తి రగులుతున్న చోటే.. ఆర్థికాభివృద్ధి పరుగులు పెడుతుందన్న సిద్ధాంతమే ఇప్పటికీ చెలుబాటు అవుతోంది. ప్రభుత్వ నియంత్రణలు తక్కువగా ఉంటే కొత్త ఆవిష్కరణలతో, కొత్త సాంకేతిక పరిజ్ఞానాలతో, ప్రయోగశీల మనస్తత్వంతో ఆర్థిక వ్యవస్థ కొత్తదారులు పడుతుందన్నది స్థూలంగా నిజమే కావచ్చు! కానీ ఆ కొత్తదారులతో అసమానతలు విపరీతంగా పెరిగి ప్రజాస్వామ్యానికీ, పర్యావరణానికీ, ఆర్థికాభివృద్ధికీ అడ్డంకులుగా మారుతున్న దృశ్యం ప్రపంచవ్యాప్తంగా కనపడుతోంది. అసమానతలు కలగచేసే విపరిణామాలపై ప్రసరిస్తున్న కొత్తవెలుగులతోనైనా వాటిని కట్టడి చేయలేని నిస్సహాయ స్థితిలో పడిపోతే మానవాళి మనుగడే ప్రమాదంలో పడిపోతుంది. సామాజిక జీవితం సాఫీగా నడవాలంటే ఆ జీవితంలో భాగస్వాములైన వారి మధ్య పరస్పరం మంచి జరుగుతుందనే నమ్మకం ఉండాలి. సమానత భావం ఎంతో కొంత ఉండాలి. సాహార్దత నెలకొనాలి. ప్రజాస్వామ్య వ్యవస్థలూ, సంస్థలూ మనకోసం పనిచేస్తాయనే భరోసా ఉండాలి. మితిమీరుతున్న అసమానతలు వీటన్నిటినీ దెబ్బతీస్తున్నాయి. అందుకే అన్ని అనర్థాలకు మూలం అసమానతలేనన్న భావం బలపడుతోంది!

(ఆంధ్రజ్యోతి ఎడిటర్)

వార్షిక 'వాతావరణ' ప్రహసనాలు!

శీతవేళ ఆగమిస్తోంది. ఏటా ఈ తరుణంలో ప్రభుత్వాల ప్రతినిధులు, పౌర సమాజ క్రియాశీలురు, పర్యావరణ వైజ్ఞానికులు, పారిశ్రామిక, వ్యాపార సంస్థల సీఈఓలు వాతావరణ మార్పుపై చర్చలకు సమావేశమవుతారు. ఐక్యరాజ్యసమితి ఆధ్వర్యంలో జరిగే ఈ సమావేశం ఈ ఏడాది బెలెమ్ (అమెజాన్ వర్షారణ్యం అంచున ఉన్న బ్రెజీలియన్ నగరం)లో జరుగుతోంది. సరిగ్గా ఇదే రోజులలో ఢిల్లీ, దాని చుట్టుపక్కల ప్రాంతాలలో గాలి ధూళి దూసరమయిపోతుంది. ఊపిరి పీల్చుకోవడం ఢిల్లీ వాసులకు మహాకష్టంగా ఉంటుంది.



■ సునీతా నారాయణ్

మట్టివాసన

ఈ ఏడాది వాతావరణ మార్పు సంబంధిత మార్పులు ఎప్పటిలానే మహా ఆందోళనకరంగా ఉన్నాయి. మనిషిపై ప్రకృతి పగ సాధిస్తున్నట్టుగా వాతావరణ పోకడలు ఉంటున్నాయి. హరిత గృహ వాయు ఉద్గారాలు ఘోరంగా పెరిగిపోతున్నాయి. వచ్చే దశకం (2030లు) తొలి సంవత్సరాలలోనే భూతాపం పెరుగుదల పరిమితి 1.5 డిగ్రీల సెల్సియస్‌ను ప్రపంచం ఖాయంగా ఉల్లంఘించనున్నదని రోజురోజుకీ మరింతగా విదితమవుతోంది. ఇది వినాశనకరమైన పరిణామం, సందేహం లేదు. భూ ఉష్ణోగ్రతలు 1.2 డిగ్రీల సెల్సియస్ పెరిగితేనే ఈ విశాల అవని ఎల్లెడలా భయంకరమైన ప్రాకృతిక విపత్తులకు లోనవుతుంది కదా. వాతావరణ మార్పు వైపరీత్యాల తాకిడి మన దైనందిన జీవితాలపై ఎంత తీవ్రంగా ఉంటుందో మరి చెప్పనవసరం లేదు. వాతావరణ మార్పును నివారించే, లేదా నియంత్రించే లక్ష్యంతో ఐక్యరాజ్యసమితి నిర్వహిస్తోన్న వార్షిక శిఖరాగ్ర సదస్సులు ముంచుకొస్తోన్న వాతావరణ ముప్పునకు ప్రభుత్వాలను జవాబుదారీగా చేయడంలో విఫలమవుతున్నాయి. చర్చలు నిరర్థకమవుతున్నాయి.

శీత రుతువు రాకడతో ఉత్తర భారతావనిలో గాలివేగం తగ్గుతుంది. చల్లని గాలులు దట్టంగా వీస్తూ భూమిని అదే పనిగా స్పృశిస్తుంటాయి. కాలుష్యం మన కళ్ల ఎదుట కరాళ నృత్యం చేస్తుంది. మన నయనేంద్రియాలు ఎర్రబారుతాయి. మన ఊపిరితిత్తులు ఊపిరి పీల్చుకోలేకపోతాయి. కొద్ది నెలల పాటు కాలుష్యం, కాలుష్య కారక ఘటనలు మీడియా పతాక శీర్షికలవుతాయి. ప్రజలకు దాపురించిన వాతావరణ వెతలకు రాజకీయవేత్తలు పరస్పరం నిందించుకుంటారు. సమస్య నిమ్మళిస్తుందా? లేదు. శాసన నిర్మాతలు శ్రద్ధ చూపుతారా? లేనే లేదు. అయినా రాజకీయ పక్షాలు వాతావరణ వైపరీత్యాలపై వాదోపవాదాలు చేస్తుంటాయి. తమ శ్రేయస్సుకు మేలు చేయని ఈ వ్యర్థ ప్రలాపాలను సగటు పౌరులు జుగుప్సా భావంతో వింటూంటారు. శీతాకాలంతో పాటు కాలుష్యమూ వీడిపోతుందా? పోదు. అది మరింతగా తీవ్రమవుతుంది. ఏటేటా ఇదే కథ. ఈ ఏడాది ఈ పాత కథకు ముగింపు పలకాలని ఢిల్లీ ప్రభుత్వం నిర్ణయించుకున్నది. ఎలా? కృత్రిమ వర్షాలు కురిపించడం ద్వారా! అందరూ అబ్బురపడుతూ ఆకాశం వర్షించబోయే అమృత ధారల కోసం ఆశావహ దృక్కులతో ఎదురుచూశారు. అయితే ఢిల్లీ సర్కార్‌కు దైవశక్తులు లేవని అంతిమంగా ప్రతి ఒక్కరికీ విదితమయింది. అయితేనేం, ఆ అట్టహాస వైఫల్యం, ఢిల్లీ సర్కార్ ప్రజల బాధలను ఉపేక్షించలేదని చెప్పేందుకు పనికి వచ్చింది మరి.



బ్రెజిల్‌లో ఐక్యరాజ్యసమితి వార్షిక వాతావరణ సదస్సూ, ఢిల్లీలో వార్షిక వాయు కాలుష్య బెడదను నివారించేందుకు 'కృత్రిమ వర్ష' ప్రయోగం రెండూ సమస్యను పరిష్కరించేందుకు సరిపోని, నిబద్ధత లేని చర్యలను ప్రదర్శించేందుకు మాత్రమే తోడ్పడుతున్నాయి.

బెలెమ్‌లో ఐక్యరాజ్యసమితి వార్షిక వాతావరణ సదస్సూ, ఢిల్లీలో వార్షిక వాయు కాలుష్య బెడదను నివారించేందుకు 'కృత్రిమ వర్ష' ప్రయోగం రెండూ సమస్యను పరిష్కరించేందుకు సరిపోని, నిబద్ధత లేని చర్యలను ప్రదర్శించేందుకు మాత్రమే తోడ్పడుతున్నాయి. ఈ ప్రహసనప్రాయ కార్యాచరణల గురించే నేను నిజంగా ఆందోళన చెందుతున్నాను. ఐక్యరాజ్యసమితి ఏటా నిర్వహిస్తున్న కాప్ (కాన్ఫరెన్స్ ఆఫ్ పార్టీస్) శిఖరాగ్ర సదస్సులో దేశ దేశాల ప్రతినిధులు, నిపుణులు వాతావరణ మార్పును నిరోధించే చర్యల పురోగతి ఏ స్థాయిలో ఉన్నదీ సమీక్షించి, తీసుకోవల్సిన తదుపరి చర్యల గురించి చర్చించి నిర్ణయాలు తీసుకుంటారు.

సరే, స్థిరమైన అభివృద్ధికి దోహదపడే విధంగా వాతావరణ మార్పులకు అనుగుణంగా అన్ని దేశాల సామర్థ్యాన్ని పెంచడమనేది ప్రస్తుతం బెలెమ్‌లో జరుగుతున్న కాప్ 30 అజెండా ప్రధాన లక్ష్యంగా ఉన్నది. వాతావరణ మార్పుల నెదుర్కొనేందుకు అభివృద్ధి చెందుతున్న దేశాలకు అందుతున్న ఆర్థిక సహాయం రుణాలు, ఈక్విటీల రూపేణా ఉంటోంది. అయితే ఇవి పేద దేశాల రుణ భారాన్ని మరింతగా పెంచడమే కాని అసలు లక్ష్య సాధనకు తోడ్పడడం లేదు. ఈ ఏడాది వాతావరణ మార్పు వైపరీత్యాలకు నష్టపోయిన అనేక దేశాలు అందుకున్న అంతర్జాతీయ ఆర్థిక సహాయం కంటే తమ రుణాలపై చెల్లించిన వడ్డీల మొత్తమూ అధికంగా ఉన్నది. అసలే వాతావరణ విపత్తులకు కుదేలయిపోయిన ఈ దేశాలు అభివృద్ధి సాధనకు అవసరమైన ఆర్థిక వనరులు కొరవడి అన్ని విధాల కృశించిపోతున్నాయి. ఈ పరిస్థితుల్లో హరిత గృహ వాయు ఉద్గారాల తగ్గింపునకు తోడ్పడే వాతావరణ చర్య (క్లైమేట్ యాక్షన్)కు అవి సమర్థంగా ఎలా పూనుకోగలుగుతాయి?

చెప్పవచ్చినదేమిటంటే నిర్దేశించుకున్న లక్ష్యాలను సాధించడంలో చిత్తశుద్ధి కొరవడి, ప్రయోజనరహితంగా సాగుతున్న వార్షిక వాతావరణ సదస్సులకు స్వస్తి చెప్పాలి. ఢిల్లీలో ఏడాది పొడుగునా కాలుష్యాన్ని తగ్గించేందుకు ఒక కార్యాచరణ పథకం ఉన్నది. అయితే దాన్ని అమలుపరచడం లేదు. మాటలే కాని, చేతలు లేనప్పుడు జరిగే మేలు ఏమిటి? ప్రభుత్వాల క్రియారాహిత్యాన్ని కప్పిపుచ్చేందుకు మాత్రమే చర్చలు, సమావేశాలు తోడ్పడుతున్నాయి. నిర్దేశించుకున్న లక్ష్యాల సాధనకు దోహదం చేసే కార్యాచరణలకే తొలి, మలి, తుది, నిరంతర ప్రాధాన్యమివ్వాలి. అవును, మనం సదా లక్ష్య సాధక కార్యాచరణలో ఉండాలి. అది మాత్రమే ముఖ్యం. అంతేగాని చేతలకు దిగకుండా మాటలకు పరిమితమైతే సమస్య నుంచి ఎలా బయటపడగలుగుతాము? అసలు సమస్య నుంచి బయటపడేందుకు మాట్లాడే అర్హతను సైతం కోల్పోతాము సుమా!

('సెంటర్ ఫర్ సైన్స్ అండ్ ఎన్విరాన్‌మెంట్' డైరెక్టర్ జనరల్, 'డౌన్ టు ఎర్త్' సంపాదకురాలు)

క్షతగాత్ర దేశాన్ని నిలబెట్టిన నాయకత్వం!

నవ భారత రూపశిల్పి పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ పుట్టినరోజు సందర్భమిది. తరాలెన్ని గడుస్తున్నా పసిపిల్లల హృదయాల్లో ఎప్పటికీ 'చాచా'గా సుస్థిర స్థానం సంపాదించుకుంటున్న అరుదైన నేత ఆయన. బీజేపీ, దాని అనుబంధ సంస్థలకు మాత్రం దాదాపు పదకొండేళ్లుగా ఆయనంటే ద్వేషం. చరిత్రలో లేనివన్నీ నెహ్రూకు ఆపాదించి ఆయనను కించపరచాలని చూస్తాయి.

ఇటీవల ప్రధాని మోదీ చేసిన వ్యాఖ్యలే ఇందుకు తార్కాణం. జమ్మూకశ్మీర్‌ను భారత్‌లో విలీనం చేసేందుకు సర్దార్ పటేల్ ప్రయత్నించగా నాటి ప్రధాని నెహ్రూ అనుమతించలేదని ఆయన చెప్పిన మాట పూర్తిగా కట్టుకథ. నిజానికి వారిద్దరూ సమష్టిగా జమ్మూకశ్మీర్ విలీనానికి కృషి చేశారు. అంతేకాదు, అప్పట్లో బీజేపీ పూర్వరూపమైన జనసంఘ్, హిందూమహాసభ, ఆరెస్సెస్ నేతలు కశ్మీర్‌లో త్రివర్ణ పతాకానికి బదులు మహారాజా హరిసింగ్‌కు సంబంధించిన జెండా ఎగురవేశారు. పైగా దాన్ని స్వతంత్ర దేశంగా మనగలిగేలా చూడమని డిమాండ్ చేశారు. ఆ ప్రాంత ఆక్రమణ కోసం పక్కనే పాకిస్థాన్ కాచుకుని కూర్చున్నప్పుడు ఇటువంటి అనాలోచిత డిమాండ్ ఎవరైనా చేస్తారా? చరిత్ర తెలియదు. తెలుసుకునే ప్రయత్నం చేయరు. కనీసం నెహ్రూ–పటేల్ మధ్య సాగిన ఉత్తరప్రత్యుత్తరాలను చదవరు. కేవలం నెహ్రూపై ద్వేషమే వారితో ఇన్ని అబద్ధాలాడిస్తోంది.

ఇదొక్కటే కాదు, 'వందేమాతరం' గీతంలో కేవలం రెండు చరణాలే ఉంచాలని 1937లో నెహ్రూ నాయకత్వంలోని కాంగ్రెస్ శాసించిందట! అది అనంతరకాలంలో దేశ విభజనకు బీజం వేసిందట! చరిత్రలోని ముఖ్య ఘట్టాలన్నిటికీ సాక్ష్యాధారాలు ఉంటాయని, అవి బయటికి వస్తే నగుబాటు పాలవుతామని సంఘ్ పరివార్ నాయకులకు కాస్తయినా బెదురూ, భయం ఉండవు. ఆనాటికి వివిధ సంస్థానాల్లో ఎవరికి తోచిన రీతిలో వారు జాతీయగీతాలుగా వేర్వేరు గీతాలను పాడుతుండగా అన్నిచోట్లా ఒకటే ఉండేలా 1937 అక్టోబర్‌లో కలకత్తాలో సమావేశమైన కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ ఏకగ్రీవంగా తీర్మానం చేసింది. ఆ సమావేశంలో గాంధీ, నెహ్రూ, పటేల్, నేతాజీ, రాజేంద్రప్రసాద్, అబుల్ కలామ్ ఆజాద్ వంటి హేమాహేమీలున్నారు. కాంగ్రెస్ బెంగాల్ ప్రొవిన్షియల్ మహాసభ బరిశాల్‌లో 1906లో ఎ.రసూల్ ఆధ్వర్యంలో జరిగినప్పుడు... ఆ గీతాన్ని పాడినందుకు పోలీసులు అత్యంత క్రూరంగా లాఠీచార్జి చేయగా, ప్రతినిధులు రెచ్చిపోయి ఆ గీతాన్ని మరింత ఎలుగెత్తి ఆలాపించారు. ఆనాటి నుంచీ 'వందేమాతరం' బెంగాల్‌లో రాజ్య ధిక్కారానికి ప్రతీక అయింది. స్వాతంత్ర్యోద్యమం సమయంలో బ్రిటిష్‌వారి పంచన చేరి ద్రోహం చేసినవారి వారసులకు ఇదంతా ఎలా తెలుస్తుంది? నెహ్రూను నిందించటమంటే ఆయన చేతులమీదుగా పురుడుపోసుకున్న నవ భారత నమూనాను తృణీకరించటమే.

నెహ్రూ 1947లో దేశ సారథిగా బాధ్యతలు స్వీకరించే సమయానికి దేశం శకలాలుగా విడిపోయి వుంది. 560 సంస్థానాలను కొత్తగా ఆవిర్భవించిన ఇండియన్ యూనియన్‌లో విలీనం చేయాల్సిన బృహత్తర కర్తవ్యం ఆయన ముందుంది. ఇందుకోసం ఆయన, సర్దార్ పటేల్, సెక్రటరీ స్థాయి ఉన్నతాధికారి వి.పి.మీనన్ ఒక్కటిగా కలిసి నడిచి ఏకశిలాసదృశమైన ప్రజాతంత్ర భారత్ ఆవిర్భవించడానికి దోహదపడ్డారు.

దేశ స్వాతంత్ర్యం కోసం నెహ్రూ దాదాపు తొమ్మిదేళ్ల పాటు కారాగారవాసం చేశారు. ఎన్నో కష్టనష్టాలను ఎదుర్కొన్నారు. కానీ బీజేపీ సైద్ధాంతిక మాతృ సంస్థ ఆరెస్సెస్ నాయకులు దీనికి దూరంగా ఉండిపోయారు.

'అతి సామాన్యుడు దారిద్ర్యాన్ని, అజ్ఞానాన్ని, వ్యాధులనూ ఎదుర్కొనటానికి, వాటిని రూపు మాపటానికి సాగించే పోరాటం కోసం అతడికి స్వేచ్ఛ, అవకాశమూ కల్పించాలంటే మనం ఏ దిశగా పోవాలి? మన ప్రయత్నం ఏమై ఉండాలి?' అని ప్రశ్నించారాయన. సంపద్వంత, ప్రజాతంత్ర, పురోగామి దేశ నిర్మాణానికి ఇవే గీటురాళ్లని ప్రకటించారు. ఈ దార్శనికత పంచవర్ష ప్రణాళికల్లో ప్రతిఫలించింది. దేశాభివృద్ధికి కారణమైంది.

'మార్కెట్ నిర్మించలేని చోటకు రాజ్యం వెళ్లితీరాలి' అన్నది నెహ్రూ దృఢ విశ్వాసం. ఈ విశ్వాసమే ప్రభుత్వరంగ సంస్థల సముచ్చయానికి దారితీసింది. 1956లో బీహెచ్‌ఈఎల్ పరిశ్రమల అభివృద్ధికి అంకురార్పణ చేసింది. హెచ్‌ఏఎల్, బెల్, హెచ్‌ఎంటీలు కచ్చితత్వ ఇంజనీరింగ్, విమానయాన రంగాలకు పునాదిగా నిలిచాయి. భిలాయ్, రూర్కెలా, దుర్గాపూర్ ఉక్కు కర్మాగారాలు భారత స్వావలంబనకు ప్రతీకలుగా భాసిల్లాయి. ఎయిరిండియా, ఎన్టీపీసీ, ఎన్‌హెచ్‌పీసీల సృష్టి రవాణా, ఇంధన మౌలిక సదుపాయాలను దృఢతరం చేశాయి.

విఖ్యాత శాస్త్రవేత్త హోమీ బాబా సారథ్యంలో 1948లో నెహ్రూ అణు ఇంధన కమిషన్‌ను ఏర్పాటు చేశారు. దేశ అణు పరిశోధనకు ఇది పునాదిగా నిలిచింది. విదేశీ సాంకేతికతపై ఆధారపడే స్థితి కొనసాగరాదన్న నిశ్చయంతో రక్షణ పరిశోధన, అభివృద్ధి సంస్థ (డీఆర్‌డీఓ), రక్షణ పరిశోధన, అభివృద్ధి ప్రయోగశాల (డీఆర్‌డీఎల్) వ్యవస్థలను రూపుదిద్దారు. 1962లో విక్రం సారాభాయ్ ఆధ్వర్యంలోని ఇన్‌కోస్‌పార్ అనంతరకాలంలో ఇస్రోగా రూపాంతరం చెందింది.

ఆనకట్టలనూ, సాగునీటి ప్రాజెక్టులనూ నెహ్రూ 'ఆధునిక భారత దేవాలయాలు' అన్నారు. ఈ రెండూ మన ఆహార ముఖచిత్రాన్నే సమూలంగా మార్చాయి. భాక్రానంగల్, హీరాకుడ్, నాగార్జునసాగర్‌లు సాగు ఉత్పాదకతను అనేక రెట్లు పెంచాయి. ఆయన ఏర్పరచిన భారత ఆహార సంస్థ (ఎఫ్‌సీఐ) కరువుల్ని అధిగమించటానికి, తర్వాతకాలంలో జరిగిన హరిత విప్లవానికి బాటలుపరిచింది. అలీనోద్యమం ద్వారా అంతర్జాతీయంగా మన దేశం ఒక స్వతంత్ర స్వరం వినిపించేలా చేసింది నెహ్రూ మహాశయుడే.

ఎటుచూసినా నిరక్షరాస్యతే నిండి, నిరుపేద దేశంగా, విభజన గాయాలతో నిలబడిన దేశానికి నెహ్రూ నాయకత్వం వహించి సలక్షణంగా పనిచేసే సంస్థల్ని, విద్యుత్ కేంద్రాలను, విశ్వవిద్యాలయాలను, జాతీయ ప్రయోజనమనే భావనను వదిలివెళ్లారు. ఆధునిక భారత పటుత్వం దాని నిర్మాతలను గుర్తించి గౌరవించటంలోనే ఉంటుంది తప్ప వారిని కించపరచటంలో కాదు. చరిత్రను పునరుల్లేఖించటానికి పూనుకుంటున్నవారు ఒకటి గుర్తుపెట్టుకోవాలి– 'పర్వతశిఖరంపై ఉమ్మివేయటం ద్వారా మీరు దాని ఖ్యాతిని మసకబార్చలేరు'.



> చరిత్రలోని ముఖ్య ఘట్టాలన్నిటికీ సాక్ష్యాధారాలు ఉంటాయని, అవి బయటికి వస్తే నగుబాటుపాలవుతామని సంఘ్ పరివార్ నాయకులకు కాస్తయినా బెదురూ, భయం ఉండవు. చరిత్రలో లేనివన్నీ నెహ్రూకు ఆపాదించి ఆయనను కించపరచాలని చూస్తారు. నెహ్రూను నిందించటమంటే ఆయన చేతుల మీదుగా పురుడుపోసుకున్న నవ భారత నమూనాను తృణీకరించటమే.



• దుద్దిళ్ల శ్రీధర్‌బాబు
తెలంగాణా ఐటీ, పరిశ్రమలు, శాసనసభ వ్యవహారాల మంత్రి

ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY హనుమకొండ HANUMAKONDA
శుక్రవారం 14 నవంబరు 2025



ఎయిర్‌పోర్టు స్థల విస్తరణ మ్యాప్‌ను పరిశీలిస్తున్న ఎంపీ కడియం కావ్య, కలెక్టర్ సత్య శారద

ఎయిర్‌పోర్ట్ పనుల్లో జాప్యం వద్దు

ఎంపీ కడియం కావ్య

మామునూరు, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): ఎయిర్‌పోర్టు పనుల్లో ఎక్కడా జాప్యం జరుగకుండా చూడాలని వరంగల్ పార్లమెంటు సభ్యురాలు కడియం కావ్య అధికారులకు సూచించారు. ఓరుగల్లు ప్రజల విమానాశ్రయం కల త్వరలోనే నెరవేరుతుందని స్పష్టం చేశారు. గురువారం ఆమె కలెక్టర్ సత్యశారద, ఇరిగేషన్, ఆర్‌అండ్‌బీ అధికారులతో కలసి మామునూరు ఎయిర్‌పోర్ట్ స్థల విస్తరణ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చొరవతో విమానాశ్రయ పనులు వేగంగా పూర్తిచేయాలని, ఎక్కడా జాప్యం జరుగకుండా చూడాలని అధికారులకు సూచించారు. భవిష్యత్తు అవసరాలను దృష్టిలో ఉంచుకుని ఇంటర్నేషనల్ ఎయిర్ పోర్టుకు ప్రణాళిక రూపకల్పన చేశారని, ప్రయాణికులకు సేవలతో పాటు కార్గో సేవలను సైతం అందించేందుకు ప్రణాళికలు చేస్తున్నట్లు తెలిపారు. కాకతీయ మెగా టెక్స్‌టైల్స్ పార్కు పక్కనే ఉన్నందున ఎయిర్ పోర్ట్ సర్వీసులు ప్రారంభమైతే వరంగల్ ప్రగతిలో దూసుకుపోతుందన్నారు.

గుంతల'కీ' బలైపోయారు..

- కారు తాళం చెవి కోసం మరో కారులో వెళ్లి వస్తుండగా రోడ్డు ప్రమాదం
- పల్టీలు కొట్టి చెట్టును ఢీ కొట్టడంతో ఇద్దరి దుర్మరణం
- మరో ఇద్దరికి తీవ్ర గాయాలు
- పరకాల కొత్తగట్టు క్రాస్ రోడ్డు వద్ద ఘటన



మృతుడు పార్శ సంపత్ (ఫైల్)




బొంపల్లి కిషన్ రావు (ఫైల్)

ఆత్మకూరు, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): కారు తాళం చెవి కోసం మరో కారులో బయలుదేరిన నలుగురు వ్యక్తులు రోడ్డు ప్రమాదానికి గురయ్యారు. గుంతలను తప్పించబోయి చెట్టును కారు ఢీకొట్టగా ఇద్దరు అక్కడికక్కడే మృతి చెందగా మరో ఇద్దరికి తీవ్రంగా గాయాలయ్యాయి. ఈ ఘటన హనుమకొండ జిల్లా ఆత్మకూరు మండలం కొత్తగట్టు శివారులో హనుమకొండ - పరకాల రహదారిపై గురువారం తెల్లవారుజామున చోటు చేసుకుంది. ఆత్మకూరు ఎస్సై సతీష్ తెలిపిన వివరాల ప్రకారం.. జయశంకర్ భూపాలపల్లి జిల్లా రేగొండ మండలం రేపాకపల్లికి చెందిన పార్శ సంపత్ (55).. తాను పండించిన మిర్చిని కిందటేడు కోల్డ్ స్టోరేజీలో నిల్వ ఉంచాడు. దాన్ని అమ్మేందుకు బుధవారం తన కారులో వరంగల్‌కు వెళ్లాడు. అక్కడ పరకాల (మిగతా 6వ పేజీలో)

పొలిటికల్ షాక్...

- సెంట్రల్ జోన్ డీసీపీగా నియామకమైన శ్రీనివాస్‌కు చుక్కెదురు
- బాధ్యతలు స్వీకరించేందుకు వచ్చిన రోజే ఉత్తర్వులు రద్దు
- తెరవెనుక చక్రం తిప్పిన ప్రజాప్రతినిధి

వరంగల్ క్రైం, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): వరంగల్ పోలీస్ కమిషనరేట్ సెంట్రల్ జోన్ డీసీపీగా బాధ్యతలు చేపట్టేందుకు వచ్చిన ఐపీఎస్ అధికారి శ్రీనివాస్‌కు చుక్కెదురైనట్లుగా తెలుస్తోంది. ఇంతకాలం సెంట్రల్ జోన్ డీసీపీగా విధులు నిర్వర్తించిన షేక్ సలీమా ఇటీవల బదిలీపై హైదరబాద్‌కు వెళ్లారు. ఆమె స్థానంలో గతంలో భూపాలపల్లి డీఎస్పీగా విధులు నిర్వర్తించి ఇటీవలే ఐపీఎస్‌గా పదోన్నతి పొందిన శ్రీనివాస్‌ను వరంగల్ సెంట్రల్‌జోన్ డీసీపీగా అటాచ్ చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. కాగా, గురువారం బాధ్యతలు స్వీకరించడానికి డీసీపీ శ్రీనివాస్ హనుమకొండకు చేరుకోగా, ఆయన ఉత్తర్వులను ప్రభుత్వం అర్థాంతరంగా రద్దు చేయడంతో నిరాశతో వెనుదిరిగి వెళ్లారు. శ్రీనివాస్ డీసీపీగా బాధ్యతలు చేపట్టడం ఇష్టంలేని సెంట్రల్ జోన్ పరిధిలోని ఓ ఎమ్మెల్యే.. ప్రభుత్వ పెద్దల దృష్టికి తీసుకెళ్లి బాధ్యతలను అడ్డుకున్నట్లుగా విశ్వసనీయమైన సమాచారం. కాగా, శ్రీనివాస్ గతంలో మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ సెక్యూరిటీ వింగ్‌లో విధులు నిర్వహించినట్లుగా తెలుస్తోంది.



- తొలుత 2016లో వరంగల్ అర్బన్, రూరల్ జిల్లాల ఏర్పాటు
- 2021లో అర్బన్, రూరల్‌ను రద్దు చేసి వరంగల్, హనుమకొండ జిల్లాలుగా ఏర్పాటు
- ఇంకా అనేక శాఖల్లో అర్బన్, రూరల్ పేర్లే చెలామణి
- జేఈఈ పరీక్షలు రాసే విద్యార్థులను పరేషాన్ చేస్తున్న జిల్లాల పేర్లు
- ఆప్షన్‌లో ఇంకా కనిపిస్తున్న వరంగల్ అర్బన్, వరంగల్ రూరల్
- పరీక్ష కేంద్రాల ఎంపికలో కనిపించని హనుమకొండ జిల్లా
- మద్యం టెండర్లు సైతం ఇటీవల అర్బన్, రూరల్ జిల్లాలుగానే నిర్వహణ
- ఇతర శాఖల నోటిఫికేషన్లలోనూ ఇదే తరహా సమస్యలు
- ఐదేళ్లు కావస్తున్నా అదే గందరగోళం

విడగొట్టారు.. చోద్యం చూస్తున్నారు..

జిల్లాల పునర్విభజన జరిగి ఏళ్లు కావొస్తున్నా.. ఇంకా ఉమ్మడి వరంగల్ జిల్లాలో ఆ విభజిత జిల్లా గందరగోళానికి తెర పడటం లేదు. అప్పటి ప్రభుత్వం ఉమ్మడి వరంగల్ జిల్లాను ఆరు ముక్కలు చేసింది. చారిత్రక వరంగల్ నగరాన్ని కూడా రెండు ముక్కలు చేసింది. పరిపాలన సౌలభ్యం అంటూ హనుమకొండలో, వరంగల్‌లో రెండు కలెక్టరేట్లను ఏర్పాటు చేసింది. ఈ రెండు పట్టణాలు కలిసే ఉంటాయి. పైగా పదే పదే జిల్లాల పేర్లను మార్చి ప్రజలను, వివిధ శాఖలను గందరగోళంలో పడేసింది. గత ప్రభుత్వం నిర్లక్ష్యం వల్ల వరంగల్ ప్రజలు.. తమది ఏ జిల్లానో.. తాము ఇప్పుడు ఏ జిల్లాలో ఉన్నామో.. అనే అయోమయంలో ఉన్నారు. విద్యార్థులైతే మరింత గందరగోళానికి, ఇబ్బందులకు గురవుతున్నారు. ప్రభుత్వ పరంగా వరంగల్ అర్బన్, రూరల్ జిల్లాల పేర్లనే కొనసాగిస్తుండటంతో అనేక సమస్యలు ఎదురవుతున్నాయి.

ఉమ్మడి వరంగల్ జిల్లాలో గందరగోళం రేపుతున్న విభజిత జిల్లాల పేర్లు

▪ ఆంధ్రజ్యోతి ప్రతినిధి, వరంగల్

తెలంగాణలో అతిపెద్ద రెండో జిల్లాగా ఉన్న వరంగల్‌ను గత బీఆర్ఎస్ ప్రభుత్వం 2016 అక్టోబరు 11న జిల్లాల పునర్విభజనలో ఐదు ముక్కలు చేసింది. వరంగల్ అర్బన్, వరంగల్ రూరల్, మహబూబాబాద్, జయశంకర్‌భూపాలపల్లి, జనగామ జిల్లాలుగా విభజించింది. ఆ తరువాత 2019 ఫిబ్రవరి 19న భూపాలపల్లి జిల్లాను రెండు ముక్కలు చేసి తొమ్మిది మండలాలతో ములుగు జిల్లాను ఏర్పాటు చేసింది. దీంతో ఉమ్మడి వరంగల్ జిల్లా ఆరు ముక్కలైంది. ఇక అక్కడితో ఆగకుండా అప్పటి గులాబీ నేతల కు సంబంధించిన మెడికల్ కాలేజీల ఏర్పాటు కోసం చారిత్రక వరంగల్ నగరాన్ని కూడా రెండుగావిభజించారనే ఆరోపణలు ఉన్నాయి. 2021 ఆగస్టు 12వ తేదీన వరంగల్ రూరల్, వరంగల్ అర్బన్ జిల్లాలను రద్దు చేసి వరంగల్, హనుమకొండ జిల్లాలను ఏర్పాటు చేశారు. దీంతో గులాబీ నేతలకు కావాల్సిన మెడికల్ వ్యాపారం పూర్తి చేసుకున్నారనే ప్రచారం జరుగుతోంది. నగరాన్ని రెండుగా విభజించిన ప్రభుత్వం.. రెండు కలెక్టరేట్లను కిలోమీటర్ల దూరంలోనే ఏర్పాటు చేసింది. అయితే హనుమకొండ కేంద్రంగానే రెండు జిల్లాల పాలన సాగుతోంది.

ఏ జిల్లాలో ఉన్నామో....

వరంగల్ అర్బన్, వరంగల్ రూరల్ జిల్లాలను రద్దు చేసి ప్రభుత్వం వరంగల్, హనుమకొండ (మిగతా 7వ పేజీలో)

జాడలేని బిల్లుల చెల్లింపులు

- సర్కారు తీరుపై జీడబ్ల్యూఎంసీ
- కాంట్రాక్టర్ల నిరసన సెగలు
- నేడు చర్చలకు రాకుంటే రేపటి నుంచి దీక్షలకు సిద్ధం

6



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న శాసన మండలి ప్రతిపక్ష నేత సిరికొండ మధుసూదనాచారి

ప్రజల సమస్యలు పట్టని సీఎం

- బీసీ రిజర్వేషన్లు అమలు చేయకపోతే రాష్ట్రం అగ్నిగుండం
- బీఆర్ఎస్ నేతలపై దాడులు జరిగితే మా శక్తి చూపిస్తాం..
- పేదలకు 50గజాల భూమిపై సర్కారుకు చిత్త శుద్ధి లేదు
- శాసన మండలి ప్రతిపక్ష నేత మధుసూదనాచారి
- ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి మానుకోట రాళ్లను గుర్తుకుతెచ్చుకోవాలి: వినయభాస్కర్

6



బస్‌స్టేషన్ నిర్మాణ స్థలం వద్ద బీజేపీ నాయకుల నిరసన

బస్‌స్టేషన్ నిర్మాణాన్ని గాలికి వదిలేశారు..

- నెల రోజుల్లో చేపట్టకపోతే ఎమ్మెల్యేల ఇళ్ల ముట్టడి
- బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంటా
- నిర్మాణ స్థలంలో పడవపై తిరుగుతూ నిరసన

6

ఘనంగా కాళోజీ సోదరుల స్మారక పురస్కారాల ప్రదానం

7



కలెక్టరేట్ ఎదుట నిరసన తెలుపుతున్న ప్రైవేట్ విద్యాసంస్థల యాజమాన్యాలు, ఉపాధ్యాయులు

చందాల దందా సరికాదు..

- ప్రిన్సిపాల్‌పై దాడికి పాల్పడిన వారిని శిక్షించాలి
- ట్రస్మా రాష్ట్ర అధ్యక్షుడు సాదుల మధుసూదన్

హనుమకొండ కలెక్టరేట్, నవంబరు 13, (ఆంధ్రజ్యోతి): చందాల కోసం కుమార్‌పల్లిలోని స్మైల్ డిజీ పాఠశాలలోకి పీడీఎస్‌యూ నాయకులు చొరబడి యాజమాన్యంపై దాడికి దిగిన ఘటనపై ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాల వారు గురువారం హనుమకొండ కలెక్టరేట్ ఎదుట పెద్ద ఎత్తున నిరసన తెలిపారు. ముందుగా సుబేదారిలోని ఆర్ట్స్ కళాశా ల ఆడిటోరియం నుంచి కలెక్టరేట్ వరకు ర్యాలీగా వెళ్లి ఆందోళన చేశా రు. విద్యార్థి సంఘాలు చందాల పేరుతో ప్రైవేట్ పాఠశాలపై ఒత్తిడి తెస్తూ దాడి చేయడం మానుకోవాలని వారు నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ట్రస్మా రాష్ట్ర అధ్యక్షుడు సాదుల మధుసూదన్ మాట్లాడుతూ.. కొంతమంది విద్యార్థి సంఘాల నాయకులమని చెప్పుకుంటూ తమను వేధించడం సరికాదన్నారు. స్మైల్ పాఠశాల కరస్పాండెంట్‌పై పీడీఎస్‌యూ నాయకులు మర్రి మహేష్, (మిగతా 6వ పేజీలో)

విద్యార్థి నేతలపై దాడి అమానుషం

కేయూ క్యాంపస్‌లో విద్యార్థి సంఘాల నిరసన 7



మీడియా సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి

వరద బాధితులకు అండ

- ఒక్కో కుటుంబానికి రూ.15 వేలు అందిస్తాం
- నేరుగా అకౌంట్లలో డబ్బుల జమ
- బీఆర్ఎస్ పాలనలో చిల్లిగవ్వ ఇవ్వలేదు...
- సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి నిర్మాణంలో రూ.600 కోట్ల దుర్వినియోగం
- ముంపు సమస్య పరిష్కారానికి భారీ ప్రాజెక్టులు
- నగరాన్ని ఒక్కటిగా చేసేందుకు అనుకూలతల పరిశీలన
- వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి

హనుమకొండ సిటీ, నవంబరు 13(ఆంధ్రజ్యోతి) : ఇటీవల మొంథా తుఫాన్‌తో తలెత్తిన వరదలతో నగరంలో నష్టపోయిన బాధితులను ఆదుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం రూ.12.08కోట్ల నిధులను విడుదల చేసిందని హనుమకొండ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు, వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి వెల్లడించారు. గురువారం జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఎంపీ కడియం కావ్య, ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు, మేయర్ గుండు సుధారాణి, పార్టీ వరంగల్ జిల్లా అధ్యక్షురాలు, కుడా చైర్మన్ ఇనుగాల వెంకట్రాంరెడ్డి తదితరులతో కలిసి రాజేందర్‌రెడ్డి మాట్లాడారు.

11 రోజుల వ్యవధిలోనే...

మొంథా తుపాన్‌తో నగరంలో వరద బీభత్సం తదుపరి 11రోజుల వ్యవధిలోనే ప్రభుత్వం బాధితులను ఆదుకునేందుకు నిధులు విడుదల చేసిందని రాజేందర్‌రెడ్డి చెప్పారు. గతంలో ఎన్నడూ ఇలాంటి దాఖలాలు లేవన్నారు. హనుమకొండలోని ప్రాంతాలకు రూ.7.03 కోట్లు, వరంగల్‌లోని బాధితులకు రూ.5.05 కోట్లు మొత్తంగా రూ. 12.08 కోట్ల నిధులను ముఖ్యమంత్రి విడుదల చేశారన్నారు. గ్రేటర్ పరిధిలోని మొత్తం 48 కాలనీలు వరదల కారణంగా ముంపునకు గురయినట్లు చెప్పారు. బాధితుల సహాయార్థం ఒక్కో కుటుంబానికి రూ.15 వేలు కేటాయించడం జరిగిందని, డబ్బులు నేరుగా వారి వారి బ్యాంకు అకౌంట్లలో నేరుగా జమ కానున్నట్లు చెప్పారు.

ఆనాడు చిల్లిగవ్వ ఇవ్వలేదు...

బీఆర్‌యస్ హయంలో నగరాన్ని వరదలు ముంచెత్తితే ప్రజలకు మొండి చేయి చూపారని రాజేందర్‌రెడ్డి (మిగతా 6వ పేజీలో)



విద్యార్థులను అభినందిస్తున్న పాఠశాల యాజమాన్యం

రాష్ట్రస్థాయి తాంగ్ తా పోటీలకు డిస్నీల్యాండ్ విద్యార్థులు

దామెర, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): ఇటీవల మహబూబాబాద్ జిల్లా నెల్లికుదురులో నిర్వహించిన జిల్లాస్థాయి తాంగ్ తా పోటీల్లో డిస్నీల్యాండ్ పాఠశాల విద్యార్థులు ఐదుగురు ఉత్తమ ప్రతిభ కనబరిచారు. ప్రథమస్థానంలో నిలిచి రాష్ట్రస్థాయి ఎంపికయ్యారు. అండర్ 17 విభాగంలో కోరె ప్రమోద్ సాయి, కడారి కార్తికేయ, దద్దు అభిరామ్, అండర్ 14లో ఎల్.విష్ణు, కసగాని జైగౌడ్ విద్యార్థులు ఉన్నారు. తమ పాఠశాల విద్యార్థులు రాష్ట్రస్థాయికి ఎంపిక కావడంపై స్కూల్ యాజమాన్యం దయ్యాల మల్లయ్య, దయ్యాల సదయ్య, అలుగు లక్ష్మీనివాసం, శోభారాణి, రాకేశ్‌భాను, దినేష్ చందర్ గర్వంగా ఉందని పేర్కొన్నారు.

రిమాండ్‌కు పీడీఎస్‌యూ నేతల తరలింపు



అజయ్, మహేశ్‌ల అరెస్టు చూపిస్తున్న ఎస్సై పరుశురాములు

వరంగల్ క్రైం, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): చందా ఇవ్వలేదని కుమార్‌పల్లిలోని స్మైల్ డీజీ పాఠశాల ప్రిన్సిపాల్ శ్రీనివాస్‌వర్మపై బుధవారం దాడిచేసిన పీడీఎస్‌యూ వరంగల్ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు గుర్రం అజయ్, కార్యదర్శి మర్రి మహేశ్‌లను రిమాండ్‌కు తరలించినట్లు హనుమకొండ ఎస్సై పరుశురాములు తెలిపారు. ఎస్సై కథనం ప్రకారం.. పీడీఎస్‌యూ మహాసభ నిర్వహణ కోసం చందాల వసూళ్ల కోసం బుధవారం స్మైల్ డీజీ పాఠశాలకు వెళ్లిన గుర్రం అజయ్, మర్రి మహేశ్‌లు అడిగినంత చందా ఇవ్వలేదని ప్రిన్సిపాల్ శ్రీనివాస్ వర్మపై దాడి చేసి, పాఠశాల సిబ్బందిని భయభ్రాంతులకు గురిచేసి ఫర్నిచర్ ధ్వంసం చేశారు. బాధితుడు వర్మ ఫిర్యాదు మేరకు ఇద్దరు నిందితులపై 329 (3), 324 (2), 292, 308 (2), 351 (2) రెడ్ విత్ 3 (5) సెక్షన్‌ల కింద కేసు నమోదు చేసి కోర్టులో హాజరుపరిచామన్నారు.

గుంతల'కీ' బలైపోయారు..

(5వ పేజీ తరువాయి)

మండలం నాగారం గ్రామానికి చెందిన అడ్తి వ్యాపారి బొంపల్లి కిషన్‌రావు(36)తో కలిసి పంటను అమ్మాడు. అనంతరం ఇంటికి వెళ్లేందుకు సిద్ధం కాగా, కారు తాళం చెవి(కీ) దొరకలేదు. రెండో తాళం చెవి రేపాకపల్లిలోని ఇంట్లో ఉండడంతో వెళ్లేందుకు కిషన్‌రావు సాయం కోరాడు. దీంతో కిషన్‌రావు షాపు పక్కన ఉండే మరోషాపు నిర్వాహకుడైన పరకాల మండలం కామారెడ్డిపల్లికి చెందిన పోతరాజు వెంకటేష్ కారు అడిగాడు.

వెంకటేశ్, తన భాగస్వామి అయిన ఆత్మకూరు మండల కేంద్రానికి చెందిన చింతపట్ల మురళీకృష్ణ, పార్శ సంపత్, కిషన్‌రావులు కలిసి బుధవారం రాత్రి 2 గంటల సమయంలో వరంగల్ వ్యవసాయ మార్కెట్ నుంచి కారు తాళం చెవి కోసం రేపాకపల్లికి వచ్చారు. అక్కడ కారు తాళం చెవి తీసుకున్నాక అందరూ కలిసి వరంగల్‌కు బయలు దేరారు. ఈ క్రమంలో ఆత్మకూరు మండలం కొత్తగట్టు క్రాస్ రోడ్డు వద్దకు రాగానే రోడ్డుపై ఉన్న గుంతలను తప్పించబోయి అదుపు తప్పి పల్టీలు కొట్టుకుంటూ రోడ్డు పక్కన ఉన్న చెట్టును అతివేగంగా ఢీకొట్టింది. దీంతో కారు వెనుక సీట్‌లో కూర్చున్న పార్శ సంపత్, బొంపల్లి కిషన్‌రావు అక్కడికక్కడే మృతిచెందారు. డ్రైవింగ్ చేస్తున్న పోతరాజు వెంకటేష్, పక్కన కూర్చున్న చింతపట్ల మురళీకృష్ణలు తీవ్రంగా గాయపడ్డారు. వీరిని చికిత్స నిమిత్తం ఎంజీఎం ఆస్పత్రికి తరలించినట్లు ఎస్సై తెలిపారు. పార్శ సంపత్ భార్య సరస్వతి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాలను వరంగల్ ఎంజీఎంకు తరలించారు. మృతిచెందిన పార్శ సంపత్‌కు భార్య సరస్వతి, ఇద్దరు పిల్లలు ఉన్నారు. బొంపల్లి కిషన్‌రావుకు భార్య అర్పిత, ఇద్దరు కుమారులు ఉన్నారు. వీరి మృతితో బాధిత కుటుంబాలు కన్నీరుమున్నీరవుతున్నాయి.

జాడలేని బిల్లుల చెల్లింపులు



వరంగల్ కార్పొరేషన్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ వరంగల్ మునిసిపల్ కార్పొరేషన్ (జీడబ్ల్యూఎంసీ) పరిధిలో అభివృద్ధి పనులు చేపట్టిన కాంట్రాక్టర్లకు సకాలంలో బిల్లులు రాకపోవడంతో అధికారులు, పాలకవర్గం తీరుపై అసహనం వ్యక్తం చేస్తున్నారు. 8 మాసాలుగా కోట్ల వ్యయంతో చేపట్టిన పనులకు సంబంధించిన బిల్లులపై అధికారుల చుట్టూ చెప్పులరిగేలా తిరిగినా అధికారులలో ఏ మాత్రం చలనంరావడం లేదని మండిపడుతున్నారు. అప్పులు చేసి పనులు పూర్తి చేసినా బిల్లులు రాకపోవడంతో అసలు, మిత్తీలు కట్టలేక మానసిక వేదనకు గురవుతన్నారు. పెండింగ్ బిల్లులు చెల్లించాలని కమిషనర్, మేయర్‌తో పాటు అకౌంట్స్ సెక్షన్ చుట్టూ తిరుగుతూ ప్రజాప్రతినిధులచే ఫోన్‌లు చేయిస్తున్నా పట్టించుకున్న నాథుడే లేడని కాంట్రాక్టర్లు వాపోతున్నారు.

గ్రేటర్ వరంగల్ పరిధిలో పెండింగ్ బిల్లుల పరిష్కారంపై ఈనెల 7న కమిషనర్ చహత్ బాజ్‌పాయ్‌ని రెండు జిల్లాల కాంట్రాక్టర్లు స్వయంగా కలిసి గోడును వెల్లబుచ్చుకున్నారు. అయినా ఫలితం శూన్యం అని వారు చెబుతున్నారు. ఈ నేపథ్యంలో శుక్రవారం సాయంత్రం వరకు బిల్లులు చెల్లించాలని, లేదంటే శనివారం నుంచి నగర పాలక సంస్థ ప్రధాన కార్యాలయం ఎదుట రిలే నిరాహార దీక్షలు చేపడతామని స్పష్టం చేస్తున్నారు. గురువారం సివిల్ కాంట్రాక్టర్స్ అసోసియేషన్ నాయకులు నగరంలో సమావేశమై నిరాహార దీక్షలు చేపట్టేందుకు రంగం సిద్ధం చేసుకున్నారు.

ఎన్నికలు సమీపిస్తున్నా...

మరో ఐదు మాసాలలో మేయర్‌తో పాటు కార్పొరేటర్ల పదవీకాలం పూర్తి కానుంది. రెండేళ్లుగా పట్టణ ప్రగతి, జనరల్ ఫండ్, సీఎంఏ, స్మార్ట్‌సిటీతో పాటు ఇతర గ్రాంట్లకు సంబంధించిన పనులు జీడబ్ల్యూఎంసీ పరిధిలో అర్హత కలిగిన సుమారు 400 మంది కాంట్రాక్టర్లు కొన్ని పనులు పూర్తి చేయగా, మరికొందరు బిల్లులు రాక పనులను మధ్యలోనే నిలిపి వేసి అధికారులు తీరుపై చేతులెత్తేశారు. ఇప్పటివరకు అందరికీ కలుపుకుని సుమారు రూ.100కోట్లు చెల్లించాల్సి ఉంది. కమిషనర్‌ను, మేయర్‌ను కలిసి విన్నవిస్తే కనీసం పట్టించుకోవడం లేదని ఆరోపిస్తున్నారు. అంతేకాకుండా హైదరాబాద్ ఫైనాన్స్ డిపార్ట్ నుంచి రావలసిన బిల్లులకు సైతం అక్కడి అధికారులు 10 నుంచి 12 శాతం బిల్లులకు కమిషన్ చెల్లించినా పేచేయడం లేదని మండిపడుతున్నారు.

మేయర్, కమిషనర్ విమర్శలు

నగర మేయర్, కమిషనర్ తీరుపై బల్దియా కాంట్రాక్టర్లు గుర్రుగా ఉన్నారు. ఎనిమిది మాసాలుగా కాంట్రాక్టర్లకు బిల్లులు ఇవ్వకుండా చుక్కలు చూపిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కమిషనర్‌ను కలిసి సమస్య విన్నవిస్తే కనీసం పట్టించుకోకుండా చూస్తాం.. చేస్తాం.. అని చెప్పినట్టు తెలిపారు. కొన్ని సమయాల్లో ఎల్ఆర్ఎస్ డబ్బులు వచ్చిన తర్వాత ఇస్తా.. లేదా.. ప్రభుత్వం నుంచి బడ్జెట్ విడుదల కాగానే ఇస్తామని కొందరు బల్దియా ఇంజనీరింగ్ అధికారులు సమాధానం ఇస్తున్నట్టు తెలిపారు. శుక్రవారం వరకు సమస్య పరిష్కారం జరిగితే ఓకే.. లేదంటే శనివారం బల్దియా ప్రధాన కార్యాలయం ఎదుట 400 మంది కాంట్రాక్టర్లతో పాటు వారి కుటుంబ సభ్యులు మేయర్, కమిషనర్ తీరును నిరసిస్తూ దీక్షలకు దిగుతామని హెచ్చరిస్తున్నారు.

బస్‌స్టేషన్ నిర్మాణాన్ని గాలికి వదిలేశారు..

● బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంటా రవికుమార్ ● నిర్మాణ స్థలంలో పడవపై తిరుగుతూ నిరసన

గిర్మాజీపేట(వరంగల్), నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): వరంగల్ బస్‌స్టేషన్ నిర్మాణ స్థలంలో బీజేపీ నాయకులు గురువారం వినూత్నరీతిలో నిరసన తెలిపారు. నిర్మాణ స్థలం చెరువులా మారడంలో అందులో పడవ ప్రయాణం చేస్తూ రాష్ట్ర ప్రభుత్వ వైఖరిని ఎంగట్టారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రులు కొండా సురేఖ, పొన్నం ప్రభాకర్ ముఖ చిత్రాలు ఉన్న మాస్క్‌లు ధరించి మంత్రులకు ఉచిత ప్రయాణం అంటూ ఎద్దేవా చేశారు. బస్‌స్టేషన్ నిర్మాణ పనులు నెల రోజుల్లో చేపట్టకపోతే కాంగ్రెస్ ఎమ్మెల్యేల ఇళ్ల ముట్టడిస్తామని హెచ్చరించారు. బస్‌స్టేషన్ నిర్మాణ పనులు నిలిచిపోవడం, నిర్మాణం కోసం తీసిన గుంత పెద్ద చెరువుగా మారడంపై 'వరంగల్ ఆత్మగౌరవ పోరాటం మహాధర్నా-2' పేరుతో నిరసన చేపట్టారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ నాయకులకు ఉచిత పడవ ప్రయాణం అంటూ పార్టీ రాష్ట్ర నాయకుడు ఎర్రబెల్లి ప్రదీప్‌రావుతో కలిసి జిల్లా అధ్యక్షుడు గంటా రవికుమార్ నిరసన కార్యక్రమాన్ని ప్రారంభించారు.

ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు గంటా రవికుమార్ మాట్లాడుతూ.. అధునాతన బస్‌స్టేషన్ నిర్మాణం పేరుతో వరంగల్ బస్‌స్టేషన్‌ను కూల్చి రెండేళ్లు గడిచినా ఇంతవరకు అడుగు ముందుకు పడలేదని, మంత్రి కొండా సురేఖ నియోజకవర్గ అభివృద్ధిని విస్మరించారని ఆరోపించారు. బస్‌స్టేషన్ నిర్మాణం కోసం రూ.70కోట్ల 'కుడా' నిధులున్నా పనులు ఆగిపోవడం మంత్రి సురేఖ అసమర్థతకు నిదర్శనం అని అన్నారు. కాంగ్రెస్ నాయకులకు కమీషన్లు, కాంట్రాక్ట్‌లపై ఉన్న శ్రద్ధ ప్రజా సమస్యలపై లేదని ఎద్దేవా చేశారు. నెల రోజుల్లో పనులు పునఃప్రారంభించక పోతే కాంగ్రెస్ ఎమ్మెల్యేల ఇళ్ల ముట్టడిస్తామని హెచ్చరించారు. ఎర్రబెల్లి ప్రదీప్‌రావు మాట్లాడుతూ.. బీజేపీ ప్రభుత్వం వరంగల్ రైల్వేస్టేషన్‌ను ఎయిర్‌పోర్ట్ తరహాలో అభివృద్ధి చేస్తే.. మంత్రి సురేఖ బస్‌స్టేషన్‌ను నిర్మించలేకపోతున్నారని విమర్శించారు. ఇప్పటికైనా స్పందించకపోతే ప్రజా నిరసనను ఎదుర్కోవాల్సి ఉంటుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే వన్నాల శ్రీరాములు, రాష్ట్ర నాయకులు కుసుమ సతీష్, రత్నం సతీష్‌సా, పుల్లారావు, జిల్లా నాయకులు హరిశంకర్, తిరుపతి రెడ్డి, రాణా ప్రతాప్‌రెడ్డి, రంజిత్‌రావు, క్రాంతి కుమార్, శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.

చందాల దందా సరికాదు..

(5వ పేజీ తరువాయి)

గుర్రం అజయ్‌లు దాడి చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. వారిపై వెంటనే కేసులు నమోదు చేసి శిక్షించాలన్నారు. ఇప్పటినుంచైనా ప్రైవేట్ పాఠశాలల్లోకి విద్యార్థి సంఘాల నాయకులమని చెప్పుకునే వారిని రానివ్వకుండా ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం కలెక్టర్‌కు, వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు.

ఈ కార్యక్రమంలో ట్రస్మా రాష్ట్ర కోశాధికారి రాఘవేందర్‌రెడ్డి, ట్రస్మా హనుమకొండ జిల్లా ప్రధాన కార్యదర్శి జ్ఞానేశ్వర్, కోశాధికారి వెలగందుల ముక్తేశ్వర్, హనుమకొండ జోన్ అధ్యక్షుడు శ్రీకాంత్‌రెడ్డి, హసన్‌పర్తి జోన్ అధ్యక్షుడు ఎ.రాంబాబు, కాజీపేట జోన్ అధ్యక్షుడు శ్రీనివాస్, ట్రస్మా వరంగల్ జిల్లా అధ్యక్షుడు చల్లా నాగార్జునరెడ్డి, ప్రైవేట్ డిగ్రీ కళాశాలల వరంగల్ జిల్లా అధ్యక్షుడు వేణుమాధవ్, ట్రస్మా చీఫ్ అడ్వయిజర్ నారాయణరెడ్డి, అడ్వయిజర్ కె.భూపాల్‌రావు, ఉపాధ్యక్షుడు పరంజ్యోతి, ట్రస్మా భూపాలపల్లి అధ్యక్షుడు సాంబయ్య, మహబూబాబాద్ అధ్యక్షుడు ఏకాంతంగౌడ్, జనగామ అధ్యక్షుడు వెంకటర్రెడ్డి, ములుగు అధ్యక్షుడు వీరమల్లు, సిద్ధిపేట ట్రస్మా నాయకుడు ఎడ్ల శ్రీనివాస్‌రెడ్డి, కరీంనగర్ ట్రస్మా అధ్యక్షుడు కొమురయ్య, వడుప్సా అధ్యక్షుడు బుచ్చిబాబు తదితరులు పాల్గొన్నారు.

అక్రమ డిప్యూటేషన్లు జరగలేదు

హనుమకొండ కలెక్టరేట్, నవంబరు13(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి వరంగల్ జిల్లాలోని ఆశ్రమ పాఠశాలల్లో అక్రమ డిప్యూటేషన్లు జరగలేదని, ఈ ప్రచారంలో నిజం లేదని హనుమకొండ జిల్లా గిరిజన అభివృద్ధి శాఖ అధికారి ప్రేమకళారెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. జనగామ జిల్లా పరిధిలో నిర్వహిస్తున్న గిరిజన ఆశ్రమ పాఠశాలల్లో ప్రతీ సబ్జెక్టుకు టీచర్ ఉన్నారన్నారు. అదనంగా ఉన్న ఉపాధ్యాయులను ఐటీడీఏ పీవో ఆదేశానుసారం హనుమకొండ జిల్లాలోని రెండు గిరిజన ఆశ్రమ పాఠశాలల్లో సర్దుబాటు చేశామన్నారు. ప్రస్తుతం జనగామ జిల్లాలో టీచర్ల లోటు లేదన్నారు. అలాగే ఐదుగురు సీఆర్‌టీలను వారి అభ్యర్థన మేరకు పరస్పర డిప్యూటేషన్లు చేశామని, దీని వలన ఏ పాఠశాలలో కూడా ఇబ్బందులు లేవని ప్రేమకళారెడ్డి ఆ ప్రకటనలో తెలిపారు.

స్టాఫ్ నర్సుల పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

వరంగల్ మెడికల్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): స్టాఫ్ నర్స్ నియామకానికి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కాకతీయ మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సంధ్య ఒక ప్రకటనలో తెలిపారు. 19 పోస్టులకు ఔట్ సోర్సింగ్ విధానంలో, పూర్తిగా తాత్కాలిక ప్రాతిపదికన 2026 మార్చి 31వ తేదీ వరకు మాత్రమే ఉంటాయని పేర్కొన్నారు. ఎంపికైన పీఎంఎస్ఎస్‌వై సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్‌లో సేవలు అందించాల్సి ఉంటుందని తెలిపారు. దరఖాస్తులను కేఎంసీ వెబ్‌సైట్ నుంచి పొందాల్సి ఉంటుదన్నారు.

వరద బాధితులకు అండ

(5వ పేజీ తరువాయి)

ధ్వజమెత్తారు. స్వయంగా నగరాన్ని పరిశీలించి వెళ్లిన అప్పటి మంత్రి కేటీఆర్ బాధితులకు రూ.10 వేలు ఇస్తామని ప్రకటించారన్నారు. కానీ చిల్లి గవ్వ కూడా ఇవ్వలేదని మండిపడ్డారు. నగరానికి ముంపు సమస్య లేకుండా చేస్తామని అండర్ గ్రౌండ్ నిర్మిస్తామంటూ బీరాలు పలికిన కేసీఆర్ మాటలు నీటి మూటలే అయ్యాయని విమర్శించారు. ఇక సైకిల్‌కు సైకిల్, వాహనానికి వాహనం ఇస్తామంటూ బాధితులకు వాగ్దానం చేసిన బీజేపీ నేతలు బాధితులకు ముఖం చాటేశారన్నారు. నగరంలోని సెంట్రల్ జైలు స్థలాన్ని బీఆర్‌యస్ నాయకులు తాకట్టు పెట్టారని రాజేందర్‌రెడ్డి ఆరోపించారు. సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి నిర్మాణంలో రూ.600కోట్ల దుర్వినియోగం జరిగాయన్నారు. ఈ అక్రమాల్లో మాజీ మంత్రి హరీశ్‌రావు ప్రమేయం ఉన్నట్లు తెలుస్తోందన్నారు. ఈ అక్రమాలను న్యాయబద్దమైన పోరాటం ద్వారా వెలుగులోకి తేనున్నట్లు వెల్లడించారు.

త్వరలో శుభవార్త

వరంగల్ నగరం రెండు జిల్లాల పరిధిలో కాకుండా గతంలో వలే ఒకటిగా చేసే విషయమై పరిశీలన జరుగుతున్నట్లు రాజేందర్ రెడ్డి చెప్పారు. కవులు, కళాకారులు, నగర ప్రముఖులు, ప్రజలు, వ్యాపారులు తదితర వర్గాలు ఈ మేరకు స్పందిస్తున్న తీరును ప్రభుత్వం పరిశీలిస్తున్నట్లు చెప్పారు. నగరవాసులు త్వరలోనే శుభవార్త వింటారని రాజేందర్‌రెడ్డి వెల్లడించారు.

వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు కడియం కావ్య మాట్లాడుతూ.. గత ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీలను పూర్తి చేసి కొత్త వాగ్దానాలతోనే రానున్న అసెంబ్లీ ఎన్నిలకు వెళతామని వెల్లడించారు. నగరాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కృషి చేస్తున్నట్లు చెప్పారు. నగర మేయర్ గుండు సుధారాణి, వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు మాట్లాడుతూ ప్రజలను ఆదుకోవడం కాంగ్రెస్ ప్రభుత్వ బాధ్యత అన్నారు. బాధితుల సహాయార్థం ముఖ్యమంత్రి నిధులు విడుదల చేయడం అభినందనీయమన్నారు. ఇటీవల ముంపు ప్రాంతాలను పరిశీలించిన ఎమ్మెల్సీ కవిత వరంగల్‌కు ఎందుకు వచ్చినట్లు అని కాంగ్రెస్ వరంగల్ జిల్లా అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ ప్రశ్నించారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిపై విమర్శలు చేసే నైతికత కవితకు లేదన్నారు. అప్పట్లో జుట్టు ఈరబోసుకున్న కవిత...నేడు ముడేసుకుందని, ఆమె తాను జయలలిత అనుకుంటుందా అంటూ వ్యంగ్యంగా వ్యాఖ్యానించారు. ఈ సమావేశంలో టీపీసీసీ ప్రధాన కార్యదర్శి ఈవీ శ్రీనివాస్, జీడబ్ల్యూయంసీ ఫ్లోర్ లీడర్ తోట వెంకన్న, గ్రంథాలయ సంస్థ చైర్మన్ అజీజ్‌ఖాన్, కార్పొరేటర్లు జక్కుల రవీందర్ యాదవ్, విజయశ్రీ రజాలీతో పాటు ఆనంద్ మోజెస్, మహిళా కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు బంక సరళా, డాక్టర్ అనిల్‌కుమార్, డాక్టర్ రామక్రిష్ణ తదితర కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

'కుడా' భూముల వేలం వాయిదా

వరంగల్ కార్పొరేషన్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): కాకతీయ పట్టణాభివృద్ధి సంస్థ (కుడా) భూముల వేలం పాట ఈ నెల 14న నిర్వహించాల్సి ఉండగా అనివార్య కారణాల వల్ల వాయిదా వేస్తున్నట్టు కుడా వైస్ చైర్‌పర్సన్ చహత్ బాజ్‌పాయ్ గురువారం ఒక ప్రకటనలో వెల్లడించారు. హనుమకొండ బాలసముద్రంలోని సర్వే నెంబర్ 1016/5లో 12,957 చదరపు గజాల ప్రభుత్వ స్థలం వేలం వేయాల్సి ఉండగా వాయిదా వేశారు. తర్వాత వేలం నిర్వహించేది వెల్లడిస్తామని కుడా వీసీ చహత్ బాజ్‌పాయ్ తెలిపారు.

తడి, పొడి చెత్తను వేరుచేయండి

● జీడబ్ల్యూఎంసీ కమిషనర్ చహత్ బాజ్‌పాయ్ ● శివనగర్‌లో శానిటేషన్ పనులు పనుల పరిశీలన



పోతన సెకండ్ ట్రాన్స్‌ఫర్ స్టేషన్‌లో అధికారులతో మాట్లాడుతున్న కమిషనర్

వరంగల్ కార్పొరేషన్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): ప్రతీ ఇంటి నుంచి తడి, పొడి చెత్తను వేరు చేయాలని జీడబ్ల్యూఎంసీ కమిషనర్ చహత్ బాజ్‌పాయ్ అధికారులను ఆదేశించారు. శానిటేషన్ తనిఖీలలో భాగంగా గురువారం వరంగల్ నగరంలోని 34వ డివిజన్ శివనగర్‌లో సంబంధిత అధికారులతో కలిసి తనిఖీలు చేశారు. పోతననగర్‌లోని సెకండ్ ట్రాన్స్‌ఫర్ స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. ప్రతీ స్వచ్ఛ ఆటో రూట్ అప్లిమేషన్ ప్రకారం తిరుగుతుందా? లేదా అని అధికారులు ఎప్పటికప్పుడు పరిశీలించాలన్నారు. ప్రతీ 600గృహాలకు ఇక స్వచ్ఛ ఆటోను వినియోగించాలన్నారు. ప్రతీ ఇంటి నుంచి విధిగా చెత్తను సేకరించాలన్నారు. పోతననగర్‌లోని సెకండ్ ట్రాన్స్‌ఫర్ స్టేషన్‌లో కంటైనర్లు పని చేయడం లేదని తమకు ఫిర్యాదులు అందాయని అక్కడి పనులను చక్కదిద్దాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంహెచ్‌వో రాజేశ్, శానిటరీ సూపర్‌వైజర్ గోల్కొండ శ్రీనివాస్‌తో పాటు శానిటేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

ప్లాస్టిక్ ఉత్పత్తులు విక్రయిస్తే కఠిన చర్యలు

వరంగల్ నగరంలో నిషేధిత ప్లాస్టిక్ వస్తువులు విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని వరంగల్ నగర పాలక సంస్థ కమిషనర్ చహత్ బాజ్‌పాయ్ హెచ్చరించారు. గురువారం నగరంలోని పబ్లిక్ గార్డెన్, నయీంనగర్, విజయపాల్‌కాలనీ తదితర ప్రాంతాల్లో క్షేత్రస్థాయిలో పర్యటించారు. ప్లాస్టిక్ నిషేధంపై అధికారులు సమర్థవంతంగా విధులు నిర్వర్తించాలని ఆదేశించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. 120 మైక్రాన్‌ల మందం కంటే తక్కువ మందం కలిగిన ప్లాస్టిక్ కవర్లు ఉపయోగిస్తే జరిమాన విధించాలన్నారు. అయినా నిబంధనలు అతిక్రమించిన వారి షాపులను సీజ్ చేస్తామని హెచ్చరించారు. కాకతీయ యూనివర్సిటీ ప్రాంతంలో నిబంధనలు అతిక్రమించి ప్లాస్టిక్ కవర్లు విక్రయిస్తున్న షాపు యజమానికి రూ.50వేల జరిమానా విధించారు. ఈ కార్యక్రమంలో సీఎంహెచ్‌వో రాజారెడ్డితోపాటు శానిటేషన్, ప్లాస్టిక్ నిషేధ బృందం పాల్గొన్నారు.

భద్రకాళి బండ్‌పై రోప్‌వే నిర్మాణం

భద్రకాళి ఆలయం నుంచి భద్రకాళి చెరువులోకి రోప్‌వే నిర్మాణం జరగబోతోంది. ఈ మేరకు గురువారం కుడా కార్యాలయంలో అధికారులతోపాటు పలు సంస్థల ప్రతినిధులతో కలిసి వీసీ ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. భద్రకాళి దేవాలయం నుంచి భద్రకాళి బండ్ వరకు ప్రతిపాదిత రోప్‌వేతోపాటు గ్లాస్ బ్రిడ్జి స్కైవాక్ ప్రాజెక్ట్ అమలు కోసం పలు సంస్థల ప్రతినిధులు చహత్ బాజ్‌పాయ్ ఎదుట పవర్ పాయింట్ ప్రజంటేషన్ చేశారు. గతంలో వారు చేపట్టిన రోప్‌వే పనులను విశ్లేషించారు. ఈ సందర్భంగా చహత్ బాజ్‌పాయ్ మాట్లాడుతూ.. భద్రకాళి వద్ద రోప్‌వే, స్కైవాక్ ప్రాజెక్ట్ అమలు చేయడం వల్ల వరంగల్ నగరం పర్యాటక అభివృద్ధికి కొత్త ఊపునిస్తుందన్నారు. నగర సౌందర్యాన్ని మరింత పెంపొందిస్తామన్నారు. రోప్‌వే నిర్మాణానికి సంబంధించిన ఆర్థిక, సాంకేతిక అంశాలపై పరిశీలించిన తర్వాత తుది నిర్ణయం తీసుకుంటామన్నారు. ఈ సమావేశంలో కుడా సీపీవో అజిత్‌రెడ్డి, తెలంగాణ ఇన్‌ఫ్రాస్టక్చర్ లిమిటెడ్ డెవలపర్ కుష్మాన్, ఐడెక్, ఫైన్ సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

ప్రజల సమస్యలు పట్టని సీఎం

శాసన మండలి ప్రతిపక్ష నేత మధుసూదనాచారి

హనుమకొండ టౌన్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి) : సీఎం రేవంత్‌రెడ్డికి జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల మీద ఉన్న ధ్యాస.. ప్రజల సమస్యలు పరిష్కరించడంలో లేదని శాసనమండలి ప్రతిపక్ష నేత సిరికొండ మధుసూదనాచారి విమర్శించారు. గురువారం హనుమకొండ బాలసముద్రంలోని బీఆర్ఎస్ కార్యాలయంలో బీఆర్ఎస్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయ్‌భాస్కర్‌లతో కలిసి విలేకరుల సమావేశం నిర్వహించారు.

ఈ సందర్భంగా మధుసూదనాచారి మాట్లాడుతూ.. బీసీల రిజర్వేషన్లపై మాటలు మార్చి బీసీలను మోసం చేసిన బీసీల ద్రోహి సీఎం రేవంత్‌రెడ్డి అని విమర్శించారు. 57శాతం ఉన్న బీసీల జనాభాలో 42 శాతం ఇవ్వడమే అన్యాయమని, స్థానిక సంస్థల ఎన్నికల్లో కూడా 42శాతం రిజర్వేషన్లు అమలు చేయకపోతే రాష్ట్రం అగ్నిగుండంగా మారుతుందని హెచ్చరించారు. ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తున్న బీఆర్ఎస్ నాయకులపై దాడులు చేయడం సరికాదన్నారు. బీఆర్ఎస్ శ్రేణులపై చిన్న దాడి జరిగినా మా తడాఖా చూపిస్తామని హెచ్చరించారు. అగ్రవర్ణాలకు వేలకోట్ల విలువ చేసే ప్రభుత్వ భూములను అప్పగించారని, పేదలకు 50 గజాల భూమి ఇవ్వడంలో ప్రభుత్వానికి చిత్త శుద్ధి లేదని విమర్శించారు.

ప్రభుత్వ మాజీ చీఫ్ విప్ దాస్యం వినయ్‌భాస్కర్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి రెండేళ్లు కావొస్తోందని, ప్రజల సమస్యలను పరిష్కరించడంలో విఫలమైందని అన్నారు. భారీ వర్షాలకు నగరం అతలాకుతలమైందని, ఆదుకోవాల్సిన ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి ప్రజలకు అందుబాటులో లేరని విమర్శించారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలు అమలుపై, ప్రభుత్వ లోపాలను ప్రశ్నిస్తే పోలీసులతో బెదిరింపులకు దాడులకు దిగుతున్నారని విమర్శించారు.

ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి కనుసైగల్లో కొంతమంది భూ కబ్జాలకు పాల్పడుతున్నారని, రౌడీలను పెట్టి దందాలు చేయడం మానుకోవాలని అన్నారు. జూబ్లీహిల్స్ ఉపఎన్నికల ప్రచారం ముగిసిన తర్వాత ఎన్నికల నిబంధనలను అతిక్రమించి ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి బహిరంగప్రదేశంలో ధూమపానం చేయడం ద్వారా ప్రజలకు ఏం సందేశం ఇస్తున్నారని ప్రశ్నించారు. ఉద్యమ సమయంలో తుపాకీ ఎక్కుపెట్టావు, కానీ మానుకోట రాళ్లను గుర్తు తెచ్చుకోవాలని హితవు పలికారు. ఈ కార్యక్రమంలో జడ్పీ మాజీ చైర్మన్ సాంబారి సమ్మారావు, కార్పొరేటర్లు సోదా కిరణ్, బీఆర్ఎస్ నాయకులు పోలెపెల్లి రాంమూర్తి, కిరణ్, మాజీ కార్పొరేటర్లు పాల్గొన్నారు.

మేడారం జాతరకు 3,800 బస్సులు

హనుమకొండ టౌన్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): మేడారం సమ్మక్క- సారలమ్మ మహాజాతరకు భక్తుల కోసం రాష్ట్రవ్యాప్తంగా 3,800 ఆర్టీసీ బస్సులు ఏర్పాటు చేసినట్లు రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. హైదరాబాద్‌లోని సచివాలయ సమావేశ మందిరంలో అధికారులతో యాక్షన్ ప్లాన్ సిద్ధం చేసినట్లు ఆర్టీసీ అధికారులు గురువారం తెలిపారు. 2026 జనవరి 28 నుంచి 31 వరకు మేడారం జాతర జరుగుతుందన్నారు. ఇప్పటికే జాతర కోసం రోడ్ల అభివృద్ధి, భక్తులకు కావాల్సిన వసతుల కోసం నిధులు కేటాయించి పనులు జరుగుతున్నాయని తెలిపారు. కాగా, వరంగల్ రీజియన్ నుంచి 1680 బస్సులు నడపనున్నట్లు వరంగల్ ఆర్టీసీ ఆర్ఎం భాను తెలిపారు.



అగ్రంపహాడ్ జాతరపై చిన్నచూపేలా ?

- నేటి వరకు మొదలు కాని అభివృద్ధి పనులు
- జాతర గడువు సమీపిస్తున్నా పట్టించుకోని పాలకులు
- అధికారుల తీరుపై మండి పడుతున్న భక్తులు

ఆత్మకూరు, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): సమ్మక్క జన్మస్థానమైన అగ్రంపహాడ్ సమ్మక్క-సారలమ్మ జాతర గడువు సమీపిస్తున్నా అధికారులు పట్టించుకోకపోవడంపై భక్తులు మండిపడుతున్నారు. రెండో మేడారంగా పేరుగాంచిన అగ్రంపహాడ్ జాతరకు లక్షలాది భక్తులు తరలివచ్చి వనదేవతలకు మొక్కులు చెల్లించుకుంటారు. రెండు నెలల ముందు నుంచే వచ్చి భక్తులు అగ్రంపహాడ్‌లో చెల్లించుకున్న తర్వాతనే మేడారానికి వెళ్లడం అనవాయితీ. జాతరకు గత ప్రభుత్వాలు ఆరు నెలల ముందే నిధులు కేటాయించి అభివృద్ధి పనులు చేసేవారు. అలాగే అన్ని శాఖల అధికారులతో కలెక్టర్, సీపీ పలుమార్లు జాతర పరిసరాలను పరిశీలించి సకల ఏర్పాట్లు చేసేవారు. అయినా భక్తులకు పూర్తి స్థాయిలో సౌకర్యాలు అందక ప్రతీ జాతరకు ఇబ్బందులు పడుతున్నారు. ప్రస్తుతం జాతర గడువు కనీసం రెండు నెలలు కూడా లేదు. ఇప్పటి వరకు కలెక్టర్, సీపీ, ఉన్నతాధికారులు పరిశీలించిన దాఖలాలు లేవని చుట్టుపక్కల గ్రామాల ప్రజలు పేర్కొంటున్నారు. జాతరకు వచ్చే భక్తులు స్నానం చేసే ఎస్సారెస్పీ కాలువ తుమ్మ చెట్లతో నిండిపోయింది. జాతర చుట్టూ ఉన్న రైతులు పంటలు వేయకుండా అధికారులు నోటీసులు ఇవ్వడంతో పాటు నష్టపరిహారం అందిస్తామని హామీ ఇస్తే పంటలు వేయకుండా ఉంటారని భక్తులు పేర్కొంటున్నారు. గతంలో మరుగుదొడ్ల నిర్మాణం, వనం తెచ్చే స్థలాలు కబ్జాకు గురైనట్లు భక్తులు తెలుపుతున్నారు. అధికారులు మాత్రం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. జాతర చుట్టు బెల్ట్‌షాపులు ఉండడంతో మద్యం సేవించిన వారు జాతర ప్రాంగణంలో బాటిళ్లను పగులగొడుతున్నారు. దీంతో జాతరకు వచ్చే భక్తులకు ఇబ్బందులు తప్పేలా లేవు. ఆత్మకూరు నుంచి చౌళ్లపల్లి మీదుగా జాతరకు వచ్చే బీటీ రోడ్డు అధ్వానంగా తయారైందని భక్తులు ఆరోపిస్తున్నారు. అలాగే ఆరు సంవత్సరాల క్రితం కంకర పోసి నేటి వరకు బీటీ వేయకపోవడంతో జాతరకు వచ్చే భక్తులకు ఇబ్బందులు తప్పవని చుట్టుపక్కల గ్రామాల ప్రజలు అంటున్నారు. జాతర సమీపంలోని చెరువును కొందరు కబ్జా చేసినా ఎవరూ పట్టించుకోవడం లేదని భక్తులు అధికారుల తీరుపై మండిపడుతున్నారు. గత జాతరకు పూర్తి స్థాయిలో ఏర్పాట్లు లేకపోవడంతో భక్తులు నానా ఇబ్బందులు పడ్డారు. గతంలో పోలీసులు కూడా జాతరకు వచ్చే భక్తులను అదుపుచేసే క్రమంలో ఓ పోలీసు అధికారి భక్తురాలిపై చేయి చేసుకున్న ఘటనలు ఉన్నాయి. ఈ సారైనా అన్ని శాఖాధికారులు సమన్వయంతో పని చేసి సౌకర్యాలు కల్పించాలని భక్తులు కోరుతున్నారు.



జాతర సమీపంలోని చౌళ్లపల్లి రోడ్డు దుస్థితి



అమ్మవార్ల గద్దెల ప్రాంగణంలో పేరుకుపోయిన చెత్త

గతంలో 6 నెలల ముందే పనులు చేశాం..

- జాతర మాజీ చైర్మన్ గుండెబోయిన రాజన్నగౌడ్



అగ్రంపహాడ్ సమ్మక్క- సారలమ్మ జాతరకు 6 నెలల ముందు నుంచే ప్రభుత్వం నుంచి నిధులు తీసుకువచ్చి అభివృద్ధి పనులు చేశాం. అన్ని శాఖల అధికారులతో ప్రతీ పక్షం రోజులకు ఒకసారి సమీక్షించి అధికారులను అప్రమత్తం చేసి అభివృద్ధి పనులను వేగవంతం చేశారు. ప్రస్తుతం జాతర గడువు సమీపించినా అభివృద్ధి పనులు ప్రారంభించలేదు.. నిధులు లేవు.. కనీసం అధికారులు కూడా పట్టించుకోవడం లేదు.

జీవాంజి దీప్తికి అప్సర అవార్డు

పర్వతగిరి, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కల్లెడ గ్రామానికి చెందిన పారా అథ్లెట్ జీవాంజి దీప్తికి ఓ న్యూస్ చానల్ అప్సర అవార్డును ప్రదానం చేసింది. ఈ మేరకు హైదరాబాద్‌లో నిర్వహించిన అప్సర అవార్డులో 2025 కార్యక్రమంలో ప్రైడ్ ఆఫ్ తెలుగు స్పోర్ట్స్ అవార్డును ప్రదానం చేశారు. సినీ నటుడు, మాజీ ఎంపీ మురళీ మోహన్ చేతుల మీదుగా దీప్తి అవార్డును అందుకుంది. మారుమూల ప్రాంతంలో జన్మించి గిరిజన కుటుంబం నుంచి వచ్చిన దీప్తి సేవలను కొనియాడారు.



మురళీమోహన్ నుంచి అవార్డు అందుకుంటున్న జీవాంజి

మెడికల్ షాపులు, బ్లడ్ బ్యాంకుల్లో సోదా

రికార్డులను పరిశీలించిన డ్రగ్ కంట్రోల్ శాఖ

వరంగల్ మెడికల్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): హనుమకొండ, వరంగల్ నగరంలోని పలు ఆస్పత్రులకు అనుబంధంగా ఉన్న ఔషధ దుకాణాలు, రక్తనిధి కేంద్రాలపై గురువారం హనుమకొండ ఔషధ తనిఖీ అధికారి జన్ను కిరణ్ కుమార్, భూపాలపల్లి అధికారి పావని, జనగామ అధికారి బాలకృష్ణ తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా పలు మెడికల్ షాపుల్లో రికార్డులు పరిశీలించి, నాణ్యత పరీక్షల నిమిత్తం కొన్ని రకాల మందులను ప్రభుత్వ ప్రయోగశాలకు పంపించారు. ఎవరైనా అధిక ధరలకు మందులు విక్రయించినా, బిల్లు ఇవ్వకపోయినా ఇతరత్రా సేవా లోపాలుంటే ఔషధ తనిఖీ అధికారులకు ఫిర్యాదు చేయవచ్చని తెలిపారు. గర్భవిచ్ఛిత్తి మందులు అర్హత గల వైద్యుడి పర్యవేక్షణలో మాత్రమే వాడాల్సి ఉందని, అర్హత లేని వైద్యులకు ఔషధాలు విక్రయించరాదన్నారు. చట్టం నిబంధనలు ఉల్లంఘించినట్లయితే క్రిమినల్ చర్యలకు తీసుకుంటామని వారు హెచ్చరించారు.



ఓ మెడికల్ షాపులో తనిఖీ చేస్తున్న డ్రగ్ కంట్రోల్ శాఖ అధికారులు

చైతన్య దీప్తులు.. కాళోజీ సోదరులు

- యాది సభలో ఎం. రాజేందర్
- ఘనంగా కాళోజీ సోదరుల స్మారక పురస్కారాలు

హనుమకొండ కల్చరల్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): పలుకు బడుల భాషకు పట్టం కట్టాలని నినదించి, ప్రజల్లో చైతన్య దీప్తిని వెలిగించి జీవితాంతం వారి గొంతుకగా బతికిన కవి సోదరులు కాళోజీ సోదరులని ప్రజాకవి కాళోజీ స్మారక పురస్కార గ్రహీత డాక్టర్ మంగారి రాజేందర్ కొనియాడారు. హనుమకొండలోని వాగ్దేవి డిగ్రీ, పీజీ కళాశాల సెమినార్ హాలులో కాళోజీ ఫౌండేషన్ ఉపాధ్యక్షుడు ఎస్.జీవన్‌కుమార్ అధ్యక్షతన జరిగింది. ముఖ్యఅతిథిగా హాజరైన కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత డాక్టర్ అంపశయ్య నవీన్ మాట్లాడుతూ.. వరంగల్ నేల ఎంతో గొప్పదని, కవుల కాణాచి అని అన్నారు. ఈ క్రమంలోనే కాళోజీ సోదరులు వెన్న హృదయం కలిగిన వారని తెలిపారు. బతుకు కమ్మదనాన్ని చెమ్మగిల్లిన కన్నులలో మాత్రమే చూడాలని చెప్పిన కవి కాళోజీ నారాయణరావు అని పేర్కొన్నారు. నా గొడవ పేరిట సమకాలీన సామాజిక సమస్యలపై నిర్మొహమాటంగా, నిక్కచ్చిగా, కటువుగా స్పందిస్తూ పాలకులపై అక్షరాయుధాలను సంధిస్తూ ప్రజాకవిగా కీర్తి గడించిన కాళోజీ స్ఫూర్తిని నేటితరం యువత అందిపుచ్చుకోవాలని పిలుపునిచ్చారు.

అనంతరం కాళోజీ నారాయణరావుపై ఉపన్యసించిన శేషభట్టర్ నరసింహాచార్యులు (జీవన్) మాట్లాడుతూ.. ప్రజాకవి కాళోజీ కేవలం తెలుగులో మాత్రమే కాదు ఉర్దూ, హిందీ, కన్నడం, ఇంగ్లీష్ తదితర భాషల్లో రచనలు చేసి ఖ్యాతి గడించారని తెలిపారు. ప్రజలను చైతన్యవంతం చేసిన కాళోజీ సోక్రటీస్‌లాంటి వాడని తెలిపారు. అనంతరం షాద్ కాళోజీ రామేశ్వర్‌రావు పురస్కార గ్రహీత అంజనీ కుమార్ గోయల్ మాట్లాడుతూ.. మానవులు పుడతారు, చనిపోతారు.. కానీ కొంతమంది మాత్రమే ప్రజలకు ఉపయోగపడే సేవా కార్యక్రమాలు నిస్వార్థంగా తమ జీవితాన్ని పణంగా పెట్టి మానవజాతిలో చిరస్థాయిగా నిలిచిపోతారన్నారు. అలాంటి వారిలో కాళోజీ సోదరులు ఉంటారని అన్నారు. రామేశ్వర్‌రావు పురస్కారం అందుకోవడం సంతోషంగా ఉందన్నారు. అనంతరం పొట్లపల్లి శ్రీనివాసరావు కార్యదర్శి నివేదిక సమర్పిస్తూ ఫౌండేషన్ ఆశయాలను, లక్ష్యాలను వివరించారు. అనంతరం మసూద్ మిర్జామహెషర్ రామేశ్వర్‌రావుపై ప్రసంగించారు. అనంతరం కాళోజీ ఫౌండేషన్ కోశాధికారి పందిళ్ల అశోక్ కుమార్ పురస్కారాల ప్రదానోత్సవం కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో కాళోజీ ఫౌండేషన్ కార్యదర్శి వీఆర్.విద్యార్థి, డాక్టర్ ఆగపాటి రాజ్‌కుమార్, పి.చంద్, మర్రి మాధవరెడ్డి, డాక్టర్ కర్రె సదాశివ్, కవులు, రచయితలు తదితర 100 మంది సాహిత్యకారులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న అంపశయ్య నవీన్

కాళోజీ విగ్రహానికి నివాళులు

ప్రజాకవి కాళోజీ నారాయణరావు వర్థంతి సందర్భంగా నక్కలగుట్టలోని కాళోజీ విగ్రహానికి వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో కుడా చైర్మన్ ఇనుగాల వెంకట్రామిరెడ్డి, ఈవీ శ్రీనివాసరావు, పలువురు కవులు, రచయితలు పాల్గొన్నారు.

చోరీ బంగారం కొనుగోలుపై కలకలం

మరిపెడలో హైదరాబాద్ పోలీసులు తనిఖీ

మరిపెడ, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి) : చోరీ బంగారాన్ని మరిపెడ బంగ్లాలోని రాంవిలాస్ గల్లీకి చెందిన ఓ గోల్డ్ షాపు నిర్వాహకుడు కొనుగోలు చేయగా గురువారం హైదరాబాద్ పోలీసులు ఆ షాపులో తనిఖీలు చేశారు. విశ్వసనీయ సమాచారం మేరకు వివరాలిలా ఉన్నాయి. హైదరాబాద్‌కు చెందిన గౌడ సంఘం నేత ఇంట్లో నర్సింహులపేట మండలం గోపాతండాకు చెందిన ఇద్దరు బాలికలు పని మనిషిగా కుదిరారు. ఈ క్రమంలో ఆ నేత ఇంట్లో రూ.2.70లక్షల విలువైన నక్లెస్‌ను పని మనుషులు చోరీ చేసి గోపాతండాకు పరారై వచ్చారు. ఆ నక్లెస్‌ను మరిపెడ బంగ్లాలోని రాంవిలాస్ గల్లీకి చెందిన గోల్డ్ షాపు నిర్వాహకుడికి అమ్మగా రూ.30వేలు చెల్లించినట్లు తెలుస్తుంది. సదరు గౌడ్ సంఘం నేత హైదరాబాద్‌లోని పోలీసులకు ఫిర్యాదు చేయగా అక్కడి పోలీసులు స్థానిక గోల్డ్ షాపునకు చేరుకొని తనిఖీలు జరిపి వివరాలు సేకరించారు. ఆ యజమాని ఫిర్యాదుదారులను బతిమలాడి సదరు నక్లెస్‌కు అయ్యే రొక్కం ఇచ్చి చేతులు దులుపుకున్నట్లు తెలిసింది. చోరీ బంగారం మరిపెడ గోల్డ్ షాపు నిర్వాహకుడు కొనుగోలు చేయడంపై కలకలం రేపింది. మిగతా గోల్డ్ షాపు యజమానులు ఈ సంఘటనపై ఆందోళనకు గురయ్యారు.

విడగొట్టారు.. చోద్యం చూస్తున్నారు..

(5వ పేజీ తరువాయి)

జిల్లాలుగా ఏర్పాటు చేసి ఐదేళ్లు కావొస్తోంది. అయితే ఇంకా అనేక శాఖల్లో పాత జిల్లాలపరంగానే పాలన సాగిస్తున్నాయి. ఇటీవల కేంద్ర ప్రభుత్వం జేఈఈ పరీక్షల కోసం నోటిఫికేషన్ ఇచ్చింది. ఆన్‌లైన్ సెంటర్లలో దరఖాస్తు చేసుకుంటున్న విద్యార్థు లకు జిల్లాల పేర్లు అయోమయానికి గురిచేస్తున్నాయి. విద్యార్థులు తమ జిల్లాను ఎంపిక చేసుకునే ఆప్షన్‌పై క్లిక్ చేస్తే హనుమకొండ, వరంగల్ జిల్లాల పేర్లు ఉండటం లేదు. వరంగల్ అర్బన్, వరంగల్ రూరల్ జిల్లాల పేర్లు మాత్రమే కనిపిస్తున్నాయి. దీంతో ఏ జిల్లాను ఎంపిక చేసుకోవాలో తెలియక విద్యార్థులు ఇబ్బందులకు గురవుతున్నారు.

వరంగల్ రూరల్ జిల్లాలో ఉన్న ఆత్మకూరు, శాయంపేట, పరకాల తదితర మండలాలు ప్రస్తుతం హనుమకొండ జిల్లా పరిధిలో ఉండగా, నర్సంపేట నియోజకవర్గంతో పాటు వర్ధన్నపేట, పర్వతగిరి, రాయపర్తి తదితర మండలాలు ప్రస్తుతం వరంగల్ జిల్లా పరిధిలో ఉన్నాయి. ఈ ప్రాంత విద్యార్థులు ఏ జిల్లా ఆప్షన్‌ను ఎంపిక చేసుకోవాలో అర్థంకాక తల పట్టుకుంటున్నారు. ఇక ఈ ప్రాంత విద్యార్థులు ఓబీసీ సర్టిఫికెట్లు కూడా అప్‌లోడ్ చేయాల్సి ఉంది. ఆ సర్టిఫికెట్‌లలో జిల్లా హనుమకొండ, వరంగల్ అని ఉంటుంది. వరంగల్ రూరల్ ఆప్షన్ ఎంపిక చేసుకున్న విద్యా ర్థులు హనుమకొండ జిల్లా పరకాల తహసీల్దార్ ఇచ్చిన ఓబీసీ సర్టిఫికెట్ చెల్లుతుందా లేదా అనే భయాందోళనలో విద్యార్థులు ఉన్నారు. వరంగల్, హనుమకొండ నగరాల్లో విద్యార్థులు వరంగల్ అర్బన్ జిల్లాను ఆప్షన్‌గా ఎంపిక చేసుకుంటున్నారు.

హనుమకొండ నగర విద్యార్థులు కూడా సర్టిఫికెట్ల విషయంలో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇక పరీక్ష కేంద్రాల ఎంపికలో వరంగల్ జిల్లా మాత్రమే కనిపిస్తుంది. విద్యార్థి సొంత జిల్లా ఆప్షన్‌లో వరంగల్ ఉండటం లేదు. కానీ, పరీక్ష కేంద్రం ఆప్షన్‌లో మాత్రం వరంగల్ జిల్లా కనిపిస్తుంది. అయితే పరీక్ష కేంద్రాలన్నీ కూడా హనుమకొండలోనే ఉన్నాయి. దీంతో విద్యార్థులు జిల్లాల ఎంపికలో అయోమయానికి గురవుతున్నారు. జేఈఈ మెయిన్ పరీక్షలే కాకుండా అనేక ఎంట్రెన్స్ పరీక్షలకు సంబంధించి వరంగల్ అర్బన్, రూరల్ ఆప్షన్లు ఇస్తున్నారు. దీంతో విద్యార్థులు అయోమయానికి గురవుతున్నారు.

2021లో జిల్లా సరిహద్దులు మారటంతో పాటు రాష్ట్రపతి గెజిట్ కూడా వచ్చినప్పటికీ ప్రభుత్వం విడుదల చేసే అధికారిక నోటిఫికేషన్లలో కొత్త జిల్లాల పేర్లు రాకపోవడానికి కారణం ఏమిటనే చర్చ జరుగుతోంది. ఇది కేవలం జేఈఈ పరీక్షలకు సంబంధించిన అంశమే కాదని, చాలా పరీక్షలు, ఉద్యోగ నోటిఫికేషన్లకు కూడా వరంగల్ రూరల్, అర్బన్ జిల్లాల పేర్లే ఆప్షన్‌గా ఇస్తున్నారని విద్యార్థులు అంటున్నారు. ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం మద్యం షాపులకు టెండర్‌లు నిర్వహించింది. ఈ టెండర్లు కూడా వరంగల్ అర్బన్‌లో 67 మద్యం షాపులకు, వరంగల్‌రూరల్ 57షాపులకు నోటిఫికేషన్ ఇచ్చి పూర్తి చేశారు. ఎక్సైజ్ శాఖలో కూడా వరంగల్ అర్బన్, రూరల్ జిల్లాలనే పరిగణంలోకి తీసుకుంటున్నారు. కార్యాలయాలు కూడా ఈ విధంగానే కొనసాగుతున్నాయి. దీంతో వరంగల్, హనుమకొండ జిల్లాలు ఉన్నట్టా లేనట్టా అనే అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. అయితే కొన్ని నోటిఫికేషన్లతో పాటు కీలకమైన శాఖలకు అధికార యంత్రాంగం నియామకాలు వరంగల్, హనుమకొండ జిల్లాలుగానే జరుగుతున్నాయి. దీంతో నగరాన్ని గత ప్రభుత్వం రెండు ముక్కలు.. నాలుగు పేర్లుగా మార్చిందనే విమర్శలు వినిపిస్తున్నాయి.

ప్రధానంగా వరంగల్ నగరాన్ని రెండు ముక్కలుగా చేసి రెండు జిల్లాలను ఏర్పాటు చేయటంపై విమర్శలు ఉన్నాయి. హనుమకొండలో ఉన్న ఎన్ఐటీ వరంగల్, కాకతీయ విశ్వవిద్యాలయం, పోలీస్ కమీషనర్ వరంగ్, కేఎంసీ వరంగల్, తదితర విద్యాసంస్థలు, పలు ప్రభుత్వ కార్యాలయాలు వరంగల్ పేరుతోనే కొనసాగుతున్నాయి. హనుమకొండ జిల్లా పరిధిలోని కాకతీయ మెడికల్ కాలేజీ ఆవరణలో వరంగల్ ఎంజీఎంకు అనుబంధంగా కేంద్ర ప్రభుత్వం సూపర్‌స్పెషాలిటీ ఆస్పత్రిని ఏర్పాటు చేసింది. హనుమకొండ జిల్లా పరిధిలోనే ఈ ఆస్పత్రి ఉన్నప్పటికీ వరంగల్ జిల్లా కలెక్టర్ పర్యవేక్షణ చేయాల్సి వస్తోంది. దీంతో పరిపాలన చిక్కులు ఎదురవుతున్నాయి. తన పరిధిలోకి పక్క జిల్లా కలెక్టర్ ఎలా వస్తారని హనుమకొండ జిల్లా కలెక్టర్ గతంలో ప్రశ్నించిన సందర్భాలు ఉన్నాయి. ఉమ్మడి వరంగల్‌లో జిల్లాల విభజనలో ఎదురవుతున్న అనేక చిక్కులను పరిష్కరించేందుకు ప్రభుత్వం దృష్టిసారించాలని మేధావులు, విద్యావంతులు విజ్ఞప్తి చేస్తున్నారు.

తప్పులు సరిదిద్దేది ఎప్పుడో ?

గత ప్రభుత్వం చేసిన తప్పిదాలను ప్రస్తుతం ప్రభుత్వం సరిదిద్దే ప్రయత్నాలు చేయటం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. జిల్లాల విభజ న గందరగోళంగా ఉందని స్వయంగా సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటించారు. ప్రధానంగా విద్యార్థులు పరీక్షల కోసం భయం భయంగా దరఖాస్తులు చేసుకోవాల్సి వస్తోంది. పరీక్షల కేంద్రాల వద్ద కూడా ఆధార్ కార్డుల్లో ఇంకా వరంగల్‌గానే చూపిస్తోంది. ఆధార్ అప్‌డేట్‌లో కూడా హనుమ కొండ, వరంగల్ అర్బన్, వరంగల్ రూరల్ మూడు జిల్లాల పేరును చూపిస్తోంది. అయితే వరంగల్ జిల్లాను మాత్రం చూపించటం లేదు. అయితే లేని వరంగల్ అర్బన్, రూరల్ జిల్లాల పేర్లు చూపిస్తూ ప్రస్తుతం ఉన్న వరంగల్ పేరును సూచించకపోవడంతో జిల్లా ప్రజలు అయోమ యానికి గురవుతున్నారు. ఇలాంటి తప్పిదాలను ప్రస్తుత ప్రభుత్వం సరిదిద్దే ప్రయత్నాలు చేయటం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి.

ఆధ్యాత్మిక గుబాళింపు

- తెలంగాణకే తలమానికంగా నర్సంపేట ధర్మశాస్త్ర అయ్యప్ప ఆలయం
- నేటి నుంచి 25వ మండల పూజ
- 41 రోజుల పాటు మాలధారులకు అన్నదానం



నర్సంపేటలోని అయ్యప్ప దేవాలయం

నర్సంపేట, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి) : ఈ ఆలయం అపర శబరిమలగా విరాజిల్లుతోంది. దీక్షాకాలంలో వేలాది మంది మాలధారులు దేవాలయంలో శరణుఘోష చేస్తారు. 25 ఏళ్లుగా వేలాది మందికి మాలధారణచేస్తూ నిత్యపూజలతో ఆధ్యాత్మిక పరిమళాలను వెదజల్లుతోంది. వరంగల్ జిల్లా నర్సంపేటలో గల ధర్మశాస్త్ర అయ్యప్ప స్వామి దేవాలయం. తెలంగాణకే తలమానికంగా ఈ ఆలయం నిలుస్తోంది. అనతికాలంలోనే పవిత్ర దర్శనీయ క్షేత్రంగా ఎదిగింది. క్షేత్ర బలి, పల్లివేట, పంబా ఆరాట్ (జలక్రీడ)ను కేరళలో ఏ విధంగా నిర్వహిస్తారో నర్సంపేటలోనూ అదే రీతిలో నిర్వహిస్తారు.

నర్సంపేట పట్టణంలోని మాధన్నపేట చెరువు కింది పెద్దవాగు సమీపంలో పచ్చని పొలాల చెంత 2000వ సంవత్సరంలో మూడెకరాల స్థలంలో ప్రముఖ వ్యాపారవేత్త దివంగత శింగిరికొండ రామాంజనేయులు, మరికొంత మంది వ్యాపారవేత్తల నేతృత్వంలో రాంరెడ్డి సిద్ధాంతి చేతుల మీదుగా ఈ ఆలయ ప్రతిష్ఠాపన జరిగింది. వివిధ వర్గాల నుంచి సేకరించిన రూ.70 లక్షల నుంచి కోటి వ్యయంతో ఆలయం నిర్మించారు. దాతల సహకారంతో మరో ఎకరం స్థలం కూడా కొనుగోలు చేశారు. దాతల సహకారంతో ఆలయం అనతి కాలంలోనే దినదిన ప్రవర్ధమానంతో అభివృద్ధి చెందిది. ఆలయంలో అయ్యప్ప స్వామితో పాటు గణపతి, పంచముఖేశ్వరస్వామి, సత్యనారాయణస్వామి, సుబ్రహ్మణ్యస్వామి, ఇంకా చిన్న ఆలయాలు ఉన్నాయి. ఈ ఆలయ ఆవరణలో అభయాంజనేయ స్వామి ఆలయమూ నిర్మించారు. పడిపూజల కోసం పెద్ద షెడ్డు నిర్మాణంతో పాటు సీసీ పనులు చేస్తున్నారు. ఆలయం ముందు భాగంలో షాపింగ్ కాంప్లెక్స్ కూడా నిర్మించారు. ఆలయ సేవా చారిటబుల్ ట్రస్టు చైర్మన్ శింగిరికొండ మాధవశంకర్, ఆలయ కమిటీ చైర్మన్ సైసా సురేశ్ నేతృత్వంలో మండల పూజ మహోత్సవాల కోసం ట్రస్టు సభ్యులు, ఆలయ కమిటీ సభ్యులు కీలకపాత్ర పోషిస్తున్నారు.

ఈ ఆలయంలో ఏటా కార్తీకమాసం ఆరంభం నుంచి వేలాది మంది స్వామి దీక్షను స్వీకరిస్తారు. నిత్యం ఇక్కడ జరిగే పడిపూజ, పుష్పాభిషేకం తదితర ప్రత్యేక పూజల్లో పాల్గొంటారు. ఆలయ ప్రధాన అర్చకుడు దినేశ్‌మిశ్రా ఆలయంలో నిత్యపూజలు నిర్వహిస్తారు. గురుస్వాముల ఆధ్వర్యంలో ఆలయంలో భక్తులు మండల కాలం (41రోజులు)పాటు స్వామి వారిని కొలుస్తూ అయ్యప్ప పాటలు, భజనలు చేస్తూ స్వామిని కొలుస్తుంటారు.



ఆలయంలో హోమం చేస్తున్న అయ్యప్ప దీక్షాపరులు

41 రోజులు అన్నదానం

దాతలు అందించే బియ్యం ఇతర సరుకులతో ఆలయంలో 41 రోజుల పాటు నిత్య అన్నదానం నిర్వహిస్తారు. దీక్షాపరులతో పాటు ఆలయానికి వచ్చే భక్తులకూ 41 రోజుల పాటు సహపంక్తి భోజనాలు పెట్టడం విశేషం.

రైస్ మిల్లర్ల చేయూత

వరంగల్, హనుమకొండ, నర్సంపేట రైస్ మిల్లర్ల అసోసియేషన్ బాధ్యులు బియ్యం అందించి అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. మండల పూజ కోసం చాలా మంది భక్తులు అన్నదానం, పూజలు, ఆలయాభివృద్ధికి విరాళాలను అందిస్తుంటారు. అయ్యప్ప దీక్షా కాలం ముగిశాక మకర సంక్రాంతి రోజున చాలా మంది కేరళ రాష్ట్రంలోని శబరిమలలో మకర జ్యోతిని దర్శించుకొని మాల విరమిస్తారు. మరికొందరు స్థానిక దేవాలయంలో మకర జ్యోతిని తిలకించాక దీక్షను విరమిస్తారు.

డిసెంబరు 8న పల్లివేట

పట్టణంలోని మునిసిపల్ కార్యాలయం ఆవరణలో పల్లివేటను దాతలు బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి గోగుల రాణాప్రతాప్‌రెడ్డి-లక్ష్మీభార్గవి, గోగుల ప్రతాప్‌రెడ్డితో గురుస్వామి వెంకటేశ్‌శర్మ వేదమంత్రాల మధ్య పూజలు చేస్తారు. ఆలయం నుంచి మునిసిపల్ కార్యాలయం వరకు మాలధారులు నృత్యం చేసుకుంటూ పల్లివేట కార్యక్రమంలో పాల్గొంటారు. (జల క్రీడ)ను మాధన్నపేట చెరువులో డిసెంబరు 9న వైభవంగా నిర్వహించనున్నారు. అన్నదాత బీఆర్ఎస్ నేత మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి- స్వప్న దంపతులు అయ్యప్ప ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. అనంతరం పట్టణంలో ఊరేగింపు నిర్వహించాక మాధన్నపేట చెరువులో పంబాఆరాట్‌ను వైభవంగా నిర్వహించనున్నారు.

విద్యార్థి నేతలపై దాడి అమానుషం

- కేయూ క్యాంపస్‌లో విద్యార్థి సంఘాల నాయకుల నిరసన
- స్మైల్ పాఠశాల ప్రిన్సిపాల్‌పై దాడికి పాల్పడిన వారికి రిమాండ్



నిరసన వ్యక్తం చేస్తున్న విద్యార్థి సంఘాల నాయకులు

కేయూ క్యాంపస్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): విద్యార్థి సంఘాలపై ప్రైవేట్ విద్యా సంస్థల యాజమాన్యాల ఆరోపణలను ఖండిస్తూ, విద్యార్థి సంఘాల నాయకులపై దాడిని నిరసిస్తూ గురువారం కేయూలో విద్యార్థి సంఘాల నేతృత్వంలో నిరసన చేపట్టారు. కేయూ దూరవిద్య కేంద్రంలో నల్లబాడ్జీలు ధరించి ప్రైవేట్ యాజమాన్యాలకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. పీడీఎస్‌యూ జాతీయ నాయకుడు మహేశ్, రాష్ట్ర అధ్యక్షుడు ఎస్‌వీ శ్రీకాంత్, ప్రధాన కార్యదర్శి పొడపంగి నాగరాజు, స్కాలర్స్ డి, తిరుపతి, కె.తిరుపతి, మధు, బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎ.నాగరాజు, సూర్యకిరణ్, స్వేరోస్ జిల్లా అధ్యక్షుడు ఎల్తూరి సాయికుమార్, డీఎస్‌ఏ జిల్లా కన్వీనర్ శివ, డీఎస్‌ఏ శివ, పీఎస్‌ఏ ఫైవ్ వినయ్, బీఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు మనోహర్, చిరంజీవిలు మాట్లాడారు.

స్మైలీ డీజీ స్కూల్‌కు బుధవారం మహాసభల ప్రచార నిమిత్తం వెళ్లిన పీడీఎస్‌యూ నేతలు గుర్రం అజయ్, మర్రి మహేశ్‌పై పాఠశాల ప్రిన్సిపాల్ శ్రీనివాస్‌వర్మ అసభ్యకరంగా మాట్లాడి ఎస్సీ, ఎస్టీల కులం పేరుతో దూషిస్తూ దాడికి దిగారని ఆరోపించారు. శ్రీనివాసవర్మపై వెంటనే అట్రాసిటీ కేసులు నమోదు చేసి చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. స్మైలీ స్కూల్ ఒక అనుమతితో రెండు బ్రాంచీలను నిర్వహిస్తున్నారని ఆరోపించారు. అలాగే ఉమ్మడి జిల్లాలో ప్రభుత్వ అనుమతులు లేని విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలని విద్యార్థి సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. విద్యార్థులపై పెట్టిన తప్పుడు కేసులను ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బొనగిరి మధు, కోశాధికారి రాణా ప్రతాప్, వంశీ, సురేశ్ పాల్గొన్నారు.



ఆంధ్రజ్యోతి WWW.ANDHRAJYOTHY.COM

హనుమకొండ సిటీ

HANUMAKONDA CITY ■ శుక్రవారం 14 నవంబరు 2025

వరల్డ్ జిమ్నాస్టిక్స్ చాంపియన్‌షిప్ న్యాయనిర్ణేతగా భరద్వాజ్



వరంగల్ స్పోర్ట్స్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): ఈనెల 20 నుంచి 25 వరకు ఫిలిపిన్స్ దేశంలో నిర్వహించనున్న వరల్డ్ జూనియర్ జిమ్నాస్టిక్స్ చాంపియన్‌షిప్‌కు భారతదేశం తరపున న్యాయ నిర్ణేతగా హనుమకొండకు చెందిన భరద్వాజ్ ఎంపికయ్యారు. ఈ మేరకు భారత జిమ్నాస్టిక్స్ ఫెడరేషన్ గురువారం భరద్వాజ్‌కు నియామక ఉత్తర్వులను జారీ చేసినట్లు వరంగల్ జిల్లా జిమ్నాస్టిక్స్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు రమేష్‌రావు, సాంబయ్యలు తెలిపారు. ఈ సందర్భంగా భరద్వాజ్ మాట్లాడుతూ.. తనకు ఇంతటి అవకాశం కల్పించిన భారత జిమ్నాస్టిక్స్ ఫెడరేషన్ బాధ్యులకు, రాష్ట్ర కార్యదర్శి ఆకుల సోమేశ్వర్, వరంగల్ జిల్లా జిమ్నాస్టిక్స్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు రమేష్‌రావు, సాంబయ్య, సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు.

కేంద్రం మెడలు వంచైనా
బీసీ రిజర్వేషన్లు సాధిస్తాం
బీసీ జేఏసీ ధర్మపోరాట దీక్షలో ఎమ్మెల్యే నాయిని

హనుమకొండ టౌన్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): కేంద్రం మెడలు వంచైనా బీసీ రిజర్వేషన్లు సాధిస్తామని వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి అన్నారు. గురువారం హనుమకొండ బాలసముద్రంలోని ఏకశిల పార్కు ఎదుట బీసీ జేఏసీ ఆధ్వర్యంలో చేపట్టిన బీసీల ధర్మపోరాట దీక్షకు ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి హాజరై సంఘీభావం తెలిపారు. బీసీల ధర్మపోరాట దీక్ష కార్యక్రమంలో బీసీ జేఏసీ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు వడ్లకొండ వేణుగోపాల్ గౌడ్, కూరపాటి వెంకటనారాయణ ఆధ్వర్యంలో మహాత్మా జ్యోతిబాపూలే, సావిత్రిబాయి పూలే దంపతుల చిత్రపటాలకు పూల మాలలు వేసి బీసీల ధర్మపోరాట దీక్షను ప్రారంభించారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి మాట్లాడుతూ.. గత బీఆర్ఎస్ ప్రభుత్వం బీసీ రిజర్వేషన్లను తగ్గించి బీసీలకు తీవ్రమైన అన్యాయం చేసిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అసెంబ్లీలో ఆమోదింప చేసిన బీసీ బిల్లులను కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అడ్డుకుంటోందన్నారు. బీసీలకు విద్య, ఉద్యోగ, స్థానిక సంస్థల కోటాతో పాటు చట్ట సభలలో రిజర్వేషన్లకు కాంగ్రెస్ పార్టీ అనుకూలమన్నారు. ఈ కార్యక్రమంలో గడ్డం భాస్కర్, బోనగాని యాదగిరి గౌడ్, దొడ్డపల్లి రఘుపతి, ఎల్లయ్య, సాయిని నరేందర్, తాడిశెట్టి క్రాంతికుమార్, వల్లాల జగన్, చాపర్తి కుమార్‌గాడ్గే, తదితరులు పాల్గొన్నారు. శాసనమండలి ప్రతిపక్ష నేత సిరికొండ మధుసూదనాచారి మాట్లాడుతూ.. దేశ సంపదలో బీసీలకు సమాన వాటా దక్కాలని బీసీలు రాజ్యాధికారం దిశగా పోరాటం చేయాలని కోరారు. బీసీ జేఏసీ తలపెట్టిన ధర్మపోరాట దీక్షకు హాజరై సిరికొండ మధుసూదనాచారి సంఘీభావం తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ మాజీ చీఫ్ విప్ దాస్యం వినయ్‌భాస్కర్, బీఆర్ఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

టెన్త్ పరీక్ష ఫీజు గడువు పొడిగింపు

వరంగల్ ఎడ్యుకేషన్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): పదో తరగతి పబ్లిక్ పరీక్ష ఫీజును ఈ నెల 20 వరకు పొడిగిస్తూ ప్రభుత్వ పరీక్షల సంచాలకులు ఉత్తర్వులు జారీ చేసినట్లు వరంగల్, హనుమకొండ డీఈవోలు రంగయ్యనాయుడు, వెంకట్‌రెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. శుక్రవారంతో గడువు ముగియనుండగా గడువును 20 వరకు పొడిగించినట్లు వారు పేర్కొన్నారు.

ప్రజాకవి కాళోజీకి ఘన నివాళి



కాళోజీ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న న్యాయవాదులు

వరంగల్ లీగల్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): కాళోజీ నారాయణరావు అసమానతలు లేని సమాజాన్ని కోరుకున్నాడని వరంగల్ జిల్లా బార్ అసోసియేషన్ అధ్యక్షుడు వలుస సుధీర్ అన్నారు. కాళోజీ వర్ధంతి సందర్భంగా గురువారం అంబేద్కర్ బార్ అసోసియేషన్ హాల్‌లో స్మారక సభను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సుధీర్ మాట్లాడుతూ.. ప్రజల ఆవేదనను బడిపలుకులతో గాక పలుకుబడుల భాషలో పలికించిన నిజమైన ప్రజాకవి కాళోజీని స్మరించుకోవడం మనందరికి స్ఫూర్తిదాయకమని ఆయన అన్నారు. ఈ సందర్భంగా న్యాయవాదులు కాళోజీ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు మైదం జైపాల్, ప్రధాన కార్యదర్శి డి.రమాకాంత్, రాష్ట్ర బార్ కౌన్సిల్ సభ్యులు భైరపాక జయాకర్, సంయుక్త కార్యదర్శి మునిపట్ల శ్రీధర్‌గౌడ్, కోశాధికారి సిరిమల్ల అరుణ, కార్యవర్గ సభ్యులు ఇజ్జగిరి సురేష్, తోట అరుణ, న్యాయవాదులు జీవన్‌గౌడ్, ఆనంద్‌మోహన్, గంధం శివ, సిద్ధం యుగంధర్, ఓరుగంటి కోటేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ కార్యాలయంలో..

హనుమకొండ టౌన్ (ఆంధ్రజ్యోతి): హనుమకొండ బాల సముద్రంలోని బీఆర్ఎస్ కార్యాలయంలో ప్రజాకవి కాళోజీ నారాయణరావు వర్ధంతిని బీఆర్ఎస్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు, ప్రభుత్వ మాజీ చీఫ్ విప్ దాస్యం వినయ్ భాస్కర్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా కాళోజీ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆరోగ్య కేంద్రాల తనిఖీ



సిబ్బందికి సూచనలు ఇస్తున్న డీఎంహెచ్‌వో అప్పయ్య

వరంగల్ మెడికల్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): ఆయుష్మాన్ ఆరోగ్య కేంద్రాలను హనుమకొండ డీఎంహెచ్‌వో అప్పయ్య గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. మడికొండలోని కేంద్రాన్ని పరిశీలించి అందుబాటులో ఉన్న టీడీఏఆర్‌వీ వ్యాక్సిన్లను పరిశీలించారు. టీవీ వల్లనరబుల్ గ్రూప్ 786 మందికి గాను స్క్రీనింగ్ ఎలా జరుగుతుందని, ఎన్‌సీడీ కార్యక్రమంలో సీబ్యాంక్ అసెస్మెంట్ ఎలా జరుగుతుందని అడిగి తెలుసుకున్నారు. సాధారణ ప్రసవాలను ప్రోత్సహించాలని, గర్భిణులకు నమ్మకం కలిగించేలా వారికి సేవలు అందించడంతో పాటు కౌన్సెలింగ్ నిర్వహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పల్లెదవాఖాన వైద్యాధికారి డాక్టర్ ఇర్ఫాన్, సిస్టర్లు లక్ష్మి, విజయకుమారి, ఆశా కార్యకర్తలు స్వరూప, రజిత పాల్గొన్నారు.

చివరి గింజ వరకు కొనుగోలు చేస్తాం..

పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి

కాజీపేట, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): రైతు పండించిన ధాన్యాన్ని చివరి గింజవరకు కొనుగోలు చేసి తీరుతామని వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి అన్నారు. కాజీపేట శివారు సోమిడిలో గురువారం నూతన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి హాజరై ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడారు. రైతుల ఇబ్బందులు గమనించి సోమిడిలో నూతన ధాన్యం కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేసినట్లు ఎమ్మెల్యే చెప్పారు. అనంతరం రైతు కేంద్రం ఏర్పాటు చేయడంతో రైతులు ఎమ్మెల్యేను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్‌లు జక్కుల రవీందర్ యాదవ్, విజయశ్రీ రజాలీ, మాజీ కార్పొరేటర్ సుంచు అశోక్, సొసైటీ చైర్మన్ ఊకంటి వనంరెడ్డి, పీఏసీఎస్ డైరెక్ట ర్‌లు మేరుగు రాజయ్య, నరేందర్ రెడ్డి, దువ్వ శ్రీకాంత్, కాయిత రాజ్‌కుమార్‌తోపాటు స్థానిక నాయకులు దోమ గాలి రెడ్డి, బి. వెంకటేశ్, మిరాల కట్టయ్య, బుర్ర బాబురావు, పాలడుగుల అనిల్, బి.ఉపేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



సోమిడిలో కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే నాయిని

'అశోక కాలనీలో వైన్ షాపును ఏర్పాటు చేయొద్దు'

వడ్డేపల్లి: హనుమకొండ 57వ డివిజన్ పరిధిలోని అశోక కాలనీ మెయిన్ రోడ్డులో వైన్‌షాపు ఏర్పాటుకు అనుమతించొద్దని అశోక కాలనీ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు మందల కృష్ణారెడ్డి, గౌరవ అధ్యక్షుడు వెంకటరాజారెడ్డి, దేవాలయ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు చింతం శ్రీనివాస్ కోరారు. హనుమకొండ బాలసముద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో గురువారం పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి వినతి పత్రాన్ని అంద జేశారు. ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి మాట్లాడుతూ జిల్లా కలెక్టర్‌తో పాటు ఎక్సైజ్ సూపరింటెండెంట్‌తో మాట్లాడి వైన్ షాపు అనుమతిని రద్దు చేయిస్తానని హామీ ఇచ్చారు.

భవిష్యత్ వరదలు తట్టుకునేలా ప్రత్యేక కార్యాచరణ

న్యూశాయంపేట: భవిష్యత్‌లో అకాల వర్షాల ప్రభావం వల్ల నష్టాలు సంభవించకుండా పటిష్ట చర్యలు చేపట్టాలని అధికారులకు వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి సూచించారు. గ్రేటర్ వరంగల్ మహానగరపాలక సంస్థ పరిధిలోని 31వ డివిజన్ నందిహిల్స్‌కాలనీలో గురువారం ఎమ్మెల్యే నాయిని నగర మున్సిపల్ కమిషనర్ చాహత్ బాజ్ పాయ్‌తో కలిసి పర్యటించారు. పైప్రాంతాల నుంచి వచ్చే వర్షపు నీరు కాలనీలోకి చేరి కలిగించే ఇబ్బందులకు ఎమ్మెల్యే పరిశీలించారు. ఈ సందర్భంగా నందిహిల్స్ కాలనీ కమిటీ అధ్యక్షులు పెసరు నరసింహారెడ్డి ఎమ్మెల్యేకు నందిహిల్స్ సమస్యలపై వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో కార్పొరేటర్ మామిండ్ల రాజు, మాజీ కార్పొరేటర్ వేల్పుల మోహన్‌రావు నందిహిల్స్ కాలనీ కమిటీ నాయకులు పాల్గొన్నారు.

రిటైర్డ్ ఉద్యోగుల సమస్యలను సీఎం దృష్టికి తీసుకెళ్తా..

హనుమకొండ టౌన్: రాష్ట్రంలో రిటైర్డ్ ఉద్యోగుల సమస్యల పరిష్కారం దిశగా రాష్ట్ర ప్రభుత్వం త్వరలో నిర్ణయం తీసుకుంటుందని, సమస్యను సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్తానని పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి హామీ ఇచ్చారు. గురువారం హనుమకొండ బాలసముద్రంలోని ఏకశిల పార్కు వద్ద రిటైర్డ్ ఉద్యోగుల రాష్ట్ర కో కన్వీనర్, జిల్లా అధ్యక్షుడు శ్రీధర్ల ధర్మేంద్ర ఆధ్వర్యంలో ధర్నా కార్యక్రమం నిర్వహించారు. ఈ ధర్నా కార్యక్రమాన్ని ప్రొఫెసర్ కూరపాటి వెంకటనారాయణ, వి.బాబురావులు ధర్నాను ప్రారంభించగా ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి హాజరై సంఘీభావం తెలిపారు. ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి సమస్య పరిష్కరిస్తామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో వివిధ ఉద్యోగ సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఎల్ఆర్ఎస్ దరఖాస్తులను పరిష్కరించండి

మేయర్ గుండు సుధారాణి



సమావేశంలో మాట్లాడుతున్న మేయర్ సుధారాణి

వరంగల్ కార్పొరేషన్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): పెండింగ్‌లో ఉన్న ఎల్ ఆర్ఎస్ దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలని నగర మేయర్ గుండు సుధారాణి అధికారులను ఆదేశించారు. గురువారం నగర పాలక సంస్థ ప్రధాన కార్యాలయంలో టౌన్ ప్లానింగ్ అధికారులతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశా రు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ.. ఇప్పటివరకు ఎల్-1లో 15వేలు, ఎల్-2 లాగిన్‌లో 2వేలకు పైగా దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయని, అధికారులు వెంటనే పరిష్కరించాలని అన్నారు.

ఇరిగేషన్, రెవెన్యూ శాఖలతో లింగ్ అయి ఉన్న దరఖాస్తులను కాకుండా మి గతా దరఖాస్తులు పరిష్కరించాలని అన్నారు. టౌన్‌ప్లానింగ్ అధికారులు రెవె న్యూ శాఖల సమన్వయంతో పని చేయాలని, రెండు శాఖల మధ్య 11 దరఖా స్తులు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. నెలలోగా వాటిని పరిష్కరించాలన్నారు. నగరంలో అనుమతి లేని లేఔట్‌లను గుర్తించాలని అధికారులకు సూచించారు. ప్రధానంగా చైన్‌మెన్‌లను కలుపుకుని టౌన్‌ప్లానింగ్ అధికారులు ఫీల్డ్ మీద పర్యటించాలన్నారు. ఈ సమావేశంలో ఇన్‌చార్జి సీపీ రవీందర్ రాడేకర్, డిప్యూటి కమిషనర్‌లు ప్రసన్నరాణి, రవీందర్, ఏసీపీలు ఖలీల్, రజితతో పాటు టీపీఎస్‌లు, టీపీబీవోలు, చైన్‌మెన్లు పాల్గొన్నారు.

ఎంజేపీ గురుకులం నుంచి పారిపోయిన విద్యార్థి

తొర్రూరు, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): జ్యోతిబా పూలే గురుకుల పాఠశాల నుంచి విద్యార్థి గోడదూకి పారిపోయిన ఘటన గురువారం తెల్లవారుజామున మహబూబాబాద్ జిల్లా తొర్రూరు పట్టణంలో చోటు చేసుకుంది. స్థానికులు, ప్రిన్సిపాల్ తెలిపిన ప్రకారం.. హనుమకొండ జిల్లా హసన్‌పర్తి మండలం మల్లారెడ్డిపల్లికు చెందిన ఓ విద్యార్థి గత నెల 29న తొర్రూరులోని మహాత్మా జ్యోతిబా పూలే గురుకుల పాఠశాలలో 5వ తరగతిలో చేరాడు. గురువారం తెల్లవారు జామున 3 గంటలకు వాష్‌రూమ్‌కు వెళ్లేందుకు లేచి పాఠశాల వెనక గోడ దూకి బయటకు వెళ్లిపోయాడు. మెయిన్ రోడ్డుకు వెళ్లి జాతీయ రహదారిపై వెళ్తున్న లారీ ఎక్కి వెళ్లడంతో ఆ లారీ హనుమకొండ మీదుగా హుజూరాబాద్ సమీపంలో ప్రమాదానికి గురైంది. గుర్తించిన స్థానికులు ఘటన స్థలానికి చేరుకుని 108కు, పోలీసులకు సమాచారం అందించగా అక్కడికి చేరుకున్న పోలీసులు బాలుడు రాజేశ్‌ను గుర్తించి వివరాలు అడిగి తల్లిదండ్రులకు అప్పగించారు. ప్రిన్సిపాల్ శంకర్ మాట్లాడుతూ.. బాలుడు పాఠశాలలో చేరినప్పటి నుంచి ఇక్కడ ఉండనని మారాం చేస్తున్నాడని, తల్లిదండ్రులకు సమాచారం ఇచ్చామన్నారు. గురుకుల పాఠశాలలో సీసీ కెమెరాలు, వార్డెన్‌లు, నైట్ వాచ్‌మెన్‌లు ఉన్నప్పటికీ విద్యార్థులు పారిపోతుండటంతో పర్యవేక్షణ కరువైందని, సంబంధిత ఉన్నతాధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

క్యాస్ ప్రమోషన్ల ఇంటర్వ్యూలు పూర్తి

కేయూ క్యాంపస్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): కేయూలో నాలుగు రోజుల పాటు జరిగిన అసిస్టెంట్, అసోసియేట్, ప్రొఫెసర్ల ప్రమోషన్ల (క్యాష్) ఇంటర్వ్యూలు గురువారం ముగిశాయి. క్యాష్ ప్రమోషన్ల ఇంటర్వ్యూలకు వీసీ కర్నాటి ప్రతాప్‌రెడ్డి చైర్మన్‌గా వ్యవహరించారు. రాష్ట్ర గవర్నర్ నామినీతో పాటు కేయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ వల్లూరి రామచంద్రంతో పాటు ఇతర వర్సిటీల నుంచి ఇద్దరి చొప్పున సబ్జెక్టు ఎక్స్‌పర్ట్‌లు, సైన్స్, ఇంజనీరింగ్, సోషల్‌సైన్స్, లాతోపాటు ఇతర విభాగాల డీన్లు, వీసీ నామినీల నేతృత్వంలో ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఈ దఫా సోషల్‌సైన్స్, ఇంజనీరింగ్, ఫార్మసీ విభాగాల్లో 9మంది అసోసియేట్ ప్రొఫెసర్ల నుంచి ప్రొఫెసర్లుగా పదోన్నతి పొందారు. అలాగే 30మంది అసిస్టెంట్ ప్రొఫెసర్ల నుంచి అసోసియేట్ ప్రొఫెసర్లుగా పదోన్నతి పొందారు. వీరితో పాటు మరో ఇద్దరు ప్రొఫెసర్ నుంచి సీనియర్ ప్రొఫెసర్లుగా పదోన్నతి సాధించారు. వీరందరికీ కేయూ పాలక మండలి సమావేశం నిర్వహించి క్యాష్ ప్రమోషన్లకు అనుమతి లభించిన తర్వాత అధికారిక ఉత్తర్వులు జారీ చేయనున్నారు.

'ఐద్వా సభలను జయప్రదం చేయాలి'

హనుమకొండ చౌరస్తా, నవంబరు13 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ మహానగరం వేదికగా 2026 జనవరి 25నుంచి 28వరకు నిర్వహించనున్న అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) 14వ జాతీయ మహాసభను విజయవంతం చేయాలని ఐద్వా రాష్ట్ర సహాయ కార్యదర్శి ఎన్. రత్నమాల పిలుపునిచ్చారు. గురువారం హనుమకొండ రాంనగర్ లోని సుందరయ్య భవన్‌లో ఐద్వా జాతీయ మహా సభల కరపత్రాన్ని రత్నమాల ముఖ్యఅతిథిగా హాజరై ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. హైదరాబాద్ వేదికగా నిర్వహిస్తున్న ఐద్వా జాతీయ మహాసభకు దేశ నలుమూలల నుంచి 1000మంది ప్రతినిధులు హాజరవుతారన్నారు. నాలుగు రోజుల పాటు జరిగే ఈ మహాసభలో దేశవ్యాప్తంగా మహిళలు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలపై చర్చిస్తారన్నారు. ఈ సమావేశంలో ఐద్వా జిల్లా కార్యదర్శి ఎల్.దీప, సహాయ కార్యదర్శి ఎం.రమాదేవి, ఉపాధ్యక్షురాలు ఎ.తార, జిల్లా కమిటి సభ్యురాలు ఉమా, రాధిక, హసీనా, యమున, కళమ్మ, కౌసల్య, స్వరూప, తిరుమల తదితరులు పాల్గొన్నారు.

'ఫార్మసీకి దేశ విదేశాల్లో ఉన్నత ఉద్యోగాలు'

కేయూ క్యాంపస్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): ఫార్మసీ విద్యకు దేశ విదేశాల్లో ఉన్నత ఉద్యోగాలు లభిస్తాయని, యువతకు ఉజ్వల భవిష్యత్ ఉందని కేయూఫార్మసీ డీన్ ప్రొఫెసర్ గాదె సమ్మయ్య ఉద్బోధించారు. గురువారం సహస్ర ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఫార్మస్యూటికల్ సైన్స్ కళాశాలలో ఓరియంటేషన్ ప్రోగ్రాం జరిగింది. ఈ సందర్భంగా డీన్ ప్రొఫెసర్ గాదె సమ్మయ్య ముఖ్యఅతిథిగా హాజరై కీలక ప్రసంగం చేశారు. క్లినికల్ రీసెర్చ్ ఆర్గనైజేషన్, రెగ్యులర్ అఫైర్స్, క్వాలిటీ అస్యూరెన్స్, సాస్, మానుఫ్యాక్చరింగ్, ఆర్‌అండ్‌డీ, ఫార్మసిస్టు, డ్రగ్స్ ఇన్‌స్పెక్టర్, అనలిస్టు, పాలిటెక్నిక్ లెక్చరర్‌గా స్థిరపడే అవకాశం ఉందన్నారు. ప్రిస్క్రిప్షన్‌లో ఎదురయ్యే తప్పిదాలను గుర్తించాలని అన్నారు. ఫార్మసిస్టులు సక్రమంగా పనిచేయకపోతే రోగులపై దుష్ప్రలితాలు పడే అవకాశం ఉందన్నారు.

అన్నివ్యాధులకు నూతన ఔషధాలను తయారు చేసే పరిశోధనలు జరుగుతున్నాయని చెప్పారు. డ్రగ్స్ కాస్మోటిక్ చట్టాన్ని గౌరవించాలని, ప్రజల ఆరోగ్యాన్ని కాపాడాలని హితవు చెప్పారు. ఈ సమావేశంలో సహస్ర కళాశాల చైర్మన్ ధీరజ్, ప్రిన్సిపాల్ గన్ను ప్రవీణ్‌కుమార్, సూత్రం శ్రీనివాస్, మౌనిక, డాక్టర్ సుష్మ, మనోజ్, కల్పనతో పాటు విద్యార్థులు పాల్గొన్నారు.

డ్రంకెన్ డ్రైవ్‌లో 27 మందికి జరిమానా

వరంగల్ క్రైం, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీల్లో పట్టుబడ్డ 27 మందిని గురువారం కోర్టులో హాజరుపరచగా న్యాయమూర్తి ఎ.వేణుగోపాల్ రూ.32,200 జరిమానా విధించినట్లు హనుమకొండ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ సీతారెడ్డి తెలిపారు. డ్రైవింగ్ లైసెన్స్ లేని 14 మందిని కోర్టులో హాజరుపరచగా రూ. 8,500 జరిమానా విధించినట్లు సీఐ తెలిపారు.

క్యాన్సర్‌పై వైద్య శిబిరం

హనుమకొండ టౌన్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): హనుమకొండ బాలసముద్రంలోని ఏకశిల పార్కులో ఈ నెల 15న రోటరీ క్లబ్, ఏకశిల పార్కు వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో క్యాన్సర్‌పై ఉచిత మెడికల్ క్యాంపు నిర్వహిస్తున్నట్లు రోటరీ క్లబ్ అధ్యక్షుడు బేతి రవీందర్‌రెడ్డి, వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు వంగ రాజిరెడ్డి గురువారం తెలిపారు. శనివారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు మహిళలకు ప్రత్యేక క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్ష, క్యాన్సర్‌పై నిపుణులైన వైద్యులచే కౌన్సెలింగ్, మహిళలకు పీఏపీ స్మియర్ పరీక్ష, క్లినికల్ టెస్టు ఎగ్జామినేషన్, అల్ట్రా సౌండ్ మెడ, ఇతర పరీక్షలు ఉచితంగా నిర్వహించనున్నట్లు తెలిపారు.

అపార్ట్‌మెంట్ వాసులు ఐక్యంగా ఉండాలి

హనుమకొండ కలెక్టరేట్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): అపార్ట్‌మెంట్ వాసులు కలిసికట్టుగా ఉండాలని ట్రైసిటీస్ అపార్ట్‌మెంట్ ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు రెంటాల కేశవరెడ్డి అన్నారు. సుబేదారిలోని ప్రశాంత్ రెసిడెన్సీలో బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో కేశవరెడ్డి మాట్లాడారు. అపార్ట్‌మెంట్‌లలో నివసించే ప్రజలు మంచి వాతావరణంలో ఉంటూ అందరితో కలిసిమెలిసి ఉండాలన్నారు. తిరువరంగం ప్రభాకర్, నడుముల విజయ్‌కుమార్, నరేందర్‌రెడ్డి, చిదర అంజనీదేవి, రాగంశెట్టి సత్యనారాయణ, సారంగపాణి, సత్యనారాయణరెడ్డి, జె.రఘోత్తంరెడ్డి, ఎ.రత్నాకర్, తుమ్మ సురేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కార్మిక వ్యతిరేక విధానాలను తిప్పికొట్టాలి

హనుమకొండ చౌరస్తా, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అనుసరిస్తున్న భవన నిర్మాణ కార్మిక వ్యతిరేక విధానాలను తిప్పికొట్టాలని, వెల్ఫేర్ బోర్డు స్కీంలను ప్రైవేటు ఇన్సూరెన్స్ కంపెనీలకు ఇవ్వొద్దని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఉప్పలయ్య అన్నారు. గురువారం హనుమకొండ రాంనగర్‌లోని సుందరయ్య భవన్‌లో ఏర్పాటు చేసిన భవన నిర్మాణ కార్మిక సంఘాల జేఏసీ రౌండ్ టేబుల్ సమావేశంలో ఉప్పలయ్య ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. వెల్ఫేర్ బోర్డు స్కీంలు ప్రైవేటు ఇన్సూరెన్స్ కంపెనీలకు అప్పచెప్పడం వలన కార్మికుల సొమ్ము దుర్వినియోగం అవుతోందన్నారు. అదే విధంగా సీఎస్‌సీ సంస్థ ద్వారా భవన నిర్మాణ కార్మికులకు ఆరోగ్య పరీక్షల పేరుతో కార్మికుల సెస్ డబ్బులు మొత్తం వృథా చేస్తున్నారని ధ్వజమెత్తారు. నవంబరు 25న రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాల కలెక్టరేట్లు, డీసీఎల్ కార్యాలయాల ముందు ధర్నాలు చేపడతామన్నారు. డిసెంబరు 5వ తేదీన చేపట్టనున్న చలో అంజయ్య భవన్ కార్యక్రమం చేపడతామన్నారు. ఈ సమావేశంలో సీఐటీయూ అనుబంధ భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు టి.సారంగపాణి, బీఎస్‌ఆర్‌కేఎస్ జిల్లా అధ్యక్షుడు వీరమూల నరసింహులు. ఏఐటీయూసీ అధక్ష్యడు భద్రయ్య, ఉపాధ్యక్షుడు రాజేందర్, సీఐటీయూ యునైటెడ్ బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ జిల్లా ఉపాధ్యక్షుడు పుల్ల అశోక్, సభ్యులు కుక్కముడి రవీందర్, వెంకటస్వామి, మంద మల్లేశం, ప్రజానాట్య మండలి జిల్లా కార్యదర్శి సుదర్శన్, బీఎస్‌ఆర్‌కేఎస్ జిల్లా కార్యదర్శి రాజేందర్, కోశాధికారి భిక్షపతి తదితరులు పాల్గొన్నారు.

కేయూ హాస్టళ్ల ఖర్చులపై విచారణ కమిటీ

కేయూ క్యాంపస్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): కేయూ పరిధిలోని హాస్టళ్లలో చేస్తున్న ఖర్చులు, ఇతరత్రా నిర్వహణ వ్యవహారాలపై ఓ చైర్మన్‌తోపాటు మరో ముగ్గురు సభ్యులతో విచారణ కమిటీని కేయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ వల్లూరి రామచంద్రం నియమిస్తూ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. కేయూ ఫార్మసీ విభాగం ప్రొఫెసర్ ఎన్.ప్రసాద్, కేయూ స్టూడెంట్స్ అఫైర్స్ డీన్, జంతుశాస్త్ర విభాగం ప్రొఫెసర్ మామిడాల ఇస్తారి, హాస్టల్స్ డైరెక్టర్ ప్రొఫెసర్ ఎల్‌పీ రాజ్‌కుమార్, మెంబర్ సెక్రటరీగా ఆడిట్ విభాగం డిప్యూటీ రిజిస్ట్రార్ ఎల్.రాములను నియమించారు. మూడు రోజుల్లో హాస్టళ్ల ఖర్చులతో పాటు విద్యార్థులకు అధిక మెస్ బిల్లులు, హాస్టళ్ల ఆహార సరుకుల కొనుగోలు టెండర్ ప్రక్రియ అవకతవకలు, పార్ట్‌ల బిల్లుల చెల్లింపుల పరిశీలన, కూలీల వేతనం చెల్లింపులో అవకతవకలతో పాటు ఇతరత్రా అంశాలను పరిశీలించి 3రోజుల్లో నివేదికను సమర్పించాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. కాగా, కమిటీలో స్టూడెంట్స్ ప్రతినిధిని నియమించాలని విద్యార్థులు డిమాండ్ చేసిన దృష్ట్యా స్టూడెంట్స్‌తోనూ మరొక కమిటీని నియమించనున్నట్లు తెలుస్తోంది.

42 శాతం రిజర్వేషన్లు కల్పించేంత వరకు పోరాటమే..

బీసీ నాయకుల డిమాండ్

వడ్డేపల్లి, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): బీసీలకు స్థానిక సంస్థల ఎన్నికల్లో 42 శాతం రిజర్వేషన్లు కల్పించేవరకూ పోరాటం తప్పదని బీసీ ఇంటలెక్చువల్ ఫోరం రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ కూరపాటి రమేష్, బీసీ, ఎస్సీ, ఎస్టీ జేఏసీ ఉమ్మడి వరంగల్ జిల్లా చైర్మన్ డాక్టర్ చందా మల్లయ్య అన్నారు. హనుమకొండ బాలసముద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. బీసీ రిజర్వేషన్లను 42 శాతం అమలు చేసేందుకు 9వ షెడ్యూల్‌లో చేర్చాలని, కామారెడ్డి డిక్లరేషన్‌ను అమలు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తూ బీసీ రిజర్వేషన్ సాధన సమితి ఆధ్వర్యంలో ఈ నెల 15న కామారెడ్డిలో నిర్వహించబోయే బీసీ ఆక్రోశ సభలో వరంగల్ ఉమ్మడి జిల్లాలోని బీసీ, ఎస్సీ, ఎస్టీ, మేధావులు, విద్యావంతులు పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో బీసీ, ఎస్సీ, ఎస్టీ వరంగల్ ఉమ్మడి జిల్లా ప్రతినిధులు డాక్టర్ కె. వీరస్వామి, మేకల సుమ, ఇస్లావత్ మోహన్‌నాయక్, ముడు వీరన్న నాయక్, గుగులోత్ రాజన్న నాయక్, గొల్లపల్లి సురేష్‌గౌడ్, మాటేటి బాలకృష్ణ, కిరణ్, సిలువేరు రవి, కట్కూరి సునీల్, సత్తి నాగరాజు, రొడ్డ మురళీకృష్ణ, దామెర శ్రావణ్, ఇల్లందుల సుమన్, జన్ను కల్యాణ్ పాల్గొన్నారు.



ప్రెస్ క్లబ్‌లో మాట్లాడుతున్న కూరపాటి రమేష్, చందా మల్లయ్య

బీసీ రిజర్వేషన్ల అమలు కోసం ఉద్యమిస్తాం..

కేయూ క్యాంపస్ (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అమలయ్యే వరకు ఉద్యమిస్తామని మాజీ ఎమ్మెల్యే దాస్యం వినయ్ భాస్కర్ అన్నారు. కేయూ దూరవిద్యకేంద్రం ఆవరణలో బీసీ విద్యార్థి జేఏసీ నేతృత్వంలో నిర్వహిస్తున్న బీసీ ధర్మదీక్షలు గురువారం 4వ రోజుకు చేరాయి. దీక్షలకు వినయ్‌భాస్కర్ హాజరయ్యారు. భారతావనిలో బీసీల రిజర్వేషన్లు అమలు కాకపోవడంతో తీవ్రనష్టం జరిగిందన్నారు. కేంద్రంపై ఒత్తిడి పెంచేందుకు రాష్ట్ర ప్రభుత్వం అఖిల పక్ష కమిటీలను ఏర్పాటు చేసి బీసీ రిజర్వేషన్లు సాధించాలని అన్నారు. బీసీలను ఏకం చేసి ఉద్యమాన్ని ఉధృతం చేయాలని అన్నారు. అనంతరం దీక్షల్లో కూర్చున విద్యార్థి నేతలకు నిమ్మరసం ఇచ్చి దీక్షలను విరమింపచేశారు. ఈ కార్యక్రమంలో బీసీ విద్యార్థి జేఏసీ చైర్మన్ అరెగంటి నాగరాజు, నాగరాజు పటేల్, తిరుపతి, అజయ్‌సింగ్, సుమన్‌రాజ్, అన్వేశ్, రవితేజ, రాజశేఖర్, బొస్కే నాగరాజు, సాయికృష్ణ, రాజేశ్, బీఆర్ఎస్వీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శరత్‌చంద్ర గౌడ్, రాజేశ్; ప్రశాంత్, వీరాస్వామి, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

ఆంధ్రజ్యోతి
నవ్య
నివేదన
శుక్రవారం • 14 నవంబరు 2025

కార్తిక మాసం

సర్వ సమత్వమే పరమార్థం

ఏ పద్ధతులు పూర్వం నుంచి సంప్రదాయబద్ధంగా వస్తున్నాయో... వాటిని పూర్తిగా విస్మరించి, ఎవరికి తోచిన రీతిలో వాళ్ళు జరుపుకొంటున్న కార్యక్రమాల్లో వనభోజనాలు కూడా ఒకటి. చైత్ర, వైశాఖ మాసాల్లో అమ్మవారి ఉత్సవాలు, జ్యేష్ఠ, ఆషాఢాల్లో విపరీతమైన ఎండలు, శ్రావణ, భాద్రపదాల్లో ఉధృతంగా కురిసే వర్షాలు, ఆశ్వయుజంలో అమ్మవారి ఉత్సవాలు, మార్గశీర్షంలో చలి, మంచు, మాఘ, ఫాల్గుణాల్లో ప్రకృతి ఆకులు రాలుస్తూ, జలాశయాలు ఎండిపోతూ సౌందర్య రహితంగా కనిపించే వాతావరణం... ఈ చివరి మాసాల్లోనే శివరాత్రి, హోలీ పండుగలు ఉంటాయి. కాబట్టి చలీ, వేడీ కలిసి ఉండే కార్తికాన్ని వనభోజనాలకు అనువైన కాలంగా పూర్వ ఋషులు నిర్ణయించారు.



> వన భోజన ముఖ్య ప్రయోజనం ఒక్కటే... "మా గచ్ఛ త్వమితస్తతో గిరిశ భో మయ్యేవ వాసం కురు.... ఓ శంకరా! నా శరీరం అనే అడవిలో కామ, క్రోధ, లోభ, మోహ, మద, మాత్సర్యాలనే ఆరు భయంకరమైన మృగాలు నిరంతరం సంచరిస్తున్నాయి. నువ్వు ఆది కిరాతుడవు. కాబట్టి ఆ మృగాలను సంహరించి, నాకు ప్రశాంతత ప్రసాదించు. ఈ వనభోజనం అనే వంకతో నిన్ను ఆరాధించడం, ఇన్ని విషయాలను తెలుసుకోగలగడం... ఎంత అదృష్టమయ్యా నాకు!" అంటూ శివయ్యకు కృతజ్ఞతతో నమస్కరించాలి.

ఆ విశేషాలు తెలుసుకోవాలి...


ప్రయోజన మనుద్దిశ్య న మందోఽపి ప్రవర్తతే.. ఏదో ఒక ప్రయోజనం లేకుండా ఎవరూ ఏ పనీ చేయరు. కార్తిక మాసానికి ముందు వచ్చే శ్రావణ, భాద్రపదాలు వర్ష ఋతువు. వర్షాలు భారీగా కురిసి ఉంటాయి. అప్పటివరకూ మనకు కనిపించకుండా ఉన్న విత్తనాలన్నీ మొలకెత్తి, ఆశ్వయుజ మాసంలో తగిన ఔషధ శక్తిని తమలో నింపుకొంటాయి. కార్తిక మాసానికి మంచి ఓషధులుగా ఆ మొక్కలు తయారవుతాయి. అలాంటి కాలంలో... వృక్షాలకు సంబంధించిన ఓషధీ గుణాలను వివరించి చెప్పగలిగే ఒక వయోధికుణ్ణి వనాలకు తీసుకువెళ్ళి, ఆ చెట్ల విశేషాల గురించి ఆయన చెబుతూ ఉంటే తెలుసుకోవాలి. వ్యాధి నివారకమైన మందులు, మాకుల గురించి (మాకులు అంటే చెట్లు) తెలుసుకోవాలి.

ప్రయోజనాలు ఎన్నెన్నో...

వనంలో చెట్లన్నీ పక్కపక్కనే ఉంటాయి. సువాసనను ఇచ్చే మంచి గంధం చెట్టు పక్కన.. కుంకుడు, తుమ్మ లాంటి చెట్లు కనిపిస్తాయి. అదే తీరుగా... వనభోజనానికి వచ్చిన వ్యక్తులు కూడా 'తమ సంపద స్థాయి, పలుకుబడి, హోదా లాంటి విషయాలను మరచి మెలగాలి' అనేది తెలుసుకోవాలి. వనభోజనాలలో శరీర ఆరోగ్యానికి భంగం కలిగించని సాత్త్వికమైన పదార్థాలతోనే వంటలు చేయాలి. వడ్డనలో నైపుణ్యం ఉన్నవారు మాత్రమే వడ్డిస్తే... పదార్థాలు వృథా కావు. ఇక... భోజనం చేసేటప్పుడు సభ్యతగా వ్యవహరించాలి. సెల్‌ఫోన్లు చూస్తూ తినకూడదు. అన్నిటికీ మించి... పక్షి తీర్థంలో భోజన సమయానికి గెద్ద వాలినట్టు... సరిగ్గా భోజన సమయానికే రావడం తగదు. భోజనాలకు ముందు మహన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకంలో పాల్గొన్నాక... మనకు ఆహారాన్ని ఇచ్చిన ఆ దైవాన్ని ధ్యానించిన తరువాతే భోజనం చేయాలని తెలుసుకోవాలి. ఎక్కడెక్కడి నుంచో ఆహార పదార్థాలను వండి తేవడం, క్యాటరర్స్ ద్వారా తెప్పించుకోవడం సరికాదు. వనంలో భోజనం చేయాలనుకున్న వేళ... ఒకరు ఎండు కట్టెలను పోగు చేయడం, ఒకరు పొయ్యిని సిద్ధం చేయడం... ఇలా ఒక్కొక్కరూ ఒక్కొక్క పని చేయాలి. భోజనాలు అయ్యాక పాత్రలను కూడా కలిసే శుభ్రం చేయాలి. అక్కడ ఎక్కువ, తక్కువ అనే ఆలోచనలు లేకుండా... సర్వ సమత్వ దృష్టిని కలిగి ఉండాలి. వ్యాపార ప్రకటనలకు సంబంధించిన కాగితాలను పంచడం, వస్త్రాలను అమ్మడం, లక్కీడిప్ లాంటివి నిర్వహించడం... ఇలాంటివి మానుకోవాలి.

• డాక్టర్ మైలవరపు శ్రీనివాసరావు
9866700425

హరేకృష్ణ



విశ్వగురువు

ప్రపంచ ప్రసిద్ధి చెందిన 'హరేకృష్ణ ఉద్యమం' (అంతర్జాతీయ కృష్ణ చైతన్య సంఘం... ఇస్కాన్) వ్యవస్థాపక ఆచార్యుడు శ్రీల ప్రభుపాద. ఆయన పశ్చిమ దేశాలతో సహా యావత్ ప్రపంచానికి సనాతన ధర్మానికి చెందిన ఆచారాలను పరిచయం చేశారు. ప్రపంచ వ్యాప్తంగా నూట ఎనిమిది రాధాకృష్ణ దేవాలయాలను స్థాపించారు. ప్రజలకు ప్రయోజనం చేకూర్చేందుకు హరినామ సంకీర్తలను, నగర సంకీర్తనలను, ఏటా పూరీలో జరిగే విధంగా జగన్నాథ రథయాత్రలను, వేద సాహిత్యాన్ని, దాని రూపాలైన భగవద్గీత, శ్రీమద్ భాగవతాలను, గురుకుల విధానాన్ని, గోశాలలను, వైదిక వ్యవసాయాన్ని ప్రపంచ దేశాలకు పరిచయం చేశారు. 'సాధారణ జీవనం, అత్యున్నత తాత్త్విక చింతన' అనే భావనను బోధించారు. పదివేల మందికి పైగా వ్యక్తులను సనాతన ధర్మ మార్గంలోకి తీసుకువచ్చారు.

హరేకృష్ణ ఉద్యమం ప్రాచీనమైన బ్రహ్మ-మధ్వ-గౌడీయ సంప్రదాయానికి చెందినది. ఈ విశిష్టమైన సంప్రదాయంలో శ్రీల ప్రభుపాద 32వ ఆచార్యులు. 1966లో, న్యూయార్క్ నగరంలో 'ఇస్కాన్'ను ఆయన ప్రారంభించారు. రోజువారీ జీవితంలో తీరిక లేకుండా గడుపుతూ, ఉన్నతమైన జీవన సూత్రాలను తెలుసుకోలేని వ్యక్తుల మనస్సుల్లో కృష్ణ చైతన్యాన్ని నింపడం దీని ప్రధానమైన లక్ష్యం. శ్రీల ప్రభుపాదులు ఏర్పరచిన ఈ సంస్థ ఉద్దేశాల్లో ప్రధానమైనది... ప్రజల దృష్టిని సర్వశక్తిమంతుడైన శ్రీకృష్ణునివైపు మళ్ళించడం. తద్వారా కృష్ణ చైతన్యాన్ని అభ్యసిస్తూ... మన మరచిన ఆ భగవత్సంబంధాన్ని తిరిగి స్థాపించుకోవడం. 'శ్రీకృష్ణుడు జంతువులు, పక్షులు, వృక్షాలు, క్రిమి కీటకాలతో సహా సమస్త జీవులకు తండ్రి (పితామహస్య జగతః అహం బీజ-ప్రదః పితా)" అని 'భగవద్గీత' చెబుతోంది. 'యావత్ ప్రపంచం శ్రీకృష్ణుడు మూల పురుషునిగా ఉన్న వసుధైక కుటుంబం' అని దీని అర్థం. చెట్టు మొదట్లో నీరు పోస్తే... ప్రతి శాఖ, ఆకు, పండు, ఎలా సంతృప్తి చెందుతాయో... అదే విధంగా సమస్త అస్తిత్వానికీ మూలమైన కృష్ణుణ్ణి సంతృప్తి పరచడం ద్వారా లోకంలోని సకల జీవులను సంతృప్తి పరచవచ్చు.

> 1977 నవంబర్ 14న శ్రీధామ బృందావనంలో మహాసమాధి అయిన శ్రీల ప్రభుపాద... శ్రీకృష్ణుని నిత్య లీలలలోకి ప్రవేశించారు. ప్రపంచవ్యాప్తంగా ఆ దివ్య తిథిని భక్తులు వేడుకగా జరుపుకొంటారు. విశ్వగురు శ్రీల ప్రభుపాదకు నివాళులు అర్పిస్తారు. గురువు భౌతిక నిష్క్రమణంతో గురుసాంగత్యం ఆగదని శ్రీల ప్రభుపాద స్పష్టం చేశారు. ఆయన అనుయాయుల ద్వారా, ఆయన పుస్తకాలు, విగ్రహ రూపాలు, సంస్థ, శిష్యులద్వారా ఎవరైనా ఇప్పటికీ మార్గదర్శకత్వం పొందవచ్చు. శ్రీల ప్రభుపాద శాసనాన్ని అనుసరించి... రోజూ 'హరేకృష్ణ' మహా మంత్రాన్ని నిర్ణీత సంఖ్యలో జపిస్తూ, కృష్ణ చైతన్య నియమాలను పాటిస్తూ దీక్ష పొందవచ్చు.

కృష్ణ చైతన్య పునరుద్ధరణ కోసం

ప్రతి ఒక్కరిలో నిద్రాణమై ఉన్న కృష్ణ చైతన్యాన్ని పునరుద్ధరించడం కోసం... శ్రీకృష్ణుని నామాలను జపించడాన్ని ఒక సాధారణ పద్ధతిగా శ్రీల ప్రభుపాదులు పరిచయం చేశారు. 1969 నుంచి 1977 మధ్య... 22 వేల పేజీల సాహిత్యాన్ని తన వాక్కు రూపంలో ఆయన నిక్షిప్తం చేశారు. అరవైకి పైగా భాషల్లో ఎనభైకి పైగా పుస్తకాలను ప్రచురించారు. ఇప్పటివరకూ ప్రపంచవ్యాప్తంగా అరవై కోట్ల పుస్తకాలను ఆయన శిష్యులు వితరణ చేశారు. భగవద్గీత లాంటి ప్రాచీన గ్రంథాలలోని నిజమైన జ్ఞానాన్ని యథాతథంగా ఆంగ్లంలో ప్రపంచానికి అందించడం ఆయన చేసిన ముఖ్యమైన సేవ. అంతేకాదు... (వేదాంత సూత్రానికి సహజ వ్యాఖ్యానంగా పరిగణించే) శ్రీమద్ భాగవతం, ఈ యుగంలో శ్రీకృష్ణుని అవతారమైన శ్రీచైతన్య మహాప్రభువు జీవితం, బోధల గురించి వివరించే 'చైతన్య చరితామృతం' అనే గ్రంథాలకు వ్యాఖ్యానాలు రచించారు. ప్రజలు తమ రోజువారీ జీవితాల్లో ఈ పుస్తకాలలోని అంశాలను చదివి, ఆచరిస్తే... శ్రీకృష్ణ చైతన్యంలో స్థితప్రజ్ఞులు అవుతారు.

• శ్రీసత్యగౌర చంద్రదాస ప్రభూజీ
అధ్యక్షులు, హరే కృష్ణ మూవ్‌మెంట్,
హైదరాబాద్, 9640086664



సందేశం

మర్యాద, మన్నన



మానవుడు సంఘజీవి. సమాజంలో తోటి వ్యక్తులతో వ్యవహరించడంలో, గౌరవించడంలో మర్యాదకు, మన్ననకు అధిక ప్రాధాన్యం ఉంటుంది. "ఏ వ్యక్తి ఇతరులతో మర్యాదగా, మన్ననగా నడుచుకుంటాడో... ఆ వ్యక్తికి గౌరవ మర్యాదలను దైవం అధికంగా అందజేస్తాడు" అని దైవ ప్రవక్త మహమ్మద్ తెలిపారు.

మానవత్వం, మర్యాద, మన్నన, గౌరవం, నాగరికత.. ఇవన్నీ ఒకదానితో మరొకటి సంబంధం కలిగిన అంశాలు. ఉత్తమ నడవడికతో మెలిగే వ్యక్తిలో ఇవన్నీ ఉంటాయి. ఈ సద్గుణాలు కలిగిన వ్యక్తి దైవం దృష్టిలో ఉన్నతుడు. అతను ఈ ప్రపంచంలో కూడా ఉత్తముడిగానే ఉంటాడు. అయితే వీటి గురించి మాటలు చెప్పినంత మాత్రాన సరిపోదు. మన స్వభావంలో అవి ఉండాలి. వాటిని ఆచరించాలి. అప్పుడే విలువ ఉంటుంది. తామే గొప్పవారమని అనుకొనే, అహంకారులైన వ్యక్తుల్లో ఈ లక్షణాలు లోపిస్తాయి. అలాంటివారిలో రాక్షసత్వం చోటు చేసుకుంటుంది. ఆ వ్యక్తులను సమాజం కూడా గౌరవించదు. సమస్త దుర్గుణాలకు, సమస్త పాపాలకు మూలం గర్వమే. గర్వం ఉన్న వ్యక్తికి తాను అనుకున్నవి అనుకున్నట్టు జరగకపోతే కోపం వస్తుంది. కోపంతో అసహనం, ఓర్వలేనితనం లాంటి దుర్గుణాలు ఉత్పన్నమవుతాయి. గర్వం కలిగినవారు పరనింద చేస్తారు. ఇతరుల మనసులను నొప్పిస్తారు. మానవత్వాన్ని పెంపొందించుకొని, సద్గుణాలను అలవరచుకుంటే... ఇలాంటి దుష్ప్రవర్తనలకు దూరం కావచ్చు. దేవుణ్ణి ఆశ్రయించడమే దానికి పరిష్కారం. తోటివారి పట్ల మర్యాదగా వ్యవహరిస్తూ, గర్వం, కృతఘ్నతలకు దూరంగా ఉండేవారు అల్లాహ్ ప్రేమకు పాత్రులవుతారు.

• మహమ్మద్ వహీదుద్దీన్

దైవమార్గం

అన్ని వేళలా ఆయనే తోడు

బైబిలును దైవలిఖితమైన గ్రంథంగా క్రైస్తవ సమాజం పరిగణిస్తుంది. దానిని ఒక రక్షణ మార్గంగా కూడా విశ్వసిస్తుంది. అందులో దేవుడు ఏదైనా సందర్భంలో ఇచ్చిన హితవైన సూచనను కానీ, అభయహస్తాన్ని అందించిన సన్నివేశాన్ని కానీ.. సమస్త విశ్వాసులకు దేవుడు ఉద్దేశించినవిగా భావించి గౌరవిస్తారు. దేవుడు అంతటా ఉన్నాడనేది భక్తులు అందరూ విశ్వసించే విషయం. ప్రజలను ఆయన విడనాడకుండా, ఎల్లప్పుడూ అంటిపెట్టుకొని ఉండీ, కాపాడుకున్న ఉదంతాలు బైబిల్‌లో అనేకం కనిపిస్తాయి.




దైవ ప్రజలకు మోషే విమోచనం కల్పించిన సందర్భంలో... ఆ ప్రజలకు ఎన్నో కష్టాలు ఎదురయ్యాయి. కొండలూ, కోనలు దాటలేక... "దీని కన్నా చావే మేలు" అని వారు భీతిల్లిపోయారు. అప్పుడు "భయపడవద్దు. దేవుడైన యెహోవా నిన్ను విడువడు, నిన్ను ఎన్నడూ ఎడబాయడు" అని దైవం గట్టి నమ్మకం ఇచ్చాడు. అలాగే "నిన్ను ఆదుకొనేవాణ్ణి నేనే. నేను నీకు తోడై ఉంటాను. భయపడవద్దు" అని వివిధ సందర్భాల్లో తన స్వరం వినిపించాడు. "నిన్ను ఎన్నటికీ విడువను, ఎడబాయను, నీ పక్కనే ఉంటాను" అని ధైర్యం చెప్పాడు. "విశ్వాసులను ఆయన ఆలింగనం నుంచి ఏదీ విడదీయలేదు. ఆయన హస్తం వారిని రక్షణ కవచంగా కాపాడుతుంది. ఆయనవైపు నడిపిస్తుంది" అని పౌలు మహర్షి తన లేఖలో వివరించాడు. అలాగే క్రీస్తు మోక్షానికి వెళుతూ... "మిమ్మల్ని అనాథలుగా ఉండిపోనీయను. నేను మీకు ఎప్పుడూ మీ తోడుగా ఉంటాను" అని మాట ఇచ్చాడు. దైవాన్ని ఆశ్రయించినవారికి ఆయన రక్షణ, అభయం ఎల్లప్పుడూ ఉంటాయి. ఆయన వారికి అన్ని వేళలా తోడుగా ఉంటాడు.

• డాక్టర్ యం. సోహినీ బెర్నార్డ్
9866755024

ఆత్మజ్ఞానం కోసం శివారాధన

మనం శివుణ్ణి ఆరాధిస్తాం, పూజిస్తాం. కానీ ఆయన విశిష్ట గుణాలు, లక్షణాల విభిన్న కోణాల గురించి మనం సమగ్రంగా, సూక్ష్మంగా తెలుసుకోవాల్సినది ఎంతో ఉంది. శివుడి అతి ముఖ్యమైన గుణం... ఆనందం. ఆ ఆనందం సూక్ష్మాతి సూక్ష్మ రూపాలలో ప్రతిచోటా వ్యాపించి ఉంటుంది. కానీ మనం ఆధ్యాత్మికంగా సూక్ష్మంగా మారేవరకూ... ఆ రూపాలను గుర్తించలేం. వాటిని అర్థం చేసుకోలేం. ఆయన ప్రతి కణంలో, ప్రతి అణువులో నివసిస్తాడు. ఆనందకరమైన విశ్వాన్ని సృష్టిస్తాడు. శివుని విశేష లక్షణాల గురించి శ్రీమాతాజీ నిర్మలాదేవి చెప్పిన అంశాలను తెలుసుకుందాం.

సహజయోగ



ఆధ్యాత్మిక పరిపక్వత లేనివారు తప్పుడు మార్గాలలోకి వెళ్తారు. ఆత్మకు వ్యతిరేకమైన పనులు చేస్తారు. దానిలో ఆనందం పొందగలమని భావిస్తారు. కానీ ఆత్మ శివుడికి ప్రతిరూపం. అంటే శివుణ్ణి ఆరాధించడం ద్వారా మనం పొందేది ఆత్మానందం. మిమ్మల్ని మీరు తెలుసుకోవడం అంటే ఆత్మను తెలుసుకోవడం.

అలా తెలుసుకోవాలంటే శివుణ్ణి ఆరాధించాలి. మనం 'ఆత్మస్వరూపులం' అని గ్రహించినప్పుడు... బాహ్య రూపానికి ఎలాంటి ప్రాధాన్యతా ఉండదు. బాహ్యరూపం ఎలా ఉన్నప్పటికీ... అంతర్గతంగా మనలో ఉన్న శివశక్తి... బాహ్య పరంగానూ కాంతిని ఇస్తుంది.

ఔదార్యంలో మహోన్నతుడు

శివుణ్ణి అందరూ 'భోళాశంకరుడు' అంటారు. ఔదార్యం ఆయనలోని మహోన్నత గుణం. శివుణ్ణి మించిన ఉదార స్వభావం కలిగిన దేవీదేవతలు మరెవరూ లేరు. అర్హులు కారని తెలిసి కూడా ఆయన అసురులకు వరప్రదానం చేస్తూ ఉంటాడు. శివుణ్ణి ప్రసన్నం చేసుకోవడానికి ఆలయాల్లో బంగారాన్నో, వెండినో సమర్పించాల్సిన అవసరం లేదు. ఆయన అన్నిటికీ అతీతుడు. భౌతికంగా విలువైనవని మనం భావించేవేవీ శివుడికి సరితూగవు. శివుణ్ణి ప్రసన్నం చేసుకోవాలంటే... మనలో శివతత్త్వాన్ని అభివృద్ధి పరచుకోవాలి. అంటే... ఆయన తత్త్వాలైన ఆనందం, ప్రేమ, సత్యం తదితర శుభ లక్షణాలను మనలో పెంపొందించుకోవాలి. వాటిని దోహదం చేసే పనులను దైనందిన జీవితంలో ఆచరించాలి. అసూయ, మోహం, శత్రుత్వం లాంటి ఉపయోగం లేని విషయాల మీద మనలోని శక్తిని వృథా చేసుకోకూడదు. దీనివల్ల మన స్వభావంలో, వ్యక్తిత్వంలో, ప్రవర్తనలో మనలోని ఆత్మ ప్రకాశిస్తుంది. శివతత్త్వంలో స్థిరపడిన వ్యక్తి ఏదీ కావాలని కోరుకోడు. 'ఏది తినాలి? ఎక్కడ నిద్రపోవాలి?' అనే విషయాల గురించి చింతించడు. ఎందుకంటే అతని ఆత్మ... అతనిలోని శివతత్త్వంతో సంతృప్తి చెందుతుంది.

క్షమాపణ కోరాల్సింది శివుణ్ణే

శివుడిలో ఉన్న అద్భుతమైన గుణం... క్షమించే శక్తి. ఆయన అత్యంత పాపాత్ములను కూడా క్షమించగలడు. ఆయన క్షమించలేని తప్పును వేరే దేవతలు ఎవరూ క్షమించలేరు. అందుకే.. భగవంతుణ్ణి క్షమాపణ కోరాల్సి వచ్చినప్పుడు... మనం శివుణ్ణే అడగాలి. గంగానదిని సునాయాసంగా తన జటాజూటంలో బంధించిన శివుడు మానవుల అహంకారాన్ని పూర్తిగా తొలగిస్తాడు. అలాగే అహంకారపూరితులైన వ్యక్తుల బారినుంచి ఆర్తులను రక్షిస్తాడు. శివుడు ఓదార్పును, శాంతిని, ఆనందాన్ని ఇస్తాడు. మనకు ఉనికిని ఇస్తాడు. ఆయన శక్తి కారణంగా మన ఉనికికి గుర్తింపు కలుగుతుంది. సృష్టి రచనలో ఆయన పాత్ర... ఇంటి నిర్మాణంలో పునాదిలా ఉంటుంది. అది బయటకు కనిపించదు. కానీ పునాది లేకుండా ఏ భవనం నిలబడదు. అదే విధంగా... సదాశివుడు మన హృదయంలో ఆత్మ రూపంలో నివసిస్తాడు. ఆయన మన హృదయాల్లో ఆత్మగా స్థిరపడి ఉన్నంతవరకూ మాత్రమే మన జీవితాలు ఉనికిలో ఉంటాయి. మనం ఆయనలో అంతర్భాగం. ఆయనే సర్వం. ఆ సర్వంలో మనం ఐక్యం కావాలనే జ్ఞానం కలగాలంటే మనం జాగృతం కావాలి. సహజయోగ సాధన ద్వారా మనలోని చక్రాలను, తద్వారా సుషుమ్నా మార్గాన్ని నిర్మలపరచుకోవాలి. శివుని శక్తి అయిన కుండలినీ శక్తి సహజయోగం ద్వారా జాగృతమై... విష్ణు శక్తి అయిన సుషుమ్నా మార్గం ద్వారా పైకి వచ్చినప్పుడు... అంటే ఆ రెండూ కలిసినప్పుడు... మనం సమతుల్యతను పొందగలం. మన శరీరం మాడు భాగంలో... సదాశివుడు ఆసీనుడై ఉన్న సహస్రారానికి చేరుకోగలం.

డాక్టర్ పి. రాకేష్, 9097097777
పరమ పూజ్యశ్రీ మాతాజీ నిర్మలాదేవి
సహజయోగ ట్రస్ట్, తెలంగాణ



తెలుసుకుందాం

భావ శిల్పం దేవ శిల్పం



శిల్పశాస్త్రంలో ముఖ్యమైనది ధ్యాన శ్లోకం. ఒక విగ్రహాన్ని మలచేందుకు ఆ ధ్యాన శ్లోకమే ఆధారం. ఒక దేవత గురించి ఉద్దేశించిన ఆ శ్లోకంలో... ఆ దేవతారూపం ఎలా ఉంటుందనే వివరణ ఉంటుంది. దేవత భంగిమ, ఆయుధాలు తదితర వివరాలు కూడా ఉంటాయి. ఈ ధ్యాన శ్లోకం శిల్పికి, భక్తుడికి కూడా చాలా ముఖ్యమైనది. శిల్పి పొందే శిక్షణలో విగ్రహ నిర్మాణాన్ని చాలా ముఖ్యంగా పరిగణిస్తారు. అందుకే శిల్పి పలు శిల్ప శాస్త్రాలను, వాస్తు గ్రంథాలను, ఆగమ గ్రంథాలను అధ్యయనం చేయాలనే నియమం ఉంది.

మంత్రమూర్తి

శాస్త్రాలలో సూచించిన ఈ రూప ధ్యాన విధానం శ్రేష్ఠమైనది. ప్రాచీన సంప్రదాయాన్ని పాటించే శిల్పులు నేటికీ ఈ విధానాన్ని అనుసరిస్తారు. శిల్పి తాను ఏ విగ్రహాన్ని నిర్మించాలో... ఆ విగ్రహానికి సంబంధించిన ధ్యాన శ్లోకాన్ని విధిగా పఠించాలి. ఒక్కో దేవతకు ఉండే విశిష్టమైన మంత్రాన్ని... జప అనుష్ఠానంగా మనసులో ధ్యానిస్తే... శిల్పి మనస్సులో ఆ దేవతామూర్తి క్రమక్రమంగా ఒక రూపంలో గోచరం అవుతుంది. ధ్యానం ద్వారా శిల్పులు మొదటగా దర్శించే ఆ రూపాన్ని 'మంత్రమూర్తి' అని పిలుస్తారు. అలా శిల్పి తన మనోఫలకం మీద స్పష్టంగా దర్శించిన ఆ దైవ రూపాన్ని... దాని స్థితిని బట్టి రాతిలోనూ, దారువు (కొయ్య)లోనూ అతను చెక్కుతాడు. లేదా తేనె మైనంతో బొమ్మను చేసి, తరువాత లోహంతో పోత పోసి... లోహ విగ్రహాన్ని నిర్మిస్తాడు.

శిల్పి మనసులో దర్శించి...

ఉదాహరణకు... 'నాగాననం చతుర్బాహుం త్రినేత్రం ముకుటోజ్జ్వలం/ కర్ణ చామర సంయుక్తం ఇక్షుదండ సమోదకం/ లంబోదరం శూలపాశం మౌంజీ యజ్ఞోపవీతినం/ ఉదరే నాగ బంధంచ ఏకదంతముపాస్మహే' అనేది గణపతికి సంబంధించిన శ్లోకం. గణపతికి సామాన్యంగా ఉండే, ఉండాల్సిన వివరాలన్నీ ఈ శ్లోకంలో ఉన్నాయి. స్థపతి లేదా శిల్పి ఈ వివరాలను మనసులో ఉంచుకొని విగ్రహం తయారు చేయాలనుకున్నప్పుడు... ప్రత్యేకించి ఏ ప్రతికృతీ (నమూనా) శిల్పి ఎదుట ఉండదు. శిల్పి తన మనసులో దర్శించిన తొలి రూపమే మొదటి ఆధారం. ఆ భగవంతుని ఆకారానికి ప్రతీకగానే విగ్రహాన్ని నిర్మిస్తాడు. 'ప్రతిమ' అనే మాటకు అర్థం అదే! శిల్ప, ఆగమశాస్త్ర గ్రంథాలు విగ్రహ లక్షణాన్ని చెప్పాయి కానీ, ఆకృతి లక్షణాన్ని కొన్ని ప్రకృతి సంబంధమైన ఆకారాలతో పోల్చాయి. అయితే అసలు ఆకృతిని శిల్పి తన ధ్యానంతో, అనుష్ఠానంతో సాధించుకోవలసిందే తప్ప... అది ఇలా ఉండాలని నిర్దేశించడం సాధ్యం కాదు. అందుకే ఏ రెండు దేవతా మూర్తి విగ్రహాలు ఒకేలా ఉండవు. ఒకే దేవతా రూపమైనా... ఒక్కొక్క క్షేత్రంలో ఒక్కొక్క విలక్షణమైన లావణ్యాన్ని సంతరించుకుంటుంది. ప్రతి ఆకారం శిల్పి మనసులో కలిగిన దైవీక అనుభవంతో రూపొందినదే.

శిల్పి ఆకారానికి అధిపతి

భాగవత పురాణానికి చెందిన శ్రీధరీయ వ్యాఖ్యానకర్త ఒక విశేషాన్ని చెబుతూ 'ఆకృతిపతిః శిల్పాచార్యః... శిల్పి ఆకారానికి అధిపతి' అని పేర్కొన్నారు. శిల్ప శాస్త్రంలో దీక్షకు చాలా ప్రాధాన్యత ఉంది. విగ్రహ నిర్మాణ ప్రారంభంలోనే కాకుండా... ఆ పని జరిగినంతకాలం శిల్పి ఆ దేవతా మంత్రాన్ని జపిస్తూ ఉండాలి. దీనికి కావలసిన సంస్కారం, ఉపదేశం... ఇవన్నీ దీక్షతోపాటు శిక్షణలోనే స్థపతులకు, శిల్పులకు లభిస్తాయి. ఇలా రూపధ్యానం భావశిల్పంగా, ఆ తరువాత దేవశిల్పంగా ఆవిర్భవిస్తుంది. ప్రాణప్రతిష్ఠను జరిపించుకొని, షోడశ కళలతో ఈ లోకాన్ని అనుగ్రహిస్తుంది.

• డి.యన్.వి. ప్రసాద్ స్థపతి
9440525788

మంత్రి క్షమాపణ..
నాగార్జున కేసు వాపస్

- కొండా సురేఖపై పరువునష్టం కేసును ఉపసంహరించుకున్న సినీ నటుడు
- విచారణను ముగించిన నాంపల్లి కోర్టు





హైదరాబాద్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): తన కుటుంబ గౌరవాన్ని దెబ్బతీసే విధంగా, పరువునష్టం కలిగించేలా అనుచిత వ్యాఖ్యలు చేశారని రాష్ట్ర మంత్రి కొండా సురేఖపై దాఖలు చేసిన క్రిమినల్ పరువునష్టం కేసును సినీహీరో నాగార్జున ఉపసంహరించుకున్నారు. దీంతో విచారణను ముగిస్తూ నాంపల్లి ప్రత్యేక కోర్టు గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. కొండా సురేఖపై చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలని నాగార్జున గతేడాది న్యాయస్థానాన్ని ఆశ్రయించిన విషయం తెలిసిందే. నాగ చైతన్య, సమంత విడాకులు, ఎన్ కన్వెన్షన్ విషయంలో మంత్రి సురేఖ చేసిన వ్యాఖ్యలు తనను, తన కుటుంబాన్ని తీవ్రంగా బాధించాయని పిటిషన్‌లో పేర్కొన్నారు. నిరాధార ఆరోపణలకు విస్తృత ప్రచారం లభించిందని, ఆ వ్యాఖ్యలు ప్రజల్లో తీవ్ర ప్రభావం చూపాయని తెలిపారు. అన్ని సామాజిక మాధ్యమాల్లో పరువునష్టం కలిగించే వీడియోలు వైరల్ కావడం బాధించిందని పేర్కొన్నారు. నాగార్జున కుటుంబంపై చేసిన వ్యాఖ్యలపై విచారం వ్యక్తం చేస్తున్నట్టు మంత్రి సురేఖ బుధవారం రాత్రి ఎక్స్‌లో సందేశం ఉంచారు. తన వ్యాఖ్యలపై పశ్చాత్తాపం వ్యక్తంచేస్తూ.. వాటిని ఉపసంహరించుకుంటున్నట్లు తెలిపారు. ఆమె క్షమాపణలను అంగీకరించిన నాగార్జున.. పరువునష్టం కేసును ఉపసంహరించుకున్నారు.

'పోస్టర్' లాగితే ఉగ్రకుట్ర భగ్నం..!

- పోస్టర్‌పై రాతల ఆధారంగా దర్యాప్తు
- సీసీ కెమెరాల జల్లెడ.. హరియాణా, యూపీ పోలీసుల సాయంతో సోదాలు
- జమ్ముకశ్మీర్‌లో ఉగ్ర కుట్ర భగ్నంలో తెలుగు అధికారి చక్రవర్తి కీలకపాత్ర



డాక్టర్ జీవీ సందీప్ చక్రవర్తి

కర్నూలు, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): అది శ్రీనగర్‌లోని నౌగామ్ ప్రాంతం.. ఈ ఏడాది అక్టోబరులో అక్కడ కొన్నిచోట్ల పోలీసులు, భద్రతా దళాలను హెచ్చరిస్తున్నట్టుగా పోస్టర్లు వెలిశాయి. అందరూ దీన్నో సాధారణ విషయంగా భావించారు..! కానీ, ఒక పోలీస్ అధికారి మాత్రం ఆ పోస్టర్లను నిశితంగా పరిశీలించారు. ఆ రాతల వెనుక ఉద్దేశం ఉగ్రకుట్రకు సంకేతమై ఉండొచ్చని అనుమానించి దర్యాప్తు ప్రారంభించారు. తీగ లాగుకుంటూ వెళితే.. 2,900 కిలోల ఐఈడీ, స్లీపర్ సెల్స్ లింకులతోపాటు దేశాన్ని విచ్ఛిన్నం చేసే భారీ ఉగ్రకుట్ర బయటపడింది. ఇంతకీ ఆ పోస్టర్ వెనుక ఉగ్ర కుట్రను ఛేదించిన అధికారి ఎవరో కాదు. మన తెలుగు తేజం డాక్టర్ జీవీ సందీప్ చక్రవర్తి. ఆంధ్రప్రదేశ్‌లోని కర్నూలు నగరానికి చెందిన ఆయన ప్రస్తుతం శ్రీనగర్ సీనియర్ ఎస్పీగా పనిచేస్తున్నారు. ఈ కుట్ర భగ్నం వెనుక ఆయనతోపాటు ఎందరో అధికారుల పాత్ర ఉన్నప్పటికీ.. కేవలం ఒక పోస్టర్ ఆధారంగా ఛేదించిన చక్రవర్తి కీర్తి మాత్రం సామాజిక మాధ్యమాల్లో మార్మోగిపోతోంది..! ఇలాంటి ప్రచారం ఆయన భద్రతకు ప్రమాదమని, వందలాది మంది పోలీసు అధికారుల్లో ఒకడిగా తమ కొడుకు ఈ పనిచేశారని ఆయన తల్లిదండ్రులు చెబుతున్నారు.

భగ్నం చేశారిలా...

అక్టోబరు 19న శ్రీనగర్‌లోని నౌగామ్‌లో జేషే మహమ్మద్ పోస్టర్లు వెలిశాయి. వాటి ఆధారంగా నౌగామ్ పోలీస్‌స్టేషన్‌లో ఎఫ్ఐఆర్ నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. జమ్మూకశ్మీర్ పోలీసులు అనేక ప్రదేశాల్లో సోదాలు నిర్వహించారు. హరియాణా పోలీసులతో కలిసి ఫరీదాబాద్‌లో, ఉత్తరప్రదేశ్ పోలీసుల సాయంతో సహరాన్‌పూర్‌లో తనిఖీలు చేపట్టారు. సీసీ కెమెరాలు రికార్డులను జల్లెడ పట్టారు. ఈ క్రమంలో విదేశీ హ్యాండ్లర్లతో సంబంధాలు కలిగి, తీవ్రవాద భావాలున్న నిపుణులు, డాక్టర్లు, విద్యార్థులతో కూడిన వైట్ కాలర్, ఉగ్ర వ్యవస్థను గుర్తించారు. నేరారోపణలకు సంబంధించిన పత్రాలు, ఎలక్ట్రానిక్ పరికరాలు, ఆయుధాలు, మందుగుండు సామగ్రి, ఐఈడీ తయారీకి ఉపయోగించే సామగ్రిని స్వాధీనం చేసుకున్నారు. ఈ కుట్రలో నిషేధిత ఉగ్రవాద సంస్థలు, జైషే మొహమ్మద్, అన్సార్ ఘజ్వత్-ఉల్-హింద్ (ఏజీయుహెచ్)లతో సంబంధం ఉన్న ఉగ్రవాద మాడ్యూల్‌ను ఛేదించడంలో పోలీసులు విజయం సాధించారు.

విద్రోహశక్తుల అణచివేతలో చక్రవర్తి దిట్ట!

కర్నూలు నగరానికి చెందిన రిటైర్డు డాక్టర్ జీవీ రామగోపాల్‌రావు, వీసీ రంగమ్మ (ఆరోగ్యశాఖ రిటైర్డు అధికారి) దంపతుల మూడో సంతానం సందీప్ చక్రవర్తి. కర్నూలు మెడికల్ కళాశాల (కేఎంసీ)లో ఎంబీబీఎస్ పూర్తి చేశారు. తొలి ప్రయత్నంలోనే సివిల్స్-2014లో ఐపీఎస్‌కు ఎంపికయ్యారు. శిక్షణ అనంతరం శ్రీనగర్ అడిషనల్ ఎస్పీగా బాధ్యతలు చేపట్టారు. సంఘ విద్రోహ శక్తుల ఏరివేతలో ఆర్మీకి సంపూర్ణ సహకారమందిస్తూ శభాష్ అనిపించుకున్న సందీప్ చక్రవర్తి శ్రీనగర్, పూంచ్, ఉరి, సోపోర్, బారాముల్లా, హంద్వారా, కుప్వారా వంటి ప్రాంతాల్లో అడిషనల్ ఎస్పీ, ఎస్పీ, సీనియర్ ఎస్పీగా సేవలందించారు. ప్రస్తుతం శ్రీనగర్ సీనియర్ ఎస్పీగా పనిచేస్తున్నారు. రాయలసీమకు చెందిన ఆయన.. శాంతిభద్రతల పరిరక్షణ, విద్రోహ, అరాచకశక్తులను అణచివేయడంలో చూపించిన ధైర్యసాహసాలకు గానూ 2017లో తొలిసారిగా రాష్ట్రపతి శౌర్య పతకం అందుకున్నారు. ఇప్పటివరకు ఆరుసార్లు రాష్ట్రపతి శౌర్య పురస్కారాలు, నాలుగుసార్లు జమ్ముకశ్మీర్ పోలీస్ మెడల్ ఫర్ గ్యాలెంట్రీ సహా పలు అవార్డులు అందుకున్నారు.

ఇన్‌పుట్ ట్యాక్స్ క్రెడిట్ పేరుతో
11.79 కోట్ల మోసం

- నకిలీ ఈ-వేబిల్లులతో రూ.58.73 కోట్ల టర్నోవర్ చూపిన వైనం
- ఇద్దరు నిందితుల అరెస్ట్

హైదరాబాద్ సిటీ, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): నకిలీ పత్రాలతో డొల్ల కంపెనీలు స్థాపించి నకిలీ ఇన్‌వాయిస్‌లు, ఇతర పత్రాలతో ప్రభుత్వాన్ని మోసం చేసి ఇన్‌పుట్ ట్యాక్స్ క్రెడిట్ పేరుతో రూ.11.79 కోట్లు మోసం చేసిన ముఠా గుట్టురట్టయింది. ఇద్దరు నిందితులు సొహైల్, హస్నుద్దీన్‌ల సైబరాబాద్ ఆర్థిక నేరాల విభాగం(ఈవోడబ్ల్యూ) అధికారులు గురువారం అరెస్ట్ చేశారు. ఢిల్లీకి చెందిన అబ్దుల్లాను ప్రధాన సూత్రధారిగా గుర్తించారు. అతనితోపాటు అబిడ్స్‌లో ఉంటున్న గుజరాత్‌కు చెందిన సొహైల్ అలియాస్ సోను(34), అడిక్‌మెట్‌కు చెందిన మహ్మద్ హస్నుద్దీన్(43), సయ్యద్ హుస్సేని అలియాస్ ఆజం, ఆయాతి రాజశేఖర్‌లు ముఠాగా ఏర్పడ్డారు. నకిలీ ఆధార్, పాన్, కరెంట్ బిల్లు, రెంటల్ అగ్రిమెంట్‌లు, జీహెచ్ఎంసీ లైసెన్స్, లేబర్ లైసెన్స్, చిరునామాలతో వీరు పలు సంస్థలను రిజిస్టర్ చేయించారు. తర్వాత నకిలీ ఇన్‌వాయిస్‌లతో సంస్థలకు ఆదాయం ఉన్నట్లు చూపారు. నకిలీ ఈ-వే బిల్లులు రూపొందించి కోట్లలో టర్నోవర్ చూపారు. ఈ ముఠా తెలంగాణ, మహారాష్ట్ర, తమిళనాడు, హరియాణా, ఒడిసా, ఛత్తీస్‌గఢ్, కర్ణాటక, గుజరాత్ రాష్ట్రాల్లో కాగితాలపై మొత్తం 52 సంస్థలను ప్రారంభించింది. నకిలీ పత్రాలతో రూ.58.73 కోట్ల టర్నోవర్ చూపారు. 405 నకిలీ ఈ-వేబిల్లులు, 10 జీఎస్టీ రిజిస్ట్రేషన్‌లతో ఇన్‌పుట్ ట్యాక్స్ క్రెడిట్ కింద 11.79 కోట్లు క్లెయిమ్ చేసుకున్నారు. జీఎస్టీ అధికారుల ఫిర్యాదుతో ఈ మోసానికి సంబంధించి ఈవోడబ్ల్యూలో కేసు నమోదైంది.

చిత్రజ్యోతి
SINCE 1965

వదంతులు నమ్మొద్దు
పాసులు ఉంటేనే ప్రవేశం
-రాజమౌళి



మహేశ్‌బాబు కథానాయకుడిగా రాజమౌళి దర్శకత్వంలో తెరకెక్కుతోన్న చిత్రం 'ఎస్ఎస్ఎంబీ 29'. గ్లోబ్‌ట్రోటర్ ఈవెంట్ పేరిట ఈనెల 15న హైదరాబాద్ రామోజీ ఫిల్మ్‌సిటీలో చిత్రబృందం భారీ కార్యక్రమం నిర్వహించబోతోంది. ఈ సందర్భంగా 100 అడుగుల ఎల్ఈడీ స్ర్కీన్‌పై సినిమా టైటిల్‌ను ఆవిష్కరించడం, టీజర్‌ను విడుదల చేయడంతో పాటు సినిమాకు సంబంధించిన మరిన్ని విశేషాలను అభిమానులతో పంచుకోనున్నారు. అయితే ఇటీవల జరిగిన తొక్కిసలాట ఘటనల నేపథ్యంలో పోలీసులు కఠిన ఆంక్షలు విధించారు.

● ఇది ఓపెన్ ఆడిటోరియం ఫంక్షన్, పాసులతో సంబంధం లేకుండా ఎంతమందైనా వెళ్లొచ్చు, మొబైల్ పాసులు చూపించి వెళ్లొచ్చు అంటూ పలు రకాలుగా సోషల్ మీడియాలో జరుగుతున్న ప్రచారంపై రాజమౌళి ఓ వీడియో ద్వారా స్పందించారు. అలాంటి పుకార్లను నమ్మొద్దని తెలిపారు. గ్లోబ్‌ట్రోటర్ ఈవెంట్ పూర్తిగా ఇండోర్‌లో జరుగుతుందని, ఫిజికల్ పాసులు ఉన్నవాళ్లకు మాత్రమే ప్రవేశం ఉంటుందని తెలిపారు. పోలీసులు కఠిన ఆంక్షలు విధించిన నేపథ్యంలో అభిమానులంతా విధిగా వాటిని పాటించాలని సూచించారు. కార్యక్రమం ఆద్యంతం పోలీసుల కనుసన్నల్లో జరుగుతుందని, అభిమానులు సహకరించాలని కోరారు. సోషల్ మీడియాలో ప్రచారమవుతున్న అసత్యాలను నమ్మి ఇబ్బందులు పడొద్దు అని హెచ్చరించారు. పిల్లలు, వృద్ధులకు ప్రవేశం లేదు, కార్యక్రమానికి రాలేనివారు డిస్నీ హాట్‌స్టార్‌లో ప్రత్యక్ష ప్రసారం చూడొచ్చు అని తెలిపారు.

కొదమసింహం.. మళ్లీ వస్తోంది!



మెగాస్టార్ చిరంజీవి కెరీర్‌లోనే ప్రత్యేకమైన చిత్రాల్లో ఒకటిగా నిలిచిన 'కొదమసింహం' మళ్లీ ప్రేక్షకుల ముందుకు వస్తోంది. ఈ నెల 21న 4కే కన్వర్షన్, 5.1 డిజిటల్ సౌండింగ్‌తో సరికొత్తగా ముస్తాబై రీ రిలీజ్ అవుతోంది. ఈ సందర్భంగా చిరంజీవి రీ రిలీజ్ ట్రైలర్‌ను విడుదల చేశారు. చిత్రనిర్మాత కైకాల నాగేశ్వర రావు మాట్లాడుతూ 'ఈ సినిమాను తిరిగి ప్రేక్షకుల ముందుకు తీసుకురావడం సంతోషాన్ని ఇస్తోంది. రీ రిలీజ్ చిత్రాల్లో ఎక్కువ కాలం గుర్తుండిపోయే అనుభూతిని ఇస్తుంది' అని చెప్పారు. వింటేజ్ చిరు యాక్టింగ్, సంభాషణలు, డ్యాన్సులు థియేటర్లో అభిమానుల్ని ఉర్రూతలూగించేలా ఉన్నాయి. అత్యాధునిక సాంకేతికతతో కూడిన ఈ ట్రైలర్ అదిరిపోయింది. టాప్ క్లాస్ విజువల్స్, అద్భుతమైన సౌండింగ్‌తో అందరినీ ఆశ్చర్యానికి గురిచేసింది. ఇటీవల రీ రిలీజ్ అవుతున్న సినిమాల్లో చూడనంత చక్కటి క్వాలిటీ ఇందులో ఉందని నెటిజన్లు అభినందిస్తున్నారు.

'చెవాలియర్' అవార్డు ప్రదానం



ప్రముఖ కళా దర్శకుడు తోట తరణికి ఫ్రెంచ్ ప్రభుత్వం అత్యున్నత పురస్కారమైన 'చెవాలియర్' అవార్డును ప్రదానం చేసింది. గురువారం చెన్నైలోని రష్యన్ కల్చర్ సెంటరులో జరిగిన ఈ కార్యక్రమంలో భారత్‌లోని ఫ్రాన్స్ రాయబారి తెర్రీ మాథౌ అవార్డును అందజేశారు. ఈ సందర్భంగా తోట తరణి విలేకరులతో మాట్లాడుతూ.. 'ఇది ఎంతో ప్రతిష్ఠాత్మకమైన అవార్డు. నాకు మాత్రమే కాదు తమిళనాడుకే గర్వకారణం. చిత్రపరిశ్రమలోని దర్శకులందరూ నన్ను ఎంతగానో ప్రోత్సహించారు' అని అన్నారు.

-చెన్నై(ఆంధ్రజ్యోతి)

తప్పుకొంటున్నా.. క్షమించండి
దర్శకుడు సి.సుందర్



తమిళ సూపర్‌స్టార్ రజినీకాంత్ నటించే 173వ చిత్రం దర్శకత్వ బాధ్యతల నుంచి తప్పుకొంటున్నట్లు సుందర్ ప్రకటించారు. ఈ ప్రకటనను ఆయన సతీమణి, నటి ఖుష్బూ ఎక్స్ హ్యాండిల్‌లో పోస్ట్ చేశారు. 'సుదీర్ఘకాలం తర్వాత రజనీకాంత్, కమల్ హాసన్‌లతో కలిసి పనిచేసే అవకాశం లభించింది. ఈ అరుదైన అవకాశాన్ని కల్పించిన వారిద్దరికీ ధన్యవాదాలు తెలియజేస్తున్నా. అదేసమయంలో నేను సూపర్‌స్టార్ చిత్రానికి దర్శకత్వం వహిస్తున్నట్టు తెలుసుకుని ఎంతో సంతోషపడిన అభిమానులను క్షమాపణలు కోరుతున్నాను. అనివార్య పరిస్థితుల దృష్ట్యా 'తలైవర్ 173' నుంచి తప్పుకోవాలన్న కఠిన నిర్ణయం తీసుకున్నాను. ఈ ఇద్దరితో కలిసి పనిచేయడం నాకు ఒక కల. కానీ, మన కోసం నిర్దేశించిన మార్గాన్ని మనం అనుసరించాల్సిన సందర్భాలు ఉన్నాయి. ఈ ఇద్దరు గొప్ప వ్యక్తులను అత్యున్నతంగా గౌరవిస్తాను. వారు నాకు ఎన్నో అమూల్యమైన పాఠాలు నేర్పారు. ఈ అరుదైన అవకాశానికి దూరమైనప్పటికీ ఎల్లవేళలా వారి మార్గదర్శకత్వాన్ని కోరుకుంటాను' అని పేర్కొన్నారు. కాగా, ఈ ప్రకటన పోస్ట్ చేసిన కొన్ని నిమిషాల్లోనే ఎక్స్ వేదిక నుంచి ఖుష్బూ తొలగించారు.

-చెన్నై(ఆంధ్రజ్యోతి)

సామాజిక ప్రయోజనం ఉన్న చిత్రం
- మధుర శ్రీధర్‌రెడ్డి



మనం చేసే సినిమాకు సామాజిక ప్రయోజనం ఉండాలని నమ్మే దర్శక నిర్మాతను నేను. 'సంతాన ప్రాప్తిరస్తు' చిత్రాన్ని కూడా వినోదం, సందేశం మేళవింపుగా తెరకెక్కించాం. ప్రేక్షకులు కుటుంబంతో కలసి ఆస్వాదించేలా మా సినిమా ఉంటుంది' అని మధుర శ్రీధర్ రెడ్డి చెప్పారు. ఆయన నిర్వి హరిప్రసాద్ రెడ్డితో కలసి నిర్మించిన చిత్రమిది. విక్రాంత్, చాందినీ చౌదరి జంటగా నటించారు. సంజీవ్ రెడ్డి దర్శకుడు. నేడు విడుదలవుతోన్న సందర్భంగా గురువారం చిత్రబృందం ప్రీ రిలీజ్ ఈవెంట్‌ను నిర్వహించింది. సంజీవ్‌రెడ్డి మాట్లాడుతూ 'మంచి కంటెంట్ ఇవ్వాలనే లక్ష్యంతో ఈ సినిమా చేశాను' అని చెప్పారు. అన్ని వర్గాల ప్రేక్షకులను అలరించే అంశాలతో తెరకెక్కిన చిత్రమిది అని విక్రాంత్ చెప్పారు.

'అర్జున్‌రెడ్డి' కన్నా ఎక్స్‌ట్రీమ్‌గా తీశారు
- సందీప్‌రెడ్డి వంగా



'జిగ్రీస్ లాంటి సినిమా చేయాలంటే యూనిట్ అందరికీ ఒక పిచ్చి కావాలి. ప్రచార చిత్రాలు చూస్తుంటే నిజాయితీగా చేసిన ప్రయత్నం అనిపించింది. నేను తీసిన 'అర్జున్‌రెడ్డి' చిత్రం కన్నా ఎక్స్‌ట్రీమ్‌గా తీశారు' అని దర్శకుడు సందీప్‌రెడ్డి వంగా అన్నారు. రామ్‌నితిన్, కృష్ణ బురుగుల, ధీరజ్ ఆత్రేయ ప్రధాన పాత్రల్లో దర్శకుడు ఉప్పల హరీశ్‌రెడ్డి తెరకెక్కించిన చిత్రమిది. కృష్ణ వోడపల్లి నిర్మాత. నేడు ఈ చిత్రం విడుదలవుతోంది. ఈ సందర్భంగా చిత్రబృందం గురువారం నిర్వహించిన కార్యక్రమంలో దర్శకుడు మాట్లాడుతూ 'నిర్మాత కృష్ణగారు కథను నమ్మి ఈ సినిమా చేశారు' అని చెప్పారు. కృష్ణ వోడపల్లి మాట్లాడుతూ 'అన్ని వర్గాల ప్రేక్షకులు ఎంజాయ్ చేసేలా ఈ చిత్రం ఉంటుంది' అని అన్నారు.

ఇది కవరేజ్ కాదు.. అమర్యాద
-కరణ్ జోహార్



బాలీవుడ్ నటుడు ధర్మేంద్ర ఆస్పత్రి నుంచి డిశ్చార్జి అయ్యి ఇంట్లో చికిత్స తీసుకుంటున్న సంగతి తెలిసిందే. అయితే కొందరు ఫొటోగ్రాఫర్స్ ఆయన ఇంట్లో బెడ్‌పై చికిత్స తీసుకుంటున్న దృశ్యాలను సోషల్ మీడియాలో షేర్ చేశారు. అందులో ధర్మేంద్ర ఆరోగ్య పరిస్థితి దీనంగా ఉంది. ఆయన కదల్లేని స్థితిలో ఉన్నారు. ధర్మేంద్ర ఇద్దరు కొడుకులు సన్నీ డియోల్, బాబీ డియోల్ కూడా అక్కడే ఉన్నారు. నెట్టింట వైరల్ అవుతున్న ఈ వీడియోపై దర్శకుడు కరణ్ జోహార్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. 'ఆ కుటుంబానికి కాస్త ప్రైవసీ ఇవ్వండి. వాళ్లు ఇప్పటికే ఎంతో బాధలో ఉన్నారు. భారతీయ సినిమా కోసం ఎంతో చేసిన ఓ గొప్ప నటుడి విషయంలో ఫొటోగ్రాఫర్స్, మీడియా ఇలా ప్రవర్తించడం హృదయాన్ని ముక్కలు చేస్తోంది. ఇదెంత మాత్రం ఆమోదయోగ్యం కాదు. ఇది కవరేజ్ కాదు.. అమర్యాద' అని పేర్కొన్నారు.

చరిత్ర సృష్టించిన అనుపమ

వరల్డ్ స్నూకర్ టైటిల్ కైవసం



దోహా: వరల్డ్ స్నూకర్ టైటిల్ నెగ్గిన తొలి భారత మహిళగా అనుపమ రామచంద్రన్ చరిత్ర సృష్టించింది. గురువారం జరిగిన ఫైనల్లో అనుపమ 3-2తో మూడు సార్లు చాంపియన్ ఎన్‌జీ ఆన్ యి (హాంకాంగ్)పై విజయం సాధించింది. సెమీస్‌లో అనుపమ 3-1తో భారత్‌కే చెందిన కీర్తన పాండియన్‌పై గెలిచింది.

సురేఖ డబుల్ ధమాకా

- 'కాంపౌండ్'లో భారత్‌కు మూడు స్వర్ణాలు
- ఆసియా ఆర్చరీ చాంపియన్‌షిప్



ఢాకా: జ్యోతి సురేఖ ముందుండి నడిపించడంతో.. ఆసియా చాంపియన్‌షిప్స్‌లో భారత కాంపౌండ్ ఆర్చర్లు మూడు స్వర్ణాలు, రెండు రజతాలు కొల్లగొట్టారు. సీనియర్ ఆర్చర్ సురేఖ టీమ్‌తోపాటు వ్యక్తిగత స్వర్ణంతో రాణించింది. గురువారం జరిగిన మహిళల టీమ్ ఫైనల్లో సురేఖ, దీప్షిక, ప్రతీక ప్రదీప్‌ల త్రయం 236-234తో కొరియాపై గెలిచి పసిడి పతకం సొంతం చేసుకొంది. తొలి సెట్‌లో 59-59తో సమంగా నిలిచినా రెండో సెట్‌లో భారత్ 59-58తో కొరియాపై ఆధిక్యం సాధించింది. మూడో సెట్ 59-59తో సమం కాగా.. నాలుగో సెట్‌లో 59-58తో పైచేయి సాధించిన భారత్ పసిడి పతకాన్ని సొంతం చేసుకొంది. ఇక, మహిళల వ్యక్తిగత విభాగంలో సహచరి, 17 ఏళ్ల ప్రతీకపై జ్యోతిసురేఖ 147-145తో గెలిచి రెండో బంగారు పతకాన్ని దక్కించుకొంది. దీంతో ప్రతీకకు రజతం లభించింది. మిక్స్‌డ్ విభాగం స్వర్ణ పోరులో దీప్షిక-అభిషేక్ వర్మ జోడీ 153-151తో బంగ్లాదేశ్ జంటపై గెలిచింది. అయితే, ఫేవరెట్‌గా బరిలోకి దిగిన పురుషుల జట్టుకు ఫైనల్లో షాక్ తగిలింది. అభిషేక్ వర్మ, రాజేష్ జాదవ్, ప్రథమేష్‌ల త్రయం 229-230 కజకిస్థాన్ బృందం చేతిలో ఓడి రజతానికే పరిమితమైంది.

ప్రీక్వార్టర్స్‌కు అర్జున్, హరికృష్ణ

చెస్ వరల్డ్‌కప్

పనాజీ: అర్జున్ ఇరిగేసి, పెంటేల హరికృష్ణ ఫిడే వరల్డ్‌కప్ ప్రీక్వార్టర్స్‌కు దూసుకెళ్లారు. గురువారం జరిగిన నాలుగోరౌండ్ టైబ్రేక్‌లోని రెండు గేముల్లోనూ హంగేరీ జీఎం పీటర్ లెకోపై గెలిచిన అర్జున్ 3-1తో విజయం సాధించాడు. ఇక టైబ్రేక్‌లో తొలి గేమ్‌ను డ్రా చేసుకొన్న హరి.. రెండో గేమ్‌లో స్వీడన్ జీఎం గ్రాండ్‌లస్‌పై నెగ్గి 2.5-1.5తో ముందంజ వేశాడు. అయితే, గత వరల్డ్‌కప్ రన్నరప్ ప్రజ్ఞానంద 1.5-2.5తో డబోవ్ చేతిలో పరాజయం పాలయ్యాడు.

ఆఖరాటా కివీస్‌దే.. 3-1తో సిరీస్ కైవసం

డ్యునెడిన్: వెస్టిండీస్‌తో జరిగిన ఆఖరి, ఐదవ టీ20లోనూ నెగ్గిన న్యూజిలాండ్ సిరీస్‌ను 3-1తో కైవసం చేసుకుంది. తొలుత విండీస్ 18.4 ఓవర్లలో 140 పరుగులకు ఆలౌటైంది. అనంతరం కివీస్ 15.4 ఓవర్లలో 2 వికెట్లకు 141 రన్స్‌తో లక్ష్యాన్ని ఛేదించింది. జాకబ్ డఫీ (4/35) ఒకే ఓవర్లో మూడు వికెట్లు తీశాడు.

రుతురాజ్ సెంచరీ

భారత్ 'ఎ' విజయం



రాజ్‌కోట్: ఓపెనర్ రుతురాజ్ గైక్వాడ్ (117) శతకం సాధించడంతో దక్షిణాఫ్రికా 'ఎ' జట్టుతో జరిగిన తొలి అనధికార వన్డేలో భారత్ 'ఎ' 4 వికెట్ల తేడాతో నెగ్గింది. గురువారం జరిగిన ఈ మ్యాచ్‌లో ముందుగా బ్యాటింగ్‌కు దిగిన దక్షిణాఫ్రికా 50 ఓవర్లలో 9 వికెట్లకు 285 పరుగులు సాధించింది. 53/5 స్కోరుతో కష్టాల్లో పడిన జట్టును లోయరార్డర్‌లో పొట్గీటర్ (90), ఫారెస్టర్ (77), ఫోర్టున్ (59) ఆదుకున్నారు. హర్షిత్, అర్ష్‌దీప్‌లకు రెండేసి వికెట్లు దక్కాయి. ఆ తర్వాత ఛేదనలో భారత్ 'ఎ' 49.3 ఓవర్లలో 6 వికెట్లకు 290 పరుగులు చేసి విజయం సాధించింది. కెప్టెన్ తిలక్ వర్మ (39), నితీశ్ కుమార్ రెడ్డి (37), అభిషేక్ శర్మ (31), నిశాంత్ (29) సహకరించారు. ఫోర్టున్, బార్ట్‌మన్, వూరెన్‌లకు రెండేసి వికెట్లు దక్కాయి. సిరీస్‌లోని మిగిలిన రెండు వన్డే మ్యాచ్‌లు 16, 19 తేదీల్లో రాజ్‌కోట్ వేదికగానే జరుగుతాయి.

సఫారీలతో సవాల్

స్పెషలిస్ట్ బ్యాటర్‌గా జురెల్

స్పిన్ బలంతో దక్షిణాఫ్రికా

తొలి టెస్టు బరిలో భారత్

ఉ. 9.30 నుంచి స్టార్‌స్పోర్ట్స్‌లో..



కోల్‌కతా: భారత పర్యటనకు వచ్చే ఏ జట్టయినా ఇక్కడి పిచ్‌లపై స్పిన్నర్లను ఎదుర్కోవడంలో తడబడుతుంటుంది. కానీ ఇప్పుడు దక్షిణాఫ్రికా రూపంలో భారత జట్టుకే కఠిన పరీక్ష ఎదురుకానుంది. రెండు టెస్టుల సిరీస్‌లో భాగంగా శుక్రవారం ఇరు జట్ల మధ్య ఈడెన్ గార్డెన్స్‌లో తొలి టెస్టు ఆరంభమవుతోంది. ఈ ఏడాది మొదట్లో న్యూజిలాండ్‌తో స్వదేశంలో జరిగిన మూడు టెస్టుల సిరీస్‌ను టీమిండియా 0-3తో కోల్పోయిన విషయం తెలిసిందే. అందుకు కారణం.. ఆ జట్టులోని స్పిన్నర్లు ఎజాజ్ పటేల్, శాంట్నర్, ఫిలిప్స్. ఇక దక్షిణాఫ్రికా జట్టు సహజంగా పదునైన పేసర్లతో బలంగా ఉంటుందనే అభిప్రాయం ఉంటుంది. కానీ ప్రస్తుతం ప్రపంచ అత్యుత్తమ స్పిన్నర్లతో ఈ టీమ్ కూడా ప్రత్యర్థి జట్లను బెదరగొడుతోంది. ఆ బలంతోనే ఈ టూర్‌కు ముందు పాక్‌తో సిరీస్‌ను 1-1తో సమం చేసుకోగలిగింది. ఇందులో పాక్ కోల్పోయిన 39 వికెట్లలో స్పిన్ త్రయం కేశవ్ మహరాజ్, సైమన్ హార్మర్, ముత్తుస్వామి కలిపి 35 పడగొట్టడం విశేషం. అదే పాక్ స్పిన్నర్లు తమ సొంతగడ్డపైనే ఆడినా 21 వికెట్లు మాత్రమే తీశారు. అందుకే తాజా సిరీస్‌ను భారత ఉపఖండ జట్టుతోనే ఆడబోతున్నట్టుగా ఉందని టీమిండియా సహాయక కోచ్ టెన్ డష్కాటే అభిప్రాయపడ్డాడు. అయితే టెస్టు ఫార్మాట్‌లో దక్షిణాఫ్రికాకు భారత్‌లో మెరుగైన రికార్డు లేకపోవడం మనకు కాస్త సానుకూలాంశం. ఆ జట్టిక్కడ టెస్టు గెలిచి 15 ఏళ్లు కావడం గమనార్హం. అంతేకాకుండా చివరగా ఆడిన ఏడు టెస్టుల్లో ఆరింటిని కోల్పోయింది. అయినప్పటికీ ఈసారి వరల్డ్ టెస్టు చాంపియన్ హోదాలో ఉన్న సఫారీలను గిల్ సేన ఎలా ఎదుర్కొంటుందో వేచిచూడాల్సిందే.



బవుమా

బ్రెవిస్ స్థానంలో బవుమా

పాక్‌తో సిరీస్‌ను 1-1తో సమం చేసుకుని భారత పర్యటనకు వచ్చిన సౌతాఫ్రికా ఆత్మవిశ్వాసంతో ఉంది. బ్యాటింగ్, బౌలింగ్‌ల్లో సమతూకంగా కనిపిస్తున్న ఈ జట్టు ఎలాగైనా భారత్‌ను ఓడించాలన్న పట్టుదలతో ఉంది. గాయంతో పాక్ పర్యటనకు దూరమైన కెప్టెన్ బవుమా ఇటీవలే భారత్ 'ఎ'పై బరిలోకి దిగి ఫిట్‌నెస్ నిరూపించుకున్నాడు. దీంతో డివాల్డ్ బ్రెవిస్ స్థానంలో తను ఆడనున్నాడు. మార్‌క్రమ్, రికెల్టన్, స్టబ్స్‌లతో టాపార్డర్ భారత పేసర్లను ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉంది. ఐపీఎల్ ద్వారా వీరికి ఇక్కడి పిచ్‌లపై అవగాహన ఉంది. మిడిలార్డర్‌లో జోర్జి, బవుమా, వెరీన్ కీలకం కానున్నారు. యాన్సెన్, రబాడ పేస్ బాధ్యతలు తీసుకోనుండగా.. కేశవ్, హార్మర్, ముత్తుస్వామి స్పిన్‌తో ఇబ్బందిపెట్టేందుకు సిద్ధమవుతున్నారు.

తుది జట్లు (అంచనా)

భారత్: రాహుల్, జైస్వాల్, సాయి సుదర్శన్, గిల్ (కెప్టెన్), పంత్, జురెల్, జడేజా, వాషింగ్టన్ సుందర్, కుల్దీప్/అక్షర్, బుమ్రా, సిరాజ్.

దక్షిణాఫ్రికా: మార్‌క్రమ్, రికెల్టన్, స్టబ్స్, జోర్జి, బవుమా (కెప్టెన్), వెరీన్, ముత్తుస్వామి, హార్మర్, యాన్సెన్, కేశవ్ మహరాజ్, రబాడ.

పిచ్-వాతావరణం

ఈడెన్ పిచ్ సహజంగా స్పిన్నర్లకు సహకరిస్తుంటుంది. అయితే ఈసారి పూర్తి టర్నింగ్ వికెట్ కాకుండా పేసర్లకు కూడా అనుకూలించే అవకాశం ఉంది. తొలి రోజు పేసర్లదే ఆధిపత్యం కానుంది. కాస్త ఓపిక పడితే బ్యాటర్లు పరుగులు సాధించే వీలుంటుంది. ఆఖరి రెండు రోజులు మాత్రం స్పిన్‌ను ఎదుర్కోవడం బ్యాటర్లకు పరీక్ష కానుంది. వర్షసూచన లేదు.

కుల్దీప్ ఆడేనా?

భారత్ 'ఎ' తరఫున శతకాల మోత మోగించిన కీపర్ ధ్రువ్ జురెల్ స్పెషలిస్ట్ బ్యాటర్‌గా ఆడడం ఖాయమే. కీపర్‌గా పంత్ కొనసాగనున్నాడు. ఓపెనర్లుగా రాహుల్, జైస్వాల్‌లతో పాటు వన్‌డౌన్ బ్యాటర్‌గా సాయి సుదర్శన్ ఆ తర్వాత కెప్టెన్ గిల్‌లతో భారత బ్యాటింగ్ ఆర్డర్ పటిష్టంగానే కనిపిస్తోంది. అయితే బ్యాటింగ్ డెప్త్ కోసం ఆల్‌రౌండర్‌గా అక్షర్‌ను ఆడించాలా? లేక స్పిన్నర్ కుల్దీప్‌తో వెళ్లాలా? అనే ఆలోచనలో టీమ్ మేనేజ్‌మెంట్ ఉంది. ఇటీవలి కాలంలో ఈడెన్ పిచ్ కాస్త పేసర్లకు సహకరిస్తుండడంతో మూడో పేసర్‌ను కూడా ఆడిస్తే ఎలా ఉంటుందన్న యోచనలోనూ ఉన్నారు. ఏదిఏమైనా శుక్రవారం ఉదయం పిచ్‌ను పరిశీలించాకే నిర్ణయం తీసుకుంటామని కెప్టెన్ గిల్ చెబుతున్నాడు. స్పిన్ ఆల్‌రౌండర్లు జడేజా, సుందర్ తుది జట్టులో ఉండనుండగా.. కుల్దీప్ స్థానమే సందేహంలో ఉంది. భారత్ ఆడిన చివరి టెస్టులోనైతే ఇద్దరు పేసర్లు, ముగ్గురు స్పిన్నర్లు జట్టులో ఉన్నారు. ఒకవేళ ముగ్గురు పేసర్లు అనుకుంటే బుమ్రా, సిరాజ్‌కు జతగా ఆకాశ్ దీప్‌ను ఆడించవచ్చు.

వెనక్కితగ్గిన లంక క్రికెటర్లు

పాక్ టూర్‌లో కొనసాగడానికి ఓకే..

- టీ20 ముక్కోణపు టోర్నీ రీషెడ్యూల్
- భద్రతపై పాక్ ఆర్మీ చీఫ్ భరోసా



రావల్పిండి: భద్రతాపరమైన భయాలు నెలకొనడంతో.. పాక్, శ్రీలంక, జింబాబ్వేలు తలపడనున్న టీ20 ముక్కోణపు సిరీస్‌ను పాకిస్థాన్ క్రికెట్ బోర్డు (పీసీబీ) రీషెడ్యూల్ చేసింది. ఆరంభ తేదీని ఈ నెల 17 నుంచి 18వ తేదీకి మార్చింది. ఇస్లామాబాద్‌లో ఆత్మాహుతి దాడి నేపథ్యంలో కేవలం రావల్పిండిలోనే టోర్నీ మొత్తాన్ని నిర్వహించనున్నట్టు పీసీబీ ప్రకటించింది. అంతకుముందు లాహోర్‌లో ఐదు మ్యాచ్‌లతోపాటు ఫైనల్ కూడా నిర్వహించాలనుకొన్నారు. కాగా, ప్రస్తుతం పాక్ పర్యటనలో వన్డే సిరీస్ ఆడుతున్న లంక జట్టు ఈ దాడులతో భయోత్పాతానికి గురైంది. ఈ క్రమంలో కొందరు ఆటగాళ్లు సిరీస్ మధ్యలోనే జట్టును వీడాలన్న నిర్ణయానికి వచ్చారు. అయితే, పాక్ ఆర్మీ చీఫ్ అసిమ్ మునీర్.. లంక ప్రభుత్వ పెద్దలతో మాట్లాడి జట్టు భద్రతపై హామీ ఇచ్చినట్టు పీసీబీ చీఫ్ మొహిసిన్ నఖ్వీ తెలిపారు. లంక బోర్డు కూడా తమ ఆటగాళ్లను గట్టిగా వారించడంతో.. ఈ పర్యటనలో కొనసాగడానికే లంక ప్లేయర్లు నిర్ణయించుకొన్నారు. దీంతో సిరీస్‌లో భాగంగా గురు, శనివారాల్లో నిర్వహించాల్సిన రెండు వన్డేలను ఈ నెల 14, 16కు రీషెడ్యూల్ చేశారు. ట్రై సిరీస్ కోసం జింబాబ్వే జట్టు కూడా పాక్‌కు చేరుకొంది.

క్వార్టర్స్‌లో లక్ష్యసేన్

- ప్రణయ్ ఓటమి
- జపాన్ ఓపెన్

కుమమోటో (జపాన్): భారత స్టార్ షట్లర్ లక్ష్య సేన్ జపాన్ ఓపెన్ మాస్టర్స్ టోర్నమెంట్లో క్వార్టర్స్‌కు చేరుకున్నాడు. గురువారం జరిగిన రెండో రౌండ్‌లో తను జియా హెంగ్ జేసన్ (సింగపూర్)పై 21-13, 21-11 తేడాతో వరుస గేముల్లో నెగ్గాడు. క్వార్టర్స్‌లో సింగపూర్‌కే చెందిన లో కీన్ యూతో లక్ష్య సేన్ ఆడనున్నాడు. ఇక హెచ్ఎస్ ప్రణయ్ పోరాటం రెండో రౌండ్‌కే పరిమితమైంది. 46 నిమిషాలపాటు సాగిన ఈ మ్యాచ్‌లో ప్రణయ్ 18-21, 15-21 తేడాతో రాస్మస్ గెమ్కే (డెన్మార్క్) చేతిలో ఓటమి పాలయ్యాడు.

ముంబైకి శార్దూల్, రూథర్‌ఫోర్డ్

ఐపీఎల్ ట్రేడింగ్‌లో సొంతం

న్యూఢిల్లీ: భారత ఆల్‌రౌండర్ శార్దూల్ ఠాకూర్, వెస్టిండీస్ ఆటగాడు షెర్ఫేన్ రూథర్‌ఫోర్డ్‌లు ముంబై ఇండియన్స్ జట్టులో చేరారు. 2026 సీజన్ కోసం జరిగిన ట్రేడ్ విండోలో వీరిద్దరినీ ముంబై కొనుగోలు చేసింది. మెగా వేలంలో లఖ్‌నవూ దక్కించుకొన్న శార్దూల్‌ను అతడి కొనుగోలు ధర రూ. 2 కోట్లకు ముంబై ఖరీదు చేసింది. గుజరాత్ జెయింట్స్ ఆటగాడు రూథర్‌ఫోర్డ్‌ను అతడి వేలం ధర రూ. 2.6 కోట్లకు ముంబై సొంతం చేసుకొంది. కాగా, లెఫ్టామ్ పేసర్ అర్జున్ టెండూల్కర్‌ను ముంబై వదిలేయనుంది.

ఒలింపిక్స్ క్రికెట్ షెడ్యూల్ వచ్చేసింది!

2028, జూలై 20, 29న పతక మ్యాచ్‌లు

న్యూఢిల్లీ: లాస్ ఏంజిల్స్ ఒలింపిక్స్-2028లో క్రికెట్ మ్యాచ్‌ల షెడ్యూల్‌ను నిర్వాహకులు విడుదల చేశారు. టీ20 ఫార్మాట్‌లో జరిగే ఈ పోటీల్లో ఆరు జట్లు పాల్గొననున్నాయి. మహిళల మ్యాచ్‌లు 2028, జూలై 12 నుంచి 20 వరకు, పురుషుల మ్యాచ్‌లు జూలై 22 నుంచి 29 వరకు జరగనున్నాయి. లాస్ ఏంజిల్స్‌కు 50 కిమీ. దూరంలో నిర్మించే తాత్కాలిక స్టేడియాల్లో రోజుకు రెండు మ్యాచ్‌లు నిర్వహించనున్నారు.

ఐటీలో నాలుగేళ్ల గరిష్ఠానికి నిరుద్యోగం

కొనసాగుతున్న కొలువుల కోత

మరో 50,000 మందిపై పొంచి ఉన్న వేటు?

ఇన్‌స్టాహైర్ వెల్లడి

న్యూఢిల్లీ: నిన్న మొన్నటి వరకు ఐటీ ఉద్యోగమంటే ఒక క్రేజ్. వారానికి ఐదు రోజుల పని, నెలకు ఐదు లేదా ఆరు అంకెల్లో జీతం. నగరాల్లో కాస్మోపాలిటన్ లైఫ్, వీకెండ్‌లో ఫ్రెండ్స్ లేదా ఫ్యామిలీతో పార్టీలు, విహార యాత్రలు. ఇప్పుడు అదంతా గతం. ప్రస్తుతం ఉన్న ఉద్యోగం ఎప్పుడు ఊడుతుందో తెలియని స్థితి. దినదిన గండం నూరేళ్ల ఆయుష్షులా బతకాల్సిన దుస్థితి. ఈ ఏడాది అక్టోబరు నాటికి ఐటీ నిపుణుల్లో నిరుద్యోగం గత నాలుగేళ్లలో ఎన్నడూ లేని విధంగా 7.2 శాతానికి చేరిందని ఐటీ కంపెనీలకు నియామక సేవలు అందించే ఇన్‌స్టాహైర్ అనే సంస్థ తెలిపింది.

అంతా టెక్నాలజీ పుణ్యం: ఐటీ రంగంలో ప్రస్తుతం కృత్రిమ మేధ (ఏఐ) ట్రెండ్ నడుస్తోంది. ఏఐ, క్లౌడ్ కంప్యూటింగ్, మెషిన్ లెర్నింగ్, సైబర్ సెక్యూరిటీ వంటి డిజిటల్ నైపుణ్యాల్లో పట్టు ఉంటేనే ఉద్యోగం. లేకపోతే 'మీ సేవలు ఇక చాలు' అని ఐటీ కంపెనీలు.. ఉద్యోగులకు చావు కబురు చల్లగా చెప్పేస్తున్నాయి. దీనికి తోడు అమెరికా, ఈయూ దేశాల నుంచి వచ్చే ప్రాజెక్టులు తగ్గిపోయాయి. అరకొర ప్రాజెక్టులు వచ్చినా, బిల్లింగ్ పెద్దగా పెరగడం లేదు. దీంతో ఖర్చులు పెరిగిపోయి కంపెనీల లాభాలకూ గండి పడుతోంది. ఈ పరిణామాలతో దాదాపు 24 శాతం కంపెనీలు ఖర్చులు తగ్గించుకునేందుకు ఉద్యోగులపై వేటు వేస్తున్నాయి. టీసీఎస్ వంటి పెద్ద కంపెనీలతో పాటు కోఫోర్జ్ వంటి మధ్య స్థాయి ఐటీ కంపెనీలు ఇప్పటికే పునర్ వ్యవస్థీకరణ పేరుతో ఉద్యోగాల కోత అమలు చేస్తున్నాయి. ఈ ఏడాది సెప్టెంబరు నాటికి దేశీయ ఐటీ దిగ్గజం టీసీఎస్ దాదాపు 19,755 మంది ఉద్యోగులను ఇంటికి పంపించింది. ఇదే కాలంలో మధ్య స్థాయి ఐటీ కంపెనీ కోఫోర్జ్ కూడా 5,000 మంది ఉద్యోగులను రోడ్డున పడేసింది. ఐటీ కంపెనీలు త్వరలో మరో 50,000 మందిని తొలగించే అవకాశం ఉందని తెలుస్తోంది.

ఫ్రెషర్స్ డీలా

బీఈ, బీటెక్ పూర్తి చేసే వారిలో నూటికి 60-70 శాతం మందికి ఇప్పటి వరకు ఐటీ రంగంలోనే కొలువులు లభించేవి. కంపెనీలు కూడా నేరుగా కాలేజీలకు వెళ్లి ఇంటర్వ్యూలు చేసి తమకు కావాల్సిన నైపుణ్యాలు ఉన్న ఫ్రెషర్లకు ప్లేస్‌మెంట్లు ఇచ్చేవి. ఏఐ పుణ్యమాని ఇప్పుడా పరిస్థితి లేదు. గతంలోలా ఐటీ కంపెనీలు పెద్దగా క్యాంపస్ ప్లేస్‌మెంట్స్‌కు వెళ్లడం లేదు. ఉన్న ఉద్యోగులకే ఏఐ నైపుణ్యాల్లో శిక్షణ ఇచ్చి పని కానిచ్చేస్తున్నాయి. దీంతో ఐటీ ఉద్యోగాలపై గంపెడాశలు పెట్టుకున్న ఫ్రెషర్స్ నీరుగారిపోతున్నారు. ఏఐ నైపుణ్యాలపై అవగాహన ఉన్న ఫ్రెషర్లకు మాత్రమే కంపెనీలు కొద్దో గొప్పో అవకాశం ఇస్తున్నాయి.

కార్ల ఉత్పత్తి పెంపు

20-40% మేర పెంచేందుకు కంపెనీల సన్నాహాలు ● టాప్‌గేర్‌లో విక్రయాలు ● జీఎస్‌టీ రేట్ల తగ్గింపుతో బూస్ట్



న్యూఢిల్లీ: దేశీయ కార్ల పరిశ్రమ ప్రస్తుతం మంచి జోరు మీద ఉంది. పండగ సీజన్ గిరాకీ, జీఎస్‌టీ రేట్ల తగ్గింపుతో గత నెలలో కంపెనీల కార్ల అమ్మకాలు రికార్డు స్థాయిలో 5,57,373కు చేరాయి. దీంతో చాలా మంది డీలర్ల వద్ద స్టాకు లేకుండా పోయింది. ఈ నెల ప్రారంభానికి మారుతి సుజుకీ డీలర్ల వద్ద ఉండే కార్ల నిల్వలు 1.04 లక్షల యూనిట్లకు పడిపోయాయి. ఈ నిల్వలు 19 రోజుల అమ్మకాలకు మాత్రమే సరిపోతాయి. మరోవైపు ఆర్డర్లు మాత్రం 3.5 లక్షల యూనిట్లకు చేరాయి. ఈ గ్యాప్‌ను భర్తీ చేసేందుకు కంపెనీలు ఈ నెల ఉత్పత్తి సామర్థ్యాన్ని సగటున 20 నుంచి 40 శాతం వరకు పెంచాయి. సెప్టెంబరు నెలాఖరు వరకు నెలకు సగటున 1.72 లక్షల కార్లను ఉత్పత్తి చేస్తున్న మారుతి సుజుకీ ఈ నెల రెండు లక్షల కార్లకు పైగా ఉత్పత్తి చేయనుంది. ఇందు కోసం కంపెనీ యూనిట్లు ఆదివారాలు కూడా పని చేస్తున్నట్టు కంపెనీ సీనియర్ ఎగ్జిక్యూటివ్ అధికారి ఒకరు చెప్పారు.

మిగతా కంపెనీలదీ అదే బాట

టాటా మోటార్స్ కూడా తన నెలవారీ కార్ల ఉత్పత్తి సామర్థ్యాన్ని ఈ నెల 47,000 నుంచి 65,000-70,000కు పెంచుతోంది. హ్యూండయ్ మోటార్‌దీ ఇదే పరిస్థితి. డీలర్ల వద్ద నిల్వలు పెంచేందుకు ప్రస్తుతం ఈ కంపెనీ రెండు షిఫ్టుల్లో పని చేస్తోంది. పండగ సీజన్ గిరాకీతో పాటు జీఎస్‌టీ రేట్ల కోతతో కార్ల డిమాండ్ అమాంతం పెరిగిందని కంపెనీ ఉన్నతాధికారి ఒకరు చెప్పారు. ఈ గిరాకీ ఈ ఆర్థిక సంవత్సరం చివరి వరకు కొనసాగుతుందని టాటా మోటార్స్ భావిస్తోంది. అమ్మకాలు పెరగటంతో ఆటోమొబైల్ కంపెనీలన్నీ ఉత్పత్తిని 20 నుంచి 40 శాతం పెంచేందుకు సన్నాహాలు చేస్తున్నాయి.

ఆరు శాతం అప్!

నిజానికి ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ప్రథమార్థం పరిశ్రమకు పెద్దగా కలిసి రాలేదు. అయితే జీఎస్‌టీ రేట్ల కోతతో పండగ సీజన్‌లో కార్ల కొనుగోళ్లు అమాంతం పెరిగాయి. గత ఏడాది ఫెస్టివల్ సీజన్‌తో పోలిస్తే ఈ ఏడాది పండగల సీజన్‌లో అమ్మకాల గిరాకీ రికార్డు స్థాయిలో 25 శాతం పెరిగింది. దీంతో ఈ ఏడాది అక్టోబరు- 2026 మార్చి మధ్య కాలంలో అమ్మకాల డిమాండ్ 6 శాతం పెరిగే అవకాశం ఉందని కంపెనీల అంచనా. కొత్త మోడల్స్ విడుదల, ఉత్పత్తి సామర్థ్య విస్తరణ ద్వారా ఈ గిరాకీని తట్టుకోవాలని కార్ల కంపెనీలు భావిస్తున్నాయి.

'బీమా'లోకి మహీంద్రా

కెనడా సంస్థ మనులైఫ్‌తో జేవీ ఏర్పాటు ● రూ.7,200 కోట్ల పెట్టుబడి

న్యూఢిల్లీ: మహీంద్రా గ్రూప్ బీమా సేవల రంగంలోకి ప్రవేశిస్తోంది. కెనడాలోని టొరంటో కేంద్రంగా కార్యకలాపాలు సాగిస్తున్న మనులైఫ్‌తో కలిసి చెరి సగం భాగస్వామ్యం (జేవీ)తో జీవిత బీమా సంస్థ ఏర్పాటుకు ఒప్పందం కుదుర్చుకున్నట్లు మహీంద్రా అండ్ మహీంద్రా (ఎం అండ్ ఎం) గురువారం ప్రకటించింది. ఈ జేవీలో ఒక్కో భాగస్వామి రూ.3,600 కోట్ల చొప్పున మొత్తం రూ.7,200 కోట్ల పెట్టుబడులు పెట్టబోతున్నాయి. మొదటి ఐదేళ్లలో ఒక్కో భాగస్వామి రూ.1,250 కోట్ల వరకు ఇన్వెస్ట్ చేసే అవకాశం ఉంది. మహీంద్రా ఫైనాన్స్ నుంచి సమకూరే డివిడెండ్ సొమ్ముతో ఈ జేవీలో పెట్టుబడులు పెట్టనున్నట్లు ఎం అండ్ ఎం తెలిపింది. వచ్చే పదేళ్లలో ఈ జేవీ వ్యాపారాన్ని రూ.18,000 కోట్ల నుంచి రూ.30,000 కోట్ల స్థాయికి పెంచాలనుకుంటున్నట్లు మహీంద్రా గ్రూప్ సీఈఓ, ఎండీ అనీశ్ షా తెలిపారు. కాగా బీమా సేవల లైసెన్సు కోసం ఐఆర్‌డీఏఐకి వచ్చే 2-3 నెలల్లో దరఖాస్తు చేసుకోనున్నట్లు షా వెల్లడించారు. కంపెనీ కార్యకలాపాల ప్రారంభానికి 15-18 నెలలు పట్టవచ్చన్నారు.

మనులైఫ్‌తో ఏడేళ్ల అనుబంధం: మహీంద్రా గ్రూప్, మనులైఫ్ కలిసి ఇప్పటికే దేశంలో మ్యూచువల్ ఫండ్ వ్యాపారాన్ని సాగిస్తున్నాయి. ఎం అండ్ ఎం ఫైనాన్షియల్ సర్వీసెస్, మనులైఫ్.. ఏడేళ్ల క్రితమే (2019లో) మహీంద్రా మనులైఫ్ ఎంఎఫ్‌ను ఏర్పాటు చేశాయి. 2020లో కార్యకలాపాలు ప్రారంభించిన ఈ కంపెనీ నిర్వహణలోని ఆస్తుల (ఏయూఎం) ప్రస్తుత విలువ రూ.31,450 కోట్లకు చేరుకుంది.

పసిడి బాండ్లపై 321% రిటర్నులు

గడిచిన రెండేళ్లలో బంగారం ధరలు భారీగా దూసుకెళ్లడంతో ప్రభుత్వ పసిడి బాండ్లలో పెట్టుబడులు పెట్టిన వారికి లాభాల పంట పండుతోంది. 2017-18 ఆర్థిక సంవత్సరంలో ఏడో విడతగా జారీ చేసిన గోల్డ్ బాండ్ల గడువు ఈ నెల 13తో ముగిసింది. ఈ బాండ్లను నగదీకరించుకునే వారికి చెల్లించే ధరను ఆర్‌బీఐ గురువారం ప్రకటించింది. యూనిట్ (గ్రాము)కు రూ.12,350గా నిర్ణయించింది. 2017 నవంబరు 13న జారీ చేసిన ఈ బాండ్ల యూనిట్ ధర రూ.2,934తో పోలిస్తే ఇన్వెస్టర్లకు 4 రెట్లకు పైగా (321%) ప్రతిఫలం లభించనుంది.

ఆఖర్లో లాభాల స్వీకరణ

ముంబై: స్టాక్ మార్కెట్లో మూడు రోజుల ర్యాలీకి తెరపడింది. దేశీయ, అంతర్జాతీయ మార్కెట్ల సానుకూల సంకేతాలతో గురువారం ఇంట్రాడేలో 453 పాయింట్ల మేర పుంజుకున్న సెన్సెక్స్.. ఆఖర్లో మదుపరులు లాభాల స్వీకరణకు పాల్పడటంతో కేవలం 12.16 పాయింట్ల వృద్ధితో 84,478.67 వద్ద ముగిసింది. నిఫ్టీ 3.35 పాయింట్ల లాభంతో 25,879.15 వద్ద స్థిరపడింది. రియల్టీ సంస్థ వేలార్ ఎస్టేట్ లిమిటెడ్ నుంచి విడిపోయిన అడ్వెంట్ హోటల్స్ ఇంటర్నేషనల్ లిమిటెడ్ గురువారం స్టాక్ ఎక్స్ఛేంజీల్లో షేర్లను నమోదు చేసింది. బీఎస్ఈలో రూ.310 వద్ద నమోదైన అడ్వెంట్ హోటల్స్ షేరు.. ఆపై 5 శాతం వృద్ధితో అప్పర్ సర్క్యూట్ స్థాయి రూ.325.45 వద్ద ముగిసింది.

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)

14వ తేదీ			
హైదరాబాద్	600	విజయవాడ	600
వరంగల్	602	గోదావరి	610
చిత్తూరు	643	విశాఖపట్నం	595
		దజను గుడ్లు రూ. 84	

ఫామ్‌గేట్ ధర — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్

హైదరాబాద్	112	విజయవాడ	111
వరంగల్	112	గుంటూరు	113
కరీంనగర్	112	ఒంగోలు	113
మహబూబ్‌నగర్	112	చిత్తూరు	114
కర్నూలు	112	నెల్లూరు	119
విశాఖపట్నం	110	అనంతపురం	119
గోదావరి	111		

లాభాల్లోకి జీఎంఆర్ ఎయిర్‌పోర్ట్స్

క్యూ2లో రూ.35 కోట్లుగా నమోదు

జీఎంఆర్ ఎయిర్‌పోర్ట్స్ లిమిటెడ్ (జీఏఎల్).. సెప్టెంబరుతో ముగిసిన త్రైమాసికంలో లాభాల్లోకి అడుగుపెట్టింది. జూలై-సెప్టెంబరు త్రైమాసికానికి గాను కంపెనీ రూ.3,754 కోట్ల మొత్తం ఆదాయంపై రూ.35 కోట్ల నికర లాభాన్ని ప్రకటించింది. గత ఏడాది ఇదే కాలంలో ఆదాయం రూ.2,598 కోట్లుగా ఉండగా నష్టాలు రూ.429 కోట్లుగా ఉన్నాయి. మూడేళ్ల తర్వాత తొలిసారిగా పన్ను చెల్లింపునకు ముందు లాభాల (పీబీటీ)ను నమోదు చేసినట్లు పేర్కొంది. కాగా సమీక్షా త్రైమాసికంలో ఢిల్లీ విమానాశ్రయం ద్వారా 1.76 కోట్ల మంది ప్రయాణికులు ప్రయాణించగా హైదరాబాద్ విమానాశ్రయం నుంచి 73 లక్షల మంది ప్రయాణికులు రాకపోకలు సాగించినట్లు జీఏఎల్ తెలిపింది. ఈ కాలంలో ఢిల్లీ విమానాశ్రయం ఆదాయం 34% వృద్ధితో రూ.1,849 కోట్లకు చేరుకోగా హైదరాబాద్ విమానాశ్రయం ఆదాయం 17% వృద్ధి చెంది రూ.674 కోట్లకు చేరుకుందని తెలిపింది. కాగా ఏపీలోని భోగాపురం విమానాశ్రయాన్ని వచ్చే ఏడాది డిసెంబరు నాటికి అందుబాటులోకి తీసుకురావాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపింది.

తగ్గిన రాంకీ ఇన్‌ఫ్రా లాభం

రాంకీ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్.. సెప్టెంబరుతో ముగిసిన త్రైమాసికంలో కన్సాలిడేటెడ్ ప్రాతిపదికన రూ.471.60 కోట్ల ఆదాయంపై రూ.75.6 కోట్ల నికర లాభాన్ని ప్రకటించింది. గత ఏడాది ఇదే కాలంలో ఆదాయం రూ.527.40 కోట్లుగా ఉండగా లాభం రూ.83 కోట్లుగా ఉంది. కాగా స్టాండ్‌ఎలోన్ ప్రాతిపదికన రూ.444.80 కోట్ల ఆదాయంపై రూ.67.9 కోట్ల లాభాన్ని నమోదు చేసింది.

బిజినెస్

బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)

	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	1,27,800 ▲	1,17,150 ▲	1,82,000 ▲
విజయవాడ	1,30,000 ▲	1,22,000 ▲	1,70,000 ▲
విశాఖపట్నం	1,30,580 ▲	1,15,350 ▲	1,82,000 ▲
రాజమండ్రి	1,28,620 ▲	1,17,900 ▲	1,66,000 ▲
ప్రొద్దుటూరు	1,26,400 ▲	1,16,290 ▲	1,67,500 ▲
ముంబై	1,26,554 ▲	1,15,923 ▲	1,62,730 ▲

స్టార్టప్‌ల కోసం రూ.100 కోట్ల నిధి

హైదరాబాద్ ఏంజెల్ ఫండ్

జెనరేటివ్ ఏఐ, గేమింగ్, స్పేస్ టెక్, డ్రోన్ల రంగాల్లో అత్యున్నత సామర్థ్యం గల స్టార్టప్‌లకు మద్దతు ఇవ్వడానికి రూ.100 కోట్ల వెంచర్ క్యాపిటల్ ఫండ్ ఏర్పాటు చేసినట్టు హైదరాబాద్ ఏంజెల్ ఫండ్ ప్రకటించింది. వర్ధమాన టెక్నాలజీలు, అధిక వృద్ధి అవకాశాలున్న 15-20 స్టార్టప్‌లలో ఈ సొమ్ము ఇన్వెస్ట్ చేయనున్నట్టు తెలిపింది. పైన పేర్కొన్న రంగాలతో పాటు కన్స్యూమర్ టెక్, ఫిన్‌టెక్, ఎంటర్‌ప్రైజ్ సాస్, సస్టెయినబులిటీ విభాగాల్లో కార్యకలాపాలు సాగిస్తున్న స్టార్టప్‌లను కూడా పరిగణనలోకి తీసుకోనున్నట్టు పేర్కొంది.

జపాన్ కంపెనీ టైజిన్‌తో బయోవరం జట్టు

జపాన్‌కు చెందిన టైజిన్ కంపెనీ ఉత్పత్తులైన రీ జెనరేటివ్ వైద్య ఉత్పత్తులు, ఇంప్లాంట్ చేయడానికి అనువైన వైద్య పరికరాల వినియోగంపై సహకారాన్ని విస్తరించుకునేందుకు ఒప్పందం కుదుర్చుకున్నట్టు హైదరాబాద్‌కు చెందిన టెక్నాలజీ కంపెనీ బయోవరం ప్రకటించింది. యూఆర్ అడ్వాన్స్‌డ్ థెరప్యూటిక్స్ (యూఆర్ఏటీ) ప్రైవేట్ లిమిటెడ్‌కు బ్రాండ్‌నేమ్ బయోవరం. ఈ ఒప్పందం కింద టైజిన్‌కు చెందిన మెడికల్ డివైసెలు, రీజెనరేటివ్ వైద్య ఉత్పత్తులు భారత మార్కెట్లో ప్రవేశపెడితే బయోవరం అడ్వాన్స్‌డ్ ఉత్పత్తులన్నింటినీ జపాన్ మార్కెట్లో ప్రవేశపెడతారు. పరిశోధన, ఇన్నోవేషన్ విభాగాల్లో తమ సామర్థ్యాలు పటిష్ఠం చేసుకునేందుకు ఈ భాగస్వామ్యం ఉపయోగపడుతుందని యూఆర్ఏటీ వ్యవస్థాపకుడు, సీఈవో జగన్మోహన్ రెడ్డి తెలిపారు.

కేఈపీ ఎనర్జీ రూ.100 కోట్ల పెట్టుబడి

వివిధ పారిశ్రామిక రంగాలకు సుస్థిర వ్యర్థ జలాల ట్రీట్‌మెంట్ ప్లాంట్ల తయారీ, ఇంజనీరింగ్ సామర్థ్యాలను పెంచేందుకు రాబోయే ఐదేళ్ల కాలంలో రూ.100 కోట్లు పెట్టుబడి పెట్టనున్నట్టు హైదరాబాద్‌కు చెందిన కేఈపీ ఇంజనీరింగ్ ప్రకటించింది. దీనివల్ల ఏటా రూ.500 కోట్ల వార్షికాదాయం జోడవుతుందని, అధిక వృద్ధి అవకాశాలున్న పారిశ్రామిక రంగాలతో సహకారాన్ని మరింత పటిష్ఠం చేసుకునేందుకు దోహదపడుతుందని కంపెనీ ఎండీ మాలు కాంబ్లే అన్నారు.

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్)

సోయా, మొక్కజొన్న

పత్తి కొనుగోళ్లలో సడలింపులివ్వండి

» కేంద్రానికి మరోమారు మంత్రి తుమ్మల లేఖ..



హైదరాబాద్, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): సోయా బీన్, మొక్కజొన్న, పత్తి కొనుగోళ్లలో ఏర్పడుతున్న సమస్యలను పరిష్కరించాలని, పంట కొనుగోళ్లలో సడలింపులివ్వాలని మరోమారు కేంద్రానికి వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు లేఖ రాశారు. రాష్ట్రంలో మొంథా తుపాన్, అకాల వర్షాలు, అనిశ్చిత వాతావరణం కారణంగా సోయాబీన్, మొక్కజొన్న, పత్తి పంటలు తీవ్రంగా దెబ్బతిన్నాయని.. ఈ పంటల కొనుగోళ్ల విషయంలో కొన్ని ప్రత్యేక సడలింపులివ్వాలని కేంద్ర మంత్రులు శివరాజ్‌సింగ్ చౌహాన్, గిరిరాజ్ సింగ్‌కు విజ్ఞప్తి చేసినట్లు ఆయన ఓ ప్రకటనలో పేర్కొన్నారు. 'సోయా బీన్ కోత సమయంలో కురిసిన అకాల వర్షాల వల్ల పంట నాణ్యత దెబ్బతినడంతో పాటు తీవ్ర నష్టం వాటిల్లింది. ఆ మేరకు నాణ్యతా ప్రమాణాల విషయంలో సడలింపులివ్వాలి. కనీస మద్దతు ధర క్వింటాల్‌కు రూ.2,400 చొప్పున మొత్తం 16.85 లక్షల మెట్రిక్ టన్నుల మొక్కజొన్న కొనుగోలుకు జాతీయ వ్యవసాయ సహకార మార్కెటింగ్ సమాఖ్య, జాతీయ వినియోగదారుల సహకార సమాఖ్య సంస్థలకు అనుమతి ఇవ్వాలి. ప్రత్యేక పరిస్థితుల దృష్ట్యా పత్తి కొనుగోలు విషయంలో తేమ శాతాన్ని సడలించాలి. ఎకరాకు 11.74 క్వింటాళ్ల దిగుబడి ఆధారంగా కొనుగోలు కొనసాగించాలి' అని లేఖలో తుమ్మల కోరారు. ఈ విషయాలను కేంద్ర మంత్రుల దృష్టికి తీసుకెళ్లాల్సిందిగా గురువారం ఢిల్లీకి వెళ్లిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కూడా కోరామని తెలిపారు.

'ఓవర్సీస్ విద్యా నిధి'పై పునఃపరిశీలన చేయాలి

» సీఎం రేవంత్ రెడ్డికి ఎఫ్‌జీజీ లేఖ

హైదరాబాద్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): ప్రతిభావంతులైన నిరుపేద ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఈబీసీ, మైనారిటీ విద్యార్థులకు విదేశీ విశ్వవిద్యాలయాల్లో ఉన్నత విద్యాభ్యాసం కోసం ప్రభుత్వం 2013లో ప్రారంభించిన 'మహాత్మ జ్యోతిబా పూలే ఓవర్సీస్ విద్యా నిధి', 'అంబేడ్కర్ ఓవర్సీస్ విద్యా నిధి' పథకాలపై పునఃపరిశీలన చేయాలని ఫోరం ఫర్ గుడ్ గవర్నెన్స్ (ఎఫ్‌జీజీ) కోరింది. ఈ మేరకు ఎఫ్‌జీజీ అధ్యక్షుడు ఎం.పద్మనాభరెడ్డి గురువారం సీఎం రేవంత్ రెడ్డికి లేఖ రాశారు. కుటుంబ వార్షికాదాయం రూ.5 లక్షలలోపు ఉన్న విద్యార్థులకు ఈ పథకాల కింద రూ.25 లక్షల వరకు ఆర్థిక సాయాన్ని అందిస్తున్నారని ఎఫ్‌జీజీ తెలిపింది. ఇప్పటివరకు 4,526 మంది విద్యార్థులకు రూ.1,250 కోట్ల మేర ఆర్థిక సాయాన్ని అందించారని వివరించింది. విదేశీ విద్య దేశీయ పరిశ్రమలకు అనుకూలంగా ఉండడం లేదని, విద్యా నిధి పథకాలు ప్రస్తుత పరిస్థితులకు పనికి రావడం లేదని తెలిపింది. ఈ దృష్ట్యా పథకాలపై రాష్ట్ర ప్రభుత్వం పునఃపరిశీలన చేసి, విద్యార్థులు దేశీయ వర్సిటీల్లో చేరేలా చర్యలు తీసుకోవాలని కోరింది.

అసెంబ్లీ ప్రాంగణంలో ఆంక్షలా?: దాసోజు

హైదరాబాద్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్యేల అనర్హతపై విచారణ సందర్భంగా అసెంబ్లీ ప్రాంగణంలో ఆంక్షలు విధించడం సరికాదని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ దాసోజు శ్రవణ్ అన్నారు. విచారణ నేపథ్యంలో స్పీకర్ కార్యాలయం విడుదల చేసిన బులెటిన్ రాజ్యాంగ విరుద్ధమని, మాజీ ఎంపీలు, మాజీ ఎమ్మెల్యేలు, మాజీ ఎమ్మెల్సీలకు ప్రవేశాన్ని నిషేధించడం ఏంటని ప్రశ్నించారు. ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలకు వారి సభాపక్ష కార్యాలయాల వరకే అనుమతివ్వడం దుర్మార్గమన్నారు. ఎమ్మెల్యేల వాదనలను ప్రజలు తెలుసుకోవాల్సిన అవసరం ఉందని, విచారణను ప్రజలు వీక్షించే అవకాశమివ్వాలని డిమాండ్ చేశారు. బులెటిన్‌ను ఉపసంహరించుకోవాలని స్పీకర్‌కు లేఖ రాసినట్లు తెలిపారు.

ఫైనాన్షియల్ బిడ్లు దాఖలు చేయండి

» కాళేశ్వరం బ్యారేజీల పునరుద్ధరణలో 3 సంస్థలకు మెయిల్

హైదరాబాద్, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): కాళేశ్వరం ప్రాజెక్టులోని మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల పునరుద్ధరణకు డిజైన్లతో పాటు సమగ్ర పునరుద్ధరణ ప్రణాళికను అందించడానికి అర్హత సాధించిన 3సంస్థలను ఫైనాన్షియల్ బిడ్లు దాఖలు చేయాలని ప్రభుత్వం కోరనుంది. ఈ మేరకు రిక్వెస్ట్ ఫర్ ప్రపోజల్(ఆర్ఎఫ్‌పీ) కింద మెయిల్‌లు పంపించాలని నీటిపారుదలశాఖ నిర్ణయించింది. మద్రాస్ ఐఐటీ, ఆర్వీ కన్సల్టెన్సీ ఐప్రీసాస్(స్పెయిన్ సంస్థ) జేవీతో పాటు పోలవరం ప్రాజెక్టు పనులు చేస్తున్న ఆఫ్రీ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్(ముంబై)తో పాటు మరో సంస్థకు మెయిల్ పంపించనున్నారు.

జీహెచ్ఎంసీలోనూ కాంగ్రెస్ జెండా ఎగరేస్తాం

» ఒడిసాలో కాంగ్రెస్ గెలుస్తుందని అధిష్ఠానం గుర్తించింది

» ఏఐసీసీ కార్యదర్శి కుసుమ్ కుమార్

హైదరాబాద్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో ఘన విజయం సాధించనున్నామని, రానున్న జీహెచ్ఎంసీ ఎన్నికల్లోనూ కాంగ్రెస్ జెండా ఎగరడం ఖాయమని ఏఐసీసీ కార్యదర్శి జెట్టి కుసుమ్‌కుమార్ అన్నారు. ఒడిసాతోపాటు గ్రేటర్ ఎన్నికలపైనా దృష్టి పెట్టాలని కాంగ్రెస్ అధిష్ఠానం తనను ఆదేశించిందని వెల్లడించారు. తనకు పార్టీలో పని చేయడమే ఇష్టమని, ప్రత్యక్ష ఎన్నికల్లో పోటీ చేయాలని గతంలో అధిష్ఠానం సూచించినా చేయలేదని గుర్తు చేశారు. తనకు ఏఐసీసీ కార్యదర్శిగా, ఒడిసా సహ ఇన్‌చార్జిగా బాధ్యతలు ఇచ్చిన ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, అగ్రనేతలు సోనియా, రాహుల్‌కు, సహకరించిన సీఎం రేవంత్‌రెడ్డి, టీపీసీసీ చీఫ్ మహేశ్‌గౌడ్, చిన్ననాటి మిత్రుడు తూర్పు జగ్గారెడ్డికి ధన్యవాదాలు తెలుపుతున్నానని అన్నారు. కాంగ్రెస్‌లో పని చేసే వారికి పదవులు వస్తాయనడానికి తన నియామకమే నిదర్శనమన్నారు. రానున్న రోజుల్లో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చేందుకు ఆస్కారం ఉన్న రాష్ట్రాల్లో ఒడిసా కూడా ఉన్నట్లు పార్టీ అధిష్ఠానం గుర్తించిందన్నారు. అక్కడ బీజేడీ బలహీనపడిందని, బీజేపీ గ్రాఫ్ కూడా పడిపోతోందని చెప్పారు. ఏబీఎన్-ఆంధ్రజ్యోతి సంస్థల ఎండీ రాధాకృష్ణ ఓ వ్యాసంలో చెప్పినట్లుగా.. కాంగ్రెస్ పార్టీ గరిక మొక్క లాంటిదని, ఎండిపోయినట్లు కనిపించినా.. చినుకులు పడగానే పచ్చబడుతుందన్నారు.

వరంగల్ సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి పేరిట..
రూ.600 కోట్లు కొల్లగొట్టిన బీఆర్ఎస్

» ఆ అక్రమాల్లో హరీశ్‌రావు కీలక పాత్ర: ఎమ్మెల్యే నాయిని

హనుమకొండ సిటీ, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): వరంగల్ సెంట్రల్ జైలు భూమి తాకట్టులో బీఆర్ఎస్ భారీగా అక్రమాలకు పాల్పడిందని వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి విమర్శించారు. సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి నిర్మాణం పేరిట జైలు స్థలాన్ని తాకట్టు పెట్టి రూ.600 కొల్లగొట్టారని ఆరోపించారు. ఎమ్మెల్సీ కవిత కూడా ఇటీవల ఇదే అంశాన్ని ప్రస్తావించారని గుర్తుచేశారు. అక్రమాల్లో మాజీ మంత్రి హరీశ్‌రావు పాత్ర ఉందని, త్వరలోనే అన్నీ బయటికి వస్తాయని పేర్కొన్నారు. బీఆర్ఎస్ హయాంలో వరద బాధితులకు రూ.10వేల చొప్పున అందచేస్తామని చెప్పిన అప్పటి మంత్రి కేటీఆర్ చిల్లిగవ్వ కూడా ఇవ్వలేదని విమర్శించారు. అదే సీఎం రేవంత్‌రెడ్డి బాధితులను ఆదుకుని చూపించారని చెప్పారు. వరంగల్ నగర అభివృద్ధిని విస్మరించిన కేసీఆర్ కుటుంబాన్ని బహిష్కరించాలని ప్రజలకు పిలుపునిచ్చారు.

మధ్యాహ్న భోజన ఏజెన్సీలకు
బకాయిలు విడుదల చేయండి:రాంచందర్‌రావు

హైదరాబాద్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలలు, హాస్టళ్లు, గురుకుల విద్యాసంస్థల్లో మధ్యాహ్న భోజన సేవలు అందిస్తున్న ఏజెన్సీలకు బకాయిలను విడుదల చేయాలని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రాంచందర్‌రావు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. బీసీ హాస్టళ్లలో విద్యార్థులకు నాణ్యత లేని ఆహారం అందిస్తున్నారని విమర్శించారు. ఇటీవల అచ్చంపేట, వికారాబాద్, తాండూరు హాస్టళ్లలో నాణ్యత లేని ఆహారం అందించడం వల్లే విద్యార్థులు అస్వస్థతకు గురై ఆస్పత్రి పాలయ్యారని తెలిపారు. గిరిజనుల సంక్షేమాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తోందని విమర్శించిన ఆయన మధ్యాహ్న భోజన ఏజెన్సీలకు బకాయిలు చెల్లించకపోతే ఈ పథకం నిలిచిపోయే ప్రమాదం ఉందని అన్నారు.

జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే ఎవరు?

(మొదటిపేజీ తరువాయి)

నిలిచారు. కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీ అభ్యర్థులు నవీన్ యాదవ్, మాగంటి సునీతా గోపీనాథ్, లంకల దీపక్‌రెడ్డిలకు మద్దతుగా నేతలు విస్తృత ప్రచారం నిర్వహించారు. నోటాతో కలిపి 59 గుర్తులు ఉండడంతో నాలుగు బ్యాలెట్ యూనిట్లు వినియోగించారు. నగర ఓటర్ ఎప్పటిలానే బద్ధకించడంతో 48.49 శాతం పోలింగ్ మాత్రమే నమోదైంది.

గంటలో తొలి రౌండ్ ఫలితం..

ఉదయం 8 గంటలకు కౌంటింగ్ మొదలు కానుండగా.. తొలుత 85 ఏళ్లు దాటిన, దివ్యాంగులు వినియోగించుకున్న 101 హోం ఓటింగ్, సర్వీస్ ఓట్లు లెక్కించనున్నారు. అనంతరం షేక్‌పేట డివిజన్ ఓట్ల లెక్కింపు జరుగుతుంది. పోలింగ్ కేంద్రం సంఖ్య 1 నుంచి వరస క్రమంలో లెక్కింపు చేపడతారు. కౌంటింగ్ కోసం 42 టేబుళ్లను ఏర్పాటు చేశారు. 10 రౌండ్లలో లెక్కింపు పూర్తి కానుంది. కేంద్ర ఎన్నికల సంఘం సాధారణ పరిశీలకులు, ప్రత్యేక బృందం ఈ ప్రక్రియను పరిశీలించనుంది. లెక్కింపు కోసం 186 మంది సిబ్బందిని నియమించినట్లు కర్ణన్ తెలిపారు. లెక్కింపు మొదలైన గంటలోపే తొలి రౌండ్ ఫలితం వచ్చే అవకాశం ఉంది. తర్వాత ప్రతి 25-30 నిమిషాల్లో ఒక్కో రౌండ్ ఓట్ల ఫలితాలను వెల్లడించనున్నారు. మధ్యాహ్నం 12 గంటల్లోపు లెక్కింపు పూర్తయ్యే అవకాశం ఉందని అధికారులు చెబుతున్నారు. లెక్కింపు నేపథ్యంలో ప్రత్యేక భద్రతా ఏర్పాట్లు చేశామని నగర పోలీస్ జాయింట్ కమిషనర్ తఫ్సీర్ ఇక్బాల్ తెలిపారు. లెక్కింపు కేంద్రం వద్ద 144 సెక్షన్ అమల్లో ఉంటుందని, నిబంధనలు అతిక్రమిస్తే బాధ్యులపై చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని చెప్పారు.

ఫార్మసీ విద్యార్థులకు మళ్లీ పరీక్షలు!

ఫాతీ, ఫార్మసీ కళాశాలల సంఘం విజ్ఞప్తి.. శ్రీదేవసేన సానుకూల స్పందన

హైదరాబాద్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): జేఎన్‌టీయూ పరిధిలోని ఫార్మసీ విద్యార్థులకు పరీక్షలు మళ్లీ నిర్వహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం సానుకూలత వ్యక్తం చేసిందని ప్రైవేటు కళాశాలల యాజమాన్య సంఘాల సమాఖ్య (ఫాతి), ఫార్మసీ కళాశాలల సంఘం ప్రతినిధులు తెలిపారు. నవంబరు 3 నుంచి జరిగిన కళాశాల సమ్మె వల్ల బీ-ఫార్మసీ రెండో సెమిస్టర్‌లోని రెండు పరీక్షలకు 88 శాతం మంది విద్యార్థులు హాజరు కాలేదు. అందువల్ల ఆయా పరీక్షలను మళ్లీ నిర్వహించాలని కోరుతూ ఫాతి ప్రతినిధులు విద్యాశాఖ కార్యదర్శి శ్రీదేవసేనకు గురువారం వినతి పత్రం అందజేశారు. అంతకుముందే పరీక్షల నిర్వహణ అంశంపై జేఎన్‌టీయూ రెక్టార్, రిజిస్ట్రార్, ఇతర అధికారులతో శ్రీదేవసేన సమీక్ష నిర్వహించారు. సమ్మె నేపథ్యంలో రాష్ట్రవ్యాప్తంగా 7వేల మందికి పైగా విద్యార్థులు పరీక్ష రాయలేకపోయారని వారు పేర్కొన్నారు. దీంతో విద్యార్థులకు నష్టం జరగకుండా పరీక్షల నిర్వహణపై సానుకూల నిర్ణయం తీసుకుంటామని శ్రీదేవసేన తమకు చెప్పారని ఫాతి ప్రతినిధులు ఓ ప్రకటనలో తెలిపారు.

బీసీ రిజర్వేషన్‌పై ఢిల్లీ కేంద్రంగా..

సర్కారు తుది యత్నాలు?

పార్లమెంటు శీతాకాల సమావేశాల్లో ఒత్తిడికి ప్రణాళిక!

» ప్రధాని వద్దకు అఖిలపక్షాన్ని తీసుకెళ్లే ఆలోచన

» పంచాయతీ ఎన్నికలు నిర్వహించి.. పరిషత్ ఎన్నికల విషయంలో పోరాడే దిశగానూ యోచన

» 1-2 రోజుల్లో మంత్రులు, పార్టీ ముఖ్యులతో సీఎం భేటీ

» 17న క్యాబినెట్ భేటీ అనంతరం స్పష్టత వచ్చే అవకాశం



హైదరాబాద్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ కల్పించేందుకు అన్ని రకాలుగా ప్రయత్నాలు చేసిన రేవంత్ సర్కారు.. ఢిల్లీ కేంద్రంగా తుది ప్రయత్నానికి ఉపక్రమించనుందా? డిసెంబర్ 1 నుంచి జరిగే పార్లమెంటు సమావేశాల్లో మరోమారు ఒత్తిడి తేవాలనుకుంటోందా? ప్రధాని వద్దకు అఖిలపక్ష పార్టీలు, ప్రజా సంఘాలను తీసుకువెళ్లే యోచన చేస్తోందా? ప్రస్తుతం ప్రభుత్వ వర్గాల్లో జోరుగా నడుస్తున్న చర్చ ఇది. స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణ అంశంపై ఇటీవల విచారణ జరిపిన హైకోర్టు.. ఎప్పటిలోగా నిర్వహించేదీ చెప్పేందుకు ప్రభుత్వానికి ఈ నెల 24 వరకూ గడువిచ్చిన సంగతి తెలిసిందే. మరోవైపున స్థానిక ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ కల్పిస్తూ ప్రభుత్వం తెచ్చిన జీవో 9ను నిలిపేస్తూ మధ్యంతర ఉత్తర్వులు ఇచ్చింది. పాత రిజర్వేషన్ల ప్రకారమే స్థానిక ఎన్నికలు నిర్వహించాలని సూచించింది. దీనిపై కౌంటర్ దాఖలు చేసేందుకు ప్రభుత్వానికి డిసెంబర్ 3 వరకూ గడువు ఇచ్చింది. ఈ రెండు తీర్పుల నేపథ్యంలో స్థానిక ఎన్నికలపై ఏ వైఖరి తీసుకోవాలన్నదానిపై ప్రభుత్వ పెద్దలు తర్జన భర్జన పడుతున్నారు. స్థానిక ఎన్నికల్లో బీసీ రిజర్వేషన్‌కోసం ఢిల్లీ వేదికగా తుది ప్రయత్నం చేయాలా.. లేక హైకోర్టు సూచనల మేరకు పాత రిజర్వేషన్ ప్రకారం ఎన్నికలు నిర్వహించి పార్టీ పరంగా బీసీలకు 42 శాతం రిజర్వేషన్ అమలు చేయాలా అన్నది తేల్చుకోలేక పోతున్నారు. ఈ క్రమంలోనే.. డిసెంబర్ 1 నుంచి పార్లమెంటు సమావేశాలు జరగనున్న నేపథ్యంలో ఢిల్లీ వేదికగా మరోమారు ఒత్తిడి కార్యాచరణ చేపట్టే ప్రతిపాదనను తీవ్రంగా పరిశీలిస్తున్నట్లు చెబుతున్నారు. జీవో 9ని నిలిపివేస్తూ మధ్యంతర ఉత్తర్వులు ఇచ్చిన హైకోర్టు కౌంటర్ దాఖలు చేసేందుకు డిసెంబర్ 3 వరకూ గడువు ఇచ్చిన నేపథ్యంలో.. ఈ వెసులుబాటును ఉపయోగించుకోవాలని, స్థానిక సంస్థల ఎన్నికలు ఎప్పుడు నిర్వహించేదీ చెప్పడానికి 24వ తేదీ వరకూ ఇచ్చిన గడువును మరికొద్దిరోజులు పొడిగించాలంటూ హైకోర్టును కోరాలని ప్రభుత్వ పెద్దలు భావిస్తున్నట్లు చెబుతున్నారు. ఆలోగా కేంద్రంపై ఒత్తిడి తెచ్చే కార్యాచరణను అమలు చేయాలని ఆలోచిస్తున్నట్లు సమాచారం. అలా గడువు కోరేందుకు అవకాశం ఉంటుందా.. లేదా అన్నదానిపై న్యాయనిపుణులనూ సంప్రదిస్తున్నట్లు చెబుతున్నారు. కాగా.. ఒత్తిడి కార్యాచరణలో భాగంగా ప్రధాని మోదీని వద్దకు బీజేపీ సహా అన్ని పార్టీల నేతలను, బీసీ సంఘాలను ఢిల్లీకి తీసుకెళ్లే అంశాన్ని ప్రభుత్వ పెద్దలు పరిశీలిస్తున్నట్లు తెలుస్తోంది. అలాగే బీసీ రిజర్వేషన్ అంశాన్ని రాజ్యాంగంలోని ఆర్టికల్ 9లో చేర్చాలని కోరుతూ కాంగ్రెస్.. ఇతర పార్టీలతో కలిసి పార్లమెంటు సమావేశాల్లో ఒత్తిడి తేవాలని కూడా భావిస్తున్నట్లు చెబుతున్నారు. ఈ విషయంలో ఏఐసీసీ పెద్దలనూ సంప్రదిస్తున్నట్లు సమాచారం. తుది ప్రయత్నంగా ఒత్తిడి కార్యాచరణ తీసుకురావాలా.. లేక 24న హైకోర్టు ఇచ్చే డైరెక్షన్ మేరకు ముందుకు వెళ్లాలా అన్నదానిపై.. ఒకటి, రెండు రోజుల్లో సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టివిక్రమార్క, పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షీ నటరాజన్, మంత్రులు భేటీ అయి చర్చించి ఒక నిర్ణయానికి రానున్నట్లు సమాచారం. కాగా.. ఈ నెల 17న సచివాలయంలో రాష్ట్ర క్యాబినెట్ భేటీ అయ్యే అవకాశం ఉంది. సీఎం రేవంత్, మంత్రులు, పార్టీ ముఖ్యనేతల భేటీలో తీసుకున్న నిర్ణయాలను పరిగణనలోకి తీసుకుని స్థానిక ఎన్నికలపై రాష్ట్ర క్యాబినెట్ ఒక స్పష్టతను ఇవ్వనున్నట్లు చెబుతున్నారు.

గ్రామపంచాయతీ ఎన్నికలు పెడదామా?

గ్రామ పంచాయతీలకు ఎన్నికలు నిర్వహించక పోవడంతో కేంద్రం నుంచి నిధులు రావడంలో ప్రభుత్వం ఇబ్బందులను ఎదుర్కొంటోంది. ఈ నేపథ్యంలో గ్రామ పంచాయతీ ఎన్నికల వరకూ నిర్వహించి.. పరిషత్ ఎన్నికల విషయంలో ఒత్తిడి కార్యాచరణకు వెళ్లాలన్న అంశాన్నీ రాష్ట్ర సర్కారు పరిశీలిస్తున్నట్లు తెలుస్తోంది.

ప్రాజెక్టుల సమగ్ర నివేదికల కోసం

కోర్ టెక్నికల్ టీమ్

» సీఎం ఆదేశాలతో ఏర్పాటు చేసిన నీటిపారుదల శాఖ

హైదరాబాద్, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): జాతీయ ఆనకట్టల భద్రత చట్టం-2021లోని సెక్షన్-38(1) ప్రకారం రాష్ట్రంలోని ప్రాజెక్టులు ఏ విధంగా ఉన్నాయనే దానిపై నివేదికలు సిద్ధం చేసి, నిర్ణీత వ్యవధిలోగా కేంద్ర వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేయాలన్న ముఖ్యమంత్రి ఆదేశాలతో నీటిపారుదల శాఖ కదిలింది. డ్యామ్ సేఫ్టీ చట్టం ప్రకారం తెలంగాణలో ఉన్న 175డ్యామ్‌లు ఏ విధంగా ఉన్నాయనే దాన్ని మూల్యాంకనం చేయడంతో పాటు వాటికి అత్యవసర ప్రణాళికను సిద్ధం చేయడం, ఆపరేషన్ అండ్ మెయింటెనెన్స్ మ్యానువల్‌ను సిద్ధం చేయడానికి గాను 8 మంది అధికారులతో కోర్ టెక్నికల్ టీమ్‌ను ఏర్పాటు చేశారు. గురువారం జారీ అయిన ఉత్తర్వుల ప్రకారం వీరంతా స్టేట్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ(ఎస్‌డీఎస్ఏ)కు అనుబంధంగా విధులు నిర్వర్తించనున్నారు. 175డ్యామ్‌ల ప్రణాళిక సిద్ధమయ్యేదాకా వీరు ఎస్‌డీఎస్ఏ పరిధిలోనే ఉండనున్నారు. సమగ్ర ప్రాజెక్టుల రక్షణ మూల్యాకనం(సీడీఎస్ఈ)పై కేంద్ర జలశక్తి శాఖ మంత్రి సీఆర్ పాటిల్ సీఎం రేవంత్‌రెడ్డికి గత అక్టోబరు 17వ తేదీన లేఖ రాశారు. జాతీయ ఆనకట్టల భద్రత సంస్థ(ఎన్‌డీఎస్ఏ) చట్టంలోని సెక్షన్-38(1) ప్రకారం నిర్దిష్ట డ్యామ్ పరిస్థితి ఏ విధంగా ఉందనే దానిపై డ్యామ్ సేఫ్టీ రివ్యూ ప్యానెల్ ద్వారా మూల్యాంకనం చేయించాల్సి ఉంటుంది. ఈ చట్టం అమల్లోకి వచ్చిన ఐదేళ్లలోపు ప్రతీ డ్యామ్‌కు సంబంధించిన రక్షణ నివేదికలు అందించాల్సి ఉంటుంది. ఈ నివేదికల గడువు 2026 డిసెంబరు కల్లా పూర్తికానుంది. రాష్ట్రంలో నివేదికలు సంతృప్తికర స్థాయిలో లేవని పాటిల్ ముఖ్యమంత్రికి రాసిన లేఖలో స్పష్టం చేశారు. రాష్ట్రంలో 175ప్రాజెక్టులు స్పెసిఫైడ్ డ్యామ్‌ల జాబితాలో ఉండగా ఆయా ప్రాజెక్టుల నివేదికలు అందించడానికి ఇంకా 14 నెలల సమయం మాత్రమే మిగిలి ఉంది. ఇక డ్యామ్ ఓనర్(సంబంధిత ప్రాజెక్టు చీఫ్ ఇంజనీర్) ఆధ్వర్యంలోనే నివేదికలు సిద్ధం చేయాల్సి ఉంటుంది. నివేదికల తర్వాత సాంకేతిక నైపుణ్యం వినియోగించుకొని, లోపాలు ఉంటే వాటిని సరిచేయడానికి వీలుగా ఆర్థిక వనరులు వినియోగించుకోవాలని కేంద్రమంత్రి సీఎంకు గుర్తు చేశారు. నివేదికల తయారీ ఆశాజనకంగా లేనందున వ్యక్తిగతంగా ఈ ప్రక్రియను పరిశీలించాలని రేవంత్‌రెడ్డిని సీఆర్ పాటిల్ లేఖలో కోరారు. దీనిపై సీఎం స్పందించి అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేయడంతో కోర్ టెక్నికల్ టీమ్‌ను వేశారు. స్పెసిఫైడ్ డ్యామ్‌ల జాబితాలో ఉన్న ప్రాజెక్టుల కట్టలు ఏ విధంగా ఉన్నాయి? గేట్ల పరిస్థితేంటి? నిర్వహణ వంటి అంశాలపై సమగ్ర వివరాలతో నివేదికలు సిద్ధం చేయనున్నారు. దీనిపై సీఎం త్వరలోనే మరోసారి సమీక్షించే అవకాశం ఉంది.

సివిల్ పనులకూ ఆరోగ్యశ్రీ నిధులు!

» ఎంజీఎం ఆస్పత్రిలో నిధుల దుర్వినియోగంపై విచారణ షురూ

వరంగల్ మెడికల్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): ఎంజీఎం ఆస్పత్రిలో ఆరోగ్యశ్రీ నిధుల దుర్వినియోగాన్ని ప్రభుత్వం సీరియస్‌గా తీసుకున్న నేపథ్యంలో విజిలెన్స్ విచారణ గురువారం మొదలైంది. ఇందులో భాగంగా ఆస్పత్రి సూపరింటెండెంట్ చాంబర్‌లో విజిలెన్స్ డీఎస్పీ నారాయణరెడ్డి ఆధ్వర్యంలో పలు ఫైళ్లను అధికారులు పరిశీలించారు. విచారణలో ఆరోగ్యశ్రీ జిల్లా కోఆర్డినేటర్ డాక్టర్ నితిన్ స్వరూప్, జిల్లా మేనేజర్ విక్రమ్ తదితరులు పాల్గొన్నారు. ప్రధానంగా 2021-2024 సంవత్సరంలో రూ.30 కోట్లకుపైగా నిధులు దుర్వినియోగమైనట్లు ఫిర్యాదులు వెళ్లాయి. దీనిపై విజిలెన్స్ అధికారుల బృందం లోతుగా విచారించనుంది. మరో మూడు రోజుల పాటు విచారణ జరిగే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. ఇదే అంశంపై ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం నియమించిన కమిటీ కూడా విచారణ జరిపి ప్రభుత్వానికి నివేదిక సమర్పించింది. ఈ నేపథ్యంలో విజిలెన్స్ రంగంలోకి దిగడం ప్రాధాన్యం సంతరించుకుంది. ప్రభుత్వం నుంచి బడ్జెట్ విడుదల కాకపోవడంతో ఆరోగ్యశ్రీ నిబంధనలను అతిక్రమించి నిధులను వాడుకున్నట్లు ప్రాథమికంగా గుర్తించినట్లు సమాచారం. మందుల కొనుగోళ్లలో కూడా ఇష్టారాజ్యంగా వ్యవహరించినట్లు తెలుస్తోంది. నిబంధనలు అతిక్రమించి సివిల్ పనులకూ ఆరోగ్యశ్రీ నిధులను వాడారని ఫిర్యాదులు చేసినట్లు సమాచారం. ఈ నేపథ్యంలో సంబంధిత కాలంలో పని చేసిన సూపరింటెండెంట్లతో పాటు పలువురు సిబ్బందిని కూడా విజిలెన్స్ అధికారులు విచారించనున్నారు. ఈమేరకు అన్ని రకాల ఫైళ్లను సమర్పించాలని విజిలెన్స్ బృందం ఆదేశించినట్లు సమాచారం. కాగా గతంలో ఎంజీఎంలో జరిగిన గ్యాస్ కుంభకోణంతోపాటు వైద్య ఆరోగ్య శాఖలో జరిగిన కుటుంబ నియంత్రణ నిధుల దుర్వినియోగంలో విజిలెన్స్ నివేదిక ఆధారంగా చాలా మంది అధికారులు, ఉద్యోగులకు ఇప్పటికీ పూర్తిస్థాయిలో పెన్షన్ అందడంలేదు. తాజాగా ఆరోగ్యశ్రీ నిధుల వ్యవహారంపై విచారణ జరుగుతుండటంతో అధికారులు, సిబ్బంది గుండెల్లో రైళ్లు పరుగెడుతున్నాయి. ఆరోగ్యశ్రీ విభాగంలో పదేళ్లకుపైగా ఒకే సీనియర్ అసిస్టెంట్ విధులు నిర్వహించడంపై విజిలెన్స్ దృష్టిసారించింది. సదరు అసిస్టెంట్ ఆస్తుల వివరాలను కూడా సేకరించే పనిలో ఉన్నట్లు విశ్వసనీయ సమాచారం.

డీఈవోల అనుమతి లేకుండా.. విద్యార్థులను బయటికి తీసుకెళ్లద్దు

» విద్యాశాఖ ఆదేశం

హైదరాబాద్, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): పాఠశాల ఆవరణ దాటి విద్యార్థులను బయటికి తీసుకెళ్లాలంటే ప్రధానోపాధ్యాయులు.. జిల్లా విద్యాశాఖాధికారి(డీఈవో) అనుమతి తీసుకోవడం తప్పనిసరి అని పాఠశాల విద్యాశాఖ ఆదేశాలు జారీ చేసింది. ప్రధానోపాధ్యాయులు ప్రైవేటు, రాజకీయ కార్యక్రమాలకు విద్యార్థులను తీసుకెళ్తున్నారంటూ ఆరోపణలు వస్తున్న నేపథ్యంలో ఉత్తర్వులు జారీ అయ్యాయి.

బీసీ రిజర్వేషన్లు భిక్ష కాదు.. మా హక్కు

సీఎం అఖిలపక్షంతో ఢిల్లీ వెళ్లి ప్రధానిని కలవాలి... పార్లమెంట్‌లో రాజ్యాంగాన్ని సవరించేలా ఒత్తిడి తేవాలి

» బీసీలను మోసం చేస్తే రాష్ట్ర సర్కారుపై తిరుగుబాటే: జాజుల

» బీసీ రిజర్వేషన్లపై మోదీతో మాట్లాడతా: బండారు దత్తాత్రేయ

» ప్రభుత్వాలు పట్టింపులకు పోతే ఉవ్వెత్తున ఉద్యమం: కోదండరాం

» ఇందిరా పార్కు వద్ద బీసీల ధర్మ పోరాట దీక్ష



కార్యక్రమంలో మాట్లాడుతున్న బీసీ జేఏసీ వర్కింగ్ చైర్మన్ జాజుల, చిత్రంలో బండారు దత్తాత్రేయ, ఎల్.రమణ, శ్రీనివాస్‌గౌడ్, బీసీ సంఘాల నేతలు తదితరులు

కవాడిగూడ, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): బీసీ రిజర్వేషన్లు ఎవరో ఇచ్చే భిక్ష కాదని.. తమ హక్కు అని బీసీ జేఏసీ వర్కింగ్ చైర్మన్ జాజుల శ్రీనివాస్ గౌడ్ వ్యాఖ్యానించారు. బీసీ రిజర్వేషన్లకు రాజ్యాంగబద్ధత కల్పించే విషయమై సీఎం రేవంత్‌రెడ్డి తక్షణమే అఖిలపక్షంతో ఢిల్లీకి వెళ్లి ప్రధానితో భేటీ కావాలన్నారు. వచ్చే పార్లమెంట్ సమావేశాల్లో రాజ్యాంగాన్ని సవరించే విషయమై కేంద్రంపై ఒత్తిడి పెంచాలని సూచించారు. ప్రధాని సమయం ఇవ్వకపోతే ఇండియా కూటమి తరఫున పార్లమెంట్ సమావేశాలను స్తంభింపచేయాలని.. కేంద్రంపై పోరాటానికి కార్యాచరణ ప్రకటించాలని డిమాండ్ చేశారు. బీసీలకు విద్య, ఉద్యోగ, రాజకీయ రంగాల్లో 42 శాతం రిజర్వేషన్లు పెంచడానికి పార్లమెంట్‌లో రాజ్యాంగ సవరణ చేసి, 9వ షెడ్యూల్‌లో చేర్చాలనే ప్రధాన డిమాండ్‌తో జాజుల ఆధ్వర్యంలో గురువారం హైదరాబాద్‌లోని ఇందిరాపార్కు వద్ద బీసీల ధర్మ పోరాట దీక్ష నిర్వహించారు. ఇందులో మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ, ఎమ్మెల్సీ కోదండరాం, టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మన్, మాజీ ఎంపీ మధుయాష్కీ, ఎమ్మెల్సీలు అద్దంకి దయాకర్, మధుసూదనాచారి, ఎల్.రమణ, మాజీమంత్రి శ్రీనివాస్‌గౌడ్‌తో పాటు 136 కుల సంఘాల రాష్ట్ర అధ్యక్షులు, 40 బీసీ సంఘాల అధ్యక్షులు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జాజుల మాట్లాడుతూ.. బీసీ రిజర్వేషన్ల కోసం ఢిల్లీతో కొట్లాడుతారో, బీసీ దోషులుగా నిలబడతారో కాంగ్రెస్ ప్రభుత్వం తేల్చుకోవాలన్నారు. బీసీలను నమ్మించి మోసం చేస్తే రాష్ట్ర ప్రభుత్వంపై తిరుగుబాటు తప్పదని హెచ్చరించారు. 42 శాతం రిజర్వేషన్లు సాధించేంతా వరకు బీసీ ఉద్యమాన్ని ఆపే ప్రసక్తి లేదని చెప్పారు. బండారు దత్తాత్రేయ మాట్లాడుతూ.. బీసీల వాటా బీసీలకు దక్కితేనే న్యాయం జరుగుతుందన్నారు. బీసీ రిజర్వేషన్ల విషయంలో ప్రధాని మోదీతో మాట్లాడతానని చెప్పారు. రాష్ట్రంలో జనాభా మేరకు రాజకీయ రంగంలో, రాష్ట్ర బడ్జెట్‌లో బీసీలకు వాటా కల్పించాలని సీఎం రేవంత్‌రెడ్డికి సూచించారు. కోదండరాం మాట్లాడుతూ.. బీసీల డిమాండ్ న్యాయమైనదని.. సమస్యను పరిష్కరించే బాధ్యత కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తీసుకోవాలన్నారు. ప్రభుత్వాలు పట్టింపులకు పోతే తెలంగాణ ఉద్యమం తరహాలో బీసీ ఉద్యమం ఉవ్వెత్తున ఎగుస్తుందని హెచ్చరించారు. బీఆర్ఎస్ నేతలు మాట్లాడుతూ.. కామారెడ్డి డిక్లరేషన్‌కు కట్టుబడి బీసీ రిజర్వేషన్లు పెంచిన తర్వాతనే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని డిమాండ్ చేశారు. బీసీ రిజర్వేషన్లపై కాంగ్రెస్ పోరాడితే బీఆర్ఎస్ కూడా మద్దతు ఇస్తుందన్నారు.

రాష్ట్రం గజగజ!

బాగా పడిపోయిన కనిష్ట ఉష్ణోగ్రతలు

» ఆసిఫాబాద్ జిల్లా గిన్నెధరిలో 8.2 డిగ్రీల కనిష్ట ఉష్ణోగ్రత

» రాష్ట్రవ్యాప్తంగా సాధారణం కంటే 3, 4 డిగ్రీలు తక్కువగా కనిష్ట ఉష్ణోగ్రతలు



హైదరాబాద్, నవంబర్ 13 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రాన్ని చలి వణికిస్తోంది. కనిష్ట ఉష్ణోగ్రతలు మరింతగా పడిపోతున్నాయి. ఉదయం పూట ఇళ్లలోంచి బయటికి రావాలంటేనే భయమేసేలా చలి విజృంభిస్తోంది. గ్రామీణ ప్రాంతాల్లో సాయంత్రం 6 దాటితే బయట జన సంచారమే కనిపించడం లేదు. మారుమూల, ఏజెన్సీ ప్రాంతాల్లో ఉదయం 9 గంటల వరకు కూడా పొగమంచు కప్పేస్తోంది. బుధవారం రాత్రి అతి తక్కువగా కుమరం భీం ఆసిఫాబాద్ జిల్లా గిన్నెధరిలో 8.2 డిగ్రీల కనిష్ట ఉష్ణోగ్రత నమోదైంది. ఇక్కడ సాధారణ ఉష్ణోగ్రతతో పోలిస్తే ఇది 4.7 డిగ్రీలు తక్కువ కావడం గమనార్హం. రాష్ట్రవ్యాప్తంగా సాధారణంతో పోలిస్తే మూడు, నాలుగు డిగ్రీల మేర తక్కువగా కనిష్ట ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. మరో రెండు రోజుల పాటు రాష్ట్రవ్యాప్తంగా చలి తీవ్రత మరింతగా పెరుగుతుందని.. అన్ని జిల్లాల్లో కనిష్ట ఉష్ణోగ్రతలు మరో 2, 3 డిగ్రీల మేర తగ్గుతాయని హైదరాబాద్‌లోని ప్రాంతీయ వాతావరణ కేంద్రం గురువారం తెలిపింది. ఇక సాధారణం కంటే తక్కువగా ఉష్ణోగ్రతలు నమోదవుతున్న జిల్లాల్లో హన్మకొండ జిల్లా టాప్‌లో ఉంది. ఈ జిల్లాలో కనిష్ట ఉష్ణోగ్రత సగటున 14 డిగ్రీలుగా నమోదైంది. సాధారణంతో పోలిస్తే ఇది 5.5 డిగ్రీలు తక్కువ. ఇక మెదక్‌లో సాధారణంతో పోలిస్తే 4.5 డిగ్రీలు తక్కువగా 12 డిగ్రీల మేర.. హైదరాబాద్‌లో 3.5 డిగ్రీలు తక్కువగా 14.4 డిగ్రీల కనిష్ట ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.

అతి తక్కువ ఉష్ణోగ్రతలు నమోదైన ప్రాంతాలివీ..

ప్రాంతం (జిల్లా)	కనిష్ట ఉష్ణోగ్రత
గిన్నెధరి (ఆసిఫాబాద్)	8.2
రుద్రంగి (రాజన్న సిరిసిల్ల)	9.1
నేరడిగొండ (ఆదిలాబాద్)	9.5
సారంగాపూర్ (నిర్మల్)	10.1
కొడిమ్యాల (జగిత్యాల)	10.4
న్యాల్‌కల్ (సంగారెడ్డి)	10.7
గాంధారి (కామారెడ్డి)	10.8
చొప్పదండి (కరీంనగర్)	11.2
గోపన్నపల్లి (నిజామాబాద్)	11.3

ఆర్టీసీకి రూ.7,980 కోట్ల చెల్లింపు

- సంస్థకు అదనపు ఆదాయ మార్గాలను చూడండి
- ఆర్టీసీ ఉన్నతాధికారులతో మంత్రి పొన్నం సమీక్ష



హైదరాబాద్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): మహాలక్ష్మి పథకం ద్వారా ఇప్పటి వరకు మహిళలు 237 కోట్ల జీరో టికెట్లు ఉపయోగించుకున్నారని, అందుకు సంబంధించి ఆర్టీసీకి సర్కారు రూ.7,980 కోట్లు చెల్లించిందని మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. మహాలక్ష్మి పథకంతో సంస్థ క్రమంగా లాభాల బాటలోకి వస్తున్నప్పటికీ.. టికెట్‌తో పాటు అదనపు ఆదాయ మార్గాలపై దృష్టి సాధించాలని అధికారులకు సూచించారు. ఆర్టీసీ ఉన్నతాధికారులతో సచివాలయంలో మంత్రి పొన్నం గురువారం సమీక్ష నిర్వహించారు. టికెట్‌పై ప్రకటనలతో ఆదాయాన్ని పెంచాలని అధికారులకు సూచించారు. నష్టాల్లో కొనసాగుతున్న డిపోలు లాభాల బాట పట్టడానికి తీసుకోవాల్సిన చర్యలపై అధ్యయనం చేసేందుకు ప్రత్యేక కమిటీ ఏర్పాటు చేయాలని సంస్థ ఎండీ నాగిరెడ్డికి సూచించారు. హైదరాబాద్‌లో బస్సుల సంఖ్యను పెంచేలా కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేయాలన్నారు. ఫోర్త్ సిటీలో బస్ టెర్మినల్ నిర్మాణం, బస్ సౌకర్యాలపై అధ్యయనం చేయాలని ఆదేశించారు. డిసెంబరు చివరిలోపు 84 ట్రాఫిక్ సూపర్‌వైజర్ ట్రైనీ, 114 సూపర్‌వైజర్ ట్రైనీ పోస్టులకు నోటిఫికేషన్ విడుదల కానుందని తెలిపారు. మేడారం జాతర సమీపిస్తుండటంతో ములుగు బస్‌స్టేషన్ నిర్మాణాన్ని పూర్తి చేయాలని ఆదేశించారు.

మహాలక్ష్మి నిధుల చెల్లింపుపై మంత్రి అబద్ధాలు..

ఆర్టీసీ సమీక్షలో మంత్రి పొన్నం కార్మికుల సమస్యలను విస్మరించడం బాధాకరమని ఎంప్లాయీస్ యూనియన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బాబు, వెంకన్న ఆరోపించారు. కాంగ్రెస్ హామీ ప్రకారం.. కార్మిక సంఘాల పునరుద్ధరణ ఏమైందని ప్రశ్నించారు. మహాలక్ష్మి పథకం కింద ఆర్టీసీకి ప్రతి నెలా ఇవ్వాల్సిన రూ.350కోట్లతో పాటు రూ.900 కోట్ల పాత బకాయిలను మంత్రి ఎప్పుడు ఇప్పిస్తారో చెప్పకుండా.. మొత్తం సొమ్ము ఇచ్చామని అబద్ధం చెప్పడం వారి స్థాయికి తగదని విమర్శించారు. పదవీ విరమణ చేసిన కార్మికులకు బకాయిలు చెల్లించాలని ఆర్టీసీ బోర్డు మాజీ డైరెక్టర్ నాగేశ్వరరావు కోరారు.

పదో తరగతి విద్యార్థులందరి పరీక్ష ఫీజు నేనే చెల్లిస్తా

- సికింద్రాబాద్ లోక్‌సభ పరిధిలోని ప్రభుత్వ పాఠశాలలకే..
- కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి ప్రకటన.. హైదరాబాద్ కలెక్టర్‌కు లేఖ

న్యూఢిల్లీ/హైదరాబాద్ సిటీ, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): తాను ప్రాతినిధ్యం వహిస్తున్న సికిందరాబాద్ లోక్‌సభ నియోజకవర్గం పరిధిలోని ప్రభుత్వ పాఠశాలల్లో 10వ తరగతి చదువుతున్న విద్యార్థులందరి పరీక్ష ఫీజులు తానే చెల్లిస్తానని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి ప్రకటించారు. తెలంగాణ ఎస్ఎస్‌సీ బోర్డు పరీక్ష ఫీజు మొత్తాన్ని తన జీతం నుంచి చెల్లిస్తానని తెలిపారు. ఈ మేరకు ఆయన హైదరాబాద్ జిల్లా కలెక్టర్ దాసరి హరిచందనకు లేఖ రాశారు. ప్రధానమంత్రి మోదీ సూచించిన అంత్యోదయ స్ఫూర్తితో ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకుంటున్న పదో తరగతి పిల్లలకు తన వంతుగా సహాయం చేయాలని నిర్ణయించుకున్నట్టు తెలిపారు. ఏ ఒక్క విద్యార్థీ ఆర్థిక ఇబ్బందులతో చదువుకు దూరం కాకూడదన్న ఉద్దేశంతో ఈ నిర్ణయం తీసుకున్నట్టు తెలిపారు.



శంషాబాద్‌ఎయిర్‌పోర్టులో ల్యాండైన ఆంటోనోవ్ ఏఎన్124 కార్గో విమానం

శంషాబాద్‌కు రెండో అతిపెద్ద కార్గో విమానం

- ఎయిర్‌పోర్టులో ల్యాండ్ కావడం ఇది రెండోసారి

శంషాబాద్ రూరల్, నవంబర్ 13 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్‌లోని శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయానికి గురువారం అనుకోని అతిథి వచ్చింది. అదే ప్రపంచంలో రెండో అతిపెద్ద ఆంటోనోవ్ ఏఎన్ 124 కార్గో విమానం. శంషాబాద్ ఎయిర్‌పోర్టుకు ఈ విమానం రావడం ఇది రెండో సారి. ప్రపంచంలోనే అతిపెద్ద కార్గో విమానం రావడంతో ఎయిర్‌పోర్టులో సందడి నెలకొంది. జీఎంఆర్ అధికారులు విమాన సిబ్బందికి, పైలెట్లకు పూలమాలలు వేసి ఘనంగా స్వాగతం పలికారు. ఆంటోనోవ్ ఏఎన్ 124 ఎయిర్‌పోర్టులో ల్యాండ్ కావడంతో ప్రయాణికులతో పాటు, ఎయిర్‌లైన్ల సిబ్బంది, అధికారులు ఆశ్చర్యం వ్యక్తం చేశారు.

కౌంటర్ దాఖలుకు వాయిదాలా?

- ఇది ప్రభుత్వ నిర్లక్ష్య ధోరణి.. హైకోర్టు ఆగ్రహం
- దామగుండం రాడార్ కేంద్రం కేసుపై విచారణ

హైదరాబాద్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): వివిధ కేసుల్లో తగిన సమయానికి కౌంటర్‌లు దాఖలు చేయకుండా ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తోందని హైకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. తగినంతగా సమయమిచ్చినా పదే పదే వాయిదాలు కోరుతోందని ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అపరేశ్‌కుమార్ సింగ్, జస్టిస్ మొహియుద్దీన్ ధర్మాసనం తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసింది. వికారాబాద్‌లోని దామగుండం రిజర్వు అటవీ ప్రాంతంలో రాడార్ కేంద్రం ఏర్పాటుకు సంబంధించి 2020లో దాఖలైన ప్రజాప్రయోజన వ్యాజ్యంపై విచారణ సందర్భంగా ధర్మాసనం ఈ వ్యాఖ్యలు చేసింది. ఈ కేసులో కౌంటర్ దాఖలు చేయడానికి రెండు వారాలు చివరి అవకాశం ఇస్తున్నామని, సమర్పించని పక్షంలో జరిమానా విధించాల్సి ఉంటుందని ప్రభుత్వ న్యాయవాదిని హెచ్చరించింది. తదుపరి విచారణ డిసెంబర్ 15కు వాయిదా వేసింది.

సంరక్షకుల సంతకంతో పాస్‌పోర్టు జారీ చేయొచ్చు

- తండ్రి పట్టించుకోనప్పుడు ఇదే మార్గం: హైకోర్టు

హైదరాబాద్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): తల్లిదండ్రుల అధీనంలో లేని పిల్లలకు సంరక్షకుల సంతకంతో పాస్‌పోర్టు జారీ చేయవచ్చని హైకోర్టు పేర్కొంది. తమ కూతురు పిల్లలకు తండ్రి సంతకం లేకుండా పాస్‌పోర్టు జారీ చేయలేమంటూ అధికారులు చెప్పడాన్ని సవాల్ చేస్తూ రంగారెడ్డి జిల్లా అత్తాపూర్‌కు చెందిన మహమ్మద్ తాజుద్దీన్ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై జస్టిస్ నగేశ్ భీమపాక ధర్మాసనం విచారణ చేపట్టింది. వాదనలు విన్న న్యాయమూర్తి.. పిల్లల ఆలనాపాలనా పట్టించుకోని తండ్రికి వారి ప్రయాణాన్ని అడ్డుకునే హక్కు లేదని చెప్పారు. పిటిషనర్ విజ్ఞప్తి మేరకు మైనర్లకు పాస్‌పోర్టు జారీ చేయాలని అధికారులను ఆదేశించారు.

బీజేపీ వినూత్న నిరసన


పడవలపై నిరసన తెలుపుతున్న బీజేపీ నాయకులు

గిర్మాజిపేట (వరంగల్), నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): వరంగల్ బస్‌స్టేషన్ నిర్మాణ స్థలంలో బీజేపీ నాయకులు గురువారం వినూత్న రీతిలో నిరసన తెలిపారు. గుంతలు తీసి వదిలేసిన నిర్మాణ స్థలం చెరువులా మారడంతో అందులో పడవ ప్రయాణం చేస్తూ రాష్ట్ర ప్రభుత్వ వైఖరిని ఎండగట్టారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మంత్రులు కొండా సురేఖ, పొన్నం ప్రభాకర్ ముఖచిత్రాలు ఉన్న మాస్కులు ధరించి మంత్రులకు ఉచిత ప్రయాణం అంటూ ఎద్దేవా చేశారు. బస్‌స్టేషన్ నిర్మాణ పనులు నెల రోజుల్లో చేపట్టకపోతే కాంగ్రెస్ ఎమ్మెల్యేల ఇళ్లు ముట్టడిస్తామని హెచ్చరించారు.

పెట్టుబడులు పెట్టండి!

(మొదటిపేజీ తరువాయి)

లండన్, టోక్యో, దుబాయ్, సియోల్ రివర్‌ఫ్రంట్‌ల మాదిరే హైదరాబాద్ నైట్ ఎకానమీ కొత్త దశలోకి ప్రవేశిస్తుందని అన్నారు. డ్రై పోర్ట్, మెట్రో విస్తరణ, రీజినల్ రింగ్ రోడ్డు, రేడియల్ రోడ్లు, ఔటర్ రింగ్ రోడ్డు - రీజినల్ రింగ్ రోడ్డు మధ్య తయారీ జోన్ వంటి కీలక మౌలిక ప్రాజెక్టుల పురోగతిని సీఎం వివరించారు. చైనా ప్లస్ 1 మోడల్‌కు గ్లోబల్ సమాధానం తెలంగాణ అవుతుందని చెప్పారు (చైనాకు అదనంగా మరో ఉత్పాదక కేంద్రం ఏర్పాటును చైనా ప్లస్ 1 మోడల్ అంటారు).

రోడ్లకు ఆ సంస్థల పేర్లు పెడతాం..!

భారతదేశంలో రోడ్లకు ఎక్కువగా నాయకుల పేర్లు ఉంటాయని, హైదరాబాద్‌లో ఆ ట్రెండ్‌ను మార్చేయాలని అనుకుంటున్నామని సీఎం రేవంత్ తెలిపారు. ముఖ్యమైన రోడ్లకు గూగుల్, మెటా, టీసీఎస్, ఇన్ఫోసిస్ వంటి కంపెనీల పేర్లను పెడతామని ప్రకటించారు. అలాగే, హార్వర్డ్, స్టాన్‌ఫోర్డ్, ఆక్స్‌ఫర్డ్ వంటి ఐవీ లీగ్ విశ్వవిద్యాలయాలు హైదరాబాద్‌లో ఆఫ్‌షోర్ క్యాంపస్‌లు ఏర్పాటు చేస్తే, తక్కువ ఖర్చు అవుతుందని తెలిపారు. సులభమైన వీసా విధానాలతో దక్షిణాది దేశాల (గ్లోబల్ సౌత్) విద్యార్థులకు నాణ్యమైన విద్య లభిస్తుందని చెప్పారు. ప్రపంచ స్థాయి విద్యా సంస్థలు హైదరాబాద్‌కు రావాలని ఆహ్వానించారు. సదస్సు ప్రారంభంలో ఆయన 'తెలంగాణ రైజింగ్-2047' విజన్‌ను ప్రదర్శించారు. తెలంగాణను ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దాలన్న సీఎం రేవంత్‌రెడ్డి లక్ష్యానికి విశేష ఆదరణ లభించింది. అంతర్జాతీయ పెట్టుబడిదారులకు రాష్ట్రంలో ఉన్న అవకాశాలను సీఎం వివరించిన తీరు ప్రపంచ వ్యాపార వర్గాలను ఆకట్టుకుంది. ముఖ్యమంత్రి వెంట తెలంగాణ పరిశ్రమల శాఖ ముఖ్య కార్యదర్శి జయేశ్ రంజన్ ఉన్నారు. కాగా, తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి విజన్ పారదర్శకంగా, సాహసోపేతంగా (బోల్డ్), సాధించగలిగేలా ఉందని టెక్ దిగ్గజం, సిస్కో మాజీ సీఈవో జాన్ చాంబర్స్ కొనియాడారు. ఆయన చెప్పిన ప్రాజెక్టులు, వాటి సామాజిక ప్రభావం ఎంతో ప్రేరణాత్మకంగా ఉందని తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆహ్వానం మేరకు తమ సభ్యుల్లో ఎక్కువ మంది డిసెంబరు 8, 9 తేదీల్లో హైదరాబాద్‌లో జరిగే తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్‌కు హాజరవుతామని యూఎస్ ఐఎస్‌పీఎఫ్ అధ్యక్షుడు ముఖేశ్ ఆఘీ తెలిపారు. తెలంగాణ విజన్‌ను తెలుసుకునేందుకు తామంతా ఆసక్తిగా ఎదురు చూస్తున్నామని చెప్పారు.



ఢిల్లీలో అమెరికా-భారత్ భాగస్వామ్య సదస్సులో ప్రసంగిస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి. చిత్రంలో జయేశ్ రంజన్ తదితరులు

పొట్ట నింపని పత్తి

(మొదటిపేజీ తరువాయి)


ఎన్కూరు మండలం బీఎన్ తండాలో దెబ్బతిన్న పత్తి పంట

సీజన్‌లో రాష్ట్రవ్యాప్తంగా సుమారు 46 లక్షల ఎకరాల్లో రైతులు పత్తి సాగు చేశారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని నల్లరేగడి భూముల్లో వాతావరణం అనుకూలిస్తే ఎకరానికి 10-12 క్వింటాళ్ల దిగుబడి వస్తుంది. చెలక నేలలు, తేలికపాటి భూముల్లో 4-5 క్వింటాళ్ల దిగుబడి వస్తుంది. మధ్యస్థ భూములు అయితే 6-7 క్వింటాళ్ల దిగుబడి వస్తుంది. రాష్ట్రవ్యాప్తంగా పత్తి దిగుబడి సగటు చూస్తే ఎకరాకు 7 క్వింటాళ్ల వరకు ఉంటుంది. కానీ, ఈసారి ఆ పరిస్థితి లేదు. జూన్, జూలైల్లో కాస్త తక్కువ వర్షాలు పడినా, ఆగస్టు నుంచి కుండపోత వర్షాలు కురవడంతో పత్తి పంటకు తీవ్ర నష్టం వాటిల్లింది. నైరుతి, ఈశాన్య రుతుపవనాలతో పడే వర్షాలతోపాటు అకాల వర్షాలు, తుపాన్ల ప్రభావంతో పత్తి పంట కోలుకోలేని విధంగా తయారైంది. దిగుబడి పూర్తిగా పడిపోయింది. పత్తి సాగుకు కేంద్రబిందువైన ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో కూడా 8-10 క్వింటాళ్లకు మించి దిగుబడి రాలేదు. జిల్లాలో అసాధారణ స్థాయిలో 1,540 మి.మీ. వర్షపాతం నమోదైంది. దీంతో పత్తి తీవ్రంగా దెబ్బతింది. వరంగల్, కరీంనగర్, నల్లగొండ, మహబూబ్‌నగర్, ఖమ్మం, మెదక్ ఉమ్మడి జిల్లాల్లో కూడా పత్తి పంట పరిస్థితి ఇలాగే తయారైంది.

ఒకటి, రెండు సార్లు పత్తి తీయగానే..

సాధారణంగా పత్తి పంట ఏడాది పాటు సాగులో ఉంటుంది. జూన్‌లో మొదలైతే మార్చి నెలాఖరు వరకు ఉంచినా పత్తి దిగుబడి వస్తుంది. అయితే, రైతులు జూన్ నుంచి డిసెంబరు వరకు పక్కాగా ఉంచుతారు. జనవరి నుంచి మార్చి వరకు కొందరు రైతులు పత్తి చెట్లు తీసేసి.. ఇతర పంటలు వేస్తుంటారు. మార్చి వరకు పంటను ఉంచి నీళ్లు, ఎరువులు అందిస్తే.. పూత, కాతతో మళ్లీ 3-4 క్వింటాళ్ల దిగుబడి వస్తుంది. ఈ ఖరీఫ్‌లో అలాంటి పరిస్థితి లేదు. నవంబరు మొదటి పక్షంలోనే రైతులు పత్తి చేను తీసేసి, నేలను చదును చేస్తున్నారు. పెద్దగా దిగుబడి రాని పంటను నాలుగైదు నెలలు ఉంచడం ఎందుకన్న ఆలోచనతో పత్తి తీసేస్తున్నారు. వర్షాల తాకిడికి చెట్లు పెరగకపోవడం, ఆకులు ముడతపడడం, కాయలు నల్లబడడంతో పత్తి మొక్కలను తీసేయడమే మేలన్న నిర్ణయానికి వచ్చారు. ఒకటి, రెండు సార్లు పత్తి తీసే స్థాయిలోనే చేనును దున్నేస్తున్నారు. అదే భూమిలో మొక్కజొన్న సాగు చేస్తున్నారు. కొందరు రైతులు శనగ, పెసర, ఇతర పంటలు కూడా వేస్తున్నారు. సాధారణంగా మొక్కజొన్న సాగుకు ప్రత్యేక సీజనేమీ ఉండదు. నీటి వసతి ఉంటే ఎప్పుడైనా వేసుకోవచ్చు. దీంతో రైతులు పత్తి చేనును తొలగించి, మొక్కజొన్నను సాగు చేస్తున్నారు. ఉమ్మడి వరంగల్, కరీంనగర్ జిల్లాల్లోని సింహ భాగం పత్తి రైతులు ఇదే పని చేస్తున్నారు. పత్తి పంటకు ఎకరానికి రూ.36-46 వేల వరకు పెట్టుబడి ఖర్చవుతోంది. ఆయా జిల్లాల్లో 10 క్వింటాళ్ల దిగుబడి వస్తే తప్ప ఎంతో కొంత మిగిలే పరిస్థితి లేదు. ఇప్పుడు అందులో సగం కూడా దిగుబడి రావడం లేదు.

డిసెంబరు 31 నాటికి ముగించడమే మేలు

పత్తి పంటను ఆరు నెలల్లో (డిసెంబరు 31 నాటికి) ముగించాలని వ్యవసాయ శాస్త్రవేత్తలు చెబుతున్నారు. గతంలో గులాబీ పురుగులు లేని సమయంలో జనవరి, ఫిబ్రవరి, మార్చి వరకు పత్తి చేనును ఉంచినా ఇబ్బంది ఉండేది కాదు. నీటి వసతి, ఎరువులు వేస్తే సరిపోయేది. కానీ, కొంతకాలంగా గులాబీ రంగు పురుగు పత్తి పంటకు కొరకరాని కొయ్యలా తయారైంది. చలికాలం మొదలవగానే గులాబీ పురుగు తీవ్రత పెరుగుతోంది. నష్టశాతం కూడా పెరిగిపోయింది. మందులు కొడుతున్నా తగ్గే పరిస్థితి లేదు. జనవరి, ఫిబ్రవరి, మార్చి, ఏప్రిల్ వరకు పత్తి సాగును పొడిగిస్తే.. కాయలు పుచ్చుపట్టిపోతాయే తప్ప ఫలితం ఉండదని కరీంనగర్ వ్యవసాయ పరిశోధన స్థానం ప్రధాన శాస్త్రవేత్త రాంప్రసాద్ 'ఆంధ్రజ్యోతి'కి తెలిపారు. డిసెంబరు నెలాఖరు నాటికి పత్తి పంటను ముగించి.. ప్రత్యామ్నాయ, ఆరు తడి పంటలు వేసుకోవాలని తెలిపారు. అదేక్రమంలో నవంబరు 20లోపు మొక్కజొన్న విత్తనాలు వేస్తే యాసంగి సీజన్‌లో దిగుబడి ఎక్కువగా వస్తుందని తెలిపారు.

మూడెకరాల్లో పత్తి తీసి మొక్కజొన్న వేశా



ఈ ఖరీఫ్‌లో మూడెకరాల్లో పత్తి సాగు చేశా. అధిక వర్షాలకు పంట ఎర్రబారిపోయింది. పత్తి కాయలు నల్లగా మారాయి. ఎకరానికి 3 క్వింటాళ్లకు మించి దిగుబడి రాలేదు. కాలపరిమితి ముగిసేవరకు పంట ఉంచినా లాభం లేదని అనిపించింది. అందుకే పత్తి మొక్కలను పీకేసి, అదే భూమిలో మొక్కజొన్న విత్తనాలు వేశా. పత్తి సాగుతో తీవ్రంగా నష్టపోయా. పెట్టుబడి ఖర్చులు కూడా రాలేదు. పత్తిపంటను దున్నేసి మొక్కజొన్న వేయడం ద్వారా యాసంగిలో అయినా ఎంతో కొంత గిట్టుబాటు అవుతుందని ఆశిస్తున్నా.

- కూరపాటి రమణ, అనంతసాగర్, ఖమ్మం జిల్లా

సీఎంఆర్ ధాన్యం పక్కదారి

- పలు మిల్లుల్లో విజిలెన్స్ సోదాలు
- నెలలో రూ.71.01 కోట్ల స్టాక్ మాయం
- పౌర సరఫరాల శాఖ అధికారులు.. మిల్లర్ల పాత్రపై సర్కారుకు విజిలెన్స్ నివేదిక

హైదరాబాద్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని పలు జిల్లాల్లో రైస్ మిల్లర్లు పక్కా ప్రణాళికతో కస్టమ్ మిల్లింగ్ రైస్(సీఎంఆర్) ధాన్యాన్ని పక్కదారి పట్టిస్తున్నారు. మిల్లర్లు ప్రతి సీజన్‌లోనూ ఇలాగే చేస్తున్నా.. సంబంధిత అధికార యంత్రాంగం సరైన సమయంలో తనిఖీలు నిర్వహించకపోవడంతో రూ.కోట్ల విలువైన ధాన్యం దారిమళ్లుతోంది. ఈ విషయాన్ని సీరియస్‌గా తీసుకున్న విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు.. రైస్ మిల్లుల్లో తనిఖీలు నిర్వహించి సీఎంఆర్ కుంభకోణాన్ని వెలికితీస్తున్నారు. తాజాగా నాలుగు రైస్ మిల్లుల్లో జరిపిన సోదాల్లో రూ.20.76కోట్ల సీఎంఆర్ ధాన్యం దారి మళ్లినట్లు గుర్తించారు. 2024-25 రబీ సీజన్‌తో పాటు 2023-24లోనూ పలువురు మిల్లర్లు ఇదే విధంగా చేతివాటం ప్రదర్శించిన విషయం విచారణలో తేలింది. పౌర సరఫరాల శాఖ అధికారులు, మిల్లర్ల మధ్య జరిగిన లోపాయికారీ ఒప్పందాలను బట్టబయలు చేస్తూ ప్రభుత్వానికి నివేదిక అందచేశారని సమాచారం. వనపర్తి జిల్లా పెదమందడి మండలం మోజర్ల గ్రామంలోని వారాహి, చాముండి రైస్ మిల్లుల్లో విజిలెన్స్ అధికారులు బుధవారం సోదాలు నిర్వహించారు. స్టాకును తనిఖీ చేసి రెండు మిల్లుల్లో కలిపి 2024-25 రబీ, ఖరీఫ్ సీజన్లకు సంబంధించిన రూ.13.67 కోట్ల విలువైన సీఎంఆర్ స్టాకును అమ్ముకున్నట్లు గుర్తించారు. నిర్మల్ జిల్లా కడెం ప్రాంతంలోని కట్ట బాలాజీ రైస్ మిల్లులో 2024-25 రబీ సీజన్‌కు సంబంధించిన రూ.6.22కోట్ల సీఎంఆర్ స్టాకును అమ్ముకున్నట్లు తేల్చారు. సంగారెడ్డి జిల్లా ఆందోల్ మండలం దకూర్ గ్రామంలోని కన్యకా పరమేశ్వరి ఆగ్రో ఇండస్ట్రీస్‌లో రూ.87.01లక్షల సీఎంఆర్ స్టాకును అమ్ముకున్నట్లు గుర్తించారు. హనుమకొండ జిల్లా కమలాపూర్ మండలం కనిపర్తి గ్రామంలోని శ్రీశైలం మల్లన్న రైస్‌మిల్లులో రూ.9.34 కోట్ల విలువైన 40,649 క్వింటాళ్ల సీఎంఆర్ ధాన్యం తక్కువగా ఉన్నట్లు కనుగొన్నారు. కేసు నమోదు చేసిన విజిలెన్స్ అధికారులు.. పౌర సరఫరాల శాఖకు నివేదిక పంపారు. గత నెల 24న ములుగు జిల్లా మల్లంపల్లిలోని శ్రీ అచ్యుత రైస్ మిల్లులో తనిఖీలు చేసి రూ.3.81 కోట్ల విలువైన సీఎంఆర్ స్టాకు దారి మళ్లినట్లు తేల్చారు. గత నెల 23న సిద్దిపేట జిల్లా ఇర్కోడ్ గ్రామంలోని ఎంఎం ఫుడ్ ప్రాసెసింగ్ సెంటర్‌లో సోదాలు జరిపి రూ.1.54కోట్ల ధాన్యం దారి మళ్లినట్లు గుర్తించారు. గత నెల 16న నల్లగొండ జిల్లా కేతేపల్లి మండలం ఉప్పలపల్లి గ్రామంలోని చాముండేశ్వరి ఆగ్రో ఇండస్ట్రీస్‌లో తనిఖీలు చేసి రూ.28.88కోట్ల ధాన్యం మాయమైనట్లు కనుగొన్నారు. గత నెల 14న పెద్ద పాపయ్యపల్లిలోని రవిచంద్ర ఇండస్ట్రీస్‌లో రూ.6.68కోట్ల సీఎంఆర్ దారి మళ్లిందని గుర్తించి, పౌర సరఫరాల శాఖకు నివేదిక పంపారు.

టెక్నాలజీతోనే సక్సెస్

విద్యార్థులు టెక్నాలజీలో ప్రావీణ్యం సంపాదించాలి.. శ్రీధర్‌బాబు పిలుపు

టీ-సాట్ రాష్ట్రస్థాయి పోటీల విజేతలకు బహుమతుల ప్రదానం



జూబ్లీహిల్స్‌లోని టీ-సాట్ కార్యాలయంలో ప్రభుత్వ పాఠశాల విద్యార్థుల రాష్ట్రస్థాయి వార్షిక పోటీలు-2025 విజేతల బహుమతి ప్రధానోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న మంత్రి శ్రీధర్‌బాబు

హైదరాబాద్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు కెరీర్‌లో విజయం సాధించాలంటే టెక్నాలజీలో మంచి ప్రావీణ్యం సంపాదించాలని మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు అన్నారు. సమాజంలో అత్యంత వేగంగా వస్తున్న మార్పులకు అనుగుణంగా కొత్త విషయాలు నేర్చుకుంటూ విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించాలని సూచించారు. ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు టీ-సాట్ నిర్వహించిన 'రాష్ట్ర స్థాయి వార్షిక పోటీలు-2025'లో విజేతలకు గురువారం హైదరాబాద్‌లోని టీ-సాట్ కార్యాలయంలో బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన శ్రీధర్‌బాబు మాట్లాడుతూ.. విద్యార్థులు టీ-సాట్ సాంకేతికతను ఉపయోగించుకుని తమ భవిష్యత్‌కు గట్టి పునాదులు వేసుకోవాలని సూచించారు. టీ-సాట్ పోటీల్లో విజేతలుగా నిలిచిన 99మంది.. తాము ఒక్కొక్కరు సుమారు 2,200 మంది విద్యార్థుల నాలెడ్జికి సమానమని భావించాలని సూచించారు. డిజిటల్ విద్యలో టీ-సాట్ నెట్‌వర్క్ అందిస్తున్న సాంకేతికతను ప్రభుత్వ పాఠశాలలు, మారుమూల ప్రాంత ప్రజలు వినియోగించుకోవాలని కోరారు. తద్వారా రాష్ట్ర ప్రభుత్వ కలలను ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు నిజం చేయాలని పిలుపునిచ్చారు. టీ-సాట్ సీఈవో బోదనపల్లి వేణుగోపాల్‌రెడ్డి మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం పక్షాన మంత్రి శ్రీధర్‌బాబు.. టీ-సాట్‌కు సంపూర్ణ మద్దతు అందచేస్తూ, తెలంగాణ విద్యార్థులు, యువతకు చేయూత అందిస్తున్నారని కొనియాడారు. 'రాష్ట్ర స్థాయి వార్షిక పోటీలు 2025' పేరుతో నిర్వహించిన వ్యాసరచన, వక్తృత్వ, క్విజ్ పోటీలు గురువారం ముగిశాయి. క్విజ్‌లో ప్రథమ స్థానంలో రాజన్న సిరిసిల్ల జోన్, ద్వితీయ స్థానంలో కాళేశ్వరం జోన్ నిలవగా, మూడవ స్థానంలో బాసర జోన్ నిలిచింది. ప్రత్యేక విజేతగా జోగులాంబ గద్వాల జోన్‌ను ప్రకటించారు. ఒక్కో జోన్ నుంచి ఐదుగురు విద్యార్థులతో కూడిన ఒక టీం చొప్పున రాష్ట్రంలోని ఏడు జోన్లకు చెందిన 35 మంది విద్యార్థులకు క్విజ్ పోటీలు జరిగాయి. వక్తృత్వ (బాల వక్త) పోటీల్లో ప్రథమ విజేతగా జోగులాంబ గద్వాల జిల్లాకు చెందిన 10వ తరగతి విద్యార్థి కె. కేశవర్ధన్ నిలిచాడు. రెండవ స్థానంలో మేడ్చల్ మల్కాజ్‌గిరికి చెందిన కె.వి.యశస్విని, మూడవ స్థానంలో నిర్మల్ జిల్లాకు చెందిన వంగా వెంకట కృష్ణ నిలిచారు. వ్యాస రచన పోటీల్లో ప్రథమ బహుమతి నిజామాద్ జిల్లాకు చెందిన టి.హర్షితకు లభించింది. రెండవ బహుమతి నారాయణపేటకు చెందిన ఎం.కీర్తనకు, మూడవ బహుమతి మేడ్చల్ జిల్లాకు చెందిన డి.తేజస్వినికి లభించింది. విజేతలకు టీ-సాట్ పార్టిసిపేషన్ సర్టిఫికేట్లను అందచేశారు.

48 గంటల్లో 750 వాహనాల సీజ్

- రాష్ట్ర వ్యాప్తంగా రవాణా శాఖ స్పెషల్ డ్రైవ్
- ఓవర్ లోడ్, అతి వేగం వంటి ఉల్లంఘనలకు పాల్పడిన వాహనాలపై 1050 కేసుల నమోదు

హైదరాబాద్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి) : నిబంధనలు పాటించని ప్రైవేటు బస్సులు, లారీలు, ఇతర వాహనాలపై రవాణా శాఖ అధికారులు ఉక్కుపాదం మోపుతున్నారు. బుధ, గురు వారాల్లో రాష్ట్ర వ్యాప్తంగా స్పెషల్ డ్రైవ్ చేపట్టిన అధికారులు.. 1050 వాహనాలపై కేసులు నమోదు చేశారు. ఓవర్ లోడ్, సరైన పత్రాలు లేని, అతివేగం తదితర నిబంధనలు ఉల్లఘించిన 750 వాహనాలను 48 గంటల వ్యవధిలోనే సీజ్ చేశారు. చేవెళ్ల సమీపంలో ఆర్టీసీ బస్సు, టిప్పర్ ఢీకొని 19 మంది మృతి చెందిన ఘటనకు టిప్పర్ ఓవర్ లోడ్, అతివేగమే ప్రధాన కారణాలని అధికారులు తేల్చారు. ఈ నేపథ్యంలోనే మంత్రి పొన్నం ప్రభాకర్ ఆదేశాల మేరకు రాష్ట్ర వ్యాప్తంగా 33 ఎన్‌ఫోర్స్‌మెంట్ బృందాలు, మూడు ఫ్లయింగ్ స్క్వాడ్‌లను రంగంలోకి దింపారు. పరిమితికి మించిన లోడ్‌తో బండి రోడ్డుపైకి రాకుండా నివారించడంపై రవాణా శాఖ అధికారులు ప్రధానంగా దృష్టి సారించారు. ఓవర్‌లోడ్ వాహనాలను క్వారీలు, రీచ్‌ల వద్దనే నియంత్రించే చర్యల్లో భాగంగా యాజమాన్యాలపైనా చట్టప్రకారం చర్యలు తీసుకునేందుకు సిద్ధమవుతున్నారు. మైనింగ్ శాఖతో సమన్వయం చేసుకుని ఓవర్ లోడ్ నియంత్రణకు పకడ్బందీగా చర్యలు తీసుకుంటున్నారు. ఫిట్‌నెస్ లేని వాహనాలు, త్రైమాసిక పన్ను కట్టకుండా తిరిగే వాహనాలను సైతం సీజ్ చేస్తున్నారు. ఓవర్‌లోడ్‌తో వాహనం నడిపితే డ్రైవర్ లైసెన్సు రద్దు చేయడంతోపాటు యజమానులపై చట్టప్రకారం కేసులు నమోదు చేస్తామని అధికారులు స్పష్టం చేస్తున్నారు.

ప్రమాదంలో నుజ్జైన వాహనంతో హోర్డింగ్

- నల్లగొండ జిల్లా పోలీసుల వినూత్న ప్రచారం



వెలిమినేడులో హోర్డింగ్ ప్రారంభోత్సవంలో ఎస్పీ శరత్‌చంద్రపవార్ తదితరులు

చిట్యాల రూరల్, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదాలపై అవగాహన కల్పించేందుకు నల్లగొండ జిల్లా పోలీసులు వినూత్నంగా ప్రచారం చేస్తున్నారు. 65వ నంబరు జాతీయ రహదారి పక్కన చిట్యాల మండలం వెలిమినేడు వద్ద 26అడుగుల హోర్డింగ్‌ను ఏర్పాటు చేశారు. ఓ ప్రమాదంలో నుజ్జైన కారును హోర్డింగ్‌పై ఉంచి 'నీ వాహనం వేగంగా వెళ్తుంది, కానీ నీ జీవితం ఆగిపోతుంది'అని రాసి ఉన్న ఫ్లెక్సీని ఏర్పాటు చేశారు. జిల్లా ఎస్పీ శరత్‌చంద్రపవార్ హోర్డింగ్‌ను ప్రారంభించి రోడ్డు ప్రమాదాలపై వాహనదారులకు అవగాహన కల్పించారు. రహదారి భద్రత అందరి బాధ్యత అని చెప్పారు.



కంది మండలం కాశీపూర్‌లో సర్వే నంబర్ 114లోని 10.37 ఎకరాల ప్రభుత్వ భూమి

వివాదంలో 50 కోట్ల అసైన్డ్ భూమి

- కాజేసేందుకు ఓ ప్రైవేట్ సంస్థ పన్నాగం
- అఫిడవిట్లు సృష్టించి తప్పుదోవ పట్టించే యత్నం
- నేడు అధికారుల కౌంటర్ పిటిషన్

కంది, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): రూ.50 కోట్ల అసైన్డ్ భూమి వివాదంలో చిక్కుకుంది. దీన్ని అక్రమంగా సొంతం చేసుకునేందుకు ఓ ప్రైవేటు సంస్థ పథకం వేసింది. అందులో ఏకంగా ఓ మామిడితోటను పెంచింది. అఫిడవిట్లు సృష్టించి రెవెన్యూ అధికారులను తప్పుదోవ పట్టించేందుకు ప్రయత్నించింది. ఈ క్రమంలో ఆ భూమిని తిరిగి స్వాధీనం చేసుకునేందుకు అధికారులు సంగారెడ్డి జిల్లా కోర్టులో నేడు కౌంటర్ పిటిషన్ దాఖలు చేయనున్నారు. వివరాలు.. సంగారెడ్డి జిల్లా కంది మండలం కాశీపూర్ సర్వే నంబర్ 114లో దాదాపు 50 ఎకరాల సర్కారు భూమి ఉంది. ఇందులో నిరుపేదలు సాగు చేసుకోవడానికి రెవెన్యూ అధికారులు గతంలో అసైన్డ్‌భూమి కింద హక్కులు కల్పించారు. కొన్నేళ్ల క్రితం ఇదే సర్వేనంబరు పక్కన ఓ ప్రైవేట్ సంస్థ ఐదెకరాలను కొనుగోలు చేసింది. దీనికి ఆనుకుని ఉన్న 10.37 ఎకరాల ప్రభుత్వ భూమిపై కన్నేసింది. దీన్ని సాగు చేసుకుంటున్న రైతులకు అరకొర డబ్బు ఆశ చూపి తమ పేరిట కాగితం రాయించుకుంది. దీనికి కోసం కొన్ని అఫిడవిట్లు సృష్టించి రెవెన్యూ అధికారులను తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేసింది. ఆ స్థలంలో మామిడి మొక్కలు నాటి, రేకులషెడ్లు నిర్మించి, చుట్టూ కంచె వేసి గేట్లు అమర్చింది. నాలుగేళ్ల క్రితం కొందరు స్థానికుల ఫిర్యాదులతో రెవెన్యూ అధికారులు ఆ భూమిని తమ అధీనంలోకి తీసుకున్నారు. 2009 నుంచి 2016 వరకు ఆ మామిడితోటలో కాసిన పండ్లను అధికారులే వేలం ద్వారా విక్రయించేవారు. ఆ తర్వాత ఇది నిలిచిపోయింది. ఎవరూ పట్టించుకోకపోవడంతో ప్రైవేట్ సంస్థ యాజమాన్యం మరోసారి పాత పత్రాలతో ఆ భూమిని సొంతం చేసుకునేందుకు ప్రయత్నించింది. ఈ క్రమంలో కంది తహసీల్దార్ రవికుమార్ మండలంలోని అన్ని ప్రభుత్వ భూముల రికార్డులను పరిశీలించగా అసలు విషయం వెలుగులోకి వచ్చింది. దీంతో రెవెన్యూ అధికారులు గురువారం 10.37 ఎకరాలను స్వాధీనం చేసుకునేందుకు ప్రయత్నించారు. ఆ భూమిపై తమకు అనుకూలంగా కోర్టు స్టే ఆర్డర్ ఇచ్చిందని వారిని సంస్థ యాజమాన్యం అడ్డుకుంది. ఇది కచ్చితంగా ప్రభుత్వ భూమేనని తహసీల్దార్ తెలిపారు. దానిని కబ్జా కోరల్లోంచి విడిపించేందుకు శుక్రవారం సంగారెడ్డి జిల్లా కోర్టులో కౌంటర్ పిటిషన్ దాఖలు చేయనున్నట్లు తెలిపారు.

అ, ఆ.. కు అడ్డంకిగా ఆధార్

ఆధార్ కార్డు లేక బడికి దూరమవుతున్న వలస శ్రామికుల పిల్లలు.. అమలుకు నోచుకోని విద్యా హక్కు చట్టం

- జీహెచ్‌ఎంసీ పరిధిలో 66 వేల మందికి పైగా చిన్నారులు విద్యకు దూరమయ్యారని అంచనా
- పరదా ఇళ్లలో, కూలి పనుల్లో ఒట్టిపోతున్న బాల్యం
- నేడు బాలల దినోత్సవం



నిజాంపేట్ జేఎన్టీయూ సమీపంలో షాపులోనే చిన్నారికి ఓనమాలు నేర్పుతున్న తల్లి

హైదరాబాద్ సిటీ, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): బడిలో చేర్చుకోవాలంటే పిల్లలకు ఆధార్ కార్డు తప్పనిసరి.. అంటూ పాఠశాలలు అనుసరిస్తోన్న విధానం పొట్టకూటి కోసం హైదరాబాద్‌కు వలస వచ్చిన శ్రామికుల పిల్లల బాల్యాన్ని చిదిమేస్తోంది. ఆధార్ లేదని పాఠశాలలు ఓనమాలు నేర్పబోమంటుంటే.. అక్షరాలు దిద్దాల్సిన చిట్టి చేతులు హోటళ్లలో ఎంగిలి ప్లేట్లు కడుగుతున్నాయి. ఆడుతూ పాడుతూ బడి బాట పట్టాల్సిన చిన్నారులు పొట్టకూటి కోసం పని బాట పడుతున్నారు. వెరసి హైదరాబాద్‌కు వలస వచ్చిన శ్రామికుల పిల్లల బాల్యం పరదా ఇళ్లలో, కూలీ పనుల్లో ఒట్టిపోతోంది.

ఒడిసా, బిహార్, ఉత్తరప్రదేశ్, ఛత్తీస్‌గఢ్, మహారాష్ట్ర, ఏపీలోని కర్నూలు, అనంతపురం తదితర ప్రాంతాల నుంచి నిత్యం ఎన్నో కుటుంబాలు హైదరాబాద్‌కు వలస వస్తుంటాయి. వీరిలో అత్యధిక శాతం మంది పటాన్‌చెరు, ఉప్పల్, నాచారం, శివరాంపల్లి తదితర ప్రాంతాల్లో దినసరి కూలీలుగా పని చేస్తూ చాలీచాలని సంపాదనతో జీవితాన్ని నెట్టుకొస్తుంటారు. హైదరాబాద్‌లో దాదాపు 84వేల మంది వలస కార్మికులు ఉన్నారని కరోనా సమయంలో అధికారులు గుర్తించారు. ప్రస్తుతం ఆ సంఖ్య 2లక్షలకు పైమాటే అని అమన్ వేదిక వంటి స్వచ్ఛంద సంస్థలు చెబుతున్నాయి. అయితే, ఆ శ్రామికుల కుటుంబాలకు చెందిన పిల్లలు చాలామంది ఆధార్ కార్డులు లేక విద్యకు దూరమవుతున్నారు. ఎలాంటి పత్రాలు, ప్రాంతాలతో సంబంధం లేకుండా 14ఏళ్ల లోపు పిల్లలందరినీ పాఠశాలల్లో చేర్చుకుని విద్య అందించాలని విద్యా హక్కు చట్టం చెబుతున్నా హైదరాబాద్‌లో అది అమలు కావడం లేదు. బడిలో చేరాలంటే పిల్లలకు ఆధార్‌కార్డు తప్పనిసరి అని ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులు చెబుతున్నారు. దీంతో ఆధార్ కార్డులు లేక వలస కార్మికుల పిల్లలు చాలామంది బడికి దూరమవుతున్నారు. ప్రభుత్వ పాఠశాలలు అందుబాటులో లేకపోవడంతో చదువుకు స్వస్తి చెబుతున్న వారు ఇంకొందరు ఉంటున్నారు. బడికి వెళ్లే అవకాశం లేకపోవడంతో కొంత వయసు వచ్చే దాకా ఇంటిపట్టునే ఉంటున్న ఆ చిన్నారులు.. క్రమంగా చిత్తుకాగితాల సేకరణ, నిర్మాణ రంగ కూలీలుగా, ఇటుక బట్టీలు, గాజుల తయారీ, హోటళ్లలో పనికి వెళుతున్నారు. వలస శ్రామికుల జీవన పరిస్థితులపై పని చేసే అమన్‌వేదిక, మామిడిపూడి వెంకట రంగయ్య ఫౌండేషన్(ఎంవీఎఫ్), పౌరహక్కుల వేదిక వంటి సంస్థలు.. తగిన గుర్తింపు పత్రాలు లేక వలస కార్మికుల కుటుంబాలకు చెందిన పిల్లలు విద్యకు దూరమవుతున్నారని వాపోతున్నాయి. జీహెచ్‌ఎంసీ పరిధిలో వలస శ్రామికుల పిల్లలు 70వేల మందికి మించి ఉంటారని వారిలో 95 శాతం మంది చదువుకు దూరంగా ఉన్నారని ఆ సంస్థల అంచనా.



నిజాంపేట్ డంప్ యార్డ్‌లో పని చేస్తున్న ఓ బాలుడు

పాఠశాలల్లో ప్రవేశానికి ఆధార్ ఎందుకంటే ?

యునిఫైడ్ డిస్ట్రిక్ట్ ఇన్ఫర్మేషన్ సిస్టమ్ ఫర్ ఎడ్యుకేషన్(యూడీఐఎస్‌ఈ) ప్రతి పాఠశాలకు ఒక కోడ్‌ను కేటాయిస్తుంది. విద్యార్థుల సమాచారం నమోదుకు జాతీయ స్థాయిలో ఏర్పాటైన ఆన్‌లైన్ వ్యవస్థ ఇది. యూడీఐఎస్‌ఈలో నమోదైన విద్యార్థులకు మాత్రమే ప్రభుత్వం నుంచి పుస్తకాలు, బ్యాగు, యూనిఫాం వంటివి అందుతాయి. మరోపక్క, ప్రభుత్వ పథకాలు పొందడానికి, బదిలీ ప్రక్రియ సులభతరం కావడానికి, మార్కులు, విద్యార్హత పత్రాలు డిజిటల్ రూపంలో ఉంచడానికి ఆటోమేటెడ్ పర్మినెంట్ అకడమిక్ అకౌంట్ రిజిస్ట్రీ(అపార్)లో విద్యార్థుల నమోదును కూడా ప్రభుత్వం తప్పనిసరి చేసింది. అపార్ ఖాతాకు ఆధార్ కార్డు అవసరం. దాంతో ఆధార్ కార్డు లేని పిల్లలను పాఠశాలల్లో చేర్చుకోమని ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులు చెబుతున్నారు. పోనీ ఆధార్‌తో సంబంధం లేకుండా పిల్లలకు ప్రైవేటు పాఠశాలల్లో చదువు చెప్పించే అవకాశం ఉన్నా తల్లిదండ్రులకు అంత స్థోమత ఉండడం లేదు.

ఆ పిల్లలకు ఆధార్ అంత సులభం కాదు..

పొరుగు రాష్ట్రాల నుంచి వలస వచ్చిన కూలీలు తమ పిల్లలకు ఆధార్ పొందడం అంత సులభమేమీ కాదు. ఆధార్‌కార్డు పొందడానికి పిల్లల జనన ధ్రువీకరణ పత్రం తప్పనిసరి. బిహార్, ఒడిసా, యూపీ, మహారాష్ట్రలోని మారుమూల పల్లెల నుంచి హైదరాబాద్‌కు వలస వచ్చిన వారిలో చాలామంది మహిళల కాన్పులు వారి స్వస్థలంలోని తమ ఇళ్ల దగ్గరో, గుర్తింపులేని ఆస్పత్రుల్లోనో జరుగుతుంటాయి. దాంతో పిల్లలకు జనన ధ్రువీకరణ పత్రాలు ఉండడం లేదు. జనన ధ్రువీకరణ పత్రం పొందేందుకు కావాల్సిన పత్రాలు కూడా అతికొద్ది మంది వద్దే ఉంటున్నాయి. దీంతో పిల్లలకు ఆధార్ లభించడం లేదు. మరోపక్క, పిల్లల చదువు విషయంలో వలస కూలీలకు ఎదురవుతున్న సమస్యను ఆసరాగా చేసుకొని.. పిల్లలకు ఆధార్ కార్డులు ఇప్పిస్తామంటూ అందినకాడికి దోచుకుంటున్న వ్యక్తులు కూడా ఉంటున్నారు.

ప్రత్యేక ఆధార్ నమోదు కేంద్రాలు అవసరం



బిహార్, యూపీ, ఒడిసా, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల నుంచి వలస వచ్చిన శ్రామికులు చాలామంది బండ్లగూడ ప్రాంతంలోని పది బస్తీలలో ఉంటున్నారు. తమ పిల్లలకు ఆధార్ కార్డులు లేక పాఠశాలలకు పంపలేకపోతున్నామని ఆయా కుటుంబాలు వాపోతున్నాయి. కూలీ పని పక్కన పెట్టి గుర్తింపు పత్రాల కోసం తిరిగే పరిస్థితి ఆ కుటుంబాలకు లేదు. అందువల్ల హైదరాబాద్‌లో వలస కూలీలు నివసించే ప్రాంతాల్లో ఆధార్ నమోదు కేంద్రాలు ఏర్పాటు చేసి పిల్లలకు ఆధార్ కార్డులు జారీ చేయాలి. ఆ లోపు ఆధార్‌తో సంబంధం లేకుండా పిల్లలకు పాఠశాలల్లో ప్రవేశం కల్పించాలి.

- సంగీత, ఎంవీఎఫ్ కార్యకర్త

జనవరి 3 నుంచి టెట్

- 31వ తేదీ వరకు నిర్వహణ
- రేపటి నుంచి దరఖాస్తుల స్వీకరణ

హైదరాబాద్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): వచ్చే జనవరిలో నిర్వహించనున్న ఉపాధ్యాయ అర్హత పరీక్ష (టెట్)లకు సంబంధించిన షెడ్యూల్ విడుదలైంది. జనవరి 3 నుంచి 31 వరకు కంప్యూటర్ ఆధారిత పరీక్ష (సీబీటీ) విధానంలో ఈ పరీక్షలను నిర్వహించనున్నారు. దీనికి సంబంధించి టెట్ చైర్‌పర్సన్, పాఠశాల విద్యాశాఖ సంచాలకుడు నవీన్ నికోలస్ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈమేరకు ఈ నెల 15 నుంచి 29 వరకు దరఖాస్తులు స్వీకరిస్తారు. మరోవైపు సుప్రీంకోర్టు తీర్పునకు అనుగుణంగా టెట్ పరీక్ష తప్పనిసరిపై పాఠశాల విద్యాశాఖ గురువారం సవరణ ఉత్తర్వులు జారీ చేసింది. 2010 ఆగస్టు 23కు ముందు సర్వీసులో చేరిన ఉపాధ్యాయులకు టెట్ నుంచి మినహాయింపు ఇస్తూ 2015 డిసెంబరులో రాష్ట్ర ప్రభుత్వం జీవో36 విడుదల చేసింది. అయితే అందరూ టెట్ ఉత్తీర్ణులు కావాల్సిందేనని ఇటీవలే సుప్రీంకోర్టు ఆదేశాలు జారీ చేసింది. దీనికి అనుగుణంగా జీవో36 మినహాయింపును ప్రభుత్వం రద్దు చేస్తూ సవరణ ఉత్తర్వులు జారీ చేసింది. రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ, ఎయిడెడ్, ప్రైవేటు పాఠశాలల్లోని ఉపాధ్యాయులు రాష్ట్రం లేదా కేంద్రప్రభుత్వం నిర్వహించే టెట్‌లో ఉత్తీర్ణత సాధించాల్సిందేనని ఉత్తర్వుల్లో స్పష్టం చేసింది. అర్హత సాధించనివారు పరీక్షలు రాసేందుకు అనుమతిస్తున్నట్టు నవీన్ నికోలస్ సవరణ ఉత్తర్వుల్లో తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా దాదాపు 40వేల మంది ఉపాధ్యాయులు గరిష్ఠంగా రెండేళ్లలోపు టెట్ అర్హత సాధించాల్సి ఉంది. లేనిపక్షంలో ఉద్యోగం నుంచి తొలగించబడతారు.

మరమ్మతు చేస్తుండగా.. భవనం కూలి ఇద్దరు కూలీల మృతి

మహబూబ్‌నగర్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): ఓ పాత భవనానికి మరమ్మతులు చేస్తుండగా అది అమాంతం కుప్పకూలడంతో అందులో పనిచేస్తున్న ఇద్దరు కూలీలు అక్కడికక్కడే మృతి చెందారు. ఈ ఘటన మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలో గురువారం జరిగింది. పాతబస్టాండ్ సమీపంలోని ఓ కిరాణ గోదాముకు సంబంధించిన రెండంతస్తుల పాత భవనానికి మూడు రోజులుగా మరమ్మతు పనులు జరుగుతున్నాయి. భవనంపై పెరిగిన రావిచెట్టును తొలగిస్తుండగా స్లాబ్, గోడలు ఒక్కసారిగా కుప్పకూలాయి. అందులో పనిచేస్తున్న ఇద్దరు కూలీలు శిథిలాల కింద చిక్కుకుని మృతి చెందగా, మరొకరికి గాయాలయ్యాయి. మునిసిపల్, పోలీసు, అగ్నిమాపక, ఎస్‌డీఆర్‌ఎఫ్ సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. దాదాపు అయిదు గంటల పాటు శ్రమించి మృతదేహాలను వెలికితీసి జనరల్ ఆస్పత్రి మార్చురీకి తరలించారు. మృతిచెందిన వారు నవాబ్‌పేట మండలం రుద్రారం గ్రామానికి చెందిన కృష్ణయ్య (48), అమిస్తాపూర్‌కు చెందిన తుమ్మరి శాంతయ్య (60)గా పోలీసులు గుర్తించారు.

ఏసీబీ వలలో ఆదిభట్ల టీపీవో

- నిర్మాణ అనుమతులకు రూ.1.50 లక్షల డిమాండ్

ఆదిభట్ల, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): ఓ అవినీతి టౌన్‌ప్లానింగ్ అధికారి తాను పట్టుబడకుండా తెలివిగా లంచం తీసుకోవాలని విఫల యత్నం చేశాడు. ఆ రోజు విధులకు గైర్హాజరై.. దరఖాస్తుదారు నుంచి డబ్బు తీసుకునేందుకు తన సహాయకుడిని పురమాయించాడు. దీంతో ఏసీబీ వలలో అతను చిక్కాడు. పట్టువదలని అధికారులు ఫోన్ లొకేషన్ ద్వారా టీపీఓ జాడ గుర్తించి అదుపులోకి తీసుకున్నారు. హైదరాబాద్ సిటీరేంజ్ ఏసీబీ డీఎస్పీ శ్రీధర్ వివరాల ప్రకారం.. గద్వాల్ జిల్లా జోగులాంబ ఐజాలో పని చేస్తున్న బందెల వరప్రసాద్ నెల క్రితం డిప్యుటేషన్‌పై రంగారెడ్డి జిల్లా ఆదిభట్ల పురపాలికకు వచ్చారు. ఆదిభట్ల పరిధిలో 400 గజాల స్థలంలో బిల్డ్ నౌ పోర్టల్‌లో జీ ప్లస్ 4 భవన నిర్మాణ అనుమతికి మోత్కూరి ఆనంద్ కుమార్ దరఖాస్తు చేసుకున్నారు. మున్సిపల్ కార్యాలయంలో అనుమతి రాకపోవడంతో టౌన్ ప్లానింగ్ అధికారి వరప్రసాద్‌ను సంప్రదించారు. రూ.1.50 లక్షలు లంచం ఇవ్వాలని టీపీఓ డిమాండ్ చేశాడు. దరఖాస్తుదారు రూ.80 వేలకు ఒప్పందం కుదుర్చుకుని 6వ తేదీన ఏసీబీ అధికారులను ఆశ్రయించాడు. గురువారం డీఎస్పీ శ్రీధర్ ఆధ్వర్యంలో హైదరాబాద్ సిటీజోన్-2 బృందం ఆదిభట్ల కార్యాలయంలో దాడులు చేశారు. టీపీఓ సహాయకుడు వంశీకృష్ణ లంచం తీసుకుంటుండగా పట్టుకున్నారు. ప్రధాన సూత్రధారి టీపీవో వరప్రసాద్ గురువారం కార్యాలయానికి రాలేదు. ఫోన్ లొకేషన్ ద్వారా అతన్ని జిల్లెలగూడలో అదుపులోకి తీసుకుని మున్సిపల్ కార్యాలయానికి తీసుకొచ్చి విచారించారు.

విద్యుత్తు బస్సుల విధానంలో మార్పులకు కేంద్రంపై ఒత్తిడి తేవాలి: జాన్ వెస్లీ

కాలుష్యం, ప్రత్యామ్నాయ ఇంధనం పేరుతో విద్యుత్తు బస్సుల విధానం తెచ్చిన కేంద్రం.. వాటి నిర్వహణ బాధ్యతలను కార్పొరేట్ కంపెనీలకే కట్టబెట్టిందని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ ఆరోపించారు. టెండర్లనూ కేంద్ర ప్రభుత్వ సంస్థే నిర్ణయించి.. ఆర్టీసీపై పెనుభారం మోపుతోందని, తక్షణమే ఈ విధానంలో మార్పులు చేసేలా కేంద్రంపై ఒత్తిడి తేవాలని కోరుతూ సీఎం రేవంత్ రెడ్డికి ఆయన లేఖ రాశారు. ఇప్పటికే ఆర్టీసీలో పనిచేస్తున్న ఉద్యోగుల భద్రతకు ప్రమాదం వాటిల్లే అవకాశముందని తెలిపారు.

ఏఐసీసీ అధ్యక్ష పదవికి మళ్లీ పోటీ చేయను!

- కాంగ్రెస్‌లో అంతర్గత ప్రజాస్వామ్యం వల్ల ఏమైనా చేయొచ్చు
- అది ఏ రాజకీయ పార్టీకైనా ఉండాల్సిన గొప్ప లక్షణం
- యువతకు ఉపయోగపడే పుస్తకం.. మహాభారతమే
- జ్యోతి కొమిరెడ్డి స్మారక ఉపన్యాసంలో శశిథరూర్



హైదరాబాద్ సిటీ, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): గతంలో రాజకీయ నాయకుల మధ్య ఆలోచనా విధానంలో భిన్నాభిప్రాయాలున్నా.. అవి ఆ అంశాల వరకే పరిమితమై ఉండేవని.. ఒకరి అభిప్రాయాలను మరొకరు గౌరవించుకునేవారని కాంగ్రెస్ సీనియర్ నేత శశిథరూర్ అన్నారు. నెహ్రూ-వాజపేయి, ఇందిరాగాంధీ-వాజపేయి హయాంలో కూడా అది కనిపించిందని ఆయన గుర్తుచేశారు. హైదరాబాద్ సోమాజీగూడలోని ఓ హోటల్‌లో మాజీ ఎంఎల్‌ఏ జ్యోతి కొమిరెడ్డి స్మారకసభలో ఆయన పాల్గొని.. 'రాడికల్ సెంట్రిజం.. మై విజన్ ఫర్ ఇండియా' అనే అంశంపై ప్రసంగించారు. జ్యోతి కొమిరెడ్డి గొప్ప న్యాయవాది అని.. మహిళల హక్కుల కోసం నినదించిన మానవతావాది అని, చట్ట సభల్లో 33% మహిళలకు రిజర్వేషన్ల కేటాయింపు కోసం పోరాడారని కొనియాడారు. తన ప్రసంగంలో భాగంగా ఆయన ప్రస్తుత రాజకీయాలు సహా పలు అంశాల గురించి మాట్లాడారు. ఏఐసీసీ ప్రెసిడెంట్‌గా మళ్లీ పోటీ చేస్తారా? అనే ప్రశ్నకు.. "ఐన్‌స్టీన్ చెప్పినట్లు.. పిచ్చితనం నిర్వచనం ఏమిటంటే.. ఎటువంటి ఫలితాలను ఆశించకుండా అదే (ఒకే) పని చేయడం" అని నవ్వుతూ సమాధానమిచ్చారు. తాను పోటీ చేయననే విషయాన్ని చెప్పకనే చెప్పారు. దీనిపై మరింత వివరణ ఇస్తూ.. "అప్పటి పరిస్థితులు వేరు. అప్పుడు పోటీ చేయడం వల్ల పొందిన అనుభవాలను పబ్లిక్‌గా చెప్పలేను. కానీ. ఒకటి మాత్రం చెప్పగలను. కాంగ్రెస్‌లో అంతర్గత ప్రజాస్వామ్యం వల్ల ఏమైనా చేయొచ్చు. అది ఏ రాజకీయ పార్టీకైనా ఉండాల్సిన గొప్ప లక్షణం. ప్రజాస్వామ్యంలో ఉన్నప్పుడు పార్టీలు కూడా ప్రజాస్వామ్యయుతంగానే ఉండాలి... అంత వరకే మాట్లాడగలను" అని వ్యాఖ్యానించారు. దేశ సమగ్రత, సార్వభౌమత్వానికి సవాళ్లు ఎదురయ్యే పహల్గాం లాంటి దుర్ఘటనలు జరిగినప్పుడు ప్రతిపక్షాల విమర్శలు బాధ్యతాయుతంగా, నిర్మాణాత్మకంగా ఉండాలని అభిప్రాయపడ్డారు. పౌర హక్కుల ఉద్యమానికి తానెప్పుడూ మద్దతుదారునే అని.. అణగారిన వర్గాల పక్షాన మాట్లాడటానికి సిద్ధంగా ఉంటానని స్పష్టం చేసిన శశిథరూర్.., రాజ్యాంగ విలువలకు పూర్తి విరుద్ధమైన భావాలు కలిగిన వామపక్ష తీవ్రవాదాన్ని మాత్రం తాను సమర్థించనని కరాఖండీగా చెప్పారు. యువత రాజకీయాల్లోకి రావాలనుకుంటే ముందుగా 'ఎందుకు?' అనే ప్రశ్న వారే వేసుకోవాలని సూచించారు. డబ్బు సంపాదన గురించి రాజకీయాల్లోకి రావాలనుకోవడం తప్పని స్పష్టం చేశారు. యువతకు ఉపయోగపడే ఏదైనా పుస్తకం గురించి చెప్పాలని అడిగితే.. మహాభారతం చదవమని చెబుతానన్నారు. కోర్టుల్లో ఏళ్లతరబడి సాగుతున్న కేసుల పరిష్కారానికి కృత్రిమ మేధను వినియోగించాలని ఆయన అభిప్రాయపడ్డారు. హైదరాబాద్‌లో ఏది బాగా నచ్చిందని అడిగినప్పుడు.. రోడ్లు బాగున్నాయని చెప్పారు.



హైదరాబాద్ కేంద్రీయ విశ్వవిద్యాలయం

తెలంగాణ విద్యాసంస్థల్లో హెచ్‌సీయూ టాప్

- క్యూఎస్ ఆసియా ర్యాంకింగ్స్‌లో 246వ ర్యాంక్

హైదరాబాద్ సిటీ, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ కేంద్రీయ విశ్వవిద్యాలయం క్యూఎస్ వరల్డ్ ర్యాంకింగ్స్ 2026లో మెరిసింది. ఆసియాలోని యూనివర్సిటీలన్నింటిలో హెచ్‌సీయూకు 246వ ర్యాంకు దక్కించుకోగా దేశంలోని కేంద్రీయ విశ్వవిద్యాలయాలలో 5వ స్థానంలో నిలిచింది. రాష్ట్రంలో అగ్రస్థాయి విద్యాసంస్థగా హెచ్‌సీయూ అరుదైన ఘనతను సొంతం చేసుకుంది. ఈ సందర్భంగా వర్సిటీ వైస్‌చాన్స్‌లర్ బీజేరావు మాట్లాడుతూ, విద్యా నైపుణ్యం, వినూత్న పరిశోధనకు క్యూఎస్ ర్యాంకింగ్స్‌ను అత్యుత్తమ గుర్తింపుగా భావిస్తున్నామన్నారు. ఆవిష్కరణ, వైవిధ్యానికి విశ్వవిద్యాలయం కేంద్రంగా నిలిచిందని, ప్రపంచవ్యాప్తంగా ప్రభావాన్ని చూపే ఆలోచనాపరులు, సృష్టికర్తలు, నాయకులను పెంపొందిస్తోందని చెప్పారు.

తెలంగాణలోని వివిధ సంస్థల ర్యాంకింగ్స్ ఇలా!

యూనివర్సిటీ	క్యూఎస్ ర్యాంకు
హెచ్‌సీయూ	246
ఐఐటీ హైదరాబాద్	270
ఉస్మానియా యూనివర్సిటీ	470
ఎన్‌ఐటీ వరంగల్	771-780
మనూ(ఉర్దూ)యూనివర్సిటీ	1101-1200
ఇఫ్లూ	1401-1500

వివేకా హత్యపై తదుపరి దర్యాప్తు జరగాలి

- హత్య విషయం జగన్, భారతిలకు ముందే ఎలా తెలుసు?
- సునీతా తరఫున సిద్ధార్థ లూథ్రా వాదనలు

హైదరాబాద్, నవంబరు 13(ఆంధ్రజ్యోతి): మాజీ మంత్రి వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసులో మరింత లోతైన దర్యాప్తు జరగాల్సిన అవసరం కచ్చితంగా ఉందని వివేకా కుమార్తె డాక్టర్ నర్రెడ్డి సునీతారెడ్డి పేర్కొన్నారు. ఈమేరకు తదుపరి దర్యాప్తు చేపట్టే విధంగా సీబీఐకి ఆదేశాలు జారీచేయాలని కోరుతూ ఆమె నాంపల్లి సీబీఐ కోర్టులో పిటిషన్ దాఖలు చేసిన విషయం తెలిసిందే. ఈ పిటిషన్‌పై గురువారం సీబీఐ కోర్టు న్యాయమూర్తి టి.రఘురాం విచారణ చేపట్టారు. సునీతారెడ్డి తరఫున సీనియర్ న్యాయవాది సిద్ధార్థ లూథ్రా వీడియో కాన్ఫరెన్స్ ద్వారా.. న్యాయవాది ఎస్.గౌతమ్ ప్రత్యక్షంగా వాదనలు వినిపించారు. తదుపరి దర్యాప్తు కోసం సంబంధిత ట్రయల్ కోర్టులోనే పిటిషన్ దాఖలు చేసుకోవాలని ఇటీవల సుప్రీంకోర్టు సూచించిందని గుర్తుచేశారు. వివేకా హత్య కేసులో లోతైన తదుపరి దర్యాప్తు జరగకపోతే అసలు వ్యక్తులు తప్పించుకునే ప్రమాదం ఉందని సిద్ధార్థ లూథ్రా పేర్కొన్నారు. తదుపరి దర్యాప్తు జరిగితే ఇప్పటికీ వెలుగుచూడని అసలు వాస్తవాలు బయటకు వస్తాయన్నారు. 'వివేకా హత్య విషయం ఆరోజు ఉదయం 5.30 గంటలకే భారతి, జగన్‌లకు తెలిసిందని ఏపీ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిగా పనిచేసి రిటైర్ అయిన ఐఏఎస్ అజేయ కల్లం తన స్టేట్‌మెంట్‌లో తెలిపారని గుర్తు చేశారు. 'ఉదయం 5.30 గంటల ప్రాంతంలో అటెండర్ వచ్చి అమ్మ (భారతి) పైకి పిలుస్తున్నారని తెలుపగా.. జగన్ వెళ్లి పది నిమిషాల తర్వాత వచ్చి చిన్నాన్న (వివేకా) ఇక లేరు అని చెప్పారు.' అని అజేయ కల్లం తన స్టేట్‌మెంట్‌లో పేర్కొన్నారు. అయితే.. భారతి, జగన్‌లకు ఈ విషయం ముందే ఎలా తెలిసింది? ఎవరు కాల్ చేశారు? అనే విషయాలపై సీబీఐ దర్యాప్తు చేయలేదని పేర్కొన్నారు. ఈ విషయాలు బయటికి వస్తేనే వాస్తవాలు బయటికొస్తాయని లూథ్రా పేర్కొన్నారు.

సింగరేణికి 'స్వచ్ఛత'లో జాతీయ అవార్డు

- కిషన్‌రెడ్డి చేతుల మీదుగా పురస్కారం అందుకున్న సంస్థ సీఎండీ బలరామ్..

హైదరాబాద్, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): కేంద్ర బొగ్గు, గనుల శాఖ ఆధ్వర్యంలో కోల్ ఇండియా కంపెనీలు, సింగరేణి, ఇతర గనుల సంస్థల్లో నిర్వహించిన స్వచ్ఛత స్పెషల్ క్యాంపెయిన్ 5.0 కార్యక్రమంలో సింగరేణి సంస్థ జాతీయ స్థాయిలో అత్యుత్తమ కంపెనీగా అవార్డును అందుకుంది. గురువారం సాయంత్రం న్యూఢిల్లీలో జరిగిన వేడుకల్లో కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి.కిషన్‌రెడ్డి చేతుల మీదుగా సంస్థ సీఎండీ ఎన్.బలరామ్ పురస్కారాన్ని అందుకున్నారు. గత నెల గాంధీ జయంతి నుంచి 30 రోజుల పాటు కేంద్ర బొగ్గు మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో దేశవ్యాప్తంగా బొగ్గు గనుల ప్రాంతాల్లో స్వచ్ఛత స్పెషల్ క్యాంపెయిన్ 5.0 కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇందులో భాగంగా సింగరేణి సంస్థ అన్ని ఏరియాల్లో కార్యాలయాలను, ప్రాంగణాలను శుభ్రపరచడం, అవసరం లేని ఫైళ్లను గుర్తించి వాటిని తొలగించింది. మొత్తం 14 సంస్థల్లో ఈ కార్యక్రమం జరగ్గా.. సింగరేణి సంస్థ అగ్రస్థానంలో నిలిచింది.



కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి చేతుల మీదుగా అవార్డును అందుకుంటున్న సింగరేణి సీఎండీ బలరామ్



వివరాలు వెల్లడిస్తున్న దేవరకొండ ఏఎస్పీ మౌనిక

స్కార్పియోలో మేకల దొంగతనం..!

- ఉదయం రెక్కీ.. రాత్రి చోరీ
- అంతర్రాష్ట్ర దొంగల ముఠా అరెస్ట్
- రూ.1.20లక్షల నగదు, 3 కార్లు స్వాధీనం
- నల్లగొండ జిల్లా చింతపల్లిలో ఘటన

చింతపల్లి, నవంబరు 13 (ఆంధ్రజ్యోతి): ఉదయం గ్రామాల్లో రెక్కీ నిర్వహించి రాత్రిళ్లు మేకలతో పాటు గొర్రెల దొంగతనాలకు పాల్పడుతున్న అంతర్రాష్ట్ర ముఠా సభ్యులను గురువారం నల్లగొండ జిల్లా చింతపల్లి పోలీసులు అరెస్టు చేశారు. దేవరకొండ ఏఎస్పీ మౌనిక తెలిపిన వివరాల ప్రకారం.. ఏపీలోని పల్నాడు జిల్లా గురజాల మండలం దైద గ్రామానికి చెందిన విజయ్, శారద, నందిని, వెంకటేష్, శబరీష్ అనే ఆరుగురు వ్యక్తులు నల్లగొండ జిల్లా నిడమనూరు మండలం రాంనగర్ గ్రామానికి చెందిన వినోద్, కార్తీక్‌లతో కలిసి ముఠాగా ఏర్పడ్డారు. వీరు చోరీ చేసిన మేకలు, గొర్రెలను సంతల్లో విక్రయిస్తూ విలాసవంతమైన జీవితం సాగిస్తున్నారు. కొంతకాలంగా జిల్లాలోని పలు గ్రామాల్లో చోరీలు పెరగడంతో బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. జిల్లా ఎస్పీ శరత్‌చంద్ర పవార్ ఆదేశాల మేరకు సాగర్-హైదరాబాద్ రహదారిపై వెళ్లే వాహనాలను తనిఖీ చేపట్టారు. అనుమానాస్పదగా వెళ్తున్న ఓ స్కార్పియో కారును గుర్తించిన పోలీసులు.. వాహనంలో ఉన్న ఇద్దరు మహిళలు, ముగ్గురు పురుషులే ఈ మూగజీవాలను దొంగిలించినట్లుగా నిర్ధారణకు వచ్చారు. విచారణలో నిందితులు నేరాన్ని అంగీకరించారని, వారి నుంచి రూ.1.20లక్షల నగదు, మూడు కార్లను స్వాధీనం చేసుకున్నట్లు ఏఎస్పీ తెలిపారు.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda press, Sy no.1054, Andhrajyothi Building, Madikonda Village, Khazipet Mandal, Hanamkonda (Dist), Pin. 506142, Editor: N.Rahul Kumar. Ph. No. (0870) 2100480/84,
RNI No:APTEL/2003/9741, Managing Director : Vemuri Radha Krishna Founder: K.L.N.Prasad.